సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+20 వెల: ₹5.00
సంపుటి: 11
సంచిక: 307
సోమవారం 28-1-2019
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'


జొకోవిచ్ సెవెన్‌స్టార్
ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచిన సెర్బియా యోధుడు –స్పోర్ట్స్‌లో


క్వీన్ సైనా
ఇండోనేసియా మాస్టర్స్ టైటిల్ నెగ్గిన భారత షట్లర్ –స్పోర్ట్స్‌లో

ప్రజా శ్రేయస్సు కోసం జగన్ రావాలి

ఎన్టీఆర్ పెద్దల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆకాంక్ష

- కుమారుడు హితేష్‌తో కలిసి వైఎస్ జగన్‌తో భేటీ
- హితేష్.. వైఎస్సార్‌సీపీతో కలిసి పని చేస్తాడని వెల్లడి
- రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని మండిపాటు
- జగన్ పదేళ్లుగా పార్టీని చక్కగా నడుపుతున్నారు..
- ఈ కష్టానికి దేవుడు తప్పకుండా మంచి ఫలితం ఇస్తాడు

2లో


మీడియాతో మాట్లాడుతున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు. చిత్రంలో హితేష్, వైఎస్సార్‌సీపీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, కృష్ణదేవరాయ

బీసీలకు కులాలవారీగా కార్పొరేషన్లు

- రాజమహేంద్రవరం 'జయహో బీసీ' సభలో సీఎం చంద్రబాబు
- బీసీలంతా నా వెనుకే ఉన్నారు.. మాతో పెట్టుకుంటే ఖబడ్దార్
- బీసీల విదేశీ విద్యకు రూ.15 లక్షల దాకా ఇస్తాం
- రాజధానిలోని 10 ఎకరాల్లో జ్యోతిరావ్‌పూలే స్మారక భవనం
- అత్యంత వెనుకబడిన బీసీలకు సబ్సిడీ రూ.50 వేలకు పెంచుతాం
- రూ.3 వేల కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు చేపడతాం

2లో


ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగిన సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో టీడీపీ నేతలు

ట్రైన్18 ఇక... 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్'

త్వరలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ



చర్చి లక్ష్యంగా పేలుళ్లు

■ బాంబు పేలుళ్లతో ఫిలిప్పీన్స్ దేశం దద్దరిల్లింది. దక్షిణ ఫిలిప్పీన్స్ ప్రాంతంలోని కేథలిక్ చర్చ్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు ఆప్రాంతంలో బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 20 మంది అక్కడికక్కడే దుర్మరణం చెందగా 111 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు.

13లో

తలలన్నీ తాకట్టే



అన్నపూర్ణ ఆంధ్రదేశాన్ని అప్పుల కుప్పగా మార్చేసిన సీఎం చంద్రబాబు

- బడ్జెట్ పరిధికి ఆవల ఇప్పటికే పరిమితులు దాటి రూ.95 వేల కోట్ల అప్పు
- మరో రూ.30 వేల కోట్ల కోసం బ్యాంకుల చుట్టూ అధికారులను తరుముతున్న సీఎం
- చేసే అప్పులన్నీ ప్రచార ఆర్భాటాలు, ఈవెంట్లు, పప్పు బెల్లాలకే వ్యయం
- బడ్జెట్ పరిధిలో ప్రస్తుత అప్పు రూ.2.59 లక్షల కోట్లు
- ఇందులో రూ.1.64 లక్షల కోట్లు ఈ నాలుగేళ్లలో చేసినవే..
- ఇంటికో ఉద్యోగం లేదా రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామంటూ 2014లో ఇచ్చిన హామీని గాలికొదిలేసిన చంద్రబాబు
- భృతి ఇవ్వకపోవడంతో ఇప్పటికే ఒక్కో కుటుంబానికి రూ.లక్ష బాకీ పడ్డ ముఖ్యమంత్రి
- ఆ బకాయిలు ఇవ్వకపోగా అప్పులతో ప్రతి కుటుంబంపై సగటున రూ.2.50 లక్షల భారం మోపిన వైనం

మొత్తం అప్పు (రూ.30 వేల కోట్లు కలిపి)
రూ.3.85 లక్షల కోట్లు

ఇప్పుడే పుట్టిన బిడ్డతో సహా ప్రతి ఒక్కరి తలపై ఉన్న అప్పు
75,000 రూపాయలు

సాక్షి, అమరావతి

నలభై ఏళ్ల రాజకీయ, పరిపాలనా అనుభవం తన సొంతమని నిత్యం గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగున్నరేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల కుప్పగా మార్చేశారు. రాష్ట్ర ప్రజల మెడకు అప్పుల గుదిబండ తగిలించారు. అప్పుడే పుట్టిన శిశువులతో సహా ఒక్కొక్కరి తలపై ఏకంగా రూ.75 వేల అప్పుల భారాన్ని మోపారు. రాష్ట్రాన్ని రుణాల ఊబిలో ముంచేశారు. నిబంధనలకు విరుద్ధంగా, బడ్జెట్ బయట పరిమితికి మించి మరీ అప్పులు తీసుకొస్తున్నారు. విచ్చలవిడిగా అప్పులు చేసి తీసుకొస్తున్న రూ.వేల కోట్లతో ప్రజలకు ఉపయోగపడే పని ఏదైనా చేస్తున్నారా? అంటే అదీ లేదు. రుణాలను ఆస్తుల కల్పనకు కాకుండా పప్పు బెల్లాలకు, కావాల్సిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి కమీషన్లు కొట్టేయడానికి, శంకుస్థాపనలకు, ప్రత్యేక విమానాల్లో తిరగడానికి, తనకు రాజకీయ ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలు, ఈవెంట్లు, ప్రచార ఆర్భాటాలకు మాత్రమే ఖర్చు చేస్తున్నారు. ప్రయోజనం లేని పనులకు ఒకవైపు సొమ్మంతా హారతి కర్పూరం అవుతుండగా, మరోవైపు ప్రజల నెత్తిన అప్పుల కొండ పెరిగిపోతోంది. రాష్ట్ర విభజన నాటికి 13 జిల్లాల అప్పు రూ.96 వేల కోట్లు కాగా, గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి బడ్జెట్ అప్పులు ఏకంగా రూ.2.59 లక్షల కోట్లకు చేరాయని

మిగతా 4వ పేజీలో ▶

మళ్లీ కాపీ కొట్టాడు

జగన్ హామీలను వరుసగా కాపీ కొడుతున్న చంద్రబాబు

- ఎన్నికల సమయంలో ఇవి అమలు కావని తెలిసినా జంకని వైనం
- మొన్న పింఛన్లు, నిన్న రైతు భరోసా, నేడు కులాల కార్పొరేషన్లు
- ప్రతి కులానికీ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ఇదివరకే హామీ ఇచ్చిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్
- బీసీల సానుభూతికి ఇదే హామీని వల్లె వేసిన సీఎం


2లో

బీసీలను బానిసలుగా మార్చింది చంద్రబాబే

- ఫీజు రీయింబర్స్‌మెంట్, సబ్‌ప్లాన్.. బీసీ స్కాలర్ షిప్, విదేశీ విద్య అన్నింటా బీసీలకు అన్యాయం
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి


2లో

104 ఉద్యోగులపై వేటుకు సర్కార్ సిద్ధం!

- డిమాండ్ల సాధనకు సమ్మె చేయడమే నేరం
- ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నవారు 1,642 మంది
- చంద్రబాబు హామీ ఇచ్చి మోసం చేశారని వాపోతున్న ఉద్యోగులు

5లో



నేడు వర్షాలు

- కోస్తాంధ్ర, రాయలసీమల్లో తేలికపాటి వర్షాలకు అవకాశం
- రాయలసీమలో పెరిగిన రాత్రి ఉష్ణోగ్రతలు - 4లో

ఒక రోజు కష్టం.. మరో రోజు సులభం

డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల తీరిది

- ఆన్‌లైన్ పరీక్షలపై అభ్యర్థుల్లో అనేక అనుమానాలు
- ఒకే సబ్జెక్టులో ప్రశ్నలు కొందరికి కష్టంగా, కొందరికి సులువుగా
- దీనివల్ల నష్టపోతామని అభ్యర్థుల్లో ఆందోళన
- డీఎస్సీ నియామకాల్లో జాప్యం తప్పదా?
- ఇప్పటికీ కొన్ని సబ్జెక్టులకు వెలువడని ప్రాథమిక 'కీ'లు
- మరికొన్ని సబ్జెక్టుల ఫైనల్ 'కీ'లదీ అదే పరిస్థితి

4లో

రైతన్నలకు రూ. 1.5 లక్షల కోట్లు



■ లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రం రైతులకు ఊరట కల్పించేలా కీలక నిర్ణయం తీసుకోనుందా? అన్నదాతలను రుణాల ఊబి నుంచి బయటపడేసేలా భారీ ప్యాకేజీ ప్రకటించనుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయాలు చవిచూసిన నేపథ్యంలో అప్రమత్తమైన ఎన్డీయే ప్రభుత్వం రైతులను ప్రసన్నం చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. - 13లో



బడ్జెట్.. పంచతంత్ర..

ఫిబ్రవరి 1.. బడ్జెట్ టైం.. ఆ రోజున ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి బదులుగా ఆ శాఖ బాధ్యతలను నిర్వర్తిస్తున్న పియూష్ గోయల్ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టే చివరి బడ్జెట్ కూడా ఇదే.. అయితే.. ఏమిటీ మధ్యంతర బడ్జెట్.. పూర్తిస్థాయి బడ్జెట్‌కు దీనికి తేడా ఏమిటి? ప్రజాకర్షక నిర్ణయాలు ఉంటాయి అంటున్నారు.. అలా తీసుకోవచ్చా లేదా.. ఇలాంటి చాలా కన్ఫ్యూజన్లు..
మరి.. వాటిని క్లియర్ చేసుకుందామా..

1 మధ్యంతర బడ్జెట్ అంటే..



ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందు(భారత్‌లో అది ఏప్రిల్ 1) కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. ఇదో ఆదాయ, వ్యయ పట్టిక. ఇందులో తనకు ఆదాయం వచ్చే మార్గాలను తెలపడంతోపాటు, ఆ ఆదాయాన్ని ఎలా ఖర్చు చేయబోతోందన్న విషయాన్నీ వివరిస్తుంది. మధ్యంతర బడ్జెట్ విషయానికొచ్చేసరికి కొంచెం తేడా ఉంటుంది. ఇది మొత్తం సంవత్సరానికి సంబంధించిన పద్దు కాదు. పరిమిత కాలానికి సంబంధించినది. అంటే.. ఎన్నికలయ్యాక కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేవరకూ ఇది అమల్లో ఉంటుంది.

2 ఓట్ ఆన్ అకౌంట్.. మధ్యంతర బడ్జెట్ ఒకటేనా..



సాధారణంగా ఒకదానికి బదులు ఒక దాన్ని వాడేస్తుంటాం కానీ.. రెండూ వేర్వేరు. ఓట్ ఆన్ అకౌంట్‌లో.. ఎన్నికలయ్యాక కొత్త ప్రభుత్వం వచ్చేవరకూ.. అంటే అధికార మార్పిడి కాలం వరకూ అయ్యే రోజువారీ వ్యయాలకు సంబంధించిన అంచనాలు మాత్రమే ఉంటాయి. అదే మధ్యంతర బడ్జెట్‌లో ఆదాయం, వ్యయం రెండింటి అంచనాలు ఉంటాయి. పాలసీపరమైన చర్యలు తీసుకోవచ్చు. రోజువారీ ఖర్చుల కోసం కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా(సీఎఫ్ఐ) నుంచి నిధులను తీసుకునేందుకు కేంద్రం పార్లమెంటు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

3 ఏం చేయొచ్చు.. ఏం చేయకూడదు..




మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక బిల్లు ఉండదు. దీని వల్ల ఆదాయపు పన్ను చట్టంలో మార్పులు చేయడానికి ఉండదు. శ్లాబ్‌లు పాతవే ఉంటాయి. ఎకనామిక్ సర్వే కూడా ఉండదని చెబుతున్నారు. సాధారణంగా అయితే రాబోయే ప్రభుత్వంపై భారం మోపేలా విధానపరమైన కీలక నిర్ణయాలేవీ ప్రకటించరు.

4 అస్సలు తీసుకోవడానికి లేదా..



రాజ్యాంగపరంగా చెప్పాలంటే.. తీసుకోవచ్చు. ఎందుకంటే.. మధ్యంతర బడ్జెట్‌లో పాలసీ నిర్ణయాలు తీసుకోకూడదని చెప్పే నిబంధనేదీ రాజ్యాంగంలో లేదు. సాధారణంగా తీసుకోరు అంతే.. 'ఎన్నికల తేదీలను ప్రకటించడానికి ముందు మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టేటట్లయితే.. ప్రభుత్వం ఎలాంటి విధానపరమైన నిర్ణయాలనైనా తీసుకోవచ్చు' అని ప్రముఖ న్యాయవాది అరవింద్ దతార్ 'బ్లూమ్‌బర్గ్ క్వింట్'కు తెలిపారు. మరికొందరు కూడా ఈ వాదనను సమర్థిస్తున్నారు. అయితే, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా దీంతో విభేదిస్తున్నారు. ఎకనామిక్ సర్వే ఉండదు, ఆర్థిక బిల్లు ఉండదు.. అలాగే విధానపరమైన నిర్ణయాలు కూడా ఉండకూడదని పేర్కొంటున్నారు.

5 ఈ మధ్యంతరం బడ్జెట్‌లో ఏముండొచ్చు..



పాత సంప్రదాయాలకు భిన్నంగా మధ్యంతర బడ్జెట్ ఉండొచ్చన్నట్లుగా కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ ఇప్పటికే పలు వ్యాఖ్యలు చేశారు. దాన్ని బట్టి మోదీ సర్కారు కొన్ని విధానపరమైన కీలక నిర్ణయాలను ప్రకటించవచ్చనే ఊహాగానాలు వినవస్తున్నాయి. మళ్లీ అధికారంలోకి వస్తే.. వచ్చే ఐదేళ్లకు సంబంధించిన తమ ప్రాధాన్యతలు ఇవీ అని తెలియజేయడానికి ఈ మధ్యంతర బడ్జెట్‌ను ఓ అవకాశంగా వాడుకోవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా దేశంలోని రైతాంగానికి తెలంగాణలోని రైతు బంధు తరహా పథకాన్ని ప్రకటించవచ్చని అంటున్నారు. జైట్లీ మాటలను బట్టి చూస్తే.. పాత సంప్రదాయాలకు తిలోదకాలిస్తూ.. ఆదాయపు పన్ను వంటివాటిల్లో మినహాయింపులు ప్రకటించినా ఆశ్చర్యపోనక్కర్లేదని పరిశీలకులు చెబుతున్నారు.

సాక్షి-సెంట్రల్ డెస్క్

బీసీలు హైకోర్టు జడ్జీలుగా పనికిరారని కుట్రలు చేశారు'

సాక్షి, న్యూఢిల్లీ: బీసీలు హైకోర్టు జడ్జీలుగా పనికిరారంటూ సీఎం చంద్రబాబు కుట్రలు చేశారని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు ధ్వజమెత్తారు. నాలుగున్నరేళ్లపాటు బీసీలను వంచించిన చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల ముందు 'జయహో బీసీ' అంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. గతంలో హైకోర్టుకు చెందిన నలుగురు బీసీ న్యాయవాదులు జడ్జీలు కాకుండా చంద్రబాబు కేంద్రానికి ఇచ్చిన తప్పుడు నివేదికల ఉదంతంపై ఒక పత్రికా కథనాన్ని జీవీఎల్ ఆదివారం ట్విట్టర్‌లో పోస్టు చేశారు.

ప్రజా శ్రేయస్సు కోసం జగన్ రావాలి

- ఎన్టీఆర్ పెద్దల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆకాంక్ష
- కుమారుడు హితేష్‌తో కలిసి జగన్‌తో భేటీ
- జగన్ పదేళ్లుగా పార్టీని చక్కగా నడుపుతున్నారు: దగ్గుబాటి



హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశమైన దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు హితేష్. చిత్రంలో ఎంపీ విజయసాయిరెడ్డి, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, హైదరాబాద్ : ప్రజా శ్రేయస్సు కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రావాలని మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పెద్దల్లుడు, సీఎం చంద్రబాబు తోడల్లుడు, సీనియర్ రాజకీయ వేత్త దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో కలిసి పయనించాలని తన కుమారుడు హితేష్ నిర్ణయించుకున్నారని, అందుకే జగన్‌ను కలుసుకున్నామని చెప్పారు. కుమారుడు దగ్గుబాటి హితేష్ చెంచురాంతో కలిసి ఆదివారం ఆయన ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ అధికారంలోకి రాగానే ప్రజలకు ఉపయోగపడే విధంగా పనిచేస్తారని తాను విశ్వసిస్తున్నానని చెప్పారు. ఇదే ఆకాంక్షను తాను జగన్ వద్ద వ్యక్తం చేశానన్నారు.

ఏపీలో ప్రభుత్వ పనితీరు పూర్తిగా గాడి తప్పిందని, ప్రభుత్వ డబ్బుతో దీక్షలు చేయడం సరికాదని విమర్శించారు. అసలు తన వద్ద నిధులు లేవంటూనే.. కోట్లకు కోట్లు ఖర్చు చేసి దీక్షలు చేయడం ఏమిటని ఆయన చంద్రబాబును ప్రశ్నించారు. 'జిల్లాల్లో సభల కోసం కోట్లకు కోట్లు ఖర్చు చేస్తున్నారు.. బస్సుల్లో ప్రజలను సభలకు తీసుకు వస్తున్నారు.. టెంట్లు వేస్తున్నారు, కలెక్టర్లు, ఎస్పీలు ఈ సభల కోసమే పని చేస్తున్నారు.. అధికారులంతా తమ విధులను వదలి టీడీపీ కార్యక్రమాల కోసమే నెలలో పది రోజులు పని చేయాల్సి వస్తోంది. ఇంత వరకు రైతుల రుణమాఫీ నాలుగు, ఐదు విడతల డబ్బు ఇవ్వలేదు గానీ, పోస్ట్ డేటెడ్ చెక్కుల ద్వారా డ్వాక్రా సంఘాల మహిళలకు డబ్బులు ఇస్తామంటున్నారు. ఇంత విచిత్రమైన పరిపాలన ఎక్కడైనా ఉంటుందా? కేవలం ఎన్నికల ముందు రూ.8 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్లు పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇవ్వడం సరికాదు' అన్నారు.

జగన్‌పై అన్నీ పుకార్లే..

జగన్ ప్రవర్తన గురించి ఎన్నో పుకార్లు సృష్టించారని, అయితే ఆయన్ను కలిసి మాట్లాడాక అవన్నీ ఓ పథకం ప్రకారం ప్రత్యర్థులు చేస్తున్నవనేది అర్థం అయిందని దగ్గుబాటి వెంకటేశ్వరరావు అన్నారు. జగన్ మీడియా ఇంటర్వ్యూలు, సుదీర్ఘ పాదయాత్రను గమనించానని, ఒక రాజకీయ పార్టీని నడపడం ఎంత కష్టమో తనకు తెలియనిది కాదన్నారు. ఇన్నేళ్లుగా ఎన్నో కష్టాలకు ఓర్చి పార్టీని నడుపుతున్న తీరు ఎంతో కష్టమైన పని అని, అందుకే జగన్ కష్టానికి దేవుడు తప్పకుండా మంచి ఫలితం చూపిస్తారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు పయనించడానికి వచ్చామని భేటీ సందర్భంగా తెలియజేసినప్పుడు జగన్ సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. అసెంబ్లీ టికెట్ ఆశించి వచ్చారా? అని మీడియా ప్రశ్నించినప్పుడు.. పార్టీ విధి విధానాల ప్రకారం టికెట్ల కేటాయింపు ఉంటుందని, పార్టీ ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని చెప్పారు. తన సతీమణి దగ్గుబాటి పురంధేశ్వరి బీజేపీలో కొనసాగుతారని, లేదంటే రాజకీయాల నుంచి విరమించుకుంటారని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తామంతా ఒకే కుటుంబంలో ఉన్నప్పటికీ, ఎవరి అభిప్రాయాలు, ఎవరి ఇష్టాలు వారివన్నారు. రాజకీయాల్లో బిడ్డల అభిప్రాయం ప్రకారమే ఉండాలని ఏమీ లేదని, బీజేపీలో పెద్దలు కూడా.. రాజకీయాల్లోనే కొనసాగాలని పురంధేశ్వరికి సూచించారన్నారు. వైఎస్సార్‌సీపీలో ఎప్పుడు చేరుతున్నారని ప్రశ్నించగా, తమ శ్రేయోభిలాషులు, హితులందరితో మాట్లాడాలన్నారు. జగన్‌తో ఈ సమావేశం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేస్తున్నామనే సంకేతం ఇవ్వాలనే ఇక్కడకు వచ్చామని చెప్పారు. వారు జగన్‌తో భేటీ అయినప్పుడు పార్టీ ముఖ్య నేతలు వి.విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఉన్నారు.

బీసీలకు కులాలవారీగా కార్పొరేషన్లు

రాజమహేంద్రవరం 'జయహో బీసీ' సభలో సీఎం చంద్రబాబు హామీ



జయహో బీసీ సభలో సీఎం ప్రసంగిస్తున్న సమయంలో జనం లేక ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వెనుకబడిన తరగతులకు(బీసీ) కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బీసీలకు న్యాయం చేసిన పార్టీ టీడీపీయేనని చెప్పారు. నేతలు కొంతమంది అటూ ఇటూ అయినా వెనుకబడిన కులాలన్నీ టీడీపీ వైపే ఉన్నాయని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన జయహో బీసీ సభలో చంద్రబాబు మాట్లాడారు. 8 మంది బీసీ మంత్రులు తన ప్రభుత్వంలో ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఇంతమంది బీసీ మంత్రులు ఉన్నారా? అని ప్రశ్నించారు. హైకోర్టు, సుప్రీంకోర్టులకు నియమించిన న్యాయమూర్తుల విషయంలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరామని స్పష్టం చేశారు. ఆదరణ పథకం కింద రూ.950 కోట్లు ఖర్చు పెట్టి 4 లక్షల మందికి ఆధునిక పనిముట్లు ఇచ్చిన ఏకైక పార్టీ టీడీపీయేనని పేర్కొన్నారు. 2014లో అధికారంలోకి వచ్చాక రూ.111 కోట్ల మేర నేతన్నలకు రుణమాఫీ చేశామన్నారు. బీసీలంతా తన వెనుకే ఉన్నారని, మాతో పెట్టుకుంటే ఖబడ్దార్ అని బీజేపీ, వైఎస్సార్‌సీపీని హెచ్చరిస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంలు కేఈ కృష్ణమూర్తి, నిమ్మకాయల చినరాజప్ప, మంత్రులు యనమల రామకృష్ణుడు, నారా లోకేష్, కళా వెంకట్రావు, కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పితాని సత్యనారాయణ, దేవినేని ఉమా, పరిటాల సునీత, టీడీపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు.

బీసీలపై బాబు హామీల వర్షం

''మన వద్ద ఫెడరేషన్‌లు ఉన్నాయి. ఫెడరేషన్ కాకుండా కార్పొరేషన్లు పెట్టండని బీసీలు అడిగారు. అందుకే బీసీ కులాల కోసం ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తాం. రజక, నాయీబ్రాహ్మణ, వడ్డెర, కృష్ణబలిజ, సగర, ఉప్పర, పూసల, వాల్మీకి, బోయ, భట్రాజు, కుమ్మరి కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తాం. శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశయన వారికి కూడా ప్రత్యేక కార్పొరేషన్‌లు నెలకొల్పుతాం. విశ్వబ్రాహ్మణ, మేదర, వడ్డెర కార్పొరేషన్‌లకు శ్రీకారం చుడతాం. మత్స్యకారులకు, అగ్నికుల క్షత్రియులకు, యాదవులకు, కురబలకు ప్రత్యేక కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తాం. గొర్రెలకు ఇన్సూరెన్స్ అమలు చేయడమేకాకుండా ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. అగ్నికుల క్షత్రియులను ఎస్సీల్లో చేర్చడానికి కమిషన్ వేశాం, త్వరలోనే దాని నివేదిక వస్తుంది. తీర్మానం చేసి ఢిల్లీకి పంపిస్తాం. తూర్పుకాపులకు ప్రత్యేక కార్పొరేషన్ పెట్టి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయిస్తాం. కొప్పుల వెలమలకు ప్రత్యేక కార్పొరేషన్ తీసుకొస్తాం. మేత, పద్మశాలి వంటి అనేక వర్గాల జీవితాలు దుర్భరంగా ఉన్నాయి. వారి సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నాం. కాళింగ, గవర, దాడ్లకు కూడా కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తాం. ఇవేకాకుండా రూ.3 వేల కోట్లతో మరికొన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతాం'' అని చంద్రబాబు హామీ ఇచ్చారు. బీసీలకు ఆయన ప్రకటించిన హామీల్లో మరికొన్ని ఏమిటంటే..

- విదేశీ విద్యకు ఒక్కొక్కరికీ రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు ఇస్తాం.
- చేనేత కార్మికులకు 100 యూనిట్ల నుంచి 150 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తాం.
- నాయీబ్రాహ్మణుల దుకాణాలకు 150 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తాం.
- వాల్మీకి బోయలను ఎస్టీల్లోకి చేర్చేందుకు చర్యలు.
- రజకులను ఎస్సీల్లోకి చేర్చేందుకు ప్రయత్నిస్తున్నాం.
- రాజధానిలోని 10ఎకరాల్లో జ్యోతిరావ్‌పూలే స్మారక భవనం, ఉద్యానవనం నిర్మిస్తాం. దానికోసం రూ.100 కోట్లు కేటాయిస్తాం.
- అత్యంత వెనుకబడిన బీసీలకు సబ్సిడీని రూ.30 వేల నుంచి రూ.50 వేలకు పెంచుతాం.
- సంచార జాతులకు 100 యూనిట్లు విద్యుత్ ఉచితం.
- బీసీలు కార్లు కొనుక్కుంటే 25 శాతం సబ్సిడీ ఇస్తాం.
- బీసీలకు69 రెసిడెన్షియల్ పాఠశాలలు పెడతాం, నియోజకవర్గానికొక గురుకుల పాఠశాల ఉండేలా చూస్తాం.
- స్వర్ణకారులకు 100 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తాం

సీఎం ప్రసంగం.. కుర్చీలు ఖాళీ

జయహో బీసీ సభ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం అవుతుందని టీడీపీ నేతలు చెప్పారు. 3 లక్షల మందితో భారీ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కానీ, అందులో 20 శాతం మంది కూడా రాలేదు. వచ్చిన వారిలో కూడా బీసీలే కాకుండా మిగతా సామాజిక వర్గాల ప్రజలు కూడా ఉన్నారు. సీఎం చంద్రబాబు 4.36 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అంతవరకు వేచి చూడలేక జనం తిరుగుముఖం పట్టారు. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించాక కుర్చీలు ఖాళీ అయిపోయాయి. కాగా,బీసీ సభకు కృష్ణా జిల్లా జగ్గయ్యపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో జనాలను తరలించారు. బస్సు తిరిగి పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు వచ్చేసరికి గడ్డర్‌ను ఢీకొంది. ఈ క్రమంలో అన్నవరప్పాడుకు చెందిన మద్దూరి శివ అనే వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు.

బీసీలను బానిసలుగా మార్చింది చంద్రబాబే

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి

విజయవాడ సిటీ: బీసీలు ఎక్కడ, ఏ స్థితిగతుల్లో ఉన్నారో?... అక్కడే ఉండేలా ఆదరణ పేరుతో చంద్రబాబు మోసం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి దుయ్యబట్టారు. బీసీ కుటుంబాల్లోని పిల్లల అభ్యున్నతికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన పథకాలకు చంద్రబాబు తూట్లు పొడిచారని ధ్వజమెత్తారు. బలహీనవర్గాల పిల్లలు ఉన్నత చదువులు చదువుకోనీయకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్, బీసీ స్కాలర్ షిప్, విదేశీ విద్య ఇలా అన్నిటికీ గండికొట్టి అన్యాయం చేశారని ఆరోపించారు. బడుగు, బలహీనవర్గాల ప్రజలను చంద్రబాబు బానిసలుగా మార్చారన్నారు. విజయవాడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్థసారథి ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలల పాలనలో బీసీలకు చేసిందేమీ లేదన్నారు. చట్టబద్ధత, విలువలు లేని జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి, వాటి దగ్గర బీసీలు చేతులు కట్టుకొని నిలబడే దుస్థితిని చంద్రబాబు తీసుకొచ్చాడని మండిపడ్డారు. బీసీలను అవమానించి, అన్యాయం చేసిన చంద్రబాబు ఏ మొహం పెట్టుకొని బీసీ గర్జన సభ పెట్టాడో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు రెండు నెలల ముందు వరాలు ప్రకటించి ప్రజలను మోసగించి లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు.

రాజమండ్రిలో అన్నపూర్ణమ్మపేట గ్రామంలో డ్వాక్రా మహిళలు గర్జన సభకు రాకపోతే సెల్‌ఫోన్ ఇవ్వం, రూ. పది వేలు ఇవ్వమని బెదిరించారని, దీంతో మహిళలు ధర్నాకు దిగారన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో బలహీన వర్గాలకు దాదాపు 125 హామీలు ఇచ్చారని, వాటిలో ఇప్పటి వరకు ఏ ఒక్కటైనా అమలు చేసిందేమో.. స్పష్టంగా చెప్పాలన్నారు. బలహీనవర్గాలకు మైనింగ్ మీద హక్కులు, ఇసుక క్వారీలు అన్నారు. ఒక్కరికీ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ అని అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోయారు. ఇక చేపల వేటకు వెళ్లి గల్లంతైన వారి కుటుంబానికి నష్టపరిహారం కూడా ఇవ్వలేని దౌర్భాగ్య ప్రభుత్వం ఇది అని ధ్వజమెత్తారు. చేనేతలకు వర్షాకాలంలో నెలకు రూ.4 వేలు ఇస్తామని ఇచ్చిన హామీకి ఇప్పటి వరకు అతీగతి లేదన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రియింబర్స్‌మెంట్ పథకం తీసుకొచ్చి బలహీనవర్గాల కుటుంబాల్లో వెలుగులు నింపారని గుర్తు చేశారు. టీడీపీ వచ్చిన తరువాత ఫీజురియింబర్స్‌మెంట్‌ను సర్వనాశనం చేసిందని మండిపడ్డారు.

రూ.2వేలు విలువ ఉన్న పనిముట్టు రూ.20వేలట...

ఆదరణ పేరుతో ప్రభుత్వం రూ.2 వేల విలువచేసే పనిముట్టును రూ.18 వేల నుంచి రూ.20 వేలతో కొనుగోలు చేసి అందులో కూడా కమీషన్ కొట్టేశారని ఆరోపించారు. ఆదరణ పథకాలు బలహీనవర్గాల జీవితాల్లో మార్పులు తీసుకురావడానికా..? టీడీపీ నాయకులు జేబులు నింపుకోవడం కోసమా? చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోస్టుమెట్రిక్ స్కాలర్ షిప్ 2017–18కి బడ్జెట్‌లో రూ. 274.5 కోట్లు కేటాయిస్తే విడుదల చేసింది రూ.124 కోట్లు మాత్రమేనన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్‌కు 2017–18 బడ్జెట్‌లో రూ.1042 కోట్లు కేటాయించి కేవలం రూ. 517.27 కోట్లు మాత్రమే ఇచ్చింది వాస్తవం కాదా అని నిలదీశారు.

బీసీలకిచ్చిన 119 హామీలేమయ్యాయి?

- వారిని వంచించింది చాలక మళ్లీ సభలా?
- సీఎంపై వైఎస్సార్‌సీపీ నేత మార్గాని భరత్ ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్/అమరావతి : గత ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకోకుండా వంచనకు గురిచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీ సభలు నిర్వహించడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గ కోఆర్డినేటర్ మార్గాని భరత్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీలకు ఇచ్చిన 119 హామీల్లో ఏ ఒక్కటీ అమలుచేయలేదన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014 టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు కేటాయించిన నాలుగు పేజీలు మొక్కుబడిగా మారాయన్నారు. ఏటా రూ.10వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో మొత్తం రూ.50 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తానన్న చంద్రబాబు ఎంతిచ్చారో చెప్పాలన్నారు. కేవలం ఎన్నికల కోసం బీసీలను చంద్రబాబు వాడుకుని లాభపడ్డారని, వారికి ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే.. బీసీలు జడ్జీలుగా పనికిరారన్న మీరు ఆ విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. బీసీలకు సబ్సిడీలు ఇస్తామని, మత్స్యకారులకు కోల్డు స్టోరేజి సౌకర్యం కల్పిస్తానని గతంలో ప్రకటించారని, ఈ హామీలేమయ్యాయన్నారు. పాకిస్తాన్ జైలులో మగ్గుతున్న ఈ ప్రాంతం వారిని కాపాడేందుకు టీడీపీ ప్రభుత్వం తీసుకున్న చొరవ ఏమిటని భరత్ ప్రశ్నించారు.

అది బీసీ విద్రోహ సభ : హరీష్‌యాదవ్

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో టీడీపీ నిర్వహించింది బీసీల విద్రోహ సభ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడు హరీష్ కుమార్ యాదవ్ విమర్శించారు. వైఎస్సార్ హయాంలోనే బీసీలకు మేలు జరిగిందని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ ప్రకటించిన నవరత్నాలు ద్వారానే వారి జీవితాలు బాగుపడతాయని, బీసీ యువకులందరూ 'జై జగన్' అనే నినాదం ఇవ్వాలని హరీష్ విజ్ఞప్తి చేశారు.

బీసీలకు టీడీపీ చేసింది శూన్యం

ఏపీ సగర సంఘం నేత నక్కా శ్రీనివాసరావు

కంకిపాడు(పెనమలూరు): టీడీపీ ప్రభుత్వం బీసీలకు చేసింది శూన్యమని ఏపీ సగర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జయహో బీసీ పేరుతో రాజమండ్రిలో నిర్వహిస్తున్న సభతో టీడీపీ మళ్లీ బీసీలను మోసం చేయాలని చూస్తోందన్నారు. చంద్రబాబు గతంలో 'వస్తున్నా మీ కోసం' పాదయాత్ర జరిపినప్పుడు సగరుల సమస్యలపై విన్నవించగా.. బీసీ డీ నుంచి బీసీ ఏగా మార్పు చేస్తామని హామీ ఇచ్చారని, ఎన్నికల మేనిఫెస్టోలోనూ పేర్కొన్నారని, కానీ నాలుగున్నరేళ్లు గడిచినా ఆ హామీ నెరవేరలేదని ఆయన విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో సగర ఫెడరేషన్ ఏర్పాటయ్యిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఫెడరేషన్‌కు కేటాయించిన రుణాలు లబ్ధిదారులకు అందట్లేదని, బ్యాంకర్లు ష్యూరిటీ లేకుండా రుణాలు అందించట్లేదని వాపోయారు. హామీలు ఏవీ కార్యరూపం దాల్చట్లేదన్నారు. ఎన్నికలు వస్తుండటంతో హఠాత్తుగా బీసీలు గుర్తుకొచ్చారని మండిపడ్డారు.

మళ్లీ కాపీ కొట్టాడు

జగన్ హామీలను వరుసగా కాపీ కొడుతున్న చంద్రబాబు

సాక్షి, అమరావతి : ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఇదివరకు ఇచ్చిన హామీలను చంద్రబాబు ఎన్నికల వేళ వరుసగా కాపీ కొడుతున్నారు. తాజాగా రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన బీసీ సదస్సులో ఆయా కులాలకు కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ప్రతి కులానికీ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని వైఎస్ జగన్ ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. కొన్ని కులాలను ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో చేరుస్తానని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఇప్పటి వరకు ఆ మాట నిలుపుకోలేదు. కేంద్రంపై నెట్టేసి చేతులు దులుపుకున్నారు. తాజాగా ప్రస్తుతం ఉన్న 11 బీసీ ఫెడరేషన్‌లను కార్పొరేషన్‌లుగా చేస్తానని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇదే విషయాన్ని వైఎస్ జగన్ చాలా సభల్లో పలు మార్లు చెప్పారు. పైగా ఆయా కులాలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్ ఇస్తానని హామీ ఇచ్చారు. శెట్టిబలిజ, ఈడిగ, గౌడ, శ్రీసైన, యాదవ, కురుబ, మత్స్యకార, అగ్నికుల క్షత్రియ, వన్యకుల క్షత్రియ, తూర్పుకాపు, కొప్పుల వెలమ, కళింగ, గవర, గాండ్ల, చేనేత కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ వర్గాల వారు సమస్యలు వివరిస్తూ పాదయాత్రలో వైఎస్ జగన్‌కు వినతి పత్రాలు సమర్పించడంతో వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, కార్పొరేషన్‌ల ఏర్పాటుకు హామీ ఇవ్వడం తెలిసిందే.

బీసీ సబ్ ప్లాన్ పేరుతో మళ్లీ మోసం చేసే ప్రకటన

నాలుగేళ్లుగా ఏటా రూ.10 వేల కోట్లు బీసీ సబ్ ప్లాన్ కింద బడ్జెట్‌లో కేటాయించామని చంద్రబాబు బీసీలను మోసం చేశారు. బీసీ సబ్‌ప్లాన్‌కు ఇంత వరకు విధి విధానాలు లేకుండా బడ్జెట్‌లో నిధులు ఎలా కేటాయించారనే దానికి మాత్రం ఆయన సమాధానం చెప్పడం లేదు. కేవలం బీసీ జనాభా ఉన్న ప్రాంతాల్లో నిర్మించిన రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం చేసిన ఖర్చును బీసీ సబ్‌ప్లాన్ కింద ఖర్చు చేసినట్లు చూపించి మోసం చేశారు. ఈ నేపథ్యంలో బీసీ సబ్‌ప్లాన్ విధి విధానాల రూప కల్పనకు కమిటీ వేస్తామని తాజాగా సదస్సులో ప్రకటించారు. అంటే ఇప్పటి వరకు సబ్‌ప్లాన్ అంటూ మోసం చేసిన విషయాన్ని ఆయన అంగీకరించినట్లేనని పలువురు బీసీ సంఘాల నేతలు వ్యాఖ్యానించారు. అత్యంత వెనుకబడిన కులాలకు కార్పొరేషన్ తానే ఏర్పాటు చేసినట్లు సభలో గొప్పలు చెప్పుకున్నారు. నిజానికి దివంగత సీఎం వైఎస్సార్ నేతృత్వంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో విధి విధానాలకు రూపకల్పన జరిగింది. అప్పట్లో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా ఉన్న ప్రవీణ్‌కుమార్ ఈ విషయంలో శ్రద్ధ తీసుకున్నారు. ఆ తర్వాత కార్పొరేషన్ ఏర్పాటైంది.

అన్నీ జగన్ చెప్పినవే: పెన్షన్‌లు రెట్టింపు చేశానని, ట్రాక్టర్లు, ఆటోలకు ట్యాక్స్ ఎత్తి వేశానని, నాయీ బ్రాహ్మణులకు తాను తప్ప ఎవ్వరూ సాయం చేయలేదని చంద్రబాబు సభలో చెప్పుకున్నారు. బీసీలకు ఆదరణ గురించి చెబుతూ 4 లక్షల మందికి వస్తువులు అందించినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటి వరకు ఆదరణ పథకం కోసం దరఖాస్తులు చేసుకున్న వారు 7.53 లక్షల మంది ఉంటే అందులో డిపాజిట్ కట్టిన వారు 3.44 లక్షల మంది ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో కనీసం రెండు లక్షల మందికి కూడా పూర్తి స్థాయిలో వస్తువులు ఇవ్వలేదు. పైగా ఇచ్చిన వస్తువులన్నీ నాసిరకం. అయినా చంద్రబాబు గొప్పలు చెప్పుకోవడం చూసి సభకు వచ్చిన పలువురు ఆశ్చర్యపోయారు. సభ జరుగుతున్న సమయంలో పలుమార్లు 'తమ్ముళ్లూ చప్పట్లు కొట్టండి' అంటూ కోరినా పెద్దగా స్పందన రాలేదు. నాయీ బ్రాహ్మణులు ఇటీవల సచివాలయం వద్దకు వచ్చి సమస్యలు విన్నవిస్తే చంద్రబాబు తీవ్రంగా మండిపడిన విషయం ఎవరూ మరచి పోలేదు. 'నన్నే ప్రశ్నిస్తారా.. మీ తోకలు కట్ చేస్తా'నని బెదిరించిన విషయం తెలిసిందే. వాస్తవానికి కొద్ది రోజులుగా చంద్రబాబు ప్రకటించినవన్నీ ఇదివరకే జగన్ ఇచ్చిన హామీలే. ఆటో వాలాలు జగన్‌ను కలిసి సమస్యలు వివరించినప్పుడు ట్యాక్స్ తీసి వేయడంతో పాటు సంవత్సరానికి రూ.10 వేలు ఉచితంగా సాయం అందిస్తానని ప్రకటించారు. అవ్వాతాతలకు తోడుగా ఉంటానని చెబుతూ పెన్షన్‌ను రూ. రెండు వేలు చేస్తానని, రైతుల ట్రాక్టర్లకు ట్యాక్స్ రద్దు చేస్తున్నట్లు అనేకసార్లు చెప్పారు.

ఇదంజగత్





కాళ్లు మొక్కిన వారే ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచారు

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్య



ఆంధ్రా అసోసియేషన్ వేడుకల్లో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్టీఆర్ కాళ్లు మొక్కినవారే ఆయనకు వెన్నుపోటు పొడిచారని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. అయితే ఇప్పుడు వారి పేర్లు చెప్పడం సరైంది కాదన్నారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన ఆంధ్ర అసోసియేషన్ ఢిల్లీ జూబ్లీ వేడుకలు, అసోసియేషన్‌లో గోదావరి ఆడిటోరియం ఆవిష్కరణ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి పాల్గొని ప్రసంగించారు. ఈ రోజుల్లో నిస్వార్థంగా సేవచేయడం కష్టమైన పనిగా మారిందని ఉపరాష్ట్రపతి అన్నారు. వ్యవస్థలను ధిక్కరించడం, చట్టాలను అతిక్రమించడం, చట్టంలోని లొసుగులు తెలుసుకొని సంస్థలను దుర్వినియోగం చేయడం కొన్నేళ్లుగా అందరికీ అలవాటుగా మారిందన్నారు. అయితే ప్రస్తుతం వీటిని సరిదిద్దేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు దేశంలో ఎదురవుతున్న సమస్యలు అందరికీ తెలిసినవేనని వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎవరి కాళ్లు మొక్కకుండా తన కష్టంతో ఈ రోజు ఈ స్థాయికి వచ్చినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దివంగత నందమూరి తారకరామారావుతో జరిగిన ఒక ఘటనను వెంకయ్య గుర్తు చేసుకున్నారు. ఒక రోజు కొంతమంది వరుసగా ఎన్టీఆర్ కాళ్లు మొక్కడం చూసి ఇదేంటని ఆయన్ను ప్రశ్నించగా.. అది వాళ్ల ప్రేమ అని సమాధానమిచ్చారన్నారు. అది ప్రేమా? మరేదైనా? అన్నది ఆరునెలల్లో తెలుస్తుందని తాను అప్పుడు బదులిచ్చినట్టు వెంకయ్య చెప్పారు. సరిగ్గా ఆరు నెలల్లోనే ఎన్టీఆర్‌కు ఎవరైతే కాళ్లు మొక్కారో వారందరూ ఆయనకు వెన్నుపోటు పొడిచారని వెంకయ్య వివరించారు. ఢిల్లీలో మన సంస్కృతిని స్థానికంగా స్థిరపడిన తెలుగువారికి చేరువచేస్తున్న ఆంధ్ర అసోసియేషన్ పనితీరు అభినందనీయమని వెంకయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కేవీ చౌదరి, అసోసియేషన్ అధ్యక్షుడు మణినాయుడు పాల్గొన్నారు.





'జయహో బీసీ సభ జరిపే అర్హత చంద్రబాబుకు లేదు'

సాక్షి, అమరావతి: ఎన్నికల సమయంలో బీసీలకు 120 హామీలిచ్చిన చంద్రబాబు.. కనీసం 12 హామీలు కూడా అమలు చేయలేదని, ఎన్నికలు దగ్గర పడుతుండటంతో మళ్లీ బీసీ జపం మొదలుపెట్టారని జనసేన పార్టీ జాయింట్ కోఆర్డినేటర్ పోతిన మహేష్ ఆరోపించారు. ఆయన ఆదివారం విజయవాడలో విలేకరులతో మాటాడారు. జయహో బీసీ సభ నిర్వహించడానికి చంద్రబాబు అనర్హుడని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తిని రబ్బరు స్టాంపుగా ఉపయోగించుకోవడంలోనే బాబుకు బీసీల పట్ల ఉన్న చులకన భావం తేటతెల్లమవుతోందన్నారు.

ఉత్తరాంధ్ర చర్చావేదిక ఆధ్వర్యంలో రైలు యాత్ర



మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ఏపీకి ప్రత్యేక హోదా కోరుతూ ఉత్తరాంధ్ర చర్చావేదిక ఆధ్వర్యంలో చలో ఢిల్లీ యాత్రకు ఆదివారం ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో వందలాది మంది సభ్యులు బయలుదేరారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో మోదీ ప్రభుత్వం ఆంధ్ర ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 31న ప్రధాన మంత్రి మోదీతోపాటు ఆయా శాఖల మంత్రులను కలవనున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ తక్షణమే మోదీ ప్రభుత్వం ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీబీఎస్‌ఈ సిలబస్‌లో హెల్త్‌సైన్స్!

న్యూఢిల్లీ: విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించేందుకు సిలబస్‌లో హెల్త్‌సైన్స్ సబ్జెక్ట్‌ను కొత్తగా చేర్చాలని సీబీఎస్‌ఈ యోచిస్తోంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఎయిమ్స్‌లు సంయుక్తంగా రూపొందించిన ఈ సిలబస్‌ను 9, 10, 11, 12 తరగతుల పాఠ్యప్రణాళికల్లో అదనంగా చేర్చే అవకాశాలున్నాయి. 'విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ప్రణాళిక రచించే ముందు చిన్న సర్వే చేశాం. వ్యక్తి కుక్క కాటుకు గురైతే వైద్యుడు వచ్చే లోపు ఏం చేయాలో చాలా మంది విద్యార్థులకు తెలియదు. ఎవరైనా గుండెపోటుకు లేదా మరేదైనా ప్రమాదానికి గురైతే ఎలా స్పందించాలో తెలియజేయడమే ప్రధాన ఉద్దేశంగా హెల్త్‌సైన్స్ సిలబస్ ఉంటుంది.' అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని అధికారి ఒకరు తెలిపారు. ఈ సిలబస్ ఏప్రిల్‌లో మొదలయ్యే కొత్త విద్యా సంవత్సరంలో ప్రారంభించే అవకాశాలున్నాయని సమాచారం.

1 నుంచి పీఎస్‌యూల్లో 10% కోటా అమలు

న్యూఢిల్లీ: అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లను అన్ని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్‌ఈ) ఫిబ్రవరి 1 నుంచే అమలు చేయనున్నాయి. ప్రస్తుతం మొత్తం 339 సీపీఎస్‌ఈల్లో కలిపి దాదాపుగా 10.9 లక్షల మంది ఉద్యోగులున్నారు. గత ఆర్థిక ఏడాదిలో ఆ సంఖ్య 11.55 లక్షలు. ఫిబ్రవరి 1 తర్వాత సీపీఎస్‌యూల్లో విడుదలయ్యే ప్రత్యక్ష నియామకాల నోటిఫికేషన్లలోనూ అగ్ర కులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలకు ప్రభుత్వ రంగ సంస్థల విభాగం ఇప్పటికే ఆదేశాలు పంపింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని విద్యా సంస్థల్లోనూ ఈ రిజర్వేషన్లను అమలు చేయాలని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశాలు ఇచ్చింది.

'కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

కోనేరుసెంటర్(మచిలీపట్నం): రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందజేయాలని ఏపీ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హెచ్ఆర్ పాలసీని ఏర్పాటుచేసి డీఏ సౌకర్యాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు.

'ఫార్మసిస్టుల సమస్యలు పరిష్కరించాలి'

సాక్షి, అమరావతి: గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఫార్మసిస్టుల నియామకాలు జరగకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో రెగ్యులర్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఫార్మసిస్టులకు పనిభారం తీవ్రంగా ఉంటోందని, తక్షణమే ఫార్మసిస్టుల నియామకాలు చేపట్టాలని ఏపీ ఫార్మసిస్ట్ అసోసియేషన్ సర్కారును డిమాండ్ చేసింది. ఆదివారం విజయవాడలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణల ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.







నేడు అక్కడక్కడా వర్షాలు

- కోస్తాంధ్ర, రాయలసీమల్లో తేలికపాటి వర్షాలకు అవకాశం
- రాయలసీమలో పెరిగిన రాత్రి ఉష్ణోగ్రతలు

సాక్షి,విశాఖపట్నం/కర్నూలు(అగ్రికల్చర్)/ గుంటూరు: రాష్ట్రంపై ఉపరితల ద్రోణులు ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం కొమరిన్ ప్రాంతం నుంచి తమిళనాడు, దక్షిణ కర్ణాటక మీదుగా ఉత్తర కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో అండమాన్ సముద్రానికి ఆనుకుని మరో ద్రోణి విస్తరించి ఉంది. వీటి ఫలితంగా నేడు కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు లేదా వర్షం కురిసే అవకాశం ఉందని ఐఎండీ ఆదివారం రాత్రి నివేదికలో తెలిపింది. ఆదివారం నుంచి రాష్ట్రం మీదుగా తూర్పు, ఆగ్నేయ గాలులు వీస్తున్నాయి. ఫలితంగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2–4 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. దీంతో పగటి పూట చల్లగా ఉంటోంది. మరోవైపు రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 6 డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయి. రాయలసీమలో రాత్రి ఉష్ణోగ్రతల పెరుగుదల ఎక్కువగా ఉంది. దీంతో కోస్తాంధ్ర, రాయలసీమల్లో రాత్రి పూట చలి ప్రభావం బాగా తగ్గింది. ద్రోణుల ప్రభావంతో గత 24 గంటల్లో మాచర్లలో 4, పత్తికొండలో 3, ఆలూరు, దేవనకొండ, ఆస్పరిల్లో 2, జంగమహేశ్వరపురం, గోనెగండ్ల, గూడూరు, డోన్, ఎమ్మిగనూరుల్లో ఒక్కో సెంటీమీటర్ వర్షపాతం నమోదైంది.

కర్నూలు, గుంటూరు జిల్లాల్లో పంటలకు నష్టం

కర్నూలు, గుంటూరు జిల్లాల్లో ఆదివారం కురిసిన మోస్తరు వర్షాలతో పంటలకు నష్టం జరిగింది. కర్నూలు జిల్లాలో వర్షాలతో వివిధ మండలాల్లో కల్లాల్లో ఆరపెట్టిన మిరప తడిచిపోయింది. రైతులు సాగు చేసిన శనగ ప్రస్తుతం పులుపు దశలో ఉంది. వర్షాలు పడటంతో పులుపు కారిపోవడంతో పంట దిగుబడులు పడిపోయే ప్రమాదం ఏర్పడింది. కర్నూలు జిల్లా మొత్తం మీద సగటున 4.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. గుంటూరు జిల్లాలో అకాల వర్షం కారణంగా రైతులు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలోని దుర్గి, కారంపూడి, మాచర్ల, రెంటచింతల మండలాల్లోని గ్రామాల్లో వర్షం ప్రభావం అధికంగా ఉంది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడవకుండా పట్టాలు కొనుగోలు చేసేందుకు రైతులు పోటీ పడటంతో వ్యాపారులు భారీ ధరలు వసూలు చేసి పట్టాలను విక్రయించారు. తాడికొండలో ఆరబెట్టిన మిర్చి తడిసిపోయింది. 1500 ఎకరాల్లో పూత దశలో ఉన్న శనగ పంటకు నష్టం వాటిల్లింది.

తలలన్నీ తాకట్టే..



▶ మొదటి పేజీ తరువాయి

సాక్షాత్తూ అకౌంటెంట్ జనరల్ ప్రిలిమినరీ అకౌంట్స్‌లో స్పష్టం చేయడం గమనార్హం. ఇప్పటికే బడ్జెట్ బయట రూ.95,000 కోట్ల అప్పులు తెచ్చిన ప్రభుత్వం వచ్చే రెండు నెలల్లో పరిమితికి మించి మరో రూ.30 వేల కోట్ల అప్పులు తెచ్చేందుకు రంగం సిద్ధం చేసింది.

బడ్జెట్‌లో ఓపెన్ మార్కెట్ ద్వారా అప్పులు చేసేందుకు నిబంధనలు అనుమతించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన దొంగ లెక్కలతో గతంలో ఇచ్చిన గ్యారెంటీలను చూపకుండా దాచేస్తూ బడ్జెట్ బయట పరిమితికి మించి ఎడాపెడా అప్పులు చేస్తోంది. ఎన్నికల ముందు దొరికిన చోటల్లా రుణాలు తీసుకోవడానికి సీఎం చంద్రబాబు ఆరాటపడుతున్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి. ద్రవ్య జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) చట్టం నిబంధనలకు మించి బడ్జెట్ బయట రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తోందని, ఆర్‌బీఐ నిబంధనలను సైతం ఉల్లంఘిస్తోందని పేర్కొంటున్నాయి.

అప్పుల కోసం బ్యాంకులతో సీఎంవో చర్చలు

బడ్జెట్ బయట వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా రాష్ట్ర సొంత ఆదాయంలో 90 శాతం మేర అప్పులు చేసేందుకు ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చేందుకు వీలుంది. అయితే, ఆ పరిమితికి మించి టీడీపీ ప్రభుత్వం బడ్జెట్ బయట అప్పులకు గ్యారెంటీ ఇచ్చేసింది. నిబంధనల మేరకు రూ.94,555.89 కోట్ల అప్పులకు మాత్రమే ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంది. అయితే, ఇప్పటికే ఆ పరిమితికి మించి అదనంగా రూ.1,154.25 కోట్లకు గ్యారెంటీ ఇచ్చి బడ్జెట్ బయట అప్పులు చేశారు. అంటే బడ్జెట్ బయట మొత్తం అప్పులు రూ.95,709 కోట్లకు చేరాయి. ఇప్పుడు కొత్తగా రెండు నెలల్లోనే రూ.29,465 కోట్ల మేర అప్పులు తెచ్చేందుకుప్రభుత్వం చర్యలు చేపట్టింది. అన్ని వాణిజ్య బ్యాంకుల పెద్దలతో ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో) స్వయంగా చర్చలు జరుపుతోంది. ఈ అప్పులు తెస్తే నిబంధనలకు విరుద్ధంగా బడ్జెట్ బయట రూ.30,619.25 కోట్ల అప్పులు చేసినట్లవుతుందని, ఇలా చేయడం రాష్ట్ర ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేయడమే తప్ప మరొకటి కాదని ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

పరిమితి పట్టదా?

2018 మార్చి 31 నాటికి ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చి బడ్జెట్ బయట చేసిన అప్పులు రూ.37,489.56 కోట్లు కాగా, 2018 డిసెంబర్ నాటికి ఆ అప్పులు రూ.47,379.56 కోట్లకు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిబంధనల మేరకు రూ.47,176.33 కోట్ల మేరకు మాత్రమే బడ్జెట్ బయట అప్పులకు ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వాల్సి ఉండగా, దానికి మించి ఇప్పటిదాకా రూ.48,330.58 కోట్ల అప్పులకు గ్యారెంటీ ఇచ్చేసింది. అంటే ఇప్పటికే పరిమితికి మించి బడ్జెట్ బయట రూ.1,154.25 కోట్ల అప్పునకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చినట్లయ్యింది.

కమీషన్‌ల కోసమే అప్పులు

ఎన్నికలకు రెండు నెలల ముందు వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల పేరుతో గ్యారెంటీ ఇచ్చేసి బడ్జెట్ బయట రూ.29,465 కోట్ల అప్పులు చేసేందుకు టీడీపీ సర్కారు సన్నద్ధమైంది. ఈ మేరకు ఫైళ్లను సిద్ధం చేసింది. వాణిజ్య బ్యాంకులతో బేరసారాలు సాగిస్తూ ఎంత ఎక్కువ వడ్డీకైనా సరే అప్పులు చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో అధికారులు బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నారు. ఇలా తెస్తున్న అప్పులను కావాల్సిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేందుకు, ఎన్నికల ముందు అనుత్పాదక రంగాలకు వెచ్చించడానికే సీఎం తాపత్రాయ పడుతుండడం గమనార్హం.

ఆర్థిక అత్యవసర స్థితిలోకి రాష్ట్రం

రాష్ట్రం విడిపోయే నాటికి 13 జిల్లాలకు చెందిన అప్పు రూ.96,000 కోట్లు ఉండగా, గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి కేవలం బడ్జెట్ అప్పులే రూ.2.59 లక్షల కోట్లకు చేరాయని అకౌంటెంట్ జనరల్ ప్రిలిమినరీ అకౌంట్స్‌లో తెలియజేశారు. వివిధ కార్పొరేషన్ల పేరుతో సర్కారు గ్యారెంటీతో తెచ్చే అప్పులను ప్రభుత్వమే తీర్చాల్సి ఉంటుందని 'కాగ్' తన నివేదికలో స్పష్టం చేసింది. ఇప్పటికే పరిమితికి మించి అప్పులు తీసుకురావడంతో ప్రభుత్వానికి ఒక కొత్త అప్పులు పుట్టే వెసులుబాటు కూడా లేకుండాపోతోందని, ఆర్థిక అత్యవసర పరిస్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టేస్తున్నారని ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

భయపెడుతున్న అప్పుల భూతం

ఇప్పుడే పుట్టిన శిశువులను సైతం చంద్రబాబు వదలడం లేదు. వారిపైనా అప్పుల భారం మోపుతున్నారు. వచ్చే రెండు నెలల్లో చేయనున్న రూ.30 వేల కోట్ల అప్పులతో కలిపి రాష్ట్రంపై మొత్తం అప్పుల భారం రూ.3.85 లక్షల కోట్లకు చేరనుంది. అంటే రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి తలపై రూ.75 వేల చొప్పున అప్పు ఉంటుందన్నమాట. తాము అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తానని 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊదరగొట్టారు. ఉద్యోగం ఇవ్వలేకపోతే ప్రతి కుటుంబానికి నెలకు రూ.2 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు.

బాబు గద్దెనెక్కి నాలుగున్నరేళ్లుగా దాటినా ఉద్యోగం, నిరుద్యోగ భృతి అనేవి ఊసే లేకుండా పోయాయి. ఈ నాలుగున్నరేళ్లలో భృతి కింద ఒక్కో కుటుంబానికి రూ.లక్షకుపైగా చెల్లించాల్సి ఉంది. ఆ బకాయిలు ఎప్పుడిస్తారో బాబు చెప్పడం లేదు. పైగా విచ్చలవిడిగా అప్పులు తెస్తూ ఆ భారాన్ని ప్రజల పైనే మోపుతున్నారు. బాబు నిర్వాకం వల్ల ఒక్కో కుటుంబంపై సగటున రూ.2.50 లక్షల అప్పుల భారం పడింది.

2018 మార్చి 31 నాటికి బడ్జెట్ బయట సర్కారు గ్యారెంటీతో చేసిన అప్పులు (రూ.కోట్లలో)

సంస్థ	అప్పులు
వివిధ కార్పొరేషన్లు	37,489.56
సీఆర్‌డీఏ, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, అపిట్‌కో, గ్రామీణ మంచినీటి సంస్థలు	9,890
ఏపీ ట్రాన్స్‌కో	9,166.36
మచిలీపట్నం పోర్టు	1,385
గ్రామీణ మంచినీటి సరఫరా సంస్థ	4,300
ఏపీసీఆర్‌డీఏ గవర్నమెంట్ క్వార్టర్స్	3,307
ఏపీసీఆర్‌డీఏ	5,940
మున్సిపల్ కార్పొరేషన్లు	13,035
అపిట్‌కో	1,164.22
గృహ నిర్మాణ సంస్థ	3,600
ఆప్కో	150
ఏపీఐఐసీ	2,000
ఏపీ ఫైబర్ నెట్	3,283
హడ్కో	1,000
మొత్తం	95,709

వివిధ సంస్థల పేరిట వచ్చే రెండు నెలల్లో కొత్తగా తీసుకురానున్న అప్పులు (రూ.కోట్లలో)

సంస్థ	అప్పులు
గ్రామీణ మంచినీటి సరఫరా సంస్థ	9,400
రైతు సాధికార సమితి	4,000
జలవనరుల అభివృద్ధి సంస్థ	3,000
రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ	3,000
స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్	500
కర్నూలు మున్సిపాల్టీ	265
ట్రాన్స్‌కో	9,300
మొత్తం	29,465

రాజధాని భూములు తాకట్టు పెట్టి రూ.10,000 కోట్ల అప్పు

రాజధాని నిర్మాణం కోసమంటూ అమరావతి ప్రాంతంలో రైతుల నుంచి తీసుకున్న వేలాది ఎకరాల భూములను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి, రూ.10,000 కోట్ల అప్పులు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భూములను తాకట్టు పెట్టి, అప్పులు తీసుకునే అధికారాలను సీఆర్‌డీఏ కమిషనర్‌కు అప్పగిస్తూ ఇటీవలే ఉత్తర్వులిచ్చింది. దీనిద్వారా ప్రభుత్వ అనుమతి తీసుకోకుండానే రాజధాని భూములను తాకట్టు పెట్టే అధికారం సీఆర్‌డీఏ కమిషనర్‌కు సంక్రమించింది. ఈ భూములను బ్యాంకుల్లో తాకట్టు పెట్టడంతోపాటు సెక్యూరిటీగా పెట్టి సీఆర్‌డీఏ అప్పులు చేయనుంది. రూ.10,000 కోట్ల అప్పునకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తూ జీవో జారీ చేసింది. అయితే, ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చినప్పటికీ ఆస్తులను చూపించకపోతే అప్పులు ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరించడం లేదు. ఈ నేపథ్యంలో రైతుల నుంచి తీసుకున్న వేలాది ఎకరాల భూములను తాకట్టు పెట్టి లేదా సెక్యూరిటీగా చూపించి అప్పులు చేయాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. ఇప్పటికే బాండ్ల పేరుతో సీఆర్‌డీఏ రూ.2,000 కోట్ల అప్పులు చేసింది. ప్రభుత్వ క్వార్టర్స్ నిర్మాణం కోసం మరో రూ.3,307 కోట్ల అప్పులు తెచ్చింది. అలాగే ఇంకో రూ.5,940 కోట్ల అప్పులు చేసేందుకు ఆర్థిక శాఖ ఇటీవల ఆమోముద్ర వేసింది.

ఒక రోజు కష్టం.. మరో రోజు సులభం

- డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల తీరిది
- ఆన్‌లైన్ పరీక్షలపై అభ్యర్థుల్లో అనేక అనుమానాలు



సాక్షి, అమరావతి: డీఎస్సీ–2018 ఆన్‌లైన్ పరీక్షలను అస్తవ్యస్తంగా నిర్వహిస్తూ ప్రభుత్వం లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతోంది. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసి, లక్షలు వెచ్చించి కోచింగ్‌లు తీసుకుని, రాత్రింబవళ్లు కష్టపడినవారి జీవితాలతో చెలగాటమాడేలా డీఎస్సీ పరీక్షల తీరు నడుస్తోంది. గతేడాది డిసెంబర్ 24 నుంచి నిర్వహిస్తున్న డీఎస్సీ–2018 పరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈసారి ఆన్‌లైన్ విధానం ఉండడం, అభ్యర్థులు ఎక్కువమంది దరఖాస్తు చేయడంతో పరీక్షలు ఎక్కువ రోజులు జరుగుతున్నాయి. రోజూ రెండు సెషన్లలో ఉదయం, మధ్యాహ్నం ఈ పరీక్షలు పెడుతున్నారు. స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ పరీక్షను రెండు రోజులు పెట్టగా సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పరీక్షలను ఏకంగా 8 రోజుల పాటు 16 సెషన్లలో నిర్వహిస్తున్నారు. ఇలా ఒకే సబ్జెక్ట్ పరీక్ష ఒకటికి మించి ఎక్కువ రోజులు, ఎక్కువ సెషన్లలో జరిగినప్పుడు కొన్ని రోజుల్లో ప్రశ్నలు సులువుగా ఉంటున్నాయని, మరికొన్ని రోజుల్లో చాలా కష్టంగా ఉంటున్నాయని అభ్యర్థులు వాపోతున్నారు. ఇలా రావడం పట్ల వారిలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

టెట్‌లోనూ ఇదే పరిస్థితి

గతంలో టెట్‌ను రెండుసార్లు ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. ఒక రోజు పరీక్ష రాసిన వారికి గరిష్టంగా 90 శాతం మార్కులు వస్తే మరో రోజు పరీక్ష రాసిన వారికి 50 శాతం లోపు మాత్రమే వచ్చాయి. దీంతో ప్రశ్నలు సులభంగా ఉన్నరోజు పరీక్ష రాసిన వారికి లాభం చేకూరగా తక్కిన రోజుల్లో రాసిన వారు నష్టపోయారు. అప్పట్లో అభ్యర్థులు దీనిపై మొరపెట్టుకున్నా పాఠశాల విద్యా శాఖ అధికారులు పట్టించుకోలేదు. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి తలెత్తింది. డీఎస్సీలో అర మార్కు తేడాతో పోస్టులు కోల్పోయే ప్రమాదముందని, ఇలాంటి సమయంలో సెషన్‌కు, సెషన్‌కు మధ్య ఒక్కసారిగా 15 నుంచి 20 మార్కులు తేడా ఉండడం వల్ల తమకు తీరని నష్టం వాటిల్లుతుందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పాఠశాల విద్యా శాఖకు తెలియచేసినా ఫలితం లేదని వాపోతున్నారు.

నార్మలైజేషన్ విధానాన్ని అనుసరించాలి..

ఈ నెల 18 నుంచి ఎస్‌జీటీ పోస్టులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. 18, 19వ తేదీల్లో ఇచ్చిన ప్రశ్నపత్రాలు చాలా సులభంగా ఉన్నాయని అభ్యర్థులు చెబుతున్నారు. తర్వాత రోజుల్లో రాసినవారికి చాలా కఠినంగా ఉన్నాయని పేర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహిస్తుండటం, రోజూ రెండు సెషన్లలో ఎక్కువ రోజుల పాటు ఒకే సబ్జెక్టు పరీక్షలు జరుగుతుండడంతో ప్రశ్నలను వేర్వేరుగా రూపొందించి వాటిని పరీక్ష రోజు ఆయా సెషన్ల వారీగా అభ్యర్థులకు కేటాయించిన కంప్యూటర్లలో అప్‌లోడ్ చేయిస్తారు. ప్రశ్నల రూపకల్పన, వాటిని కంప్యూటర్ల ద్వారా అప్‌లోడ్ చేయించడంలో తాము నార్మలైజేషన్ పద్ధతిని పాటిస్తున్నామని అధికారులు చెబుతున్నా పరీక్షల్లోని ప్రశ్నపత్రాలు చూస్తే అలా ఉండడం లేదని నిపుణులు సైతం చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. మూల్యాంకనంలోనైనా జేఈఈ తదితర పరీక్షల్లో చేసినట్లు నార్మలైజేషన్ విధానాన్ని అనుసరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిబ్రవరిలోపు నియామకాలు పూర్తయ్యేనా?

డీఎస్సీ షెడ్యూల్ ప్రకారం.. ఈ నెల 10న స్కూల్ అసిస్టెంట్ పరీక్షల ఫలితాలు ప్రకటించి 13న మెరిట్ జాబితా, 17న ఎంపిక జాబితాను కూడా ఇవ్వాల్సి ఉంది. కానీ పరీక్షల ఫైనల్ 'కీ'లను విడుదల చేసినా వాటిపై స్పష్టత లేదు. ఫైనల్ 'కీ'లు విడుదల చేసినప్పుడు వాటిలో ఏ ప్రశ్నల సమాధానాల్లో మార్పులు జరిగాయి? వేటిని తొలగించారు? రెండు సరైన సమాధానాలున్న ప్రశ్నలు ఏవి అన్నవి స్పష్టంగా వెబ్‌సైట్‌లో పెట్టాలి. ఆ తర్వాతే ఏ ప్రశ్నలకు మార్కులు కలపాలి? ఏ ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాల్లో తప్పులుంటే తొలగించాలి? అన్నది తేలి తుది ఫలితాలను, మెరిట్ జాబితాను విడుదల చేయడానికి వీలవుతుంది. ఇలా ఇప్పటివరకు స్పష్టత లేదు. అసలు ఏ ప్రశ్నలకు ఏ సమాధానం సరైందో, ఏది తప్పో తెలియక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఫిబ్రవరి చివరిలోగా నియామక ప్రక్రియ ముగిసేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరీక్షలు ముగిసి షెడ్యూల్ ప్రకారం ఫలితాలు వెల్లడవుతాయని ఎదురు చూస్తున్నవారికి పాఠశాల విద్యా శాఖ తీరని నిరాశను మిగులుస్తోంది.

స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు మాత్రమే ఫైనల్ 'కీ' విడుదల

టీచర్ పోస్టుల భర్తీని ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు పూర్తిచేస్తామని ప్రభుత్వం కూడా కోర్టుకు తెలిపింది. డీఎస్సీ ఫలితాల విడుదల ఆలస్యమవుతోంది. పరీక్షల ప్రాథమిక 'కీ' విడుదలకే చాలా రోజులు తీసుకుంటున్నారు. మొదటి దశలో స్కూల్ అసిస్టెంట్లు (లాంగ్వేజెస్, నాన్ లాంగ్వేజెస్), పీజీటీ, టీజీటీ, ప్రిన్సిపాళ్లు, పీఈడీ, మ్యూజిక్, క్రాఫ్ట్, ఆర్ట్, డ్రాయింగ్, భాషా పండితుల పోస్టుల పరీక్షలు ముగిశాయి. వీటిలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు మాత్రమే ప్రాథమిక, తుది 'కీ'లు విడుదలయ్యాయి. పీజీటీ, టీజీటీ పోస్టులకు ప్రాథమిక 'కీ' ఇచ్చినా ఫైనల్ 'కీ'లు విడుదల కాలేదు. మిగతా వాటికి ప్రాథమిక 'కీ'నే విడుదల చేయలేదు.

నాటా కొత్త అధ్యక్షుడిగా డాక్టర్ రాఘవరెడ్డి

నెల్లూరు జిల్లా కొండమీది కొండూరులో హర్షాతిరేకాలు

సాక్షి, అమరావతి: ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా) నూతన అధ్యక్షుడిగా డాక్టర్ రాఘవరెడ్డి గోశాల బాధ్యతలు చేపట్టారు. కొత్తగా ఎన్నికైన నాటా కార్యవర్గ సభ్యులతో నాటా అడ్వైజరీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్త కమిటీలో రాఘవరెడ్డితో పాటు కొర్సపాటి శ్రీధర్‌రెడ్డి, బాలా ఇందుర్తి, ఆళ్ల రామిరెడ్డి, గండ్ర నారాయణరెడ్డి, సోమవరపు శ్రీనివాసులురెడ్డి, శివ మేక, గంగసాని రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి కొట్లూరు, రమణారెడ్డి క్రిస్టపాటి, కోటిరెడ్డి బుర్ల, శ్రీనివాస్‌రెడ్డి కానుగంటి, పెనుమాడ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.



నాటా నూతన అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రాఘవరెడ్డి, పక్కన కమిటీ సభ్యులు

డాక్టర్ రాఘవరెడ్డి గోశాల ప్రస్థానం..

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు తాలూకా కొండమీది కొండూరు గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో రాఘవరెడ్డి జన్మించారు. వైద్య విద్యను అభ్యసించిన ఆయన ఉన్నత విద్యకు అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అమెరికాలో వైద్య వృత్తిని కొనసాగిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలతో ఇటు భారతీయుల్లో అటు స్థానిక అమెరికన్లలో మంచి పేరు తెచ్చుకొన్నారు. మరోవైపు వైఎస్సార్ ఫౌండేషన్ ద్వారా ఏటా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. నాటా ద్వారా అమెరికాలోని తెలుగు వాళ్లకే కాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో కూడా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాఘవరెడ్డి నాటా అధ్యక్షుడిగా ఎన్నికవడంతో ఆయన స్వగ్రామంలో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఏటా సొంత ఊరికి వచ్చి అందరి క్షేమ సమాచారాలు తెలుసుకుంటారని, ఎవరు ఎలాంటి సహాయం అడిగినా కాదనకుండా చేస్తారని కొనియాడారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను రానివ్వొద్దు

- ప్రభుత్వ కార్యక్రమాలను పూర్తిగా టీడీపీ కార్యక్రమాలుగా నిర్వహించాలి
- అధికారులకు ప్రభుత్వ పెద్దల మౌఖిక ఆదేశాలు

సాక్షి, అమరావతి: పింఛన్ల పంపిణీ, డ్వాక్రా మహిళలకు ఇచ్చే చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో అధికార టీడీపీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ నేతలను మినహా ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను, ఇతర స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ఆహ్వానించవద్దంటూ ప్రభుత్వ పెద్దలు అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యక్రమాలను టీడీపీ కార్యక్రమాలుగా నిర్వహించాలని హుకుం జారీ చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు ప్రతి నెలా ఇచ్చేవైనా ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరిలో 2, 3, 4 తేదీల్లో అన్ని గ్రామాలు, పట్టణాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డ్వాక్రా మహిళలకు పసుపు–కుంకుమ పేరుతో ఇస్తామన్న చెక్కులను ఆయా తేదీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి, పంపిణీ చేయాలని నిర్ణయించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఎక్కడైనా పింఛన్ల పంపిణీలో పాల్గొంటే తమకు రాజకీయంగా నష్టం తప్పదని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. అందుకే వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు హాజరు కాకుండా చూడాలని ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది.

సిండికేట్ల జోలికొస్తే బదిలీలే..

ఎక్సైజ్ అధికారులకు అధికార పార్టీ నేతల బెదిరింపులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మద్యం ఉల్లంఘనలు పెచ్చుమీరాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ధనార్జనే ధ్యేయంగా మద్యం సిండికేట్లకు అధికార పార్టీ నేతలు బాసటగా నిలుస్తున్నారు. మద్యం షాపుల జోలికెళితే బదిలీలు తప్పవంటూ ఎక్సైజ్ అధికారులను బెదిరింపులకు గురిచేస్తున్నారు. అధికారులు టీడీపీ నేతలతో రాయ'బేరాలు' సాగిస్తున్నారు. మద్యం సిండికేట్లను తాము వదిలేస్తామని.. టీడీపీ నేతలు తమ జోలికి రావద్దని వేడుకుంటున్నారు. మద్యం షాపులకు అనుబంధంగా బెల్టు షాపులు, బ్రాండ్ మిక్సింగ్, ఎమ్మార్పీ ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఇటు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పూర్తిగా నిస్తేజంగా మారింది. రాష్ట్రంలో గత 2 నెలల వ్యవధిలో మద్యం షాపుల ఉల్లంఘనలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఒక్క కేసు నమోదు చేయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మద్యం బాటిల్‌పై సిండికేట్లు రూ. 10 నుంచి రూ. 20 వరకు అధికంగా విక్రయిస్తున్నారని ఎక్సైజ్ ఉన్నతాధికారి ఒకరు అంగీకరించారు.

సిండికేట్ల ఇష్టారాజ్యం

గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలో మద్యం సిండికేట్లు తమకిష్టమొచ్చినట్లు ఎక్సైజ్ వర్గాలపై పెత్తనం చెలాయిస్తున్నాయి. తమ వెనుక ఓ సీనియర్ ఎమ్మెల్యే, ముఖ్య నేత తనయుడు ఉండటంతో సిండికేట్లు రెచ్చిపోతున్నారు. ఎమ్మార్పీ ఉల్లంఘనలపై స్థానిక ఎక్సైజ్ అధికారులు కేసులు నమోదు చేయడంతో అధికార పార్టీ నేతలు అగ్గి మీద గుగ్గిలమయ్యారు. ఎక్సైజ్ అధికారి ఒకరు వెళ్లి క్షమాపణలు చెప్పుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆ శాఖలో తీవ్ర చర్చ జరుగుతోంది. గుంటూరు జిల్లా డిప్యూటీ కమిషనర్‌పై గతంలో ఏసీబీ దాడులు జరిగాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయన్ని అరెస్ట్ చేశారు. నిబంధనల ప్రకారం ఫోకల్ పోస్టులో ఆయన్ను నియమించకూడదు. కానీ గతేడాది జరిగిన పోస్టింగుల్లో గుంటూరు డీసీగా నియమించారు. రాజకీయ కారణాలతోనే పోస్టింగ్ ఇవ్వడంతో మద్యం సిండికేట్ల ఇష్టారాజ్యంపై చర్యలు చేపట్టడం లేదని ప్రచారం జరుగుతోంది. ఇటు శ్రీకాకుళం జిల్లాలో ఏకంగా ఓ అమాత్యుడే దగ్గరుండి మద్యం సిండికేట్ల వ్యవహారాలను చక్కబెడుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ టీడీపీ నేతలకు ఎక్సైజ్ అధికారులు సరెండర్ అయ్యారు. ఎక్సైజ్ అధికారుల తీరుతో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు మద్య నియంత్రణ కమిటీలు ఫిర్యాదులు చేస్తున్న సంగతి తెలిసిందే.

కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, తూర్పు గోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కల్తీ మద్యంపైనా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా.. ఇప్పటి వరకు చర్యలు లేవు.

ప్రత్యేక హోదాను మరచిన గజినీ చంద్రబాబు

- ఐదేళ్లు కావస్తున్నా సంపూర్ణ రాజధాని కట్టలేకపోయారు
- అధికారంలోకి రావడానికి జనసేనను వాడుకున్నారు
- అవసరం కోసం అవినీతిపరులను కూడా పార్టీలో చేర్చుకుంటా
- హోదా కోసం 29న ఉండవల్లి ఏర్పాటు చేసిన వేదికలో పాల్గొంటా
- వైఎస్సార్‌సీపీ వస్తే అందరం కలిసి పోరాడదాం.. ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేద్దాం
- గుంటూరు జనసేన శంఖారావ సభలో పవన్‌కళ్యాణ్



సాక్షి, గుంటూరు: ప్రత్యేక హోదాను సీఎం చంద్రబాబు పదేపదే గజినీలా మర్చిపోతున్నారని, ఆయనకు ప్రత్యేకహోదా ఆరునెలలకోసారి గుర్తుకు వస్తుందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. ప్రత్యేక హోదాపై చంద్రబాబు అవసరానికి అనుగుణంగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. గుంటూరులో ఆదివారం జరిగిన జనసేన శంఖారావ సభలో ఆయన ప్రసంగించారు. గుంటూరుకు చేరుకున్న పవన్ ఇన్నర్ రింగ్‌రోడ్డులోని జనసేన జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు పూర్తయినా సంపూర్ణ రాజధానిని నిర్మించలేకపోయారని చంద్రబాబుపై ధ్వజమెత్తారు. 2014 ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి జనసేన పార్టీని వాడుకున్న చంద్రబాబు సమస్యలు వచ్చినప్పుడు తమను నిర్లక్ష్యం చేశారని, సభలు పెట్టుకుంటే బ్యానర్ చించుతున్నారని చెప్పారు. ఈ నెల 29న ఉండవల్లి అరుణ్ కుమార్ ప్రత్యేక హోదా కోసం ఏర్పాటు చేసిన వేదికలో తాను పాల్గొంటానని, వైఎస్సార్‌సీపీ కూడా వస్తే అందరం కలిసి హోదా కోసం పోరాడదామని అన్నారు. ఎన్నికల్లో మాత్రం విడివిడిగా పోటీ చేద్దామా ఎలా పోటీ చేద్దాం అనే విషయం తర్వాత చూసుకుందామన్నారు. అవినీతిలో కూరుకుపోయిన వ్యక్తులని తెలిసినా గెలవాల్సిన పరిస్థితి ఉంటే అవసరం కోసం వారిని పార్టీలో చేర్చుకుంటానన్నారు.

గుంటూరు పార్లమెంట్‌కు తోట, తెనాలి అసెంబ్లీకి మనోహర్

జనసేన రాష్ట్ర నాయకులు తోట చంద్రశేఖర్ గుంటూరు ఎంపీగా, నాదెండ్ల మనోహర్ తెనాలి శాసన సభకు జనసేన తరపున పోటీ చేస్తారని పవన్ ప్రకటించారు. మాజీ మంత్రి రావెల 2009 నుంచి తనకు తెలిసిన వ్యక్తి అని చెప్పిన పవన్ ఆయనకు ఎక్కడ సీటు ఇస్తున్న విషయం మాత్రం చెప్పలేదు.

ఏపీలో అరకొరగానే రుణమాఫీ

వ్యవసాయ రంగ నిపుణురాలు జయతిఘోష్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రుణమాఫీ అమలు అరకొరగానే ఉందని, రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని వ్యవసాయ రంగ నిపుణులు, జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జయతి ఘోష్ ఆవేదన వ్యక్తం చేశారు. 'నేటి వ్యవసాయం–ప్రభుత్వ విధానాలు' అనే అంశంపై విజయవాడ మాకినేని బసవపున్నయ్య భవన్‌లో ఆమె ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. రైతు రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన పాలకులు రూ.1.50 లక్షలకే పరిమితం చేసి అందులోనూ ఇంకా రెండు విడతలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఐదేళ్ల కాలంలోనూ రుణమాఫీ పూర్తిగా అమలు చేయకపోవడం వైఫల్యం అన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా దేశంలోని పలు రాష్ట్రాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోను వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని జయతి ఘోష్ ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన మూడేళ్లలో పెరిగిన ధాన్యం ధరలను లెక్కలు గట్టి వ్యవసాయ ఉత్పత్తుల గ్రోత్‌రేటు పెరిగినట్టు చూపడం ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడమే అవుతుందన్నారు.

'తూర్పుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

ఉయ్యూరు(పెనమలూరు): తూర్పుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి తూర్పుకాపుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తూర్పుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా ఉయ్యూరులో తూర్పుకాపు సంఘం సమావేశం ఆదివారం జరిగింది. ఇందులో శ్రీకాంత్ మాట్లాడుతూ.. తూర్పుకాపుల సంక్షేమం విషయంలో ప్రభుత్వాలు అలసత్వం చూపుతున్నాయన్నారు. రాజకీయాలకు అతీతంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధి చర్యలు చేపట్టాలన్నారు. బీసీ–డీ గ్రూపు నుంచి ఏ గ్రూప్‌లోకి తూర్పుకాపులను మార్చి ఓబీసీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా తూర్పుకాపులకు సముచిత ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహక రాష్ట్ర అధ్యక్షుడు అలగంజి సూర్యప్రకాశ్‌రావు, ప్రతినిధులు బొర్ల శ్రీనివాస నాయుడు, గణేష్, ఉయ్యూరు సంఘం అధ్యక్షులు వడ్డిపల్లి వీరభద్రరావు పాల్గొన్నారు.

అప్పు ఇస్తూ ఎన్నికల డప్పు!

- చంద్రబాబుపై డ్వాక్రా మహిళల ఆగ్రహం
- 2014 ఎన్నికల రుణ మాఫీ ఏమైందని నిలదీత
- ఇప్పుడు రూ.10 వేలు ఇస్తామన్న ప్రకటన ఎన్నికల స్టంట్ అని మండిపాటు
- ఇది అప్పు అనే విషయాన్ని స్పష్టంగా చెప్పక పోవడం మోసమే..
- నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఒకేసారి నగదుగా ఇవ్వాలని డిమాండ్
- బాబు ఎన్ని మాటలు చెప్పినా వైఎస్ జగన్ నవరత్నాల వైపే మహిళల మొగ్గు
- నాలుగు దఫాలుగా రుణాల మొత్తాన్ని తిరిగి ఇస్తామన్న జగన్ హామీపై హర్షం

సాక్షి, అమరావతి బ్యూరో: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి మహిళలను మోసగించడానికి ఎత్తులు వేస్తున్నారు. పట్టపగలే చుక్కలు చూపిస్తూ మరోసారి అధికారంలోకి రావడానికి పాచికలు విసురుతున్నారు. రుణాలు ఎవరూ కట్టాల్సిన అవసరం లేదని, అధికారంలోకి రాగానే 'మాఫీ' చేస్తామని 2014 ఎన్నికల ముందు చెప్పిన ఆయన అధికారంలోకి వచ్చాక మాఫీ చేసిన తీరు చూసి అటు రైతులు, ఇటు డ్వాక్రా సంఘాల మహిళలు నిర్ఘాంతపోయారు. ఆయన మాటలు నమ్మి అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఇప్పుడు నాలుగున్నరేళ్ల తర్వాత.. ఎన్నికలు మరో మూడు నెలల్లో జరగనున్న సమయంలో మరోమారు మహిళలకు ఎన్ని'కల' తాయిలాలు ప్రకటిస్తున్నారు.

అధికారంలోకి రావాలని కొత్త ఎత్తుగడ

సీఎం చంద్రబాబు తాజాగా 'పసుపు – కుంకుమ' కింద ఒక్కో డ్వాక్రా మహిళకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారు. ఈ మొత్తం అప్పుగా ఇస్తున్నప్పటికీ, ఆ విషయాన్ని స్పష్టంగా చెప్పడం లేదు. రాష్ట్రంలోని 93.80 లక్షల మందికి రూ.9,380 కోట్లు ఇస్తామని చెప్పారు. ఫిబ్రవరిలో తొలిదఫాలో రూ.2,500, రెండో దఫాలో రూ.3,500, మూడో దఫాలో రూ.4 వేల చొప్పున మహిళల ఖాతాల్లో జమ అయ్యేలా పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇస్తామని చెప్పారు. ఈ డబ్బును మూడు దఫాల్లో ఇస్తామని చెబుతున్న చంద్రబాబును నమ్మి మరోసారి మోసపోయేందుకు తాము సిద్ధంగా లేమని డ్వాక్రా సంఘాల మహిళలు చెబుతున్నారు. ఫిబ్రవరి మూడు లేదా నాలుగో వారంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ స్థితిలో ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని భావిస్తే ఎన్నికల కమిషన్ దీన్ని తాత్కాలికంగా నిలిపివేసే అవకాశం ఉందని ఉన్నతాధికారులు అంటున్నారు. ఈ విషయం తెలిసే చంద్రబాబు దీనిని ప్రకటించారని, నెపం ఎన్నికల కమిషన్‌పై వేసి లబ్ధి పొందాలని చూస్తారని ఓ అధికారి అన్నారు.

అప్పుల ఊబిలో మహిళలు విలవిల

2014 ఎన్నికల ముందు చెప్పిన విధంగా డ్వాక్రా రుణ మాఫీ సాధ్యం కాదని అధికారం చేజిక్కించుకున్నాక చంద్రబాబు చావుకబురు చల్లగా చెప్పారు. మాఫీకి బదులు పెట్టుబడి నిధిగా సంఘంలోని ఒక్కో మహిళకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారు. ఈ మొత్తం కూడా రూ.3 వేలు, 3 వేలు, 2 వేలు, 2 వేలు ఇలా నాలుగు దఫాలుగా అందజేశారు. బాబు వాగ్దానాన్ని నమ్మిన మహిళలు రుణాలు చెల్లించకపోవడంతో బ్యాంకర్లు నోటీసులిచ్చారు. నగలు వేలం వేశారు. కోర్టుల చుట్టూ తిప్పారు. ఖాతాల్లో ఉన్న డబ్బులను కూడా వడ్డీ రూపంలో జమ చేసుకున్నారు. దీంతో చాలా మంది మహిళలు తాము తీసుకున్న రుణాలపై వడ్డీలు చెల్లించేందుకే తిరిగి అప్పులు చేయాల్సి వచ్చింది.

వైఎస్సార్ చేయూత, ఆసరా వైపే మహిళలు

చంద్రబాబు ప్రభుత్వం ఇస్తానంటున్న రూ.10 వేల కంటే ప్రతిపక్షనేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల్లో ఒకటైన 'వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వైపే మహిళలు మొగ్గు చూపుతున్నారు. 45 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు అధికారంలోకి వచ్చిన రెండో ఏడాది నుంచి వరుసగా నాలుగేళ్లలో నాలుగు దఫాలుగా రూ.75 వేలు ఉచితంగా అందజేస్తామని జగన్ హామీ ఇచ్చారు. అలాగే ఎన్నికల రోజు వరకు డ్వాక్రా మహిళలకు ఉన్న పొదుపు సంఘాల రుణాల మొత్తం సొమ్మును నాలుగు దఫాలుగా నేరుగా వారి చేతికే అందిస్తామని కూడా భరోసా ఇచ్చారు. ఈ హామీలపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బాబు మాటలు నమ్మేది లేదని, నమ్మి మోసపోయింది చాలని అంటున్నారు.

మళ్లీ మోసపోవడానికి సిద్ధంగా లేము



డ్వాక్రా రుణాలను బేషరతుగా మాఫీ చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రూ.10 వేలు ఇస్తామని చెబుతున్నారు. ఈ డబ్బులు పూర్తిగా ఇస్తారనే నమ్మకం మాకు లేదు. ఒకసారి మోసపోయాం. మళ్లీ మళ్లీ మోసపోవడానికి సిద్ధంగా లేము.

– కంచికచర్ల పద్మావతి, డ్వాక్రా మహిళ, పరిటాల, కృష్ణా జిల్లా

నాటి హామీ ఏమైంది?



ఎన్నికలు సమీపిస్తున్న సమయంలోనే సీఎం చంద్రబాబుకు మహిళలు గుర్తుకు వస్తారు. నాడు రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని వాగ్దానం చేసి తర్వాత మాట మార్చారు. ఇప్పుడు మళ్లీ రూ.10 వేలు అంటూ తాయిలాలు ప్రకటిస్తున్నారు. నిజంగా సీఎంకు చిత్తశుద్ధి ఉంటే రూ.10 వేలను ఒకేసారి ఇవ్వాలి.

– కృష్ణా వీరనారాయణమ్మ, డ్వాక్రా మహిళ, గండేపల్లి, కృష్ణా జిల్లా

ఎప్పుడో చేతికందేలా చెక్కులేంటి?



ఎన్నికల ముందు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ అని ఓట్లు వేయించుకున్న చంద్రబాబు ఆ తర్వాత నిండా ముంచారు. నాలుగున్నరేళ్ల పాటు ఏమాత్రం పట్టించుకోకుండా ఇప్పుడు తగుదునమ్మా అంటూ పసుపు–కుంకుమ పేరుతో మా వద్దకు వస్తున్నారు. రూ.10 వేలు ఇవ్వాలనుకుంటే ఒకేసారి నగదుగా ఇవ్వొచ్చుగా? ఎప్పుడో చేతికందేలా చెక్కులేంటి? ఇక చంద్రబాబును నమ్మే స్థితిలో డ్వాక్రా మహిళలు లేరు.

– మూడెడ్ల ఉమా, డ్వాక్రా మహిళ, గుడివాడ, కృష్ణా జిల్లా

జగన్ రూ.75 వేలు ఇస్తామంటున్నారు



డ్వాక్రా రుణ మాఫీ చేస్తామని జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆయన మాట తప్పే నాయకుడు కాదు. జగన్ అధికారంలోకి వస్తే డ్వాక్రా మహిళలకు మేలు జరుగుతుంది. చంద్రబాబు మాటలు నమ్మి ఇప్పటికే మోస పోయాం. ఇకపై మోసపోయే పరిస్థితి లేదు. రుణమాఫీని ఏమార్చి పసుపు–కుంకుమ అని ఎప్పుడో చెల్లేలా బాబు చెక్కులు ఇస్తే వాటిని ఏం చేసుకోవాలి?

– మాదాసు వెంకటలక్ష్మి, గుడివాడ, కృష్ణా జిల్లా

ఆర్యవైశ్యుల సంక్షేమానికి నూతన మహాసభ

సంఘం నూతన అధ్యక్షుడు ద్వారకానాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు

చినకాకాని (మంగళగిరి): రాష్ట్రంలోని పేద ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం నూతన ఆర్యవైశ్య మహాసభ ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. గుంటూరు జిల్లా హాయ్‌ల్యాండ్‌లో 13 జిల్లాల ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు ఆదివారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా నెల్లూరు జిల్లాకు చెందిన ముక్కాల ద్వారకానాథ్‌తో పాటు, గౌరవ అధ్యక్షునిగా గుబ్బా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా తెనాలికి చెందిన సాధు ప్రతాప్‌కుమార్, కోశాధికారిగా ఒంగోలుకు చెందిన కుప్పం ప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ద్వారకానాథ్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఆశీస్సులతో ఏర్పడిన నూతన కార్యవర్గం రాష్ట్రంలోని పేద ఆర్యవైశ్యులందరి అభివృద్ధి కోసం పని చేస్తుందని చెప్పారు. గతంలో ఉన్న ఆర్యవైశ్య మహాసభ వ్యక్తి పూజలలో నిమగ్నమై, రాజకీయ రంగుతో ఆర్యవైశ్యుల అభివృద్ధిని విస్మరించడం కారణంగానే నూతనంగా మహాసభ ఏర్పాటు చేయాల్సి వచ్చిందని వెల్లడించారు. గతంలో ఉన్న రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయం హైదరాబాద్‌లో ఉండటంతో ప్రస్తుతం రాష్ట్రంలో తమకు అడ్రస్సు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరిలో అన్ని జిల్లాలకు మండల కమిటీలను ఏర్పాటు చేసి, మార్చిలో రాజధానిలో పెద్ద ఎత్తున సభ నిర్వహించి పూర్తిస్థాయిలో కార్యవర్గాన్ని విస్తరిస్తామని చెప్పారు.

రేపు కిసాన్ కాంగ్రెస్ సదస్సు

సాక్షి, హైదరాబాద్: దేశంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభం, పెరిగిపోతున్న రైతు ఆత్మహత్యల నేపథ్యంలో వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించేందుకు గాను దక్షిణాది రాష్ట్రాల కిసాన్ కాంగ్రెస్ సమావేశమవనుంది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొనే ఈ ఒక్కరోజు సదస్సు మంగళవారం గాంధీభవన్‌లో జరగనుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా దక్షిణాది రైతుల పరిస్థితిపై ఇందులో చర్చించనున్నారు.

104 ఉద్యోగులపై వేటుకు సర్కార్ సిద్ధం!



- డిమాండ్ల సాధనకు సమ్మె చేయడమే నేరం
- ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నవారు 1642 మంది
- చంద్రబాబు హామీ ఇచ్చి మోసం చేశారని వాపోతున్న ఉద్యోగులు

సాక్షి, అమరావతి: 104 సంచార వైద్య శాలలు (చంద్రన్న సంచార చికిత్స) పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోవడంతో ఈ నెల 22 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 104లో పనిచేస్తున్న 1642 మంది సమ్మెకు దిగారు. సమస్యలు పరిష్కరిస్తానని సీఎం చంద్రబాబు మాట ఇచ్చి మోసం చేశారని, విధిలేని పరిస్థితుల్లో సమ్మెకు దిగినట్టు సిబ్బంది ప్రకటించారు. ఈ నేపథ్యంలో వారిపై వేటు వేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 25న వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా మధ్య సుదీర్ఘ చర్చలు జరిగినట్టు సీఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 104 వాహనాల నిర్వహణను పిరమిల్ స్వాస్థ్య సంస్థ చూస్తోంది. ఈ సంస్థకు మూడేళ్ల వ్యవధికి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. వచ్చే మార్చితో ఈ వ్యవధి ముగుస్తుంది. అప్పుడు తిరిగి టెండర్లు నిర్వహించి నిర్వహణ సంస్థతో పాటే సిబ్బందినీ మార్చాలని నిర్ణయించినట్టు సమాచారం. ఉద్యోగులంతా 2008లో నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 104 పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి పనిచేస్తున్నవారే. గత నాలుగున్నరేళ్లుగా 104 సిబ్బందికి వేతనాలు పెంచకపోవడం, ప్రశ్నించినవారిని బదిలీ చేయడం, తొలగించడం చేస్తున్నారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ గత కొంతకాలంగా సిబ్బంది పోరాడుతూనే ఉన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో సిబ్బంది సమ్మె చేస్తున్నారు.

మందులు అందక రోగుల ఇబ్బందులు

ఈ నెల 22 నుంచి సిబ్బంది సమ్మెలోకి వెళ్లడంతో 292 వాహనాలు గ్రామాలకు వెళ్లడం లేదు. దీంతో లక్షలాది మంది వృద్ధులు, గర్భిణులు, బాలింతలు మందులు అందక ఇబ్బందులు పడుతున్నారు. వీరేకాకుండా మధుమేహం, మూర్ఛ, రక్తపోటు, హైపర్‌టెన్షన్ వంటి వ్యాధులతో బాధపడుతున్న మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మందులు అందడం లేదు. దీంతో వారంతా అల్లాడుతున్నారు.

కార్పొరేట్ సంస్థకు ఏడాదికి రూ.85.44 కోట్లు

ప్రభుత్వం 104 సిబ్బందికి వేతనాలు సరిగా ఇవ్వకపోయినా, రోగులకు మందులివ్వకపోయినా తూతూమంత్రంగా వాహనాలను తిప్పుతున్న పిరమిల్ స్వాస్థ్య సంస్థకు మాత్రం ఏడాదికి రూ.85.44 కోట్లు చెల్లిస్తోంది. ఒక్కో వాహనానికి నెలకు రూ.2.44 లక్షలు ఇస్తోంది. అంటే నెలకు రూ.7.12 కోట్లకు పైగా చెల్లిస్తోంది. మూడేళ్ల కాంట్రాక్టులో భాగంగా నిర్వహణ సంస్థకు ప్రభుత్వం చెల్లించింది అక్షరాలా రూ.256.32 కోట్లు. నాలుగున్నరేళ్లుగా ఉద్యోగులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకుండా నిర్వహణ సంస్థకు మాత్రం భారీగా లబ్ధి చేకూర్చింది. చివరకు ఉద్యోగులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ చెల్లించకుండా సంస్థ నిర్లక్ష్యం వహించినా సర్కారు పట్టించుకోకపోవడం వల్లే పోరాటాలకు దిగాల్సి వచ్చిందని సిబ్బంది చెబుతున్నారు. స్వయానా ముఖ్యమంత్రే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయకుండా మోసం చేశారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

104లో సిబ్బంది వివరాలు ఇలా..

కేడర్	ఉద్యోగుల సంఖ్య
నర్సు/ఏఎన్‌ఎంలు	321
ఫార్మసిస్టులు	321
ల్యాబ్ టెక్నీషియన్లు	320
డ్రైవర్లు	326
వాచ్‌మెన్లు	165
డాక్టర్లు	189

అక్రమ సంపాదన అంటువ్యాధిలా ప్రబలుతోంది

- పాలకులు స్వలాభం కోసం అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు
- రైతుల్ని, నిరుద్యోగ యువతను పట్టించుకోవట్లేదు
- ప్రజాధనంతో చేపట్టే పనులకు సోషల్ ఆడిట్ నిర్వహించాలి
- ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అజేయ కల్లం




డాక్టర్ అజేయ కల్లం

నంద్యాల వ్యవసాయం: దేశంలోనూ, రాష్ట్రంలోనూ అక్రమ సంపాదన అంటువ్యాధిలా ప్రబలుతోందని.. పాలకులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డాక్టర్ అజేయ కల్లం ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం కర్నూలు జిల్లా నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కాలేజీ ఆవరణలో జరిగిన 'మేలుకొలుపు' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కుటుంబ పాలన ప్రజాస్వామ్యానికి ప్రథమ శత్రువన్నారు. ఎల్లకాలం అధికారంలో కూర్చోవడం కూడా ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. జమ్మూ కశ్మీర్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, బిహార్‌తో పాటు ఏపీ, తెలంగాణలో నేటికీ కుటుంబ పాలన సాగుతోందన్నారు. అమాయకులైన యువకుల ఉద్రేకాలను వాడుకోవడం వల్లే దక్షిణాదిన సినిమా రాజకీయాలు విజయవంతమవుతున్నాయన్నారు. ఇది ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు విరుద్ధమని చెప్పారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతుల గురించి కానీ.. రోజురోజుకూ పెరిగిపోతున్న నిరుద్యోగ యువత గురించి కానీ పట్టించుకొనే పరిస్థితుల్లో ప్రస్తుత పాలకులు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. పాలనా వ్యవస్థను అవినీతిమయంగానూ, అభివృద్ధి నిరోధకంగానూ మార్చి వేస్తున్నారని మండిపడ్డారు. పరిపాలన, విద్య, వైద్య రంగాల్లో స్వయం ప్రతిపత్తి ఉండాలన్నారు. అలాగే పరిపాలన యంత్రాంగం నిర్వహణలో ప్రజాప్రతినిధుల జోక్యాన్ని అరికట్టాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధుల బాధ్యత విధాన నిర్ణయాలకే పరిమితమయ్యేలా పోరాటం చేయాలన్నారు. ప్రజాధనంతో చేపట్టిన పనులన్నింటికీ సోషల్ ఆడిట్ నిర్వహించాలని, నష్టం వాటిల్లితే బాధ్యుల నుంచి నష్టపరిహారం వసూలు చేయాలని.. పౌరసమాజం ఈ దిశగా ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరముందన్నారు. అప్పుడే ప్రజాస్వామ్యం నిలబడుతుందని చెప్పారు.

రాజకీయ జోక్యం తగదు..

ముఖ్యమంత్రులు, మంత్రులు, ఉన్నతాధికారులు తమ ఆడంబరాలకు ప్రజాధనాన్ని ఇష్టానుసారంగా ఖర్చు చేయకుండా చూడాల్సిన అవసరముందని అజేయ కల్లం అభిప్రాయపడ్డారు. వ్యవసాయ విస్తరణ, లాభసాటి ధరలు అందేలా మార్కెట్ల నియంత్రణ.. వీటిని సమన్వయం చేసేందుకు ఒక సంస్థను ఏర్పాటు చేయాలన్నారు. భూ యాజమాన్యాన్ని ధ్రువీకరించే చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరముందన్నారు. స్థానిక సంస్థలకు స్వయం పాలన స్వేచ్ఛను కల్పించి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తగిన నిధులతో పాలనా బాధ్యతలు అప్పగించినప్పుడే ఆరోగ్యం, విద్య ప్రజలందరికీ అందుతాయన్నారు. వీటిలో రాజకీయ జోక్యం లేకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ పాలన సమర్థవంతంగా సాగాలంటే సివిల్ సర్వీస్ బోర్డు, న్యాయ జవాబుదారీ కమిషన్, పోలీసు యంత్రాంగాలను పూర్తి స్వయం ప్రతిపత్తితో ఏర్పాటు చేయాల్సిన అవసరముందని చెప్పారు. అప్పుడే అవినీతిని కూడా అంతమొందించవచ్చన్నారు. కార్యక్రమంలో 'మన కోసం మన సంస్థ' రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నాగస్వరం నరసింహ, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డు వైస్ చాన్సలర్ డాక్టర్ రాఘవరెడ్డి, ఇన్‌కం ట్యాక్స్ రిటైర్డు జాయింట్ డైరెక్టర్ డేవిడ్, రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గాడ్స్ ఆన్ అర్త్– తిరుమల చరిత్ర' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాక్షి ఈడీ కె. రామచంద్రమూర్తి, మాజీ చీఫ్ సెక్రటరీ ఐవైఆర్ కృష్ణారావు

హైదరాబాద్: డాక్టర్ దేవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి రచించిన 'గాడ్స్ ఆన్ అర్త్– తిరుమల చరిత్ర' పుస్తకాన్ని 'సాక్షి' ఎడిటోరియల్ డైరెక్టర్ కె.రామచంద్రమూర్తి ఆవిష్కరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి కె.రామచంద్రమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి అపార అనుభవంగల రచయిత, చరిత్ర పరిశోధకులని, ఈ పుస్తకంలో తనకు తెలియని అనేక విషయాలను విపులంగా వివరించారని ప్రశంసించారు. ఈ పుస్తకం భక్తి పారవశ్యంతో రాసింది కాదని, శ్రీవారి ఆలయ విశిష్టత, దేవాలయం కట్టినప్పటి వాతావరణాన్ని చాలా క్లుప్తంగా విశదీకరించారని పేర్కొన్నారు. ఐవైఆర్ కృష్ణారావు మాట్లాడుతూ.. ఈ పుస్తకంలో తిరుమల విశిష్టతను రచయిత చక్కగా వివరించారన్నారు. ఈ పుస్తకం హిస్టరీకి ప్రామాణికంగా ఉంటుందని, తిరుమల విశేషాలను తెలిపే వారసత్వ సంపదగా నిలుస్తుందన్నారు. రచయిత దేవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ.. తిరుమల విశేషాలను, విజయనగర రాజులు, శ్రీవారి వైభవాన్ని పుస్తకంలో వివరించానని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలిండియా రేడియో డైరెక్టర్ నాగసూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని జిల్లాల్లో కార్మిక గర్జన సదస్సులు

వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం: గౌతంరెడ్డి



సాక్షి, అమరావతి/విజయవాడ సిటీ: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ పోరాటాలు నిర్వహించాలని వైఎస్సార్ కార్మిక యూనియన్ (వైఎస్సార్ టీయూసీ) నిర్ణయించినట్లు వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. విజయవాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన వెల్లడించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రోడ్డున పడేయడం, కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని రద్దు చేయకపోవడం లాంటి అంశాలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు గౌతంరెడ్డి తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రతి జిల్లాలో 'కార్మిక గర్జన' పేరుతో సదస్సులు నిర్వహించాలని, ప్రతి జిల్లాలో ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానికంగా ఉండే నియోజకవర్గ ఎమ్మెల్యేలు, సమన్వయ కర్తలతో కలసి ఆటో సదస్సులు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని యూనివర్శిటీల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులతో ఫిబ్రవరి 10న ఫెడరేషన్‌లు చేస్తామని ప్రకటించారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు అందరికీ ఉద్యోగాలు కల్పిస్తామన్నారని, అయితే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న 80 వేల మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. ఐటీ హబ్‌లు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన హామీ అటకెక్కిందని గౌతంరెడ్డి ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఇప్పటికే ప్రకటించారని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో వైఎస్సార్‌టీఎస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సత్తార్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి అమరనాథ్, కేవీ సుధాకర్, బందరు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మాదు శివరామకృష్ణ, విజయవాడ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు నంబూరు ప్రతీప్‌కుమార్, విజయవాడ నగర అధ్యక్షుడు విశ్వనాథ రవిలు పాల్గొన్నారు.

సొమ్మొకరిది... సోకొకరిది



ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించిన కాలనీకి నారా దేవాన్ష్ పేరు పెట్టిన దృశ్యం..

ప్రభుత్వ నిధులతో నిర్మించిన కాలనీకి సీఎం మనవడి పేరు

- కృష్ణా జిల్లా కొమరవోలు గ్రామాన్ని దత్తత తీసుకున్న సీఎం భార్య
- సొంతంగా పైసా ఖర్చు పెట్టని వైనం.. అభివృద్ధి పనులకు ఎన్‌ఆర్‌ఐల వితరణ
- అంతా తామే చేశామని చెబుతున్న సీఎం కుటుంబ సభ్యులు

సాక్షి, అమరావతిబ్యూరో: ప్రభుత్వ సొమ్ముతో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించిన కాలనీకి సీఎం చంద్రబాబు మనవడు నారా దేవాన్ష్ పేరు పెట్టారు. ఇది నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ అధికారులెవరూ ప్రశ్నించే సాహసం చేయలేదు. గ్రామస్తులు మాత్రం సొమ్మొకరిది.. సోకొకరిది అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. అలాగే ఆ గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు కొందరు ఎన్‌ఆర్‌ఐలు తమ వంతు సాయం అందించగా.. ఆ పనులు కూడా తామే చేపట్టామని సీఎం కుటుంబసభ్యులు పేర్కొంటుండటం విశేషం. కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం కొమరవోలు గ్రామాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి 2015 సెప్టెంబరులో దత్తత తీసుకున్నారు. ఈ గ్రామ జనాభా సుమారు 2,200. ఎన్టీఆర్ భార్య బసవరామతారకం ఈ గ్రామంలోనే జన్మించారు. ఈ నేపథ్యంలో నారా భువనేశ్వరి ఆ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించి దత్తత తీసుకున్నారు. ఆ తర్వాత పలు దఫాలుగా ఆమె గ్రామాన్ని సందర్శించి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం ఆ గ్రామానికి అవసరమైన పనులను గుర్తించి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయగా.. ప్రభుత్వం వాటికి నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వ నిధులతోపాటు గ్రామస్తులు వితరణ ఇచ్చిన డబ్బును కలుపుకుని అభివృద్ధి పనులు చేపట్టారు.

అభివృద్ధి అంతా ఆమె చలువే అంటూ..


సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి కొమరవోలు గ్రామాన్ని దత్తత తీసుకున్న తరువాత.. ప్రభుత్వ నిధులతోపాటు పామర్రు జెడ్పీటీసీ దంపతుల సొంత నిధులు కలుపుకుని ఆ గ్రామంలో మరుగుదొడ్లు నిర్మించారు. రైతుల కోసం గ్రామంలో ఉన్న డొంకరోడ్లను జేఎస్పీ రహదారులుగా మార్చు చేసేందుకు ప్రభుత్వం రూ. 45.50 లక్షలు మంజూరు చేసింది. అలాగే భూగర్భ డ్రెయినేజీ నిర్మాణానికి రూ. 4.40 కోట్లు, అంతర్గత సిమెంటు రోడ్లకు రూ. 2.06 కోట్లు, 1.7 కిలోమీటర్ల పొడవున్న జిల్లా పరిషత్ రోడ్డును సిమెంటురోడ్డుగా మార్చేందుకు రూ. 1.70 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇక గ్రామంలో 150 ఏళ్ల చరిత్ర కలిగిన అమరలింగేశ్వర దుర్గానాగేశ్వర స్వామి వారి దేవస్థానం పునః నిర్మాణానికి దేవదాయ శాఖ రూ. 38 లక్షలు మంజూరు చేసింది. అలాగే గ్రామస్తులు మరో రూ. 15 లక్షలు వితరణ ఇచ్చారు. ఇలా.. పంచాయతీ నూతన భవన నిర్మాణానికి రూ. 25 లక్షలు కూడా ప్రభుత్వ నిధులే కావడం విశేషం. అయితే గ్రామంలో ఈ అభివృద్ధి అంతా నారా భువనేశ్వరి వల్లే జరిగిందని ఆమె బంధువులు, అధికారపార్టీ నాయకులు చెప్పుకోవడాన్ని చూసి గ్రామస్తులు విస్తుపోతున్నారు.

హౌసింగ్ కాలనీకి దేవాన్ష్ పేరు..

అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఉండాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద కొమరవోలు గ్రామానికి గృహనిర్మాణ శాఖ అధికారులు 250 పక్కా గృహాలు మంజూరు చేశారు. ఒక్కో ఇంటికీ ప్రభుత్వం 1.50 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామంలో చేపట్టిన 150 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇందులో ఒకే చోట 54 ఇళ్లను ఇటీవలే పూర్తి చేశారు. ప్రభుత్వ నిధులకు అదనంగా లబ్ధిదారులు కూడా కొంత మొత్తం జమ చేసి వాటిని నిర్మించుకోవడం జరిగింది. తమ సొంత నిధులు రూపాయి కూడా వెచ్చించకుండా సీఎం దంపతులు ఆ కాలనీకి తమ ముద్దుల మనవడు దేవాన్ష్ పేరు పెట్టేశారు. ప్రభుత్వ నిధులకు తోడుగా ఎవరైనా దాతలు తమ వంతు సాయం చేస్తే.. వారు కోరినట్లుగా కాలనీలకు గాని, భవనాలకు గాని పేర్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోందని.. ఈ కాలనీ నిర్మాణం కేవలం ప్రభుత్వ నిధులతో జరిగిందని.. దానికి పథకం పేరు తప్ప వేరే పేరు పెట్టడానికి వీల్లేదని గృహనిర్మాణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.


పుట్టిన ఊరిని మరువకండి

- నా భార్యను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు తమ గ్రామాలను బాగుచేయాలి
- కొమరవోలు గ్రామ సందర్శనలో సీఎం



సాక్షి, అమరావతి బ్యూరో: 'కన్న తల్లి జన్మనిస్తుంది.. జన్మభూమి మరెన్నింటినో ఇస్తుంది, అటువంటి ఊరికి మనమెంత చేసినా తక్కువే. ప్రతి ఒక్కరూ తను పుట్టిన ఊరికి ఎంతోకొంత సేవచేయాలి' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా పామర్రు మండలం కొమరవోలు గ్రామంలో సీఎం కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పర్యటించారు. తన అమ్మమ్మ ఊరు కావటంతో ఈ గ్రామాన్ని సీఎం సతీమణి భువనేశ్వరి దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నామని చెప్పారు. తన భార్య భువనేశ్వరి ఈ గ్రామాన్ని ఒక సవాలుగా తీసుకొని అభివృద్ధి చేసిందని, ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ స్వగ్రామాన్ని చక్కదిద్దాలన్నారు. ఎన్టీఆర్ పుట్టిన నిమ్మకూరు, ఆయన భార్య బసవతారకం పుట్టిన కొమరవోలు గ్రామాలను నమూనా చేసుకొని మిగిలిన వాటిని కూడా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పంచాయతీ కార్యాలయం, సీసీ రోడ్లు, ఎన్టీఆర్ గృహసముదాయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా, ఎంపీ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన, ఎమ్మెల్సీలు బాబు రాజేంద్రప్రసాద్, బచ్చుల అర్జునుడు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాహిత్యం



విజయవాడ | సోమవారం
జనవరి | 28 | 2019
మెయిల్: sakshisahityam@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీవిళంబినామ సంవత్సరం. ఉత్తరాయణం, హేమంత ఋతువు. పుష్య మాసం. తిథి బ.అష్టమి రా.8.03 వరకు, తదుపరి నవమి. నక్షత్రం స్వాతి రా.7.55 వరకు, తదుపరి విశాఖ. వర్జ్యం రా.1.30 నుంచి 3.05 వరకు. దుర్ముహూర్తం ప.12.35 నుంచి 1.20 వరకు, తదుపరి ప.2.49 నుంచి 3.34 వరకు. అమృత ఘడియలు ప.11.16 నుంచి 12.54 వరకు.

సూర్యోదయం : 6.38, సూర్యాస్తమయం : 5.49
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు


ఫజర్ : 5.34
జొహర్ : 12.29
అసర్ : 4.33
మగ్రీబ్ : 6.09
ఇషా : 7.24

ఈవారం పుస్తకాలు


ధనికొండ హనుమంతరావు శతజయంతి సందర్భంగా 12 సంపుటాల ఆయన సమగ్ర సాహిత్యం వెలువడింది. సంపాదకుడు: ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్. ప్రచురణ కర్త: శేషు అండ్ కో., ఫ్లాట్ బి–5, 42 స్టేషన్ రోడ్, చెన్నై–600024. ఫోన్: 9789002470 ప్రతులకు: సాహితి ప్రచురణలు, 32–22–2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ–4. ఫోన్: 0866–2436642




అతను-ఆమె-ఆమె
(మరి 35 కథలు) పేజీలు: 352; వెల: 200



మగువ మనసు
(నవల)
పేజీలు: 288; వెల: 175



లోక చరిత్ర
(నవలికల సమాహారం)
పేజీలు: 336; వెల: 200




జగదేక సుందరి క్లియోపాత్రా
(నవల)
పేజీలు: 384; వెల: 225



మొపాసా కథలు
(అనువాద కథలు)
పేజీలు: 256; వెల: 150



ఎర్ర బుట్టలు
(మరికొన్ని నాటికలు, నాటకాలు)
పేజీలు: 360; వెల: 200



అంతిమ పోరాటం
(అనువాద నవల)
మూలం: జె.ఫెన్నీమోర్ కూపర్;
పేజీలు: 224; వెల: 125



కథాసారం

ప్రేమే సృష్టి

సరే, పిల్లలంతా ఆరుబయట చెట్లు నాటారు, మేము అనుకునేదేమంటే, ఇదంతా కూడాను చదువులో భాగమే, వాటి వేర్ల వ్యవస్థ ఎలా పనిచేస్తుందో తెలుసుకోవడం, అలాగే ఒకదాని గురించి బాధ్యతగా ఉండటం, ఒకదాన్ని జాగ్రత్తగా చూసుకోవడం. చెట్లు అన్నీ చచ్చిపోయాయి. అవి ఆరెంజ్ చెట్లు. అవి ఎందుకు చనిపోయాయో నాకు తెలీదు, కానీ చనిపోయినై. భూమి మట్టితోనే ఏదైనా సమస్య ఉందో, నర్సరీలోంచి వచ్చినవే మంచివి కాదో. దాని గురించి ఫిర్యాదైతే చేశాం. మొత్తం ముప్పై మంది పిల్లలున్నారు, ప్రతి చిన్నారి ఒక్కో మొక్క నాటాలి, చూస్తే ముప్పై చెట్లూ చనిపోయినై. ఆ ఎండిపోయిన కట్టెలను పిల్లలు చూస్తూవుంటే, డిప్రెసింగ్‌గా ఉండింది.

మరీ అంత బాధేం ఉండేది కాదుగానీ, ఈ చెట్ల వ్యవహారం జరగడానికి కొన్ని వారాల ముందు పాములన్నీ చచ్చిపోయినై. కనీసం అవి చనిపోవడానికి ఓ కారణం అయితే కనబడింది, బాయిలర్ నాలుగు రోజులు ఆగిపోయింది సమ్మె వల్ల. కనీసం ఇదీ అని పిల్లలకు వివరించి చెప్పొచ్చు. అందుకే పరిస్థితులు మామూలైన తర్వాత పాములను చూసినప్పుడు పిల్లలు మరీ కలత చెందలేదు.

ఔషధ మొక్కల గార్డెన్ విషయంలో అయితే అది నీళ్లు మరీ ఎక్కువ పెట్టడం అయివుండాలి, కనీసం పిల్లలకు ఇప్పుడు తెలుసు నీళ్లు ఎక్కువ పోయకూడదని. పిల్లలు ఆ గార్డెన్ మీద మరీ ఎక్కువ పట్టింపుతో ఉండి, అందులో ఎవరైనా మేము చూడనప్పుడు కొన్ని నీళ్లు ఎక్కువ పోసివుంటారు. అనుకోగూడదుగానీ ఎవరైనా కావాలని చేసిందా అన్న ఆలోచన కూడా మాకు రాకపోలేదు. అలా ఎందుకు అనుకున్నామంటే, దీనికంటే ముందు ఎడారి ఎలుకలు చనిపోయినై, తెల్ల చిట్టెలుకలు చనిపోయినై, నలికండ్లపాములు చనిపోయినై... సరే, ఇప్పుడు వాళ్లకు తెలుసు వాటిని ప్లాస్టిక్ బ్యాగుల్లో తీసుకుపోవద్దని.

ఉష్ణమండల చేపలు చనిపోతాయని మాత్రం ఊహించాం, అదేమీ ఆశ్చర్యం కలిగించలేదు. పెద్ద సంఖ్యలో, ఉపరితలానికి వచ్చి, మెలి తిరిగి వెల్లకిలా పడిపోయినాయి. ఆ సమయంలోనే మా పాఠ్య ప్రణాళికలో ఉష్ణమండల చేపలు చూపాలని ఉండింది, కానీ మేము ఏమీ చేయలేకపోయాం.


మేము కనీసం ఓ కుక్కపిల్లను ఉంచుకునే వీలు లేకపోయింది.

అది చిన్న కుక్కపిల్ల, దాన్ని మర్డోక్ చిన్నారి గ్రిస్టెడె ట్రక్కు కింద చూసింది, ఆ డ్రైవరు అప్పుడే డెలివరీ పూర్తిచేసుకున్నాడు, ఆ ట్రక్కు దాని మీద ఎక్కడ ఎక్కేస్తుందేమో అని తెగ భయపడిందట, వెంటనే దాన్ని తన బ్యాగులో పెట్టుకుని స్కూలుకు తెచ్చేసింది. కానీ దాన్ని చూసిన మరుక్షణం, దేవుడా, అది రెండు వారాలకు మించి బతకదేమో అనిపించింది... చివరకు అదే జరిగింది. నిజానికి అది తరగతి గదిలో ఉండకూడదు కూడా, అట్లా అని పాఠశాల నిబంధనలు ఏవో ఉండినాయి, కానీ పిల్లలతో మీరు కుక్కపిల్లను క్లాసులోకి తేవొద్దని చెప్పలేరు, అది అప్పటికే వచ్చి మీ కళ్లముందు కనబడుతూ, ఈ మూల నుంచి ఆ మూలకు గెంతుతూ కుయ్యికుయ్యి మంటూ ఉన్నప్పుడు. దానికి వాళ్లు ఎడ్గర్ అని పేరు పెట్టారు, నా పేరు మీదుగానే! ఇంక చూడండి, దానితో వాళ్లు చేసే తమాషా, 'బాగుంది ఎడ్గర్!', 'ఇటు చూడు ఎడ్గర్!' అంటూ ఒకటే అరవడం,



ఒకటే నవ్వడం. నేను కూడా సంతోషపడ్డాను, నన్ను ఆటపట్టిస్తుంటే నాకు బానేవుంటుంది. వాళ్లు సామానుల గదిలో దానికో చిన్న ఇల్లు అదీ కూడా కట్టారు. అదెందుకు చనిపోయిందో అంతుపట్టలేదు, కుక్కలకు తగిలే ఏదైనా అంటువ్యాధి అయివుండాలి. బహుశా దానికి టీకాలు వేయించివుండరు. పిల్లలు స్కూలుకు వచ్చేలోపలే దాన్ని తీయించేశాను. ప్రతి రోజు పొద్దుటే నేను ఆ సామాన్ల గదిని చూస్తూ వచ్చాను, ఓ దినచర్యలాగా, ఏం జరిగే ప్రమాదముందో ఒక అంచనావుంది కాబట్టి. దాన్ని కస్టోడియన్‌కు అప్పగించాను.

ఆ తర్వాత ఈ కొరియన్ అనాథ, హెల్ప్ ద చిల్డ్రెన్ కార్యక్రమంలో భాగంగా క్లాస్ తరఫున దత్తత తీసుకున్నాం, ప్రతి చిన్నారీ నెలకో పావలా డాలర్ చొప్పున ఇవ్వాలనేది ఆలోచన. ఆ పిల్లాడి పేరు కిమ్, మేము దత్తత తీసుకోవడమే ఆలస్యమైందో ఏమో గానీ దురదృష్టకరమైన సంగతి. అతడి మరణానికి కారణం ఏమిటో మాకు వచ్చిన ఉత్తరంలో పేర్కొనలేదు, కానీ మేము ఇంకో దత్తతకు వెళ్లమని సలహా అయితే ఇచ్చారు, కొన్ని ఆసక్తికరమైన కేసు హిస్టరీలు కూడా పంపారు, కానీ మాకు అప్పటికే గుండెలు జారివున్నాయి. అందరూ మరీ డీలా పడిపోయారు, నాతో ఎవరూ నేరుగా ప్రస్తావించలేదుగానీ, అసలు స్కూలులోనే ఏదో దోషం ఉందని అనుకోసాగారు. నాకేమీ ప్రత్యేకంగా స్కూలులో ఏదో దోషం ఉన్నట్టు కనిపించలేదు, నేను మంచి చూసినవాణ్ని, చెడు చూసినవాణ్ని. ఏదో అదృష్టం బాగాలేదంతే. చాలామంది పిల్లల తల్లిదండ్రులు కూడా చనిపోయారు, ఆ మాటకొస్తే. రెండు గుండెపోట్లు, రెండు ఆత్మహత్యలు, ఒకరు నీట మునిగి, ఇంకో నలుగురు కారు ప్రమాదంలో. ఒకరికి స్ట్రోక్ వచ్చింది. ప్రతి ఏడాదీ తాతలు, బామ్మల మరణాలు మామూలుగానే ఎక్కువే సంభవిస్తుంటాయి, ఈ సంవత్సరం మరీ ఎక్కువున్నట్టున్నాయి. చివరకేమో ఈ దారుణం.



> **నాతో ఎవరూ నేరుగా ప్రస్తావించలేదుగానీ, అసలు స్కూలులోనే ఏదో దోషం ఉందని పిల్లలంతా అనుకోసాగారు.**

దారుణం ఎలా జరిగిందంటే– ఈ మాథ్యూ వెయిన్, టోనీ మావ్‌రోగార్డో ఇద్దరూ ప్రభుత్వ కార్యాలయ భవనం కోసం తవ్వుతున్న పునాదుల దగ్గర అడుకుంటున్నారు. అక్కడే పెద్ద పెద్ద దూలాలు కుప్పవేసి వున్నాయి. వాటిని సరిగ్గా పెట్టలేదని పిల్లల తల్లిదండ్రులు చెబుతున్నారు, దానిమీద కోర్టు కేసు అయితే రానుంది. ఏది సత్యమో ఏది కాదో నాకైతే తెలీదు, కానీ ఈ సంవత్సరం మాత్రం బాలేదు.

ఇంకోటి మరిచిపోయాను, బిల్లీ బ్రాంట్ వాళ్ల నాన్నను ఎవడో ముసుగు తొడుక్కున్న అగంతకుడు కత్తితో దారుణంగా పొడిచాడు, ఇంట్లో జొరబడినప్పుడు వాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పుడు.

ఒకరోజు క్లాసులో చర్చ జరిగింది. ఇవన్నీ ఎటు పోయాయని వాళ్లు ప్రశ్నించారు, ఆ చెట్లు, ఆ నలికండ్లపాములు, ఆ ఉష్ణమండల చేపలు, ఎడ్గర్, నాన్నలు, అమ్మలు? మాథ్యూ, టోనీ, వీళ్లు ఎటు పోయారు? నాకు తెలీదు, తెలీదు అని జవాబిచ్చాను. మరి ఎవరికి తెలుసని అడిగారు. ఎవరికీ తెలియదని జవాబిచ్చాను. అప్పుడు వాళ్లు, అంటే ఈ జీవితానికి అర్థాన్ని ఇచ్చేది ఈ మరణమా అని అడిగారు. లేదు, లేదు, జీవితానికి అర్థం కల్పించేది జీవితం మాత్రమే అని చెప్పాను. తర్వాత వాళ్లు ఏమన్నారంటే, కానీ ఈ చావు అనేది లౌకిక ప్రపంచంలో రోజువారీ భరించి తీరవలసిన రొష్టును అధిగమించే దిశలో మనని కొనిపోయే మూలసూత్రంగా పరిగణిస్తారు కదా––

అవును, కావొచ్చు, అన్నాను.

మాకు నచ్చలేదు, అన్నారు వాళ్లు.

ఊమ్ బాగుంది, అన్నాను.

ఎంత సిగ్గుమాలిన విషయం, అన్నారు.

ఒప్పుకున్నాను.

అయితే మీరు ఇప్పుడు హెలెన్(మా టీచింగ్ అసిస్టెంట్)ను మా ముందు ప్రేమించండి, ఎలా చేయాలో మేము చూస్తాం. మాకు తెలుసు మీకు హెలెన్ అంటే ఇష్టమని అన్నారు వాళ్లు.


నాకు హెలెన్ అంటే ఇష్టమే, కానీ అలా చేయలేనని చెప్పాను.

మేము దాని గురించి చాలా విన్నాం, కానీ మేము ఎప్పుడూ చూడలేదు అన్నారు వాళ్లు.

నన్ను ఉద్యోగంలోంచి తీసేస్తారు, పైగా అది ఎవరూ, ఎక్కడా ఇంతకుముందు ప్రదర్శించి చూపలేదని చెప్పాను. హెలెన్ కిటికీలోంచి చూసింది.

ప్లీజ్ ప్లీజ్, మీరు హెలెన్‌ను ప్రేమించండి, మాకో విలువ ఉందని నమ్మకం కలిగించండి, మాకు భయమేస్తోంది, అన్నారు వాళ్లు.

ఆ విలువ అంతటా ఉందనీ, (నాకూ భయమేస్తున్నప్పటికీ) మీరు భయపడనవసరం లేదనీ చెప్పాను. హెలెన్ వచ్చి నన్ను కౌగిలించుకుంది. ఆమె కనుబొమ్మలను నేను కొన్నిసార్లు ముద్దు పెట్టుకున్నాను. పిల్లలు కేరింతలు కొట్టారు. ఇంతలో తలుపు దగ్గర ఏదో చప్పుడైంది, వెళ్లి తీశాను, కొత్త ఎడారి ఎలుక లోనికి వచ్చింది. పిల్లలు ఆనందంతో అరిచారు.



డొనాల్డ్ బార్తెల్మె

సుప్రసిద్ధ అమెరికన్ కథకుడు, నవలాకారుడు డొనాల్డ్ బార్తెల్మె (1931–1989) రాసిన 'ద స్కూల్' కథ ఇది. 1974లో న్యూయార్కర్‌లో ప్రచురించబడింది. నిరాశామయ, విధ్వంసకర ప్రపంచంలో ఇంకా ప్రేమ అనే ఆశ ఉందని ప్రతీకాత్మకంగా చెప్పిన కథ ఇది. ముగింపు అసభ్యకరంగా ఉందని విమర్శించినవాళ్లున్నారు. అయినప్పటికీ క్లాసిక్‌గా గుర్తింపు వచ్చింది. సంక్షిప్త అనువాదం: సాక్షి సాహిత్యం డెస్క్.

నీ మరణాన్ని నీవే చూస్తున్నప్పుడు...

'నీ భార్యతో పాటు ఇంటి బయటకి వెళ్తావు. తోట మధ్యకు చేరుకున్నప్పుడు, టెన్నిస్ రాకెట్టు ఇంట్లో మరచిపోయావని ఆమెకి చెప్తావు. దానికోసం వెనక్కి వెళ్ళి,'నీవు' రాకెట్టుని పెట్టే ప్రవేశద్వారం వద్దున్న అల్మారాకి వెళ్ళకుండా, బేస్‌మెంటు వైపు దారి తీస్తావు. బయటే ఉన్న నీ భార్య, తుపాకీ శబ్దం విని, ఇంట్లోకి పరిగెత్తి నిన్ను పిలుస్తుంది. బేస్‌మెంట్ తలుపు తెరిచుందని గమనించి, కిందకెళ్తుంది. నీవు, రైఫిల్ని నీ కణత మీద పెట్టుకుని కాల్చుకున్నావని చూస్తుంది.'

మధ్యమ పురుషలో ఉండే 'సూయిసైడ్' నవల ప్రారంభం ఇది.

యీ ఫ్రెంచ్ పుస్తకంలో ఉన్న మాటలు, 20 ఏళ్ళ క్రితం–తను పాతికేళ్ళకన్నా ఎక్కువ జీవించనని చాటి, తన 25వ ఏటే ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని ఉద్దేశించి కథకుడు చెప్పినవి. మొదట్లో యథార్థ జీవితకథ అనిపించే నవల–20 పేజీల తరువాత కథకుని ఉనికి గురించిన ప్రశ్నలు లేవనెత్తుతుంది.

'నీవు బతికే ఉంటే నాకు అపరిచితుడివి అయి ఉండేవాడివి. మరణించిన తరువాత స్పష్టంగా కనిపిస్తున్నావు' అన్న మాటలు, కథకునికీ 'నీవు'కీ ఉన్న సంబంధాన్ని వివరించవు. అయితే, 'నీ ఆత్మహత్యను వివరిస్తూ, కామిక్ పుస్తకపు పేజీ ఒకటి తెరిచి పెడతావు. నీ భార్య చేయి తగిలి, పుస్తకం మూసుకుపోతుంది. ఏ పేజీ నీ ఆత్మహత్యను ఉదహరించిందో, ఎవరికీ తెలియకుండా పోతుంది' అన్న మాటలు ఆతృత హెచ్చిస్తాయి. 'ఆమె నిన్ను తన చేతుల్లోకి తీసుకుని వెక్కుతూ, నీ మీదకి వాలుతుంది. నీ శరీరం చల్లబడ్డం గమనిస్తుంది... నీ అంతాన్ని నీవే యోచించి పెట్టుకున్నావు. నీ మరణానికి వెనువెంటనే, నీ శరీరం కనుక్కోబడే ఏర్పాట్లు చేసుకున్నావు. అదక్కడే కుళ్ళుతూ పడి ఉండటం నీకిష్టం లేకపోయింది' అన్నలాంటి– నీవు జీవితపు ఉదంతాలను,

కొత్త బంగారం





ఎద్వార్డ్ లేవే

అనుభూతులను, అలవాట్లను, వస్త్రధారణను, పడగ్గది వివరాలను – ఒకదానికొకటి సంబంధం లేకుండా చెప్పే కథనం కాబట్టి, కథకుడికి 'నీవు' గురించిన వ్యక్తిగత వివరాలు ఎలా తెలుసా!' అన్న అనుమానం కలుగుతుంది.

నవల ఆత్మహత్య అనే చర్యను ప్రశ్నించదు. కానీ, ఆ నిర్ణయం తీసుకున్న మనిషిని నిలదీస్తుంది. అయితే ఏ సమాధానమూ దొరకదు. యీ 104 పేజీల నవలికలో ఉన్న అధ్యాయాల చివర్న, నీవు కుండే ఇష్టాయిష్టాలు కనబడతాయి: 'నవ్వు రక్షిస్తుంది. సంతోషం నిరాశ పరుస్తుంది. వార్తాపత్రికలు విసుగు పుట్టిస్తాయి'.

'నీ మరణం తరువాత ఆమె మళ్ళీ పెళ్ళి చేసుకుందా? ఆమె శృంగారం జరుపుతున్నప్పుడు నీవు గుర్తుకొస్తావా! నీ పుట్టిన రోజున ఆమె ఏమిటి చేస్తుంది? నీ వర్ధంతి దినాన, నీ సమాధి మీద పూలు ఉంచుతుందా! ఇంకా నీ బట్టలు అట్టేపెట్టిందా?' అన్న క్రూరమైన ప్రశ్నలు హృదయవిదారకంగా అనిపిస్తాయి.

పుస్తకంలో కథకుడి వివరాలేవీ లేనప్పటికీ నవల వెనుక అట్టమీదున్న, 'తన యీ చివరి పుస్తకపు అచ్చుప్రతి పబ్లిషరుకి ఇచ్చిన పది రోజులకి, రచయిత ఎద్వార్డ్ లేవే ఉరి వేసుకున్నాడు' అన్న వాక్యాలే – నవలను పాఠకులు ఎలా అర్థం చేసుకోవాలో చెప్తాయి. 'నీవు' అన్న పేరులేని వ్యక్తంటూ ఎవరూ లేరనీ, రచయితే తన రెండు పక్షాల వ్యక్తిత్వాలనీ సమర్థించుకుంటూ, అంతర్గత సంభాషణలు జరిపినవాడనీ అన్నవారు అనేకమంది.


భయం పుట్టించే పుస్తకం కాదిది. జాలి కలిగించే ప్రయత్నం చెయ్యదు. వ్యాకులత, నిస్పృహాతో బాధను విపరీతం చేయదు. వచనం సరళంగా, సాఫీగా ఉంటుంది. జాన్ స్టైన్, ఇంగ్లిషులోకి అనువదించిన యీ నవలికను 2011లో డాకీ ఆర్కైవ్స్ ప్రెస్ ప్రచురించింది.

◆ కృష్ణ వేణి

గ్రేట్ రైటర్

మాల్గుడి నారాయణ్

'ఏ కోర్సూ నిన్ను ఆర్కే నారాయణ్ చేయలేదు,' అంటాడు రచయిత జెఫ్రీ ఆర్చర్. చిన్న మనుషులు, చిన్న సంపాదనలు, చిన్న సమస్యలు... పుస్తకం కూడా చిన్నదిగానే ఉండాలి. రెండొందల పేజీలకు మించకూడదు! 'స్వామి' ఎంతుంటాడు! కానీ వాడి ఎత్తు భారతదేశం నుంచి ఆఫ్రికానో, అమెరికానో అందుకునేంత. ఉపాధ్యాయుడిగా మొదట్లో పనిచేసిన ఆర్కే (1906–2001)కు ఆ పనిలో అర్థం కనబడలేదు. దాంతో రచయిత అయిపోదామని వాళ్ల బామ్మ దగ్గర ప్రకటించేసి, ముహూర్తం చూసుకుని మరీ నోట్‌బుక్ ముందేసుకుని కూర్చున్నాడు. ఊహా రైల్వేస్టేషన్ మాల్గుడి తళుక్కుమంది. 'స్వామి అండ్ ఫ్రెండ్స్' పరుగెత్తుకుని వచ్చేశారు. అయితే, స్వామి ఇంగ్లీషులో మాట్లాడతాడు. ఆయన వరకూ అది పరాయిభాష కాదు, పెరిగిన వాతావరణమే అది. పుట్టిన తమిళమంత, పెరిగిన కన్నడమంత అలవోకగా ఇంగ్లీషులో రాశాడు, తొలితరపు భారతీయాంగ్ల రచయిత అయ్యాడు. ప్రతి నాయకుడి పాత్రయినా సరే, దాన్ని నిలబెట్టగలిగేదేదో పట్టుకోవాలి, అంటారాయన. 'మాల్గుడి డేస్', 'ది ఇంగ్లీష్ టీచర్', 'ద బాచిలర్ ఆఫ్ ఆర్ట్స్', 'మిస్టర్ సంపత్',



'ఫినాన్సియల్ ఎక్స్‌పర్ట్', 'వెయిటింగ్ ఫర్ ద మహాత్మ', 'ద గైడ్', 'ద మ్యాన్ ఈటర్ ఆఫ్ మాల్గుడి', 'టాకెటివ్ మ్యాన్', 'అండర్ ద బన్యాన్ ట్రీ', 'మై డేస్', ఆయన ఇతర రచనలు. ఆత్మకథాత్మకంగా కనబడే ఆయన పుస్తకాలకు, 'ఈ కథలో ఏముంది? శక్తివంతమైన క్లైమాక్స్ లేదు. అసలు ఎటు తీసుకెళ్దామని దీన్ని?' లాంటి ప్రశ్నలు ఎదుర్కొన్నారు. అయినా అదే శైలికి కట్టుబడి ఉండటానికి కారణం, ఇంకోరకంగా నేను రాయలేకపోవడమే, అంటారు.

చేతనైతే హృదయాన్ని ఫొటో తీయండి

సాహిత్య మరమరాలు

శ్రీశ్రీకి అచ్చంగా కవిత్వం కోసమే ఒక పత్రిక ప్రారంభించాలనే ఆశయం ఉండేది. పేరు 'ధ్వని' అని నిర్ణయించుకున్నారు. ప్రారంభ సంచికకు తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి చేతుల ఛాయాచిత్రాన్ని ప్రచురించాలనేది వారి ముచ్చట. దాని కోసం ఆయన నివసించే కడియం వెళదామనుకున్నారు. వీలు పడలేదు. ఈలోగా శాస్త్రిగారే వైద్యం కోసం విజయవాడ వచ్చారు. దాంతో ఈ చేతుల ఫొటో సంపాదించే పనిని అబ్బూరి వరదరాజేశ్వరరావుకు అప్పగించారు శ్రీశ్రీ. అబ్బూరి, మల్లాది ఫణిభూషణరావు, నీలంరాజు వెంకటశేషయ్య కలిసి ఒక ఫొటోగ్రాఫర్‌ను వెంటబెట్టుకొని బందరు కాలువ పక్కన శాస్త్రిగారు విడిది చేసిన ఇంటికి వెళ్లారు. ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ నేరుగా చేతులకు ఫొటో అంటే ఏమంటారో అనుకుని, వారికే నాలుగు ఫొటోలు తీయించారు. తరువాత అసలు సంగతి చెప్పి నాలుగైదు భంగిమల్లో వారి చేతుల్ని తీయించారు. ''ఎవరన్నా మొహాన్ని ఫొటో తీస్తారు, వేస్తారుగానీ– చేతుల ఫొటో ఏమిటయ్యా'' అన్నారాయన నవ్వుతూ.



''శాస్త్రిగారూ! మీ కవిత్వమంతా ఈ చేతుల్తోనే కదా వ్రాశారు. పత్రిక ముఖచిత్రం మీద ఈ బొమ్మ ప్రముఖంగా అచ్చేస్తాము'' అన్నారు అబ్బూరి కొంచెం భయంగా.

ఆయన పకాలున నవ్వి, ''మీరు నిజంగా నాకు న్యాయం చేయాలనుకుంటే నా మేధస్సునీ, హృదయాన్నీ, గాత్రాన్నీ ఫొటో తీసి మీ పత్రికలో వేయండి'' అన్నారు.


''అలా తమరనడంలో అర్థం ఉంది. కానీ అలా కుదరదు కనుక ఈ మార్గం అవలంబించాం'' అని వినయంగా జవాబిచ్చారు అబ్బూరి.

(అబ్బూరి వరదరాజేశ్వరరావు 'కవన కుతూహలం' ఆధారంగా)

◆ డి.వి.ఎం.సత్యనారాయణ

ప్రతిధ్వనించే పుస్తకం

సంసారంలో సన్యాసం



సిద్ధార్థ నవలా రచయిత హెర్మన్ హెస్

బుద్ధుడు ఉత్తమ పురుషుడని మనస్ఫూర్తిగా నమ్ముతాడు సిద్ధార్థుడు. కానీ ఆ ఉత్తమ పురుషుడి ఉత్తమ బోధకు మించినది ఆయన పొందిన అనుభవం అని అంతకంటే ఎక్కువగా విశ్వసిస్తాడు. అందుకే బుద్ధునికి శిష్యుడిగా ఉండటానికి ఇష్టపడక, తన సొంత అనుభవాన్ని అన్వేషిస్తూ సాగిపోతాడు. చిత్రంగా, ముందు సంసారంలో ఉన్నవాడు, అన్నింటినీ వదిలివేసి శ్రమణుడిగా మారతాడు; మళ్లీ మళ్లీ కాలచక్రంలో సంసారంలో మునిగిపోతాడు. కమలతో కూడతాడు. స్త్రీకి, ధనానికి, అధికారానికి వశుడవుతాడు. జూదం ఆడి, మద్యం తాగి, సకల లౌల్యాల్లో మునిగి తేలతాడు. జీవితపు అన్ని అవలక్షణాలను మలినాలుగా అద్దుకుంటాడు. సుఖదుఃఖాలకు లోనవుతాడు. జ్ఞానతృష్ణ నిగూఢంగా ఉన్నవాడు ఏదో ఒకరోజు అందులోంచి కూడా మేల్కొనక తప్పదు. మళ్లీ సంసారాన్ని త్యజించి సన్యాసి కావడానికి ప్రయత్నిస్తాడు. సన్యాసి అయ్యాననుకున్నాక కూడా మళ్లీ కొడుకును మంచిదారిలో, అదుపులో పెట్టడానికి ప్రయత్నిస్తాడు. నేను, నా అనేవి సంపూర్ణంగా నశించిపోవడం సిద్ధార్థుడి ఎడల సాధ్యం కాదు. అప్పుడు పల్లెకారు వాసుదేవుని సాహచర్యంలో, నది ఊతంగా ఈ లోచూపును పొందుతాడు. నది వినడం నేర్పుతుంది, ప్రవహించడం నేర్పుతుంది. అన్నింటినీ దహనం చేసుకుని, వెలుగుతోపాటు చీకటినీ, మంచితోపాటు చెడునూ, సుఖంతోపాటు దుఃఖాన్నీ, బతుకుతోపాటు మృత్యువునూ స్వీకరించగల ధీరుడు అవుతాడు. బహుశా అదే మోక్షం.

హెర్మన్ హెస్ జర్మన్‌లో రాసిన 'సిద్ధార్థ' నవల భారతీయ వేదాంత జ్ఞానాన్ని ఆకళింపు చేసుకుని రాసినట్టుగా తోస్తుంది. అసలు బుద్ధుడి పూర్వ నామం సిద్ధార్థుడు అన్న పేరు పెట్టడంలోనే, ఒక మామూలు మనిషి జ్ఞానిగా మారిన క్రమాన్ని అర్థం చేయించేందుకు ప్రయత్నించినట్టు అనిపిస్తుంది. కథ జరిగేది కూడా బుద్ధుని కాలంలోని భారతదేశంలోనే. ఆంగ్లంలోకి హిల్డా రోజ్నర్ అనువదించిన ఈ నవలను తెలుగులో బెల్లంకొండ రాఘవరావు అనువదించారు.

పదం పలికింది - పాట నిలిచింది

నీ జడ కోరని కోవెల చేరని రోజే వచ్చులే

ఆకాశాన సూర్యుడుండడు సంధ్య వేళకే
చందమామకి రూపముండదు తెల్లవారితే
ఈ మజిలీ మూడు నాళ్ళే ఈ జీవయాత్రలో
ఒక పూటలోనే రాలు పూవులెన్నో
నవ్వవే నవమల్లికా ఆశలే అందాలుగా
ఎద లోతుల్లో ఒక ముల్లున్నా వికసించాలే ఇక రోజాలా
కన్నీటి మీద నావ సాగనేల



రోజువారీ సత్యాల ఆలంబనగా మరో గొప్ప సత్యాన్ని ఆవిష్కరించడమే తత్వం అనిపించుకుంటుందేమో! అదే నిజం అయితే, వేటూరి సుందరరామ్మూర్తి ఈ పాటలో ఎంత తత్వాన్ని అందించాడు! అంతటి సూర్యుడే సాయంత్రానికి కనబడడే, చందమామకే తెల్లారితే రూపముండదే, మరి మనిషి ప్రాణమనగా ఎంత? మూడు నాళ్లే అని తెలిసిందీ, ఆ తర్వాత? దుఃఖిస్తూ కూర్చోవాలా? కన్నీటి మీద జీవిత నావను తోలుకోవాలా? ముళ్లున్నప్పటికీ గులాబీలా నవ్వాలి. మధుమాసంలో తుమ్మెదకు ఒక్క రోజు చాలదా, ఆనందంతో బతికేయదా? కనుమూస్తే మాత్రం ఏం? మళ్లీ మనవాళ్ల ఒడిలోనేగా పునర్జన్మ ఎత్తుతాం! ఈ పాటలోని ప్రతి పంక్తీ విలువైనదే, సులభంగా అర్థమయ్యేదే.

కొమ్మలు రెమ్మలు గొంతే విప్పిన కొత్త పూల మధుమాసంలో
తుమ్మెద జన్మకు నూరేళ్ళెందుకు రోజే చాలులే
చింత పడే చిలిపి చిలకా చిత్రములే బ్రతుకు నడకా
పుట్టే ప్రతి మనిషి కను మూసే తీరు మళ్ళీ తన మనిషై ఒడిలోకే చేరు
మమతానురాగ స్వాగతాలు పాడ
నీ సిగపాయల నీలపు ఛాయల చేరుకున్న ఈ రోజాలే
నీ జడ కోరని కోవెల చేరని రోజే వచ్చులే
పంజరమై బ్రతుకు మిగులు పావురమే బైటి కెగురూ
మైనా క్షణమైనా పలికిందే భాష ఉన్నా కలగన్నా విడిపోదీ ఆశ
విధిరాత కన్న లేదు వింత పాట

వేటూరి 'నంది' అవార్డు పొందిన ఈ సుందరకాండ చిత్రానికి సంగీతం ఎం.ఎం.కీరవాణి. పాడినవారు బాలసుబ్రహ్మణ్యం. 1992లో విడుదలైన ఈ చిత్రానికి దర్శకుడు కె.రాఘవేంద్రరావు. అపర్ణ, మీనా, వెంకటేష్ నటీనటులు.

రారండోయ్

- ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ కవితా సంపుటి 'జీవితం ఒక ఉద్యమం' ఆంగ్లానువాదం 'లైఫ్ ఈజ్ ఎ మూవ్‌మెంట్' ఆవిష్కరణ జనవరి 29న మధ్యాహ్నం 3 గంటలకు తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో జరగనుంది. అనువాదం: స్వాతి శ్రీపాద. సంపాదకుడు: చింతపట్ల సుదర్శన్. ఆవిష్కర్త: నందిని సిధారెడ్డి. నిర్వహణ: తెలుగు విశ్వవిద్యాలయం భాషాభివృద్ధి పీఠం.
- 'విప్లవ కవి వరవరరావు కవిత్వంతో ఒక రోజు' కార్యక్రమం ఫిబ్రవరి 3న ఉదయం 10 నుంచి సాయంత్రం 6:30 వరకు మహబూబ్‌నగర్‌లోని రోజ్‌గార్డెన్ ఫంక్షన్ హాల్(తెలంగాణ చౌరస్తా – బోయపల్లి గేట్ దారిలో)లో జరగనుంది. మూడు సెషన్లుగా జరిగే ఈ కార్యక్రమానికి ప్రారంభోపన్యాసం: జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి. తొలి సెషన్లో జి.హరగోపాల్, కె.శివారెడ్డి, ఖాదర్, దర్భశయనం శ్రీనివాసాచార్య, పాణి పాల్గొంటారు. నిర్వహణ: పాలమూరు అధ్యయన వేదిక.
- తంగిరాల సోని కవితాసంపుటి 'బ్లాక్ వాయిస్' ఆవిష్కరణ ఫిబ్రవరి 3న సాయంత్రం 5 గంటలకు విజయవాడ, గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జరగనుంది. ప్రచురణ: సామాజిక పరివర్తన కేంద్రం.
- 'మొదటి పేజీ కథలు' సంపుటానికిగానూ ఎ.ఎన్.జగన్నాథశర్మకు 'లక్ష రూపాయల' నగదుతో 'లక్ష్మీనారాయణ జైనీ జాతీయ సాహితీ పురస్కార (2019)' ప్రదానం జనవరి 29న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి సమావేశ మందిరంలో జరగనుంది. ముఖ్య అతిథి: నందిని సిధారెడ్డి. నిర్వహణ: జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్.
- జాగృతి వారపత్రిక ఓ కార్టూన్ల పోటీ నిర్వహిస్తోంది. చక్కటి హాస్యం ఉండాలి. బ్లాక్ అండ్ వైట్‌లో ఒకరు ఎన్నైనా పంపవచ్చు. మూడు బహుమతులు వరుసగా రూ.5 వేలు, 3 వేలు, 2 వేలు. 500 చొప్పున పది ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. ఫిబ్రవరి 28లోగా jagriticompetition@gmail.comకు పంపాలి. ఫోన్: 9959997204

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ సోమవారం
28-1-2019




ప్రతి అడుగు
ఒక పర్యటనే
- లోపలి పేజీలో



● కరిష్మా, కరీనా



● బబిత



● రణధీర్‌కపూర్, బబిత, కరిష్మా, కరీనా

సింగిల్ అంటే ఒకరు కాదు

సింగిల్ పేరెంట్ అంటే అమ్మా లేక నాన్న కాదు. అమ్మానాన్న రెండూ! ఇద్దరి ప్రేమనూ ఆ ఒక్కరే పంచాలి. రెండు బాధ్యతలు తీసుకోవాలి. సింగిల్ పేరెంట్ కావడానికి కారణాలు, వాటి నేపథ్యాలు వేరువేరుగా ఉండొచ్చు. కానీ నిలబడే తీరు ఒకటే.. స్థయిర్యంగా. ఛాలెంజెస్‌ను ఎదుర్కొనే ఆయుధమూ ఒకటే.. ఆత్మ విశ్వాసం!

''భార్యాభర్తలు విడిపోవచ్చు.. కానీ అమ్మానాన్నా విడిపోకూడదు''..

'భామనే సత్యభామనే' అనే సినిమాలోని డైలాగ్. వినడానికి బాగుంది. ఆలోచిస్తే నిజమే అనిపిస్తుంది. అమ్మానాన్న మానసికంగా విడిపోయాక కూడా వాళ్లు భార్యాభర్తలే. పిల్లల కోసం ఒకే చూరు కింద సర్దుకుపోయే భార్యాభర్తలు. కొన్ని జంటల విషయంలోనే విడాకులు తప్పనిసరవుతాయి. అమ్మా... నాన్న.. ఇద్దరిలో ఎవరో ఒకరు పిల్లల బాధ్యత తీసుకోవాల్సిన పరిస్థితి. ఆర్థికపరమైన వెసులుబాటు ఉంటే సింగిల్ పేరెంట్ ప్రయాణం కాస్త తేలిక కావచ్చు. లేకపోతే.. సామాజికపరమైన సవాల్ అదనం. ముఖ్యంగా ఆడవాళ్లకు. నైతిక స్థయిర్యం చాలా అవసరం. అలా సింగిల్ హ్యాండెడ్‌గా పిల్లల్ని పెంచి ప్రయోజకులను చేసిన సింగిల్ పేరెంట్స్ సినిమా ఫీల్డ్‌లో చాలా మందే ఉన్నారు. ఎస్పెషల్లీ ఇన్ బాలీవుడ్. సినిమా కథకేమీ తీసిపోని జీవితాలు వాళ్లవి. వాళ్లెవరో చూద్దాం.

బబిత

బబిత... బాలీవుడ్ నటి. హిందీ సినిమా లెజెండ్ రాజ్‌కపూర్ పెద్ద కోడలు. నటుడు రణధీర్ కపూర్ భార్య. కరిష్మా, కరీనా కపూర్‌ల తల్లి. భార్యాభర్తలుగా బాగున్నారు. అమ్మానాన్న అయ్యాకే గొడవలు మొదలయ్యాయి. కరిష్మాను నటిని చేద్దాం అని బబిత తల్లిగా బిడ్డ పట్ల ఉన్న తన కోరిక చెప్పగానే తండ్రిగా రణధీర్ కపూర్ వద్దు అన్నాడు. ఈ స్పర్థ ఇంకా అనేక గొడవలకు దారితీసి.. ఎడతెగని వాగ్వివాదాలతో ఆ ఆలుమగలు విడిపోవడం అనివార్యం అయింది. కరిష్మా, కరీనాల బాధ్యత బబితే తీసుకుంది. ఒంటరి తల్లిగా ఆ ఇద్దరినీ పెంచి, పెద్దచేసి తాను నటీమణులుగా నిలబెట్టింది. 2007లో పిల్లలిద్దరూ తమ తల్లిదండ్రులను ఒకే కప్పు కిందకు తెచ్చారు. అమ్మానాన్నగా మాత్రమే కలిసి ఉంటున్నారంతే!



● నీలిమా అజీమ్



● తల్లి అపర్ణసేన్‌తో కొంకణా సేన్




● అపర్ణాసేన్



● సారా అలీఖాన్

అమృతాసింగ్

బాలీవుడ్ నటిగా అందరికీ తెలుసు. సైఫ్ అలీఖాన్ మాజీ భార్యగానూ అంతే పరిచయం. ఈ జంట పిల్లలే సారా అలీఖాన్, ఇబ్రహీం. సారా అలీఖాన్ కూడా 'కేదార్‌నాథ్' సినిమాతో ఈ మధ్యే బాలీవుడ్‌లోకి ఎంటర్ అయింది. సారా, ఇబ్రహీంలకు లోకజ్ఞానం వచ్చేటప్పటికే వాళ్ల అమ్మానాన్నా విడిపోయారు. పిల్లలిద్దరినీ అమ్మ అమృతే పెంచింది.



● అమృతాసింగ్ కుటుంబం

నీలిమా అజీమ్

నీలిమా కూడా నటే. కాని షహీద్ కపూర్‌కి అమ్మగానే ఎక్కువ మందికి పరిచయం. నటుడు పంకజ్ కపూర్, నీలిమాలది ప్రేమ వివాహం. షహీద్ కపూర్‌కి మూడేళ్లప్పుడు ఈ ఇద్దరూ విడిపోయారు. షహీద్ తల్లి దగ్గరే పెరిగాడు. తండ్రితోనూ షహీద్‌కు మంచి అనుబంధమే ఉంది. అదంతా నీలిమా పెంపకం గొప్పదనమే అంటారు బాలీవుడ్ ఫోక్స్. షహీద్ కపూర్ బాలీవుడ్ జర్నీ మొత్తం బాక్సాఫీస్ హిట్లుగానే సాగలేదు. అతని ఫెయిల్యూర్స్‌లో వెన్నంటి ఉంది నీలిమే. కొడుకు మానసిక స్థితిని అర్థం చేసుకుని అండగా నిలబడింది.



● తల్లితో షాహిద్

అపర్ణా సేన్

నటి, దర్శకురాలు అయిన అపర్ణాసేన్ ప్రముఖ బాలీవుడ్ నటి కొంకణా సేన్ వాళ్ల అమ్మ, ఫిల్మీ లైఫ్‌లో గ్రేట్ సక్సెస్ సాధించిన అపర్ణ వైవాహిక జీవితంలో చేదునే చవి చూసింది. కొంకణా సేన్‌కు ఆరేళ్లున్నప్పుడు అపర్ణ తన భర్త ముకుల్ శర్మతో విడిపోయింది. అప్పటికే ఆమె నటిగా, దర్శకురాలిగా కూడా బిజీ.. ఇటు హిందీ, అటు బెంగాలీ భాషల్లో. అయినా కూతురిని తనే పెంచుకుంది. జీవితం ఏం ఇచ్చినా తీసుకోవాలి అన్నది అపర్ణాసేన్ ఫిలాసఫీ. ఆ తత్వాన్నే కూతురికీ బోధించింది. ప్రాక్టికల్‌గా ఉండడం నేర్పింది. అందుకే కొంకణా సేన్ చెప్తుంది.. ''మొదట్లో అమ్మానాన్నా వేరువేరుగా ఉండడం మింగుడుపడలేదు. స్కూల్ ఫంక్షన్స్‌కి నా ఫ్రెండ్స్ పేరెంట్స్ కలిసి వచ్చి, మా అమ్మ మాత్రం ఒక్కతే వస్తుంటే నాకు దిగులుగా, బాధగా.. అనిపించేది. కానీ ఊహ తెలిసినతర్వాత.. మా ఇంటి పరిస్థితిని అమ్మ వివరిస్తుంటే.. అర్థమైంది. అందరి ఇళ్లు ఒకేరకంగా ఉండవని, అమ్మానాన్నలందరూ కలిసి ఉండరని. విడిపోవడం సాధారణ విషయమే అని, విడిపోయినా అమ్మా, నాన్న ఇద్దరూ పిల్లలకు ఉంటారు అని'' అంటోంది.

పూజా బేడీ

సంచలన నటి. సినిమాల కన్నా ఆమె నటించిన యాడ్స్‌తో ఎక్కువ పాపులర్ అయింది. నటుడు కబీర్ బేడీ – నర్తకి, మోడల్ ప్రతిమా బేడీల ముద్దుల కూతురు. పూజా వైవాహిక జీవితమూ కష్టాలమయమే. బజినెస్ టైకూన్ ఫర్హాన్ ఇబ్రహీమ్‌ను పెళ్లిచేసుకుంది. ఆలియా, ఒమర్ (కూతురు, కొడుకు) పుట్టాక ఫర్హాన్ ఇబ్రహీమ్‌తో సాహచర్యం పూజకు కన్నీళ్లనే మిగిల్చింది. పిల్లలను తీసుకొని ఆ గడపదాటింది.



● పూజా బేడీ

ఒంటరి తల్లిగానే పిల్లల మంచిచెడుల బాధ్యతలను భుజాలకెత్తుకుంది.


కోరుకున్న పేరెంటింగ్


కరిష్మా, కొంకణాసేన్‌లు కూడా సింగిల్ మదర్ జాబితాలో ఉన్నారు. వీళ్ల కాక.. బై చాయిస్ అంటే పెళ్లి, విడాకులతో సంబంధం లేకుండా కూడా సింగిల్ మదర్‌గా పిల్లలను పెంచుతున్న సెలబ్రిటీలు ఉన్నారు. రవీనా టాండన్.. అనిల్ థడానీతో పెళ్లి కంటే ముందే పూజ, ఛాయ అనే ఇద్దరు పిల్లలను దత్తత తీసుకుంది. మాజీ విశ్వసుందరి సుస్మితాసేన్ కూడా ఈ విషయంలో రవీనాను ఆదర్శంగా తీసుకున్నట్టుంది. పాతికేళ్ల వయసులోనే ఆడపిల్లను దత్తత తీసుకుంది. ఆ తర్వాత 2010లో ఇంకో పాపనూ అడాప్ట్ చేసుకొని సింగిల్ మదర్‌గానే వాళ్లను పెంచుతోంది. నీనా గుప్తా.. థియేటర్ అండ్ బాలీవుడ్ నటి. వెస్ట్ ఇండీస్ క్రికెటర్ వివ్ రిచర్డ్స్‌ను ఇష్టపడింది. పెళ్లి బంధం లేకుండానే మసాబాను కన్నది. అంతే ఇష్టంగా వివ్ రిచర్డ్స్ తోడు లేకుండానే మసాబాను పెంచి పెద్ద చేసింది. మసాబా... సెలబ్రెటీ ఫ్యాషన్ డిజైనర్.

– సరస్వతి రమ

హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్

అమ్మ.. నాన్న.. ఓ ప్రేమకథ





▲ అమ్మానాన్నలతో షబానా (నాడు)

◄ 'కైఫీయత్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న షబానా (నేడు)

మూడు రోజుల 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్' లో చివరి రోజు సెషన్‌లలో ప్రముఖంగా ఆకర్షించిన సెలబ్రిటీ షబానా ఆజ్మీ. ఆదివారం నాడు ఆమె తన తండ్రి, ప్రముఖ ఉర్దూ కవి కైఫీ ఆజ్మీ రాసిన కవితలను, పాటలను పాడి అలరించారు. అరవై ఎనిమిదేళ్ల వయసులో ఆమె గ్లామర్‌తో పాటు స్వరంలో తియ్యదనం ఆకట్టుకున్నాయి. తండ్రి కైఫీ జీవితాన్ని 'కైఫీయత్' పుస్తకంగా వెలువరించారు షబానా. ఆ పుస్తకం మీద చర్చతో పాటు, కైఫీ జీవితం మీద ఏర్పాటు చేసిన చర్చాగోష్టిలో పాల్గొనడానికి హైదరాబాద్‌కి వచ్చారు షబానా. ఆమె పుట్టింది కూడా హైదరాబాద్‌లోనే. షబానా తల్లి షౌకత్‌ది హైదరాబాద్. ఆమె కైఫీ రచనలకు అభిమాని. ఆయన హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ఆయన దృష్టిలో పడడానికి ప్రయత్నించి మరీ తన ప్రేమను వ్యక్తం చేసినట్లు చెప్పారు షబానా. కైఫీ రక్తంతో రాసిన ప్రేమలేఖలను నమ్మవద్దని, అందులో వ్యక్తం చేసిన భావుకతలకు మురిసిపోవద్దని షౌకత్‌ను ఆమె తండ్రి (షబానా తాతగారు) హెచ్చరించినట్లు కూడా చెప్పారు షబానా. అయినప్పటికీ పట్టుపట్టి మరీ అతడినే పెళ్లి చేసుకున్న వైనాన్ని వివరించారు, పెళ్లి తర్వాత పెద్దగా సంపాదన లేని కైఫీ ఎనిమిది కుటుంబాలకు కలిపి ఒకటే టాయిలెట్ ఉండే ఇంట్లో కాపురం పెట్టారు. డబ్బు లేని బాల్యమే అయినా అందమైన జీవితాన్ని గడిపిన రోజులవి అన్నారామె. తండ్రి ఫొటో పేపర్‌లో ప్రచురించినప్పుడు ఫ్రెండ్స్ ప్రశంసలను ఎంజాయ్ చేయడం వంటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారామె.

కైఫీ చిన్నప్పటి నుంచి పండక్కి కొత్త దుస్తులు వేసుకోవడాన్ని వ్యతిరేకించేవారని, రైతు బిడ్డ కొత్త దుస్తుల కోసం ఆరాటపడకూడదని చెప్పేవారని ఆమె తండ్రి చెప్పిన మాటలను గుర్తు చేసుకున్నారు. పదకొండేళ్ల వయసులో తండ్రి రాసిన కవితను, ఆయన తండ్రి విశ్వసించకపోవడాన్ని, మళ్లీ రాసి చూపించిన తర్వాత నమ్మిన విషయాలను పంచుకున్నారు. ''మా అమ్మ చాలా ప్రాక్టికల్‌గా ఉండేది. వారి దాంపత్యంలో ఎంత ప్రేమ ఉండేదో అంతటి గొడవలు కూడా ఉండేవి. మా నాన్న చాలా నైస్‌గా చక్కదిద్దేవారు. వాళ్ల కాపురంలో సమానత్వం కోసం ప్రయత్నించడం జరగలేదు, వారి ఆచరణలో ఉండేది. నాన్న రాసిన 'నా వెనుక నడిచే అనుచరురాలు కాదు... నువ్వు నా పక్కన నడిచే సహచరిగా ఉండాలి' అనే కవిత మా అమ్మను ఆయన ప్రేమలో పడేసింది. అది చివరి వరకు వాళ్ల జీవితంలో కొనసాగింది. అది మా అమ్మానాన్నలకే కాదు, ప్రతి జంటకీ వర్తిస్తుంది. అన్వయించుకోగలిగితే ప్రేమబంధం ఎప్పటికీ సజీవంగా ఉంటుంది' అన్నారు షబానా. సమాజంలో మత సంఘర్షణలు వాటికవిగా జరగవు. వాటి వెనుక కొన్ని ప్రయోజనాలుంటాయి. అవి ప్రేరేపించినప్పుడే మతకల్లోలాలు జరుగుతాయని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. ''మీటూ ఉద్యమం చాలా గొప్ప సామాజికోద్యమం. పని ప్రదేశంలో మహిళలకు రక్షణ పూరిత వాతావరణం ఉండాలి. తమకు జరుగుతున్న అన్యాయం మీద గళమెత్తిన అమ్మాయిలకు సెల్యూట్'' అని ప్రశంసించారు.

హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ మూడవ రోజు తెలంగాణ టూరిజమ్ పెవిలియన్‌లో వినయ్ సీతాపతి రాసిన 'పి.వి. ది అన్‌లైకిలీ ప్రైమ్ మినిస్టర్' పుస్తకంపై విశ్లేషణాత్మక సంభాషణ జరిగింది. సాహిత్యాభిలాషి డాక్టర్ సునీతారెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



డాక్టర్ సునీతారెడ్డి, పుస్తక రచయిత వినయ్ సీతాపతి

ఇన్‌పుట్స్: మంజీర, ఓ మధు

రియల్ హీరో

చెయ్యి వదల్లేదు

'మగాళ్లు' సినిమాల్లోనే ఉంటారు. ఒకేసారి పదిమందిని చితక్కొట్టేస్తుంటారు. సిటీలో 'భాయ్' మనుషుల్ని ... (బీప్) పోయిస్తుంటారు. బంగీ జంప్‌లు చేస్తుంటారు. లుంగీ డ్యాన్స్‌లు వేస్తుంటారు. ఓ సినిమాలో విలన్ అంటాడు.. హీరో గురించి.. 'ఆడు మగాడ్రా బుజ్జే..' అని! మీరిప్పుడు అలాంటి మగాణ్ణే రియల్ లైఫ్‌లో చూడబోతున్నారు! అతడు ఫైట్ చేసింది, చేస్తున్నది.. తన భార్యపై సామూహిక అత్యాచారం జరిపిన తొమ్మిది మంది కీచకులకు శిక్ష వేయించడం కోసం! మూడేళ్లు అతడీ పోరాటం చేస్తున్నాడు. భార్యతో కలిసి చేస్తున్నాడు.





● జితేందర్

అతడి పేరు జితేందర్ ఛాతర్. హరియాణా రాష్ట్రానికి చెందిన సాధారణ యువ రైతు. కీచక సంతతి చేతిలో చిత్రవధ అనుభవించిన అభాగ్యురాలికి కొత్త జీవితాన్ని ఇవ్వడమే కాకుండా న్యాయం కోసం నిరంతర పోరాటం చేస్తూ రియల్ హీరో అనిపించుకున్నాడు. ఈ న్యాయ పోరాటానికి దారి తీసిన పరిస్థితులేమిటి? అతడి మాటల్లోనే విందాం.

''ఇలాంటి విషయాలు చెప్పుకోవడానికి సాధారణంగా ఎవరూ ఇష్టపడరు. కొన్నేళ్ల క్రితం నా భార్యపై ఎనిమిది మంది కామాంధులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దారుణాన్ని ఫొటోలు, వీడియో తీశారు. వాటితో ఆమెకు ఏడాదిన్నర పాటు నరకం చూపించారు. ఈ కిరాతకం జరిగేనాటికింకా మాకు పెళ్లి కాలేదు. 2015, సెప్టెంబర్‌లో మాకు నిశ్చితార్థం జరిగింది. హరియాణాలోని గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఆచారం ప్రకారం పెళ్లి కొడుకు పెళ్లి వరకు అమ్మాయిని మళ్లీ చూడటానికి వీల్లేదు. మేము ఫోన్‌లో తరచు మాట్లాడుకునేవాళ్లం. మాది జింద్ జిల్లాలోని ఛాతర్ గ్రామం. జింద్ నగరంలో ఆమె ఉండేది. మా రెండూళ్ల మధ్య 30 కిలోమీటర్ల దూరం.

ఓరోజు నాతో చాలా ముఖ్యమైన విషయం మాట్లాడాలని, వెంటనే రావాలని కోరింది. అమ్మానాన్నతో కలిసి రెండోసారి వాళ్ల ఊరెళ్లాను. ఆమె నోటి నుంచి వచ్చిన మాట వినగానే.. ఏం మాట్లాడాలో కాసేపు అర్థం కాలేదు. 'నన్ను పెళ్లి చేసుకోవద్దు. వివాహ బంధానికి నేను పనికిరాను' అని చెప్పడంతో నిర్ఘాంతపోయాను. ఏం జరిగిందని అడిగితే అసలు విషయం చెప్పింది. తాను అత్యాచార బాధితురాలినని, దీన్ని దాచిపెట్టి పెళ్లి చేసుకోవడం తనకు ఇష్టం లేదని సజల నేత్రాలతో నాపైపు సూటిగా చూస్తూ చెప్పేసరికి నేనేమీ మాట్లాడలేకపోయాను. నా అంతరాత్మ లోలోపల నన్ను ప్రశ్నిస్తోంది. 'ఈమెను పెళ్లి చేసుకోకపోతే దేవుడు నిన్ను క్షమించడు' అని మనస్సాక్షి ఘోషించడంతో 'నిన్నే పెళ్లి చేసుకుంటాన'ని ప్రమాణం చేశాను. పెళ్లి చేసుకోవడం మాత్రమే కాదు, నీకు న్యాయం జరిగేలా చేస్తానని దృఢవిశ్వాసంతో మాటిచ్చాను.

బెదిరింపులు.. ప్రలోభాలు

నాకు కాబోయే భార్య ఇంటికి వెళ్లొచ్చిన రెండు వారాల తర్వాత రేపిస్టుల భరతం పట్టే పనికి శ్రీకారం చుట్టాను. ఎనిమిది మంది దుండగులపై అప్పటికే నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా న్యాయవాదిని నియమించుకుని న్యాయ పోరాటం మొదలుపెట్టాను. నాకు, ఆమె కుటుంబానికి బెదిరింపులు వచ్చినా లెక్కచేయకుండా 2015 డిసెంబర్‌లో మేము పెళ్లి చేసుకున్నాం. నిందితులు యువకులు. పైగా రాజకీయ నేపథ్యం ఉన్న ధనవంతులు. మా ఇంటికి రౌడీలను పంపించి మమ్మల్ని బెదిరించారు. పోలీసులకు మేము ఇచ్చిన ఆధారాలు కోర్టు ముందుకు రాకుండా చేశారు. అంతేకాదు నామీద మూడు తప్పుడు కేసులు పెట్టించారు. ఆ సమయంలో మా ఇద్దరికీ మా అమ్మానాన్న అండగా నిలిచారు. ఎన్నివిధాలుగా బెదిరించినా లొంగకపోవడంతో మమ్మల్ని ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారు. కేసు వెనక్కి తీసుకుంటే భారీగా డబ్బు ఇస్తామని ఆశ చూపారు. నిందితులను జిల్లా కోర్టు నిర్దోషులుగా విడుదల చేయడంతో నేను హైకోర్టు తలుపు తట్టాను. న్యాయం జరిగే వరకు పోరాడాలన్న పట్టుదలతో ముందుకు సాగాను. కోర్టు ఫీజుల కోసం ఛాతర్ గ్రామంలో మాకున్న స్థలంలో కొంత అమ్మేసి రూ. 14 లక్షలు సమకూర్చుకున్నాను. అంతేకాదు కోర్టుకు దగ్గరగా ఉండాలన్న ఉద్దేశంతో సొంత ఊరిని, మాకున్న వ్యాపారాన్ని వదిలిపెట్టి జింద్ నగరంలో మకాం పెట్టాం. ఈ సమయంలో ఎంతో మానసిక వేదన అనుభవించాం. నా భార్యపై అమానుషకాండ సాగించిన కామాంధులకు శిక్ష పడాలన్న ఏకైక లక్ష్యంతో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నాను. మరోవైపు కోర్టు ఫీజులు భరించలేక, ఇతర లాయర్లపై నమ్మకం సడలిపోవడంతో న్యాయవాద విద్య అభ్యసిస్తున్నాను. నా భార్యను కూడా లాయర్ కోర్స్ చదివిస్తున్నాను.

చండీగఢ్ వెళ్లిపోతున్నాం

మేము సాగిస్తున్న సుదీర్ఘ న్యాయపోరాటానికి నా తల్లిదండ్రులు మద్దతుగా నిలిచారు. వారు అందించిన అండదండల కారణంగానే ఛాతర్ గ్రామస్తుల్లో చాలా మంది మా పక్షాన నిలబడ్డారు. నా భార్య తరపున న్యాయ పోరాటం చేయాలన్న నిర్ణయాన్ని మా పెళ్లికి ముందే మొత్తం పంచాయతీ సమర్థించింది. మా చదువు పూర్తైన తర్వాత చండీగఢ్‌కు వెళ్లిపోవాలనుకుంటున్నాం. మేమిద్దరం కలిసి న్యాయవాదులుగా అక్కడ ప్రాక్టీస్ మొదలుపెడతాం. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు న్యాయసేవలు అందించేందుకు మా చదువును ఉపయోగిస్తాం. మాకిప్పుడు రెండేళ్ల బాబు ఉన్నాడు. హరియాణాలోని దుష్ట పితృస్వామ్య వ్యవస్థ ఛాయలు మా కుమారుడిపై పడకుండా వాడిని చండీగఢ్‌లో చదివించాలనుకుంటున్నాం. మహిళల జీవితాలను నాశనం చేస్తున్న అత్యాచార సంస్కృతికి దూరంగా వాడిని పెంచాలనుకుంటున్నాం. మహిళలపై జరుగుతున్న అకృత్యాల గురించి గొంతు విప్పే రోజులు వస్తాయన్న ఆశాభావంతో ఉన్నాను. ఇప్పటికే అర్బన్ ఇండియాలో మీటూ ఉద్యమం మొదలైంది. పల్లెటూరి పడతుల విషయంలోనూ పరిస్థితులు మారతాయని ఆశిస్తున్నాం. ఇందుకోసం నేను, నా భార్య మా వంతు ప్రయత్నం చేస్తాం. మార్పు కోసం ఎదురు చూస్తున్నాం'' అని వివరించాడు జితేందర్.

ఇలా స్ఫూర్తిదాయక పోరాటం సాగిస్తున్న జితేందర్ ఛాతర్‌పై 'సన్ రైజ్' పేరుతో త్వరలో డాక్యుమెంటరీ రానుంది. జాతీయ అవార్డు అందుకున్న ప్రముఖ ఫిల్మ్ మేకర్ విభా బక్షి ఈ డాక్యుమెంటరీని రూపొందించారు.

– పోడూరి నాగ శ్రీనివాసరావు,
సాక్షి వెబ్ డెస్క్

ఈ హీరో గురించి మరికొంచెం

హరియాణాలో మహిళలపై లైంగిక దాడులు చాలా పెద్ద సమస్య. హరి (విష్ణువు) నిలయంగా వాసికెక్కిన హరియాణాలో దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లోనూ జరగనన్ని సామూహిక అత్యాచారాలు నమోదయ్యాయి. ఇన్ని అఘాయిత్యాలు జరుగుతున్నా బయటకి చెప్పడానికి ఎవరూ ఇష్టపడరు. సమాజం మొత్తం బాధిత మహిళలనే నిందిస్తుంది కాబట్టి తమపై జరిగే దారుణాల గురించి బయటపెట్టడానికి భయపడతారు. విష్ణువు నడయాడిన నేలగా చెప్పుకుంటున్న హరియాణాలో ఆడపిల్లల మానప్రాణాలకు రక్షణ లేకపోవడం జితేందర్‌ను ఎంతగానో కలచివేసింది. ఛాతర్ గ్రామంలో బాలికల పాఠశాల దగ్గర జులాయిలు కాపుకాసి అమ్మాయిలను నిత్యం అల్లరి పెట్టేవారు. తల్లిదండ్రులకు చెబితే ఎక్కడ స్కూల్ మాన్పించేస్తారోనన్న భయంతో ఆ బాలికలు మౌనంగా ఇవన్నీ భరించేవారు. ఛాతర్ నుంచి ఆర్టీసీ బస్సులో జింద్ నగరానికి వెళ్లే కాలేజీ అమ్మాయిలు ప్రతిరోజూ పోకిరీల వెకిలి చేష్టల బారిన పడుతుంటారు. ఇలాంటివి భరించలేక చాలా కుటుంబాలు అమ్మాయిలను కాలేజీ మాన్పించేశాయి. ఆ నేపథ్యంలో.. ఎటువంటి భయం లేకుండా అమ్మాయిలు కాలేజీకి వెళ్లేందుకు జితేందర్ తన వంతు ప్రయత్నం చేశాడు. మహిళల కోసం ప్రత్యేకంగా బస్సు నడపాలని విద్యార్థిగా ఉన్నప్పుడే 2004లో ఆర్టీసీ జిల్లా మేనేజర్‌కు లేఖ రాశాడు. కొన్ని నెలల తర్వాత లేడీస్ స్పెషల్ బస్సు ఛాతర్– జింద్ మార్గంలో రోడ్డెక్కింది. అక్కడితో తన పోరాటాన్ని ఆపలేదు అతడు. లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యల నిర్మూలనకు స్థానిక ఖాప్ పంచాయతీ సహకారంతో 2013లో జింద్ జిల్లాలోని 24 గ్రామాల్లో ప్రదర్శనలు, ప్రయత్నాలు సాగించాడు.

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ లవ్ గురు! ప్రేమ, పెళ్లి ఇదే జీవితమా? నేను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని అనుకోవట్లేదు. అలా అని వదిలెయ్యాలని అనుకోవట్లేదు మీరు ఏమంటారు??

– ప్రతాప్

వెటకారం అయిపోయింది నీకు...

ప్రేమ, పెళ్లి జీవితం కాదని అనుకునే నీకు ఏం జబ్బు వచ్చిందని...

గిలగిలా కొట్టుకుని ఉత్తరం రాశావు బ్రో...?!

అమ్మాయి అదృష్టవంతురాలు! నిన్ను పెళ్లి చేసుకుంటే అనవసరమైన వేదాంతం పీకుతావు. అవసరం లేని చోట వెటకారం కక్కుతావని అమ్మాయికి తెలిసిపోయింది బ్రో..!!

నువ్వూ అదృష్టవంతుడివే!! నీ నైజం తెలుసుకున్న అమ్మాయి పెళ్లికి ఒప్పుకుంటే నరకం చూస్తావు.

యు ఆర్ వెరీ లక్కీ ఐ సే!!!

'వెటకారమా సార్?!' అని నవ్వింది నీలాంబరి.

lovedoctorram@sakshi.com

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కట్‌చేయ్...దాచేయ్...

నన్నే వీడి ఎటో వెళ్లినావే
నిన్నే వీడి ఏటూ వెళ్లలేనే ॥2॥
నీరు లేనిదే ఏరు లేదులే
శోకం లేనిదే ప్రేమ లేదులే
నన్నే వీడి... నిన్నే వీడి
॥నన్నే వీడి॥

నువు లేని నింగిలో నాకింకా
ఏ ఇంద్రధనసులు లేవే
నువు లేని నేలలో నాకింకా
ఏ పచ్చదనము లేదే
నా ప్రాణ వాయువే నువ్వంటా
నా ఊపిరల్లె నిండావే
నా ప్రేమ దీపమే నువ్వంటా
వెలుగల్లె ఉండిపోవే

అరె ఏం చేశానే ఘోరం నేరం
మరి నీకు నాకు ఏంటీ దూరం
నువ్వంటే నాది ఇంకో రూపం
నీమీదే నాకు రాదే కోపం
॥నన్నే వీడి॥

నీ ప్రేమ జ్వాలలో నిలువెల్లా
నే కాలి బుడిదయ్యానే
నువు ఏమి చేసినా ఎదలోనా
నా ప్రేమ కాలిపోదే
ఒక గంట నువ్వు కాదంటే
ఒకరోజు వేచి ఉంటానే
ఒక జన్మ నువ్వు నను కాదంటే
పది జన్మలెత్తుతానే
నా ప్రాణానంతా గొంతే చేసి
నా ప్రేమే నీకు చెప్పేస్తున్నా
ఈ ప్రాణం గాల్లో కలిసేలోగా
నీ ప్రేమే నాకు చెప్పేస్తావా
॥నన్నే వీడి॥

చిత్రం : దేవ్
రచన : చంద్రబోస్
గానం : యస్పీ బాల సుబ్రహ్మణ్యం
సంగీతం : హ్యారిస్ జైరాజ్

కాసుకో సుడోకు

6	5		9	3			4	
		3		4		7		
			7	2	5		9	
	4			6			1	
		2	4		3	5		
	3			1			7	
	1		3	7	2			
		9		5		1		
	2			9	6		3	5

నిబంధనలు:
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

1	6	2	9	8	3	5	4	7
3	8	5	4	6	7	2	9	1
4	7	9	1	5	2	8	3	6
2	4	8	3	9	6	1	7	5
5	3	6	2	7	1	9	8	4
9	1	7	8	4	5	3	6	2
6	2	3	7	1	8	4	5	9
8	5	4	6	2	9	7	1	3
7	9	1	5	3	4	6	2	8


● గోపీ ఆచంట, హరీష్ శంకర్, రామ్ ఆచంట, బాపినీడు, నవీన్ ఎర్నేని, 'దిల్' రాజు, వరుణ్ తేజ్

కొత్త చాప్టర్ షురూ

సినిమాల ఎంపికలో వైవిధ్యానికి పెద్దపీట వేస్తుంటారు వరుణ్ తేజ్. విభిన్నమైన పాత్రలను ఎంపిక చేసుకుంటూ ప్రేక్షకులకు మరింత చేరువ అవుతున్నారు. వరుణ్ నటించనున్న తాజా చిత్రానికి 'వాల్మీకి' అనే పేరును ఖరారు చేశారు. హరీష్ శంకర్ దర్శకత్వంలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించనున్న ఈ సినిమా ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రామ్ బొబ్బ కెమెరా స్విచ్చాన్ చేయగా, నటి, వరుణ్ తేజ్ చెల్లెలు నిహారిక కొణిదెల క్లాప్ ఇచ్చారు. దర్శకులు వీవీ వినాయక్ తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ''నా తర్వాతి చిత్రానికి 'వాల్మీకి' అనే టైటిల్ ఖరారు చేశాం. కొత్త చాప్టర్ మొదలైంది'' అని ఈ సందర్భంగా వరుణ్ తేజ్ పేర్కొన్నారు. ''మా 'వాల్మీకి' చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని విశేషాలను త్వరలోనే తెలియజేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. డైరెక్టర్ సుకుమార్, నిర్మాత 'దిల్' రాజుతో పాటు పలువురు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా. కాగా, తమిళ హిట్ చిత్రం 'జిగర్తాండ' కి 'వాల్మీకి' తెలుగు రీమేక్ అనే సంగతి తెలిసిందే.


● వెంకీ అట్లూరి

ఆ భయం పోయింది

"దర్శకునిగా నా తొలి చిత్రం 'తొలిప్రేమ' విజయం సాధించిన తర్వాత నా రెండో చిత్రం 'మిస్టర్ మజ్ను' రిజల్ట్ ఎలా ఉంటుందా? అని భయం ఉండేది. ఇప్పుడు ఆ భయం పోయింది. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఇండస్ట్రీలో ఏ సినిమాకు ఆ సినిమానే. ఒక సినిమా హిట్ సాధించింది కదా అని రిలాక్స్ అయిపోలేం" అని దర్శకుడు వెంకీ అట్లూరి అన్నారు. అఖిల్, నిధీ అగర్వాల్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన 'మిస్టర్ మజ్ను' ఈ నెల 25న విడుదలైంది. ఈ సందర్భంగా వెంకీ అట్లూరి చెప్పిన విశేషాలు...

- నా తొలి సినిమా 'తొలిప్రేమ' కంప్లీట్ అవ్వడం, అదే టైమ్‌లో అఖిల్ రెండో చిత్రం 'హలో!' కూడా రిలీజ్ అవ్వడంతో 'మిస్టర్ మజ్ను' సినిమా సైట్స్‌పైకి వచ్చింది. 'ప్రేమ్‌నగర్' చిత్రంలోని ఏయన్నార్‌గారి పాత్ర ఈ సినిమాకు ఓ స్ఫూర్తి.
- నేను అనుకున్నదానికన్నా అఖిల్ 50 పర్సెంట్ ఎక్కువగానే చేశాడు. నిధీ అగర్వాల్ బాగా చేశారు. 'తొలిప్రేమ'కు తమన్ ఎంత కష్టపడ్డాడో 'మిస్టర్ మజ్ను' కి కూడా అంతే కష్టపడ్డాడు. నేను రైటర్ కాక ముందు నుంచే బాపీనీడు పరిచయం. ఈ సినిమా జర్నీలో ప్రసాద్‌గారితో మంచి స్నేహం ఏర్పడింది. శ్రీమణి మంచి పాటలు రాశారు.
- నిర్మాత 'దిల్' రాజుగారు సినిమాల విషయంలో మంచి జడ్జ్. ఆయన సలహాలను పాటిస్తాను. రాజుగారి మనవడు ఆరాన్ష్ ఈ సినిమాలోని కొండబాబు క్యారెక్టర్ చేశాడు. దాదాపు ఏడాదిన్నర వయసు ఉన్న ఆర్షాన్ రెండో టేక్ తీసుకోలేదు (నవ్వుతూ).
- ఈ సినిమాకు నాగార్జునగారు ఫస్ట్ ఆడియన్. కథ విన్నారు. ఆ తర్వాత సినిమా చూసి.. రిలాక్స్ అయిపోండి అన్నారు. రిజల్ట్ పట్ల టీమ్ హ్యాపీగానే ఉంది.
- 'తను ఎలా ఉండాలనుకుంటున్నాడో అలాంటి క్యారెక్టర్ విక్కీని స్క్రీన్‌పై చూపించానని' అఖిల్ అన్నారు.. అంటే ఆయన మాటల్లోనే అర్థం అవుతుంది ఇప్పుడు అలా లేనని. స్క్రీన్‌పై హీరో ఉన్నట్లు రియల్ లైఫ్‌లో ఉండలేం. అంత ధైర్యం నాకు లేదు.
- రివ్యూస్ చదివాను. కొంతమందికి నచ్చింది. కొంతమందికి నచ్చలేదు. ఈ సినిమాకు కామన్ ఆడియన్స్ నుంచి విమర్శలు రాలేదు. మౌత్ టాక్ పాజిటివ్‌గానే ఉంది. సినిమాలోని ఎమోషన్, కామెడీ సీన్స్‌ను బాగా ఏంజాయ్ చేస్తున్నారు.
- ఒక సినిమా కోసం టీమ్ అంతా ఎంతో కష్టపడతారు. తీరా రిలీజై థియేటర్స్‌లో మార్నింగ్ షో పడగానే ఇంటర్నెట్‌లో ఓ పైరసీ లింక్ ఉంటుంది. ఇది బాధాకరమైన విషయం. అందుకే పైరసీ ఎపిసోడ్‌ని సినిమాలో చూపించాం. సీరియస్‌గా డీల్ చేయకండా ఆడియన్స్‌కు చెప్పాలనుకున్నాం. అలాగే చేశాం.
- దర్శకులు మణిరత్నం, త్రివిక్రమ్ గార్లు నాకు స్ఫూర్తి. నటన నాకు కంఫర్ట్‌గా అనిపించలేదు. మళ్లీ యాక్టర్ అవ్వాలనుకోవడం లేదు. రైటింగ్‌లో నా ఇంట్రెస్ట్ ఉందని తెలుసుకున్నాను. ఒక రచయిత ఫైనల్ గోల్ దర్శకుడు కావడమే. ప్రస్తుతానికి 'మిస్టర్ మజ్ను' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాను. నెక్ట్స్ మూవీ ఇంకా ఫిక్స్ కాలేదు. రెండు మూడు కథలు ఉన్నాయి. త్వరలోనే అనౌన్స్ చేస్తాను.


యువత మనోభావాలకు అద్దం పట్టేలా ఉంది

– కె. రాఘవేంద్రరావు


● భాస్కర్ రాజు, రఘురాజు, ఉదయ్ కుమార్, రాఘవేంద్రరావు, ఈశ్వర్

ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా ఆర్. రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మించిన చిత్రం '4 లెటర్స్'. 'కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే' అనేది ఉపశీర్షిక. చిత్రీకరణ పూర్తయింది. ఈ నెల 30న ఆడియోను, వచ్చే నెల రెండో వారంలో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సినిమా టీజర్‌ను ప్రముఖ దర్శకులు కె. రాఘవేంద్రరావు విడుదల చేసి, మాట్లాడుతూ– ''ప్రవాస భారతీయుడైన ఉదయ్‌కుమార్‌గారు నిర్మించిన ఈ చిత్రం టీజర్ యువతరం మనోభావాలకు అద్దం పట్టేలా ఉంది. సత్యానంద్ శిష్యరికం కాబట్టి హీరోగా ఈశ్వర్ చక్కని ప్రతిభ కనబరిచాడు. ఈశ్వర్‌కు ఉజ్వలమైన భవిష్యత్ ఉంది. ఉదయ్‌కుమార్–రఘురాజ్‌లు ఈ చిత్రంతో మంచి విజయాన్ని అందుకోవాలి'' అని అన్నారు. ''రాఘవేంద్రరావుగారి చేతులమీదుగా మా సినిమా టీజర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. ఈశ్వర్ ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశారు'' అన్నారు నిర్మాతలు. ''రాఘవేంద్రరావుగారి చేతులమీదుగా మా సినిమా టీజర్ రిలీజ్ అవ్వడం శుభసూచికం. ప్రేమ, పెళ్లి విషయాల్లో నేటియువత ఆలోచనలు, అభిప్రాయాలు ఎలా ఉన్నాయి? వాస్తవాలు ఏంటి? అనే అంశాలను సినిమాలో చూపించాం'' అని రఘురాజ్ అన్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకు సంగీతం అందించారు.

పోలీస్, గ్యాంగ్‌స్టర్‌ల అంతర్యుద్ధం


● బండి సరోజ్‌కుమార్


సినిమా అంటే 24 శాఖల సమ్మేళనం. వాటిల్లో 11 శాఖలను నిర్వహించి అరుదైన ఫీట్ చేశారు బండి సరోజ్ కుమార్. 'సూర్యాస్తమయం' సినిమాకి ఆయన కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, ఎడిటింగ్, సంగీతం, ఫైట్లు, ప్రొడక్షన్ డిజైనర్, కెమెరా శాఖలతో పాటు ప్రధాన పాత్రలో నటించి, దర్శకత్వం వహించడం విశేషం. ఓజో మీడియా పతాకంపై రఘు పిల్లుట్ల, రవికుమార్ సుదర్శి నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి ద్వితీయార్ధంలో విడుదల కానుంది. ఈ సందర్భంగా బండి సరోజ్‌కుమార్ మాట్లాడుతూ ''ఒక పోలీస్‌కీ, గ్యాంగ్‌స్టర్‌కీ మధ్య జరిగే అంతర్యుద్ధమే ఈ సినిమాలో ప్రధాన కథాంశం. పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో నేను, గ్యాంగ్‌స్టర్‌గా త్రిశూల్ రుద్ర యాక్ట్ చేశాం. తమిళ నటుడు డేనియల్ బాలాజీ కీలక పాత్ర పోషించారు. హైదరాబాద్, వికారాబాద్, నల్గొండ, రామోజీ ఫిల్మ్‌సిటీ, కడప, కర్ణాటకల్లో చిత్రీకరణ జరిపాం. ఇటీవల విడుదల చేసిన 'ఉరిమే మేఘం స్నేహం, కురిసే వర్షం స్నేహం..' పాటకు చాలా మంచి స్పందన వస్తోంది. మా సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుంది. త్వరలోనే ట్రైలర్‌ని, ఫిబ్రవరిలో సినిమా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. త్రిశూల్ రుద్ర, హిమాన్సీ కాట్రగడ్డ, కావ్యా సురేశ్, డేనియల్ బాలాజీ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.

తాతామనవడు


● నాగచైతన్య, నాగార్జున

నాగార్జున, నాగచైతన్య నిజజీవితంలో తండ్రీ కొడుకులు. కానీ చూడ్డానికి మాత్రం అన్నదమ్ముల్లా ఉంటారని అక్కినేని అభిమానులు సరదాగా చెప్పుకుంటుంటారు. ఇప్పుడు నాగార్జున, నాగచైతన్య తాతామనవళ్లుగా నటించబోతున్నారు. రెండేళ్ల క్రితం కల్యాణ్ కృష్ణ దర్శకత్వంలో నాగార్జున హీరోగా 'సోగ్గాడే చిన్ని నాయనా' అనే సినిమా రూపొందిన విషయం తెలిసిందే. ఇందులో నాగార్జున చేసిన బంగార్రాజు క్యారెక్టర్ ఆడియన్స్‌ను బాగా మెప్పించింది. ఇప్పుడు సేమ్ కాంబినేషన్‌లోనే 'సోగ్గాడే చిన్ని నాయనా' చిత్రానికి సీక్వెల్ తెరకెక్కనుంది. అయితే ఇందులో నాగచైతన్య కూడా నటిస్తారు. బంగార్రాజు మనవడి పాత్రలో నాగచైతన్య కనిపిస్తారు. ఈ సినిమా షూటింగ్ వేసవిలో ఆరంభం కానుందని సమాచారం. ఇంతకుముందు 'మనం' సినిమాలో నాగార్జునకు నాన్న పాత్రలో నాగచైతన్య కనిపించారు. ఇప్పుడు ఈ చిత్రం కోసం మనవడిగా మారారు. ఈ సంగతి ఇలా ఉంచితే... 2002లో నాగార్జున హీరోగా వచ్చిన 'మన్మథుడు' చిత్రానికి కూడా స్వీకెల్ చేస్తున్నారట నాగార్జున. ఈ సినిమాకు నటుడు, 'చిలసౌ' ఫేమ్ రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తారు. మార్చిలో ఈ సినిమా షూటింగ్ పోర్చుగల్‌లో స్టార్ట్ అవుతుందని ప్రచారం జరుగుతోంది.

పరిగణిస్తున్నారట


● పరిణీతీ చోప్రా

హీరోయిన్‌ను ఫిక్స్ చేయకుండానే రాజమౌళి తాజా మల్టీస్టారర్ చిత్రం సెకండ్ షెడ్యూల్ కూడా స్టార్ట్ చేశారు. అయితే ఈ సినిమాలో హీరోయిన్‌ను కన్‌ఫార్మ్ చేశారన్నది తాజా సమాచారం. ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ మల్టీస్టారర్ చిత్రం 'ఆర్ఆర్ఆర్' (వర్కింగ్ టైటిల్). డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ఈ హీరోల సరసన యాక్ట్ చేస్తున్నారంటూ చాలా మంది పేర్లే వినిపించాయి. ఇప్పుడీ సినిమాలో ఓ హీరోయిన్‌గా బాలీవుడ్ భామ పరిణీతీ చోప్రాను పరిగణిస్తున్నట్టు సమాచారం. పరిణీతితో కథా చర్చలన్నీ పూర్తయ్యాయని, పారితోషికం విషయంలోనే డిస్కషన్స్ నడుస్తున్నట్లు టాక్. ఈ సినిమా కోసం ఎక్కువ రోజులు డేట్స్‌ను కేటాయించనున్నారట పరిణితి. ఈ చిత్రంలో మరో హీరోయిన్‌గా కీర్తీ సురేశ్, ముఖ్య పాత్రలో తమిళ దర్శకుడు సముద్రఖని నటించనున్నారు. ఈ ఏడాది చివరలోపు షూటింగ్ పూర్తి చేసుకోనున్న ఈ చిత్రం వచ్చే ఏడాదిలో రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి సంగీతం: కీరవాణి, కెమెరా: సెంథిల్.

నవ్వులు పంచే దొంగ


● సప్తగిరి

అతని పేరు గోవిందు. పేరుకి ఫన్నీ దొంగ అయినా అతనికో లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్య సాధన కోసం ఏం చేశాడనే కథతో రూపొందుతోన్న చిత్రం 'వజ్ర కవచధర గోవింద'. సప్తగిరి, వైభవీ జోషీ జంటగా అరుణ్ పవార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రమిది. శివ శివమ్ ఫిలిమ్స్ పతాకంపై నరేంద్ర యెడల, జీవీఎన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. అరుణ్ పవార్ మాట్లాడుతూ–''సప్తగిరితో నేను తెరకెక్కించిన 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. తాజాగా రూపొందిస్తున్న 'వజ్ర కవచధర గోవింద' సినిమా అంతకు మించి సక్సెస్ కావాలనే తపనతో కృషి చేస్తున్నాం. కడుపుబ్బా నవ్వించే అంశాలతో పాటు, మంచి యాక్షన్, ఎమోషన్, ఇతర వాణిజ్య అంశాలు మెండుగా ఉంటాయి. మా నిర్మాతలు కొత్త వారైనా ఎక్కడా కాంప్రమైజ్ కావడం లేదు'' అన్నారు. ''హిలేరియస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. 80 శాతం షూటింగ్ పూర్తయింది. మిగిలిన సన్నివేశాలను కర్ణాటకలోని ఒక గుడిలో తెరకెక్కిస్తాం'' అని నరేంద్ర యెడల, జీవీఎన్ రెడ్డి అన్నారు. ఈ చిత్రానికి కథ: జిటిఆర్ మహేంద్ర, సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: ప్రవీణ్ వనమాలి, ఎడిటింగ్: కిషోర్ మద్దాలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సలాన బాలగోపాలరావు.


● రిషీ కపూర్

త్వరగానే కోలుకుంటా

బాలీవుడ్ యాక్టర్ రిషీ కపూర్ అనారోగ్య సమస్యలతో అమెరికాలో వైద్య చికిత్స పొందుతున్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్నారని బాలీవుడ్‌లో వార్తలొచ్చినప్పటికీ కపూర్ ఫ్యామిలీ మాత్రం వాటిని కొట్టిపారేసింది. తన ఆరోగ్యానికి సంబంధించిన విషయాన్ని షేర్ చేసుకున్నారు రిషీ. ''ప్రస్తుతం చికిత్స జరుగుతోంది. త్వరలోనే కోలుకుంటాను. చికిత్స పూర్తి కాగానే ఇండియా వచ్చేస్తాను. ఎందుకంటే ఈ ప్రక్రియ చాలా ఎక్కువ సమయం తీసుకుంటుంది. చాలా ఓపిక కావాల్సి వస్తుంది. ప్రస్తుతానికి ఏ సినిమాను అంగీకరించదలచుకోలేదు. కొన్ని రోజులు బ్రేక్ తీసుకుందాం అనుకుంటున్నాను'' అన్నారు.


● నవాజుద్దీన్

బ్యాడ్ లక్

'పేట్టా' సినిమాతో తమిళ పరిశ్రమకు పరిచయమయ్యారు బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్దిఖీ. తన పాత్రకు మంచి అభినందనలు అందుకుంటున్నారాయన. తమిళ సూపర్ స్టార్ రజనీతో యాక్ట్ చేశారు. మరి కమల్‌తో ఎప్పుడు యాక్ట్ చేస్తారు అని ఇటీవల ఓ సందర్భంలో నవాజుద్దీన్‌ని అడగ్గా ఆసక్తికరమైన విషయం బయటపెట్టారు. ''నేను ఆల్రెడీ కమల్ హాసన్‌తో నటించాను. 'హే రామ్' సినిమాలో నాకు ఆ అవకాశం దొరికింది. కానీ, నా బ్యాడ్ లక్ ఆ సీన్స్ ఎడిటింగ్‌లో కట్ అయిపోయాయి. ఆ తర్వాత 'అభయ్' సినిమాకి హిందీ డైలాగ్ కోచ్‌గా పని చేశాను కూడా'' అని పేర్కొన్నారు నవాజుద్దీన్.


● నోలన్


జూలై సెంటిమెంట్

హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తదుపరి సినిమా ఏంటా? అని ప్రపంచవ్యాప్తంగా ఆయన అభిమానులు ఎదురుచూస్తున్నారు. అయితే నోలన్ ఎప్పటిలానే ఏం చేస్తున్నాడో, ఎవరితో చేస్తున్నాడో అన్న విషయం ఇంకా ప్రకటించలేదు. కానీ విడుదల తేదీని మాత్రం ప్రకటించేశారు. 2020 జూలై 17న నోలన్ కొత్త చిత్రం రాబోతోందని నిర్మాణ సంస్థ వార్నర్ బ్రదర్స్ కంపెనీ ప్రకటించింది. నోలన్ రూపొందించిన ఎక్కువ శాతం సినిమాలను ఈ నిర్మాణ సంస్థే నిర్మించింది. నోలన్ తన సినిమాలను జూన్– జూలై సీజన్‌లో రిలీజ్ చేయడానికి ఇష్టపడతారు. ఆ సెంటిమెంట్‌నే మళ్లీ రిపీట్ చేశారు. నోలన్ గత ఐదు చిత్రాల్లో 4 సినిమాలు జూలైలో రిలీజ్ కావడం విశేషం.


సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ సోమవారం
28-1-2019

పరిచయం బుగ్గన కవిత, ట్రావెలర్

ప్రతి అడుగు ఒక పర్యటనే



కళ్లు తెరిచి చూస్తే... భౌతిక రూపాలు కనిపిస్తాయి. మనసుతో చూస్తే... అచ్చమైన ఆర్ద్రత కళ్లకు కడుతుంది. మనోనేత్రంతో చూస్తే... స్వచ్ఛమైన జీవితాలు కనిపిస్తాయి. జీవితాలను చూడటం... జీవించడంలో అందాన్ని చూడటమే తన పర్యటనల ఉద్దేశం అంటారు కవిత బుగ్గన.



ఈ ఏడాది... భారతీయ నాట్య కళాకారిణి మృణాళినీ శారాబాయ్, ప్రముఖ ఉర్దూ కవి కైఫీ అజ్మీల శత జయంతి. దేశం ఇప్పటికే జాతిపిత మహాత్మాగాంధీ నూటయాభయ్యవ జయంతి ఉత్సవాలను జరుపుకుంటోంది. ఈ సందర్భంగా హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్.. 2019లో శుక్రవారం (జనవరి, 25) నాడు తన తొలి పుస్తకాన్ని ఆవిష్కరించారు కవిత బుగ్గన. 'వాకింగ్ ఇన్ క్లౌడ్స్: ఎ జర్నీ టు మౌంట్ కైలాస్ అండ్ లేక్ మానససరోవర్' అనే ఆ రచనను వెలువరించడానికి ముందు మూడు దశాబ్దాల ఆమె అధ్యయనం ఉంది. శ్రీలంక, నేపాల్, టిబెట్, లెబనాన్, రుమేనియా, ఇటలీ, ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా, కెనడా, స్పెయిన్, చైనా, జపాన్, కంబోడియా, మయన్మార్, థాయ్‌లాండ్, టాంజానియా దేశాల్లో పర్యటించారామె. ఆ పర్యటనల్లో మనిషి జీవితాన్ని చూశారామె. పరిస్థితులు జీవితాన్ని ఎన్ని మలుపులు తిప్పుతాయో కాంబోడియా పర్యటనలో తెలుసుకున్నారు.

రిషి వ్యాలీ స్కూల్ ఆమెకు అక్షరాలను, పాఠాలను చదవడంతోపాటు ప్రపంచాన్ని చదవడం కూడా నేర్పించింది. అన్నింటికంటే ముందు ప్రశ్నించడం నేర్పించింది. ఆ లక్షణమే ఆమెను మానసరోవర్ యాత్రలో రాక్షస్ తాల్ నీటిని తాగించింది. రాక్షస్ తాల్ విషపు నీటి మడుగు అనే మూఢనమ్మకాన్ని తుడిచేయడానికి తన వంతు ప్రయత్నం చేయించింది. పర్యటన అంటే... ప్రదేశాలను కళ్లతో చూడటం కాదు, పరిస్థితులను మనోనేత్రంతో చూడటం అంటూ.. తన అనుభవాలను, అనుభూతులను సాక్షితో పంచుకున్నారు కవిత.

''నేను ఎక్కడికి వెళ్లినా టూర్ ఆపరేటర్‌లు రూపొందించిన ఐటెనరీలో వెళ్లను. ఆ టూర్‌లు... మనకు కట్టడాలను చూపిస్తాయి, వస్త్ర దుకాణాలను చూపిస్తాయి, స్థానికంగా తయారయ్యే హ్యాండీక్రాఫ్ట్‌ను మన చేత కొనిపించడానికి ప్రయత్నిస్తుంటాయి. నేను చూడాలనుకునేది చరిత్రను తెలిపే గొప్ప నిర్మాణాలతోపాటు అక్కడి ప్రజల జీవితాన్ని కూడా. అందుకే వెళ్లిన ప్రతి చోట మొదట మార్కెట్‌కు వెళ్తాను. అక్కడి పండ్లు, కూరగాయలను చూస్తే ఆ నేలల్లో ఏం పండుతాయో తెలుస్తుంది. ఆహారపు అలవాట్లు అర్థమవుతాయి. వర్క్ ప్లేస్, వర్షిప్ ప్లేస్‌లు మనుషుల ఇష్టాలు, విశ్వాసాలను చెప్పేస్తాయి.

కైలాస విశ్వాసాలు

మానస సరోవర్, మౌంట్ కైలాస్ పర్యటన... హిందూ, బౌద్ధ, జైన, బాన్ మత విశ్వాసాలకు ప్రతీక. కైలాస్ పర్వతం మీదకు వెళ్లిన తర్వాత కొందరు తిరిగి రావడానికి ఇష్టపడరని తెలిసినప్పుడు ఆశ్చర్యం వేసింది. ప్రాణం పోయే వరకు అక్కడే ఉండాలనుకునే వాళ్లు కూడా ఉంటారు. బుద్ధ పూర్ణిమ రోజున టిబెట్ నలుమూలల నుంచి ప్రజలు, బౌద్ధ సన్యాసులు పెద్ద సంఖ్యలో కైలాస పర్వతానికి వచ్చి, బౌద్ధ శాక్యముని వర్ధంతి, సాగ దేవ జయంతిని కీర్తనలు, ప్రార్థనలతో దీక్షగా నిర్వహిస్తారు. కైలాస పర్వతాన్ని హిందువులు శివపార్వతుల క్షేత్రంగా భావిస్తారు. బౌద్ధులు చక్రసంవర, వజ్ర విరాహిలను కొలుస్తారు. మహాయాన బౌద్ధంలో వజ్రయానం అక్కడ ప్రాక్టీస్‌లో ఉంది. నా పర్యటన ఆద్యంతం చిన్న చిన్న గ్రామాల గుండా సాగింది. అక్కడ కరెంటు లేదు. ఆధునిక ఉపకరణాల్లేవు. స్థానిక గిరిజనులు ఏ మాత్రం సమతలంగా లేని ఎగుడుదిగుడు నేలలోనే వ్యవసాయం చేస్తారు. అనువైన పరిస్థితులు లేవని చింత వారిలో ఏ మాత్రం కనిపించదు. అటవీ ఉత్పత్తులను సేకరించి మైదాన ప్రదేశాలకు వెళ్లి అమ్ముకుంటారు. 'ప్రకృతి మనకు ఏమి ఇస్తుందో అంతే తీసుకోవాలి, అంతలోనే జీవితాన్ని చక్కదిద్దుకోవాల'నే ఫిలాసఫీ కనిపిస్తుంది. అంతే తప్ప తమ జీవిక కోసం ప్రకృతికి హాని కలిగించరు.

మన గూర్ఖాలు

కర్నాలి నది నేపాల్‌లో పొడవైన నది. మానసస రోవర్ ప్రదేశంలో మొదలైన ప్రవాహం మనదేశంలో గంగానదిలో కలుస్తుంది. మ్యూల్ గుర్రాలు ప్రశాంతంగా పచ్చిక బయళ్లలో మేస్తూ ఉంటాయి. స్థానికులు అడవి గేదెలు, మేకలను పెంచుకోవడం కనిపిస్తుంది. రాళ్లు పలకలుగా ఉంటాయి. బహిరంగ ప్రదేశాల్లో ఆ రాతి పలకలనే సిమెంట్ బెంచీలుగా అమరుస్తారు. స్కూలు పిల్లలు ఆ రాతి బెంచీల మీద కూర్చుని హోమ్‌వర్క్ చేసుకోవటం చూసినప్పుడు మనిషి పరిస్థితులకు అనుగుణంగా తనను తాను ఎలా మలుచుకుంటాడో కదా అనిపించింది. కర్నాలి నది నీళ్ల మరకతాల పచ్చదనాన్ని, నీలాల నీలివర్ణాన్ని కలుపుకుని వజ్రంలా మెరుస్తుంటాయి. నా ప్రయాణం 'హమ్లా' ప్రాంతంలో ఉన్న చిన్న చిన్న సెటిల్‌మెంట్‌ల మీదుగా సాగింది. అన్నీ బంకమట్టి, బండరాళ్లతో కట్టిన చిన్న చిన్న ఇళ్లు. పై కప్పు మీద గడ్డి పరుస్తారు. పర్వతాల నుంచి వచ్చే పెనుగాలుల నుంచి రక్షణ కోసం అలా కట్టుకుంటారు. ఓ సెటిల్‌మెంట్‌లో మమ్మల్ని (బృందంలో ఉన్న కజిన్ పల్లు, ప్రార్థన, జెఫ్, కేటీ) చూసి 'ఇండియా ఇండియా' అని అరిచారు పిల్లలు. ఒక వ్యక్తి 'ఇండియాలో ఎక్కడ' అని హిందీలో అడిగాడు. 'హైదరాబాద్' అని చెప్పాం. కానీ వీళ్లకు హైదరాబాద్ ఎలా తెలుస్తుంది అనుకున్నాను. ఆశ్చర్యంగా 'తెలుగా' అని అడిగాడతడు. నాకు నోట మాట రాలేదు. 'అవును' అనగానే అతడు తెలుగులో 'మీ పేరేంటి' అని అడిగాడు. నేను తేరుకుని 'మీకు తెలుగు ఎలా వచ్చు' అని అడిగితే... అప్పుడు... తాను విశాఖపట్నంలో గూర్ఖాగా పనిచేశానని. ఇక్కడి గ్రామాల వాళ్లు చాలా మంది ఉపాధి కోసం ఇండియాలో అనేక నగరాలకు వస్తుంటామని చెప్పాడతడు.

భిక్షతో ఆత్మశుద్ధి

థాయ్‌లాండ్‌లో బౌద్ధాశ్రమాన్ని చూడటంతో పాటు బౌద్ధ సన్యాసుల జీవనశైలిని అనుసరించాను. ఉదయమే లేచి వాళ్ల వెనుక గ్రామాల్లోకి భిక్షకు వెళ్లడం... మన ఆత్మను శుద్ధి చేస్తుంది. మనలోని అహాన్ని చంపేస్తుంది. అహాన్ని చంపేయడంలో బౌద్ధాన్ని మించిన మతం మరోటి ఉండదనే చెప్పాలి. శ్రీలంక, బర్మాతోపాటు దక్షిణాసియా దేశాల్లో తెరవాద బౌద్ధం విస్తృతంగా ఉంది. చైనా, జపాన్, ఉత్తర ఆసియా దేశాల బౌద్ధులు అనుసరించే మతం మహాయాన బౌద్ధం. టిబెట్‌లో బౌద్ధాన్ని దగ్గరగా చూడగలిగాను. తొలినాటి బౌద్ధం చెప్పని తాంత్రికత ఆచరణలో ఉందక్కడ. ఇక టిబెట్‌లో కుక్కలైతే... చూడగానే భయమేస్తుంది. సింహాలంత ఉంటాయి. మనుషుల్ని తినేస్తాయి కూడా. ఇక్కడ పరిమితికి మించి మైనింగ్ చేయడం వల్ల మట్టి వదులై తరచూ కొండ చరియలు విరిగిపడుతుంటాయి. అది గోల్డ్ మైనింగ్ అని చెప్పాడు మా గైడ్ చిరింగ్.

రాక్షసుల సరస్సు

మానసరోవర్‌తోపాటు రాక్షస్ తాల్ అనే మరో సరస్సు కూడా ఉంది. మానసరోవరం వలయాకారంగా ఉంటే, రాక్షస్‌తాల్ అర్ధ చంద్రాకారంలో ఉంది. వీటిని సూర్యచంద్ర సరస్సులు అని కూడా అంటారు. రాక్షస్ తాల్‌లో నీరు విషపూరితమని చెబుతారు. శివుని కోసం రావణుడు తపస్సు చేసింది ఈ సరస్సు తీరానే అని హిందువులు చెబుతారు. రావణుడి కారణంగానే అది విషపూరితమైందని, రాక్షస సరస్సుగా పేరు రావడానికి కారణం కూడా రావణుడు తపస్సు చేయడమేనని, ఆ నీటిని తాగితే చచ్చిపోతారని చెబుతారు. మానసరోవరం దేవతల సరస్సు కాబట్టి అందులో నీటిని తాగవచ్చు, ఆ నీటిలో మునిగితే పుణ్యం ప్రాప్తిస్తుందని విశ్వాసం. పుణ్యం ప్రాప్తించడం అనే నమ్మకం వల్ల ఎవరికీ నష్టం ఉండదు, కానీ ఒక సరస్సును విషపూరితమని ప్రచారం చేయడం ఏమిటి... అనిపించింది. అందుకే కప్పుతో రాక్షస్ తాల్ నీటిని ముంచుకుని తాగాను. నీరు చల్లగా, శుభ్రంగా ఉన్నాయి. అయితే కొద్దిగా ఉప్పగా ఉన్నాయి. తాగడానికి అనువుగా లేని నీరు అనే కారణంగా విషపూరితం అనీ, రాక్షసుల సరస్సు అని, రావణుడి కారణంగానే ఇలా జరిగిందనే అపోహలతో కథనాలను సృష్టించడం ఎందుకు అని కూడా అనిపించింది. నాతో ఉన్న పల్లు ఆ నీటిని ఎందుకు తాగావని కోప్పడింది. 'ఆ నీరు విషపూరితమనేది అపోహ మాత్రమే' అని నిరూపించడానికే అన్నాను. అంతే కాదు, ఆ సరస్సు తీరాన మెడిటేషన్ కూడా చేశాను''.

ఇంటర్వ్యూ: **వాకా మంజులారెడ్డి**
ఫొటోలు : **అనిల్ కుమార్**

తాత్విక జీవనం

నెల్లూరులో పుట్టి, అమెరికాలోని వాషింగ్టన్‌లో పెరిగి, రిషివ్యాలీ స్కూలుకు వచ్చి ఆధ్యాత్మిక తత్వాన్ని ఒంటబట్టించుకున్నారు కవిత బుగ్గన. ఎమ్మెస్సీ కంప్యూటర్స్, ఎకనమిక్స్‌లో ఎంఫిల్ ఇవ్వని సంతృప్తిని ప్రపంచాన్ని చదవటంలో పొందుతున్నారామె. భర్త హరి బిజినెస్‌మన్. పిల్లలు ప్రణవ్, రోహన్ యుఎస్‌లో చదువుకుంటున్నారు. ఆధ్యాత్మికత అంటే జీవితం నుంచి, సమాజం నుంచి వెళ్లిపోవడం కాదు... చేసే పనిలో కరుణను నింపుకోగలిగితే అది ఆధ్యాత్మిక జీవనమే నన్నారు.


రాక్షస్ తాల్ తీరాన ధ్యానంలో...

యుద్ధం నుంచి జీవితం

పర్యటనలన్నింటిలో జీవితం పెట్టే పరీక్షలను ఎదుర్కొని నిలబడిన కంబోడియా మహిళ నన్ను ముగ్ధురాలిని చేసింది. ఖ్మేర్ పాలనలో ప్రజాజీవనం అస్తవ్యస్తం అయింది. తినడానికి తిండి దొరకని పరిస్థితి, ఎప్పుడు దాడులు జరుగుతాయోననే భయానక వాతావరణం. సైనిక దాడిలో ఒక కుటుంబంలో యజమాని మరణించాడు. ఆ దాడిని ప్రత్యక్షంగా చూసిన అతడి భార్య పిచ్చిదైపోయింది. పదకొండేళ్ల కొడుకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎటో వెళ్లిపోయాడు. ఇక మిగిలింది ఐదేళ్ల అక్క, మూడేళ్ల చెల్లి. ఆ చెల్లిని బతికించుకోవడం ఆ అక్క బాధ్యత. మార్కెట్‌లో పారేసిన పండ్లు, కూరగాయలను ఏరి పాడైపోయిన వరకు తీసేసి బాగున్న భాగాన్ని తిని కడుపు నింపుకోసాగారు. కొన్నాళ్లకు సైనికులు ఆ మార్కెట్‌ను కాల్చేశారు. మూడేళ్ల చెల్లి ఆచూకీ లేదు. ఇక మిగిలింది తానొక్కటే. మార్కెట్ ఆధారం కూడా లేకుండా తనను తాను బతికించుకోవాలి. యుద్ధంలో అనాథలైన పిల్లలకు ఆశ్రయమిస్తున్న బౌద్ధారామానికి వెళ్లిందా ఐదేళ్ల అమ్మాయి. ఆడపిల్లలకు అనుమతి లేదన్నారు. తన కళ్ల ముందే మగపిల్లలను తీసుకెళ్లడం కనిపిస్తోంది. మగపిల్లాడిలా దుస్తులు మార్చుకుని ఆశ్రమంలో చేరిపోయింది. పదమూడేళ్ల వరకు ఇబ్బంది రాలేదు. అమ్మాయి అనే వాస్తవం బయటపడే వయసది. అప్పుడు ఆశ్రమ పెద్ద పిలిచి జీవితాన్ని ఎలా నిర్మించుకోవాలనుకుంటున్నావు– అని అడిగారామెని. 'చాలా భాషలు నేర్చుకోవాలనుంది' అని చెప్పింది. ఒక సన్యాసి ఆమెకి ఒక బంగారు పళ్లెం ఇచ్చి, వృద్ధ దంపతుల సంరక్షణలో ఉంచారు. అలా పెరిగిన మహిళ ఇప్పుడు ఆంగ్‌కోర్‌వాట్‌లో ఒక కేఫ్, స్టోర్ నడుపుతోంది. సోషల్ వర్క్ చేస్తోంది. బయోగ్రఫీ రాస్తే 'ప్లేట్ ఆఫ్ గోల్డ్' అని పేరు పెడతానని చెప్పిందామె. జీవితాన్ని నిలబెట్టుకోవాలనే ఆకాంక్ష ఉంటే ఎన్ని ప్రతికూలతలు ఉన్నా జీవితాన్ని అందంగా తీర్చిదిద్దుకోవచ్చు అని అర్థమైంది.

- కవిత బుగ్గన,
ఫిక్షన్, ట్రావెల్ రైటర్


రాతి పలకల మీద హోమ్‌వర్క్ చేసుకుంటున్న నేపాల్ పిల్లలు

పీడియాట్రిక్ కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

ఇంత పసిదానికి ఈ గురక ఏమిటి?



మా పాపకు ఐదున్నర నెలలు. తాను పుట్టిన రెండో వారం నుంచి గురక వస్తోంది. ఇటీవల ఆ శబ్దం మరీ ఎక్కువయ్యింది. తరచూ వాంతులు కూడా చేసుకుంటోంది. డాక్టర్‌కు చూపిస్తే తగ్గిపోతుందన్నారు. పాప సమస్య ఏమిటి? మాకు ఆందోళనగా ఉంది. సలహా ఇవ్వండి.

– నాగమణి, కోదాడ

మీరు చెబుతున్న లక్షణాలను బట్టి చూస్తుంటే మీ పాపకు 'లారింగో మలేసియా' సమస్య ఉన్నట్లు అనిపిస్తోంది. అంటే... శ్వాస తీసుకునే నాళంలోని ఒక భాగం బలహీనంగా ఉండటం. కొద్దిమంది పిల్లల్లో శ్వాస తీసుకునేటప్పుడు శబ్దం రావడం... మరీ ముఖ్యంగా ఆ శబ్దం... చిన్నారులు మెలకువగా ఉన్నప్పుడు, ఇతరత్రా ఇన్ఫెక్షన్లు (దగ్గు, జలుబు వంటివి) ఉన్నప్పుడు, ఆహారం తీసుకుంటున్నప్పుడు ఎక్కువ కావచ్చు. ఇలా ఎక్కువగా శబ్దం రావడాన్ని వైద్యపరిభాషలో స్ట్రయిడర్ అంటారు. పిల్లల్లో 60 శాతం మందిలో స్ట్రయిడర్ రావడానికి కారణం లారింగో మలేసియానే. ఇటువంటి పిల్లల్లో శ్వాస సంబంధమైన సమస్యలు పుట్టిన రెండో వారం నుంచే మొదలై... ఆర్నెల్ల వయసప్పటికి తీవ్రతరం కావచ్చు. చాలామందిలో ఇది క్రమేణా తగ్గుముఖం పట్టడం, పరిస్థితుల్లో మెరుగుదల కనిపించడం జరుగుతుంది. ఈ మెరుగుదల ఎప్పుడైనా మొదలుకావచ్చు. అయితే కొద్దిమంది పిల్లల్లో లారింగోమలేసియాతో పాటు దగ్గు, వాంతులు కనిపించే లారింగో ఫ్యారింజియల్ రిఫ్లక్స్ అనే కండిషన్‌తో సమస్య తన తీవ్రతను చూపించవచ్చు. ఇలాంటి పిల్లల్లో కొన్నిసార్లు నీలంగా మారడం (సైనోసిస్), దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలను ఎదుర్కోవడం వంటి సమస్యలు కనిపించవచ్చు. కొన్నిసార్లు మరికొన్ని ఇతర రకాల సమస్యలైన... సబ్‌గ్లాటిక్ స్టెనోసిస్, లారింజియల్ వెబ్స్, ట్రాకియో బ్రాంకియో మలేసియా... మొదలైన కండిషన్‌లలోనూ మీరు చెప్పిన లక్షణాలే కనిపిస్తుంటాయి. పై అంశాలను బట్టి విశ్లేషిస్తే మీ పాపకు లారింగో మలేసియాతో పాటు గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ కండిషన్ ఉన్నట్లు అనిపిస్తోంది. దీన్ని నిర్ధారణ చేయడానికి ఫ్లెక్సిబుల్ లారింగోస్కోపీ, బ్రాంకోస్కోపీ, రేడియోగ్రాఫిక్ స్టడీస్ చేయించాల్సి ఉంటుంది. ఈ సమస్యకు చికిత్స అన్నది పిల్లల్లో కనిపించే లక్షణాల తీవ్రత, శ్వాసతీసుకునే సమయంలో ఇబ్బందిని ఏ మేరకు భరిస్తున్నారు, పిల్లల్లో ఉన్న ఇతరత్రా వైద్య సమస్యలు, ఇన్వెస్టిగేషన్ డేటా, అన్నిటి కంటే ముఖ్యంగా ఈ జబ్బు కారణంగా కుటుంబంపై పడుతున్న మానసిక ఒత్తిడి తాలూకు తీవ్రత వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ పాపకు ఉన్నది చాలా తీవ్రమైన లారింగోమలేసియా అని నిర్ధారణ అయితే శస్త్రచికిత్స ద్వారా దీన్ని సరిచేయవచ్చు. కాబట్టి... మీరు మీ పిల్లల వైద్యుడిని, పీడియాట్రిక్ ఈఎన్‌టీ నిపుణుడిని సంప్రదించి, ఫాలోఅప్‌లో ఉండండి.

ఇంత చిన్న బాబుకూ తలనొప్పా?



మా బాబుకు ఎనిమిదేళ్లు. ఇటీవల వాడు తరచూ తలనొప్పి అంటూ ఏడుస్తున్నాడు. కొన్నిసార్లు వాంతులు కూడా అవుతున్నాయి. కొన్నిసార్లు కాసేపు నిశ్శబ్దంగా పడుకోబెడితే తలనొప్పి తగ్గుతోంది. కానీ చాలాసార్లు మాత్ర వేస్తేగానీ తగ్గడం లేదు. కొన్ని సందర్భాల్లో కడుపునొప్పి, కళ్లు తిరుగుతున్నాయని కూడా చెబుతున్నాడు. మా బాబు సమస్య ఏమిటి? వాడికి తగ్గేదెలా?

– ఆర్. సాయిలక్ష్మి, సామర్లకోట

మీరు చెబుతున్న దాన్ని బట్టి మీ బాబుకు తరచూ తలనొప్పి ఒకింత తీవ్రంగానే ఉన్నట్లు అనిపిస్తోంది. చిన్న పిల్లలతో పాటు టీనేజర్లలో తలనొప్పి రావడం మామూలే. పిల్లల్లో పదేపదే తీవ్రమైన తలనొప్పులకు కారణాలు అనేకం. వాటిలో ముఖ్యమైన వాటిల్లో మైగ్రేన్ ఒకటి. ఇక దీనితో పాటు టెన్షన్ హెడేక్, అటనామిక్ డిస్ట్రబెన్సెస్ వల్ల కూడా తలనొప్పులు రావచ్చు. అలాగే కొన్నిసార్లు కొన్ని సెకండరీ కారణాల వల్ల అంటే... ఇతరత్రా అవయవాల్లో సమస్యల వల్ల... (ఉదాహరణకు సైనసైటిస్, కంటికి సంబంధించిన సమస్యలు లేదా మెదడుకు సంబంధించిన రుగ్మతలు ఉన్నప్పుడు) కూడా తలనొప్పి రావచ్చు.

ఇక మీ బాబు విషయానికి వస్తే అది మైగ్రేన్ అని చెప్పవచ్చు. మైగ్రేన్ జబ్బు తరచూ ఒక మాదిరి నుంచి తీవ్రమైన తలనొప్పితో వస్తుంటుంది. ఇది ఒక చోట కేంద్రీకృతమైనట్లుగా ఉండవచ్చు. కొన్నిసార్లు వికారం, వాంతులు, కాంతిని చూడటాన్ని, శబ్దాలు వినడాన్ని ఇష్టపడకపోవడం, కొన్నిసందర్భాల్లో ఏదో అవయవం బలహీనంగా ఉన్నట్లు అనిపించడం, తూలిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఐదు నుంచి పదిహేనేళ్ల పిల్లల్లో 10 శాతం మందికి ఏదో ఒక రూపంలో మైగ్రేన్ కనిపిస్తుంది. తలనొప్పి వచ్చే పిల్లలందరికీ అన్ని పరీక్షలూ అవసరం లేకపోయినప్పటికీ తీవ్రత ఎక్కువగా ఉండటం లేదా దానితో పాటు నరాలకు సంబంధించిన లక్షణాలు (అసోసియేటెడ్ న్యూరలాజికల్ సింప్టమ్స్) ఉన్న కొద్దిమందిలో మాత్రం కొన్ని ఇమేజింగ్ పరీక్షలు అవసరమవుతాయి.

ఇక చికిత్స విషయానికి వస్తే... తలనొప్పి కనిపించిన సందర్భం (అక్యూట్ ఫేజ్)లో ఎన్ఎస్ఏఐడీ గ్రూపు మందులతో తప్పకుండా ఉపశమనం లభిస్తుంది. ఇక దీర్ఘకాలికంగా ఈ సమస్య ఉన్న పిల్లలకు అది రాకుండా నివారించడానికి కొన్ని మందులు... ఉదాహరణకు ఎమిట్రిప్టిలిన్, ప్రాప్రొనలాల్ వంటివి అనేకం ఇప్పుడు వాడుతున్నారు. ఇవి కొన్ని నెలల పాటు వాడటం వల్ల లక్షణాలు మళ్లీ కనిపించకపోవడం లేదా చాలారోజుల పాటు కనిపించకుండా ఉండటం జరుగుతుంది. ఇలాంటి పిల్లలకు బిహేవియర్ థెరపీతో నొప్పి తీవ్రత తగ్గి, మంచి మెరుగుదల కనిపిస్తుంది.

ఇక మైగ్రేన్‌ను ప్రేరేపించే ట్రిగ్గర్స్... అంటే ఏదైనా పూట ఆహారం తీసుకోకుండా ఉండటం, నీళ్లు తక్కువగా తాగడం, నిద్రలేమి, కెఫిన్ ఉన్న పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వంటి వాటికి దూరంగా ఉండటం చాలా ముఖ్యం. దీనితో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, క్రమబద్ధంగా ఒకేవేళకు ఆహారం తీసుకోవడం, కంటి నిండా నిద్రపోవడం వంటివి చేసేవారిలో నొప్పి తీవ్రత తక్కువ. పైన పేర్కొన్న సూచనలు పాటిస్తూ మీరు ఒకసారి మీ పిల్లల వైద్యనిపుణుడిని సంప్రదించండి.

పిల్లి కరిచింది... సలహా ఇవ్వండి



మా బాబుకి ఐదేళ్లు. వాడు ఆడుకుంటూ, ఆడుకుంటూ పిల్లి దగ్గరికి వెళ్లినప్పుడు అది కరిచింది. అది పెంపుడు పిల్లి కాదు. డాక్టర్ గారి దగ్గరికి తీసుకెళ్తే పూర్తి వ్యాక్సిన్ వేయించాలని చెప్పారు. మావాడి విషయంలో ఆందోళనగా ఉంది. దయచేసి మాకు సరైన సలహా ఇవ్వండి.

– ఆర్. సునీత, నరసన్నపేట

జంతువుల వల్ల మనుషులకు వచ్చే జబ్బులను, జంతువులు కరవటం వల్ల వచ్చే జబ్బులను జూనోటిక్ వ్యాధులు అంటారు. ప్రమాదకరమైన జూనోటిక్ వ్యాధులలో రేబిస్ ఒకటి. అందరూ అనుకుంటున్నట్లు రేబిస్ కేవలం కుక్కల ద్వారానే కాక– పిల్లులు, నక్కలు, గబ్బిలాలు, కోతులు, అరుదుగా ఎలుకల వల్ల కూడా కలుగుతుంది. అన్ని జంతువులలో రేబిస్ ఉండకపోవచ్చు. అయితే స్ట్రే యానిమల్స్ కరిచినప్పుడు– దాని ద్వారా రేబిస్ సంక్రమిస్తుందో లేదో అని నిర్ధారణకు అయ్యేవరకు వాటికి రేబిస్ ఉన్నట్లుగానే పరిగణించి, జంతువు కాటుకు గురైన వారికి చికిత్స చేయాలి. ఒక వేళ కరిచిన జంతువు పదిరోజులలోపు చనిపోయినా లేదా అది రేబిస్ ఉన్న జంతువు అని నిర్ధారణ అయినా పూర్తి ట్రీట్‌మెంట్ ఎంతైనా అవసరం.

జంతువుల వల్ల అయిన గాయాన్ని మూడు కేటగిరీలుగా విభజించడం జరుగుతుంది. గాయం 2, 3 కేటగిరీలకు చెందినదైతే వైద్యం తప్పనిసరిగా చేయించవలసి ఉంటుంది. వ్యాక్సిన్ కూడా తీసుకోవడం చాలా ముఖ్యం. అదే విధంగా కేటగిరీని బట్టి 3 నుంచి 5 సార్లు యాంటీరేబిస్ వ్యాక్సిన్ ఇవ్వటం కూడా జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో జంతువులు విపరీతంగా కరిచినప్పుడు వ్యాక్సిన్‌తో పాటు యాంటీ రేబిస్ ఇమ్యునో గ్లోబ్యులిన్ ఇంజెక్షన్ కూడా ఇవ్వాలి. కరిచిన జంతువుకు రేబిస్ లేకపోయినా ఇది తప్పనిసరి. మామూలుగా మన పరిసరాలలో తిరిగే జంతువులు గీరటం లేదా కరవటం జరిగినప్పుడు మొదటి పదిరోజుల్లో ఆ జంతువుకి ఎటువంటి హాని జరగకపోతే మొదటి మూడు డోసులతో వ్యాక్సిన్‌ను నిలిపివేయవచ్చు.



డా. రమేశ్‌బాబు దాసరి
సీనియర్ పీడియాట్రీషియన్,
రోహన్ హాస్పిటల్స్,
విజయనగర్ కాలనీ,
హైదరాబాద్

పరి పరిశోధన

నీటి శుద్ధికి బ్యాక్టీరియా...



వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి. ముల్లును ముల్లుతోనే తీయాలి. ఈ మాటలు చాలాసార్లు మనం వినే ఉంటాం. అయితే నీటిని శుద్ధి చేసేందుకు బ్యాక్టీరియాలను ఉపయోగించవచ్చునన్న ఆలోచన మాత్రం వాషింగ్టన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చేసి చూపారు. బ్యాక్టీరియా కారణంగా నీరు కలుషితమవుతుందిగానీ.. శుద్ధి ఎలా జరుగుతుందని ఆలోచిస్తున్నారా? చాలా సింపుల్ అంటున్నారు సింగమనేని శ్రీకాంత్. మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసరైన ఈయన తన విద్యార్థులతో కలిసి బ్యాక్టీరియాతో నిర్మితమైన ఓ ఫిల్టర్‌ను తయారు చేశారు. ఈ ఫిల్టర్‌లో గ్రాఫీన్ ఆక్సైడ్, బ్యాక్టీరియల్ నానో సెల్యులోజ్ ఉంటాయి. నీటి శుద్ధీకరణకు వాడే సాధారణ ఫిల్టర్లలో బ్యాక్టీరియా చేరడం వల్ల కొద్దోగొప్పో దుర్వాసన వేస్తూంటాయన్నది మనకు అనుభవమైన విషయం. కానీ కొత్త ఫిల్టర్‌లో మాత్రం ఈ సమస్య ఉండదు. శ్రీకాంత్ గతంలోనూ ఇలాంటి ఫిల్టర్లను బంగారు నానోకణాల సాయంతో చేసినప్పటికీ చౌకైన ప్రత్యామ్నాయం కోసం జరిగిన ప్రయత్నాల్లో గ్రాఫీన్ ఆక్సైడ్, బ్యాక్టీరియా ఫిల్టర్ సిద్ధమైంది. గ్రాఫీన్ ఆక్సైడ్ కారణంగా ఫిల్టర్ సూర్యరశ్మితో వేడెక్కుతుందని, అది చుట్టూ ఉన్న నీటిలోకి ప్రవేశించడం ద్వారా నీటిలోని ఇతర బ్యాక్టీరియాను శుద్ధి చేస్తుందని శ్రీకాంత్ అంటున్నారు.

ఉయ్యాల ఊగితే.. మా..ంఛి నిద్ర!



రాత్రిళ్లు నిద్ర సరిగ్గా పట్టడం లేదా? ఈ మధ్య కాలంలో జ్ఞాపకశక్తి కూడా తగ్గిపోతున్నట్లు అనిపిస్తోందా? అయితే ఒక పనిచేయండి. ఇంట్లో ఓ ఉయ్యాల వేయించుకోండి. ఎంచక్కా దానిపైనే ఊగుతూ నిద్రపోండి. మీ సమస్యలు ఉపశమించే అవకాశం ఉంది. అదెలా అని ఆశ్చర్యపోవద్దు. స్విట్జర్లాండ్, జెనీవా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు జరిపిన రెండు వేర్వేరు అధ్యయనాలు ఇదే విషయాన్ని చెబుతున్నాయి. ఉయ్యాలపై ఊగడం నిద్రను ఎక్కువ చేయడం మాత్రమే కాకుండా జ్ఞాపకశక్తిని కూడా పెంపొందిస్తుందట. మామూలు పరిస్థితుల్లో కూడా బాగా నిద్రపోయే వారు కొంతమందిని ఎన్నుకుని తాము ప్రయోగాలు చేశామని.. ఉయ్యాల ఊపులకు వీళ్లు చాలా తొందరగా నిద్రలోకి జారుకోవడమే కాకుండా.. ఎక్కువ సమయం దీర్ఘనిద్రలో ఉన్నట్లు తెలిసిందని ఈ ప్రయోగాల్లో పాల్గొన్న శాస్త్రవేత్త లారెన్స్ బేయర్ తెలిపారు. అలాగే కొన్ని పదాలను గుర్తుపెట్టుకుని మళ్లీ చెప్పాల్సిందిగా కోరే పరీక్షలోనూ వీరు విజయం సాధించారని తద్వారా వారి జ్ఞాపకశక్తి మెరుగైనట్లు తాము ఒక అంచనాకు వచ్చామని వివరించారు. స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తలు ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లోనూ దాదాపు ఇదే ఫలితాలు రావడం విశేషం. ఎలుకలను నిద్ర పుచ్చేందుకు వీరు కదిలే పంజరాలను ఉపయోగించారు.

సౌరశక్తిని ఒడిసిపట్టేందుకు కొత్త టెక్నిక్...



సౌరశక్తి ఏటికేడాదీ చౌక అవుతున్నప్పటికీ అది ఇప్పటికే సామాన్యుడి చేతికి అందేస్థాయిలో లేదన్నది నిర్వివాద అంశం. ఈ పరిస్థితి త్వరలో మారనుందని అంటున్నారు ద సిటీ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ శాస్త్రవేత్తలు. సౌరశక్తిని మరింత ఎక్కువగా ఒడిసిపడుతూనే అందుకయ్యే ఖర్చును గణనీయంగా తగ్గించేందుకు తాము నానోటెక్నాలజీ ఆధారంగా వినూత్న పదార్థాలను సిద్ధం చేశామని యాండ్రూ లెవీన్ అనే శాస్త్రవేత్త తెలిపారు. సింగ్లెట్ ఫిషన్ అనే ఓ భౌతికశాస్త్ర ప్రక్రియ ద్వారా ఈ పదార్థాలు ఎలక్ట్రాన్లు ఎక్కువ సమయంపాటు మనుగడలో ఉండేలా చేస్తాయని లెవీన్ చెప్పారు. దీనివల్ల సూర్యుడి కిరణాల్లోని శక్తిని కనీసం 44 శాతం వరకూ విద్యుత్తుగా మార్చుకోవచ్చు. ఇప్పటివరకూ ఈ పరిమితి 33 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. అంతేకాకుండా.. ఈ పదార్థాలు తమంతట తామే ఒక ప్రత్యేకమైన పద్ధతిలో అమరిపోతాయని దీనివల్ల సూర్యరశ్మిలోని ఫొటాన్ల శక్తిని పరిసరాల్లోని పదార్థాలతో పంచుకునే వీలేర్పడుతుందని ఫలితంగా అధిక విద్యుదుత్పత్తి సాధ్యమని లెవీన్ వివరించారు.

సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com

సోమవారం 28-1-2019

ఉద్యోగాలు

భోపాల్-ఎయిమ్స్‌లో 119 ఖాళీలు

భోపాల్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. 119 ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:**
  1. ప్రొఫెసర్- 41
  2. అడిషనల్ ప్రొఫెసర్- 28
  3. అసోసియేట్ ప్రొఫెసర్- 50
- **అర్హత:** పోస్టును బట్టి సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్/ఎంసీహెచ్/డీఎం ఉత్తీర్ణతతో పాటు టీచింగ్ లేదా రీసెర్చ్ విభాగంలో అనుభవం ఉండాలి.
- **వయసు:** అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు గరిష్టంగా 50 ఏళ్లు, అడిషనల్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులకు గరిష్టంగా 58 ఏళ్లు ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు మినహాయింపు లేదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2000; ఎస్సీ, ఎస్టీలకు రూ.500.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 6, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.aiimsbhopal.edu.in

భిలాయ్ స్టీల్ ప్లాంట్‌లో 149 ఖాళీలు

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) ఆధ్వర్యంలోని భిలాయ్ స్టీల్ ప్లాంట్‌లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 149 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఫైర్ ఇంజనీర్-3, ఆపరేటర్ కమ్ టెక్నీషియన్ (ట్రైనీ)-116, జూనియర్ స్టాఫ్ నర్స్ (ట్రైనీ)-8, ఫార్మసిస్ట్ (ట్రైనీ)-5, జూనియర్ మెడికల్ టెక్నాలజిస్ట్ (ట్రైనీ)-17.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ ఫైర్ ఇంజనీరింగ్, మెట్రిక్యులేషన్, డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్, ఐటీఐ, బీఎస్సీ, డిగ్రీ ఇన్ ఫార్మసీ ఉత్తీర్ణతతో పాటు నిబంధనల ప్రకారం దేహదారుఢ్యం కూడా ఉండాలి.
- **వయసు:** 18–28 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** పోస్టులను బట్టి రాత పరీక్ష/ట్రేడ్ టెస్ట్/స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 9, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.sail.co.in

ఏపీపీఎస్సీ-78 ఏఎస్ఓ ఖాళీలు



ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్ సబ్ సర్వీస్‌లో 78 అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) పోస్టుల భర్తీకి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.

- **జోన్‌ల వారీ ఖాళీలు:** జోన్-1: 14, జోన్-2: 27, జోన్-3: 15, జోన్-4: 22.
- **అర్హత:** స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్టుగా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత. స్టాటిస్టిక్స్ ఒక పేపర్‌గా చదివి, మ్యాథమెటిక్స్/ ఎకనామిక్స్/ కామర్స్/ కంప్యూటర్ సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులైన వారూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** జులై 1, 2019 నాటికి 18–42 ఏళ్ల మధ్య ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, పీహెచ్‌సీలకు పదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తు ఫీజు:** అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామ్ ఫీజు రూ.80.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్ ఆధారంగా.
- **స్క్రీనింగ్ టెస్ట్ తేదీ:** మే 19, 2019.
- **మెయిన్ ఎగ్జామ్ తేదీ:** 2019 ఆగస్టులో.
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 12, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 5, 2019.

ఏపీపీఎస్సీ-6 అసిస్టెంట్ డైరెక్టర్ ఖాళీలు

- **అర్హత:** మ్యాథమెటిక్స్/ప్యూర్ మ్యాథమెటిక్స్/స్టాటిస్టిక్స్/ఎకనామిక్స్ (స్టాటిస్టిక్స్‌తో పాటు)/ప్యూర్ ఎకనామిక్స్/అప్లయిడ్ ఎకనామిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ మ్యాథమెటిక్స్/ఎకనామెట్రిక్స్/కంప్యూటర్ సైన్స్‌లో పీజీ ఉత్తీర్ణత.
- **వయసు:** జులై 1, 2019 నాటికి 18–42 ఏళ్ల మధ్య ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, పీహెచ్‌సీలకు పదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తు ఫీజు:** అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామ్ ఫీజు రూ.120.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్ ఆధారంగా.
- **మెయిన్ ఎగ్జామ్ తేదీలు:** 2019, ఏప్రిల్ 3, 4 తేదీల్లో.
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** జనవరి 30, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 20, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://psc.ap.gov.in



సెట్ అవ్వండిలా..

ఎంసెట్

రాష్ట్రంలో ఎక్కువ మంది ఇంటర్ విద్యార్థులు రాసే పరీక్ష ఎంసెట్. ఇంటర్ తర్వాత ఇంజనీరింగ్, అగ్రికల్చర్, బీఎస్సీ అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫార్మసీ, ఫార్మా-డి తదితర కోర్సుల్లో ప్రవేశాలను ఎంసెట్ ద్వారా చేపడతారు. ఎంసెట్ 2019 పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో ఉదయం, సాయంత్రం షిఫ్టుల్లో నిర్వహించనున్నారు.



ఎంసెట్ (ఇంజనీరింగ్)

ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు రాయాల్సిన పరీక్ష ఇది. అర్హత.. ఇంటర్మీడియట్ ఎంపీసీ. ఎంసెట్(ఇంజనీరింగ్) ప్రశ్నపత్రంలో మ్యాథమెటిక్స్ నుంచి 80, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు ఉంటాయి. మూడు గంటల సమయం అందుబాటులో ఉంటుంది. ఇందులో సాధించిన ర్యాంకు ఆధారంగా.. బీటెక్, బీటెక్(డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ), బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్), బీఫార్మసీ తదితర కోర్సుల్లో చేరొచ్చు. తుది ర్యాంకుల రూపకల్పనలో ఎంసెట్ స్కోర్‌కు 75 శాతం వెయిటేజీ, ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ ఇస్తారు.

ఎంసెట్ (అగ్రికల్చర్)

అగ్రికల్చర్ బీఎస్సీ, బీఎస్సీ హార్టికల్చర్, బీఎస్సీ ఫారెస్ట్రీ, బీఫార్మసీ తదితర కోర్సుల్లో ప్రవేశానికి రాయాల్సిన పరీక్ష ఇది. బైపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత అర్హతతో దీనికి హాజరుకావొచ్చు. పరీక్షలో ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 40 చొప్పున ప్రశ్నలు; బయాలజీ (బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు ఉంటాయి.

ఈసెట్

పాలిటెక్నిక్, బీఎస్సీ(మ్యాథ్స్) పూర్తయ్యాక.. లేటరల్ ఎంట్రీ విధానంలో నేరుగా బీటెక్, బీఈ, ఫార్మసీ కోర్సుల్లో సెకండ్ ఇయర్‌లో చేరేందుకు రాయాల్సిన పరీక్ష ఈసెట్. డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఫార్మసీ/బీఎస్సీ(మ్యాథ్స్) ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం

ఈసెట్ మొత్తం 200 మార్కులకు జరుగుతుంది. డిప్లొమా,ఫార్మసీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ ఉత్తీర్ణులకు వేర్వేరుగా ఉంటుంది. డిప్లొమా ఉత్తీర్ణులకు నాలుగు విభాగాల్లో ప్రశ్నలు ఉంటాయి. అవి.. మ్యాథమెటిక్స్-50 ప్రశ్నలు; ఫిజిక్స్-25 ప్రశ్నలు; కెమిస్ట్రీ-25 ప్రశ్నలు; ఇంజనీరింగ్ పేపర్ (అభ్యర్థి ఎంపిక చేసుకునే పేపర్)-100 ప్రశ్నలు. ఫార్మసీ ఉత్తీర్ణులకు ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యుటికల్ కెమిస్ట్రీ, ఫార్మకోగ్నసీ, ఫార్మకాలజీ విభాగాల్లో 50 ప్రశ్నలు చొప్పున మొత్తం 200 ప్రశ్నలు. బీఎస్సీ మ్యాథమెటిక్స్ ఉత్తీర్ణులకు మ్యాథమెటిక్స్ నుంచి 100 ప్రశ్నలు; అనలిటికల్ ఎబిలిటీ, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ నుంచి 50 ప్రశ్నలు చొప్పున ఉంటాయి. **పరీక్ష వ్యవధి:** మూడు గంటలు.

పీఈసెట్

ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పీఈసెట్) ద్వారా రెండేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ) లేదా రెండేళ్ల డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్(డీపీఈడీ) కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఫిజికల్ ఎడ్యుకేషన్ అనుబంధ కళాశాలల్లో చేరేందుకు పీఈసెట్ రాయాల్సి ఉంటుంది. బీపీఈడీ కోర్సుకు ఏదైనా మూడేళ్ల డిగ్రీ/తత్సమాన విద్య; డీపీఈడీ కోర్సులో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ /తత్సమాన విద్యలో ఉత్తీర్ణులై ఉండాలి.



ఎంపిక

బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో చేరేందుకు రాత పరీక్షలు ఉండవు. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(400 మార్కులు), స్కిల్ టెస్ట్ ఇన్ గేమ్(100 మార్కులు) ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో వంద మీటర్ల పరుగు పందెం; షాట్‌పుట్, 800 మీటర్ల పరుగు పందెం నిర్వహిస్తారు. వీటితోపాటు అభ్యర్థులు తమ ఆసక్తి మేరకు హైజంప్ లేదా లాంగ్‌జంప్‌లలో ఏదో ఒక ఈవెంట్‌లో ప్రతిభ చూపాలి. వంద మార్కులకు నిర్వహించే స్కిల్ టెస్ట్ ఇన్ గేమ్‌లో పదకొండు రకాల గేమ్స్‌లో ఏదో ఒకదాన్ని ఎంచుకొని అందులో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. ఈ రెండు భాగాల్లో ప్రతిభ ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేస్తారు.

ఐసెట్

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో చేరేందుకు రాయాల్సిన పరీక్ష.. ఏపీ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఐసెట్). ఈ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఎంబీఏ కోర్సుకు ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సరిపోతుంది. కానీ ఎంసీఏ కోర్సుకు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఇంటర్మీడియెట్ స్థాయిలో మ్యాథమెటిక్స్‌ను ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ఫైనల్ ఇయర్ విద్యార్థులు అర్హులే. ఐసెట్ పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. ఈ పరీక్షలో.. అనలిటికల్ ఎబిలిటీ, మ్యాథమెటికల్ ఎబిలిటీల నుంచి 75 ప్రశ్నలు చొప్పున, కమ్యూనికేషన్ ఎబిలిటీ నుంచి 50 ప్రశ్నలు.. మొత్తం 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. అభ్యర్థుల్లో విశ్లేషణ నైపుణ్యం, గణిత సామర్థ్యం పరీక్షించేలా ప్రశ్న పత్రం ఉంటుంది. ఇంగ్లిష్ గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్, వొక్యాబులరీపైనా ప్రశ్నలు ఉంటాయి.

లాసెట్

రాష్ట్ర స్థాయి న్యాయ కళాశాలల్లో చేరడానికి వీలు కల్పించే పరీక్ష.. లాసెట్(లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్). మూడేళ్ల బీఎల్/ఎల్ఎల్‌బీ కోర్సు, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ/బీఎల్ కోర్సుల్లో లాసెట్ ర్యాంక్ ద్వారా ప్రవేశం పొందొచ్చు. అదేవిధంగా ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన అభ్యర్థులు పీజీ చేయడానికి పీజీ లాసెట్ నిర్వహిస్తారు. లాసెట్ ద్వారా ఇంటర్ అర్హతతో ఐదేళ్ల లా కోర్సుకు, డిగ్రీ అర్హతతో మూడేళ్ల లా కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: ఐదేళ్ల లా కోర్సుకు 45 శాతం మార్కులతో ఇంటర్మీడియట్(10+2 విధానంలో) (ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 40 శాతం మార్కులు సరిపోతాయి).. మూడేళ్ల లా కోర్సుకు ఏదైనా డిగ్రీని(10+2 +3 విధానం) 45 శాతం మార్కులతో పూర్తి చేయాలి.

- ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన వారు పీజీ లాసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం

గంటన్నర వ్యవధిలో జరిగే పరీక్షలో మొత్తం 120 ప్రశ్నలుంటాయి. ఒక్కోదానికి ఒక్కో మార్కు. మూడు విభాగాలుండే ప్రశ్నపత్రంలో పార్ట్-ఎలో జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీపై 30 ప్రశ్నలు.. పార్ట్-బిలో కరెంట్ అఫైర్స్‌పై 30 ప్రశ్నలు.. పార్ట్-సిలో ఆప్టిట్యూడ్ ఫర్ ది స్టడీ ఆఫ్ లాపై 60 ప్రశ్నలుంటాయి. పీజీ లాసెట్‌ను 120 ప్రశ్నలతో నిర్వహిస్తారు. ఇందులో పూర్తిగా లా సబ్జెక్టుల నుంచే ప్రశ్నలు అడుగుతారు.

పీజీఈసెట్

ఇంజనీరింగ్‌లో పీజీ కోర్సుల్లో చేరడానికి పీజీఈసెట్ రాయాల్సి ఉంటుంది. ఈ పరీక్షను గేట్‌కు ప్రత్యామ్నాయ పరీక్షగా పరిగణించవచ్చు. ఎంటెక్, ఎంఈ, ఎంఫార్మసీ, ఎంఆర్క్, తదితర పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి పీజీఈసెట్(పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) నిర్వహిస్తారు. సంబంధిత బ్రాంచ్‌లో 50 శాతం మార్కులతో బీటెక్, బీఈ, బీఫార్మసీ, బీఆర్క్ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్షలను ఆన్‌లైన్‌లో మూడు రోజుల్లో నిర్వహించనున్నారు.

పరీక్ష విధానం

అభ్యర్థులు అర్హతల మేరకు సంబంధించిన స్పెషలైజేషన్ పరీక్షకు హాజరు కావాలి. ఇది 120 మార్కులకు రెండు గంటల వ్యవధిలో పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షలో సాధించిన ర్యాంకు ఆధారంగా పీజీ ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. పీజీ ఇంజనీరింగ్ సీట్ల భర్తీ క్రమంలో జాతీయ స్థాయిలో నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్), గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్(జీప్యాట్) ఉత్తీర్ణులకు మొదట ప్రాధాన్యం ఇస్తారు. తర్వాత మిగిలిన సీట్లను పీజీఈసెట్ ర్యాంకు ద్వారా భర్తీ చేస్తారు.

ఎడ్‌సెట్

ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలనుకునే అభ్యర్థులు చేరుతున్న కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఈడీ). బీఈడీలో చేరేందుకు ఎడ్‌సెట్ రాయాల్సి ఉంటుంది.

అర్హతలు

- **మ్యాథమెటిక్స్ మెథడాలజీ:** మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా బీఏ/బీఎస్సీ/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు, ఇంటర్మీడియెట్ స్థాయిలో మ్యాథమెటిక్స్ చదివిన బీసీఏ ఉత్తీర్ణులు.
- **ఫిజికల్ సైన్సెస్:** ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా అల్లైడ్ మెటీరియల్ సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా బీఎస్సీ/బీటెక్/బీఈ ఉత్తీర్ణులు/ఇంటర్మీడియెట్‌లో ఫిజిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివిన బీసీఏ ఉత్తీర్ణులు.
- **బయలాజికల్ సైన్సెస్:** బోటనీ, జువాలజీ లేదా అనుబంధ లైఫ్ సైన్స్ సబ్జెక్ట్‌లు గ్రూప్ సబ్జెక్ట్‌లుగా బీఎస్సీ/బీఎస్సీ(హోంసైన్స్) ఉత్తీర్ణత. ఇంటర్మీడియెట్‌లో బయలాజికల్ సైన్స్ చదివిన బీసీఏ ఉత్తీర్ణులు.
- **సోషల్ స్టడీస్:** బీఏ/ బీకాం/ బీబీఎం/బీబీఏ/బీసీఏ ఉత్తీర్ణులు.
- **ఇంగ్లిష్:** బీఏ స్పెషల్ ఇంగ్లిష్/బీఏ లిటరేచర్/ఎంఏ ఇంగ్లిష్ ఉత్తీర్ణులు.

ఆయా కోర్సుల చివరి సంవత్సరం అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎడ్‌సెట్ తీరు ఇలా

ఎడ్‌సెట్ మూడు పార్ట్‌లు(పార్ట్-ఎ, పార్ట్-బి, పార్ట్-సి)గా ఉంటుంది.

ఇందులో పార్ట్-ఎ(జనరల్ ఇంగ్లిష్ 25 ప్రశ్నలు -25 మార్కులు); పార్ట్-బి(జనరల్ నాలెడ్జ్ 15 ప్రశ్నలు-15 మార్కులు; టీచింగ్ ఆప్టిట్యూడ్ 10 ప్రశ్నలు-10 మార్కులు)లు ఎడ్‌సెట్ అభ్యర్థులందరూ రాయాల్సిన విభాగాలు.

- పార్ట్-సిలో అభ్యర్థులు తమ ఆప్షనల్ సబ్జెక్ట్‌కు అనుగుణంగా పేపర్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం పార్ట్-సిలోని అయిదు సబ్జెక్ట్ పేపర్స్‌లో ఏదో ఒకదాన్ని అభ్యర్థి ఎంచుకోవాల్సి ఉంటుంది. పార్ట్- సి 100 మార్కులకు జరుగుతుంది. అవి..
- **మ్యాథమెటిక్స్:** 100 ప్రశ్నలు(100 మార్కులు).
- **ఫిజికల్ సైన్సెస్:** 100 ప్రశ్నలు. ఇందులో ఫిజిక్స్ నుంచి 50; కెమిస్ట్రీ నుంచి 50 ప్రశ్నలుంటాయి. మార్కులు- 100.
- **బయలాజికల్ సైన్సెస్:** 100 ప్రశ్నలు. ఇందులో బోటనీ నుంచి 50; జువాలజీ నుంచి 50 ప్రశ్నలు చొప్పున ఉంటాయి. మార్కులు-100.
- **సోషల్ స్టడీస్:** 100 ప్రశ్నలు. ఇందులో జాగ్రఫీ నుంచి 35; హిస్టరీ నుంచి 30; సివిక్స్ నుంచి 15; ఎకనామిక్స్ నుంచి 20 ప్రశ్నలుంటాయి. మొత్తం మార్కులు - 100.
- **ఇంగ్లిష్:** 100 ప్రశ్నలు- 100 మార్కులు.

గమనిక: ఆయా సెట్‌ల పూర్తిస్థాయి నోటిఫికేషన్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. పరీక్ష విధానం, అర్హతలు తదితర వివరాలన్నీ గతేడాది ఆధారంగా తీసుకున్నవి.

సెట్‌ల తేదీలు

సెట్	పరీక్ష తేదీ	నిర్వహించే యూనివర్సిటీ
ఎంసెట్ (ఇంజనీరింగ్)	ఏప్రిల్ 20–22	జేఎన్‌టీయూ, కాకినాడ
ఎంసెట్(అగ్రికల్చర్)	ఏప్రిల్24	జేఎన్‌టీయూ,కాకినాడ
ఈసెట్	ఏప్రిల్ 19	జేఎన్‌టీయూ, అనంతపురం
పీఈసెట్	మే 8–15	నాగార్జున యూనివర్సిటీ
ఐసెట్	ఏప్రిల్ 26	ఎస్వీ యూనివర్సిటీ
లాసెట్	మే 6	ఎస్కే యూనివర్సిటీ
పీజీఈసెట్	మే 1–4	ఆంధ్ర యూనివర్సిటీ
ఎడ్‌సెట్	మే 6	ఎస్వీ యూనివర్సిటీ

కెరీర్ గైడెన్స్

ఆర్కిటెక్చర్ @ నాటా



నాటా.. నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీఆర్క్) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష. 2019-2020 విద్యా సంవత్సరానికి సంబంధించి నాటా-2019కు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ సంవత్సరం నుంచి ది కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్(సీఓఏ).. నాటాను ఏటా రెండుసార్లు నిర్వహించనుంది. నాటాలో పొందే స్కోర్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపుపొందిన ఆర్కిటెక్చర్ కళాశాలల్లో బీఆర్క్ కోర్సులో చేరొచ్చు.

- **కోర్సు పేరు:** బీఆర్క్(బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్).
- **కోర్సు వ్యవధి:** ఐదేళ్లు

అర్హతలు

- మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో కనీసం 50 శాతం మార్కులతో, మొత్తంగా కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణత సాధించాలి. ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయోపరిమితి:** 2019, జులై 31 నాటికి 17 ఏళ్లు నిండాలి.

పరీక్ష విధానం

- నాటా మొత్తం 200 మార్కులకు ఉంటుంది. ఇందులో 2 భాగాలు, పార్ట్-ఎ, పార్ట్-బి ఉంటాయి.
- పార్ట్-ఎకు 120 మార్కులు కేటాయించారు. ఈ విభాగాన్ని 60 నిమిషాల్లో పూర్తిచేయాలి. ఇందులో మ్యాథమెటిక్స్ నుంచి 20 ప్రశ్నలు, జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి 40 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు. అంటే.. మ్యాథ్స్ 40 మార్కులకు, జనరల్ అప్టిట్యూడ్‌కు 80 మార్కులకు ఉంటుంది. ఇది ఆన్‌లైన్ పరీక్ష.
- పార్ట్-బి డ్రాయింగ్ పరీక్ష. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఏ4 సైజు పేపర్‌పై రెండు ప్రశ్నలకు డ్రాయింగ్స్ గీయాలి. ఒక్కో ప్రశ్నకు 40 మార్కుల చొప్పున మొత్తం 80 మార్కులకు డ్రాయింగ్ పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులు రెండు సెక్షన్లలో విడివిడిగా కనీసం 25 శాతం మార్కులు సాధిస్తే అర్హత లభిస్తుంది.
- జూలై 7న నిర్వహించే పరీక్ష కూడా ఇదే విధానంలో ఉంటుంది. మెరుగైన ర్యాంకు కోసం లేదా మొదటిసారి పరీక్ష రాయలేని వారు రెండోసారి జరిగే పరీక్షకు హాజరుకావచ్చు.

సిలబస్

- పార్ట్-ఏలోని మ్యాథ్స్, జనరల్ ఆప్టిట్యూడ్ విభాగాల్లో... ప్యూర్ మ్యాథ్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఆల్జీబ్రా, లాగారిథమ్స్, మ్యాట్రిసెస్, ట్రిగనామెట్రీ, కోఆర్డినేట్ జామెట్రీ, 3 డైమెన్షనల్ కోఆర్డినేట్ జామెట్రీ, థియరీ ఆఫ్ క్యాలికులస్, అప్లికేషన్ ఆఫ్ క్యాలికులస్, పర్ముటేషన్ అండ్ కాంబినేషన్, స్టాటిస్టిక్స్ అండ్ ప్రాబబిలిటీ అధ్యాయాల నుంచి మ్యాథ్స్ సెక్షన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. జనరల్ ఆప్టిట్యూడ్ సెక్షన్‌లో.. మ్యాథమెటికల్ రీజనింగ్, సెట్స్ రిలేషన్స్, ఆర్కిటెక్చర్ అండ్ నిర్మాణాలకు సంబంధించిన ఆబ్జెక్ట్స్, డ్రాయింగ్‌కు సంబంధిన ప్రశ్నలు అడుగుతారు. వీటితోపాటు జాతీయ, అంతర్జాతీయ ఆర్కిటెక్ట్స్, ప్రఖ్యాత ఆర్కిటెక్చరల్ క్రియేషన్స్ మీద జనరల్ అవేర్‌నెస్ ప్రశ్నలు ఉంటాయి. అనలిటికల్ రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ(విజువల్, న్యూమరికల్,వెర్బల్)పై కూడా ప్రశ్నలు ఎదురవుతాయి.
- పార్ట్ బీ డ్రాయింగ్ టెస్ట్‌లో అభ్యర్థిలోని సృజనాత్మకతను పరీక్షించే విధంగా డ్రాయింగ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో నిర్ణీత ఆకారం లేదా వస్తువును అభ్యర్థి ముందుంచి.. దాని ఆధారంగా ఊహాశక్తితో డ్రాయింగ్ వేయమంటారు. ఒక వస్తువును పలు కోణాల్లో చిత్రించమనడం, నిర్ణీత ఆకారానికి ఆకట్టుకునే రంగులు వేయడం వంటి ప్రశ్నలు ఎదురవుతాయి. నిజ జీవితంలో ఎదురైన సంఘటనలను ఊహించుకుంటూ.. వాటికి సంబంధించిన పెన్సిల్ చిత్రాలను గీయమంటారు. ఈ పేపర్ వాల్యూయేషన్‌ను ఒకరి కంటే ఎక్కువ ఎగ్జామినర్లు చేస్తారు. వారు ఇచ్చిన మార్కులను సగటు చేసి తుది మార్కులు కేటాయిస్తారు. అంతిమంగా ఈ సెక్షన్ అభ్యర్థి డ్రాయింగ్ నైపుణ్యాలు, ఊహ శక్తి, పరిశీలన దృక్పథాన్ని అంచనా వేసే పరీక్ష.

పరీక్ష కేంద్రాలు

తెలంగాణలో హైదరాబాద్, వరంగల్; ఏపీలో గుంటూరు, కాకినాడ, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్‌లో దరఖాస్తు తేదీలు:**
  మొదటిసారి పరీక్షకు దరఖాస్తులు: 2019, జనవరి 24 నుంచి మార్చి 11 వరకు.
  రెండోసారి పరీక్షకు దరఖాస్తులు: 2019, జనవరి 24 నుంచి జూన్ 12 వరకు.
- **మొదటి పరీక్ష తేదీ:** 2019, ఏప్రిల్ 14.
- **ఫలితాలు విడుదల:** 2019, మే 3.
- **రెండోసారి జరిగే పరీక్ష తేదీ:** 2019, జూలై 7.
- **ఫలితాలు విడుదల:** 2019 జూలై 21.
- **పరీక్ష ఫీజు:** రూ.1800(ఎస్సీ/ఎస్టీలకు రూ.1500)
- **వెబ్‌సైట్:** http://www.nata.in

ఆర్కిటెక్టుల్లు ఏం చేస్తారు?

- ఎత్తైన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం.. పొడవైన వంతెన బోగిబీల్.. మలేషియాలోని ఆకాశహర్మ్యాలు పెట్రోనాస్ ట్విన్ టవర్స్.. దుబాయ్‌లోని జేడబ్ల్యూ మారియట్ మార్క్విస్.. ఆధునిక ఎయిర్‌పోర్టు టర్మినల్స్.. అందమైన స్టేడియాల నిర్మాణం.. ఇలా ఒకటేమిటి ఎన్నో అద్భుతమైన కట్టడాలు, నిర్మాణాలు, వంతెనలు, టవర్స్‌కు ఆద్యులు ఆర్కిటెక్చర్ ఇంజనీర్లు. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లు, విశాలమైన హోటల్స్, భారీ ఆసుపత్రుల డిజైన్, నిర్మాణంలో ఆర్కిటెక్చర్లు ప్రధాన పోషిస్తారు. సుందరమైన డిజైన్లతో వెలుస్తున్న కట్టడాలు, నిర్మాణాల వెనక సివిల్ ఇంజనీర్లతో పాటు ప్రధాన పాత్ర ఆర్కిటెక్టుదే. ఇటీవల కాలంలో సృజనాత్మక ఆర్కిటెక్టులకు డిమాండ్ కనిపిస్తుంది.
- క్లయింట్లకు నచ్చిన విధంగా కట్టడాలను ప్లాన్ గీయడం, అందరూ మెచ్చే రూపమివ్వడం ఆర్కిటెక్చర్ ఇంజనీర్ల ప్రధాన విధి. నిర్మాణ ప్లాన్ రూపొందించడం.. నిర్మాణం ప్రారంభించడం కోసం సంబంధిత శాఖల అనుమతులు.. సివిల్ ఇంజనీర్లు, సర్వేయర్లు తదితర నిపుణుల బృందంతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది.
- ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్ ఔత్సాహికులకు సృజనాత్మకత, పరిశీలన జ్ఞానం, విశ్లేషణ నైపుణ్యాలు, మ్యాథమెటికల్ ఎబిలిటీ, డ్రాయింగ్ స్కిల్స్ ఉండాలి. ఈ రంగంలో వస్తున్న మార్పులను నిరంతరం అందిపుచ్చుకునే నేర్పు సొంతం చేసుకోవాలి.

ఉన్నత విద్య

బీఆర్క్ కోర్సు పూర్తయ్యాక ఆసక్తి ఉంటే.. అనేక ఉన్నత విద్యావకాశాలు సొంతం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఉన్నత విద్య పరంగా పీజీ స్థాయిలో ఎంఆర్క్ కోర్సులో చేరొచ్చు. పీజీలో అర్బన్ డిజైనింగ్, రీజనల్ ప్లానింగ్ వంటి అనేక స్పెషలైజేషన్లు అందుబాటులు ఉన్నాయి. పీజీ తర్వాత ఆసక్తి ఉంటే.. పీహెచ్‌డీ సైతం చేయొచ్చు.

ఉపాధి మార్గాలు

బీఆర్క్ పూర్తిచేసిన వారికి ఇటీవల కాలంలో ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ కోర్సు పూర్తిచేసుకున్న అభ్యర్థులు ప్రైవేటు రంగంతోపాటు ప్రభుత్వ రంగంలోనూ జాబ్స్ సొంతం చేసుకోవచ్చు. టౌన్ ప్లానింగ్, మౌలిక వసతుల సముదాయాలు, రియల్ ఎస్టేట్ వెంచర్స్ వంటి వాటిల్లో అవకాశాలను పొందొచ్చు. ఆర్కిటెక్చర్ డిజైన్ సంస్థలు, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్ సేవల కంపెనీలు, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, అర్బన్ డవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ వంటి వాటిల్లో అవకాశాలు పొందొచ్చు. దాంతోపాటు ప్రైవేట్ రంగంలోని నిర్మాణ సంస్థల్లోనూ అవకాశాలు లభిస్తాయి. సొంతంగా ఆర్కిటెక్చర్ కన్సల్టెంట్‌గా కూడా ఉపాధి పొందొచ్చు. ఏదైనా సంస్థలో కొంత కాలం పనిచేసి అనుభవం సొంతం చేసుకున్నాక.. సొంతంగా కన్సల్టెంట్‌లుగా కెరీర్ ప్రారంభించొచ్చు.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
28-1-2019



జొకోవిచ్ సెవెన్ స్టార్

ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ వశం



తనకు ఎంతో అచ్చొచ్చిన వేదికపై ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ విశ్వరూపం ప్రదర్శించాడు. హోరాహోరీ పోరు ఆశించి వచ్చిన ప్రేక్షకులకు తన అద్వితీయ ఆటతీరుతో కనువిందు చేశాడు. తుది సమరాన్ని ఏకపక్షం చేసేశాడు. గతంలో ఎవరికీ సాధ్యంకాని రీతిలో ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను ఏడోసారి సొంతం చేసుకొని చరిత్ర పుటల్లోకి చేరాడు. కెరీర్‌లో 18వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకోవాలని ఆశించిన రాఫెల్ నాదల్ సెర్బియా స్టార్ దెబ్బకు కుదేలయ్యాడు.

- ఈ టోర్నీని అత్యధికసార్లు నెగ్గిన ప్లేయర్‌గా రికార్డు
- ఏకపక్ష ఫైనల్లో నాదల్‌పై ఘనవిజయం
- రూ. 20 కోట్ల 87 లక్షల ప్రైజ్‌మనీ సొంతం

నేను ఆడిన గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో ఇదే అత్యుత్తమం. నాదల్‌పై నేను కనబరిచిన అత్యుత్తమ ప్రదర్శన కూడా ఇదే. ఏడాది క్రితం మోచేతికి శస్త్ర చికిత్స జరిగింది. ఆ తర్వాత టాప్-20లో చోటు కోల్పోయాను. మళ్లీ కెరీర్‌పై దృష్టి సారించి గతేడాది వరుసగా వింబుల్డన్, యూఎస్ ఓపెన్ గెలిచి ఫామ్‌లోకి వచ్చాను. ఇది వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కావడంతో నా అనుభూతిని మాటల్లో వర్ణించలేకపోతున్నాను.
- జొకోవిచ్

మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్స్‌లో తన అజేయ రికార్డును సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ కొనసాగించాడు. గతంలో ఆరుసార్లు ఫైనల్‌కు చేరి ఆరుసార్లూ (2008, 2011, 2012, 2013, 2015, 2016) విజేతగా నిలిచిన జొకోవిచ్ ఏడోసారి అదే ఫలితాన్ని పునరావృతం చేశాడు. ఆదివారం రాడ్ లేవర్ ఎరీనాలో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ జొకోవిచ్ 6-3, 6-2, 6-3తో రెండో సీడ్ రాఫెల్ నాదల్ (స్పెయిన్)పై విజయం సాధించాడు. మ్యాచ్‌లోని ఏదశలోనూ 31 ఏళ్ల జొకోవిచ్ జోరు ముందు 32 ఏళ్ల నాదల్ ఎదురు నిలువలేకపోయాడు. 2012లో చివరిసారి వీరిద్దరి మధ్య జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ 5 గంటల 53 నిమిషాలు కొనసాగగా... ఈసారి మాత్రం 2 గంటల 4 నిమిషాల్లోనే ముగిసింది. విజేత జొకోవిచ్‌కు 41 లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 20 కోట్ల 87 లక్షలు)... రన్నరప్ నాదల్‌కు 20 లక్షల 50 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 10 కోట్ల 43 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. నాదల్‌ను ఏమాత్రం తక్కువ అంచనా వేయకుండా బరిలోకి దిగిన జొకోవిచ్ తొలి గేమ్ నుంచే తన వ్యూహాన్ని అమలులో పెట్టాడు. కచ్చితమైన సర్వీస్‌లు చేసిన అతను రెండో గేమ్‌లోనే నాదల్ సర్వీస్‌ను బ్రేక్ చేసి ఆ తర్వాత తన సర్వీస్‌ను కాపాడుకొని 3-0తో ఆధిక్యంలోకి వెళ్లాడు. జొకోవిచ్ గేమ్ ప్లాన్‌పై అవగాహన వచ్చేలోపే నాదల్ తొలి సెట్‌ను కోల్పోయాడు. రెండో సెట్‌లోనూ జొకోవిచ్ జోరు కొనసాగగా... నాదల్ ప్రేక్షకుడిలా మారిపోయాడు. మూడో సెట్‌లోనూ నాదల్ తేరుకోవాలని చూసినా జొకోవిచ్ జోరు ముందు చేతులెత్తేశాడు.

జొకోవిచ్		నాదల్
8	ఏస్‌లు	3
0	డబుల్ ఫాల్ట్‌లు	2
5/8	బ్రేక్ పాయింట్లు	0/1
16/18	నెట్ పాయింట్లు	7/14
34	విన్నర్స్	21
9	అనవసర తప్పిదాలు	28
89	మొత్తం పాయింట్లు	53

పురుషుల డబుల్స్ విభాగంలో ఐదో సీడ్ నికొలస్ మహుట్-పియరీ హ్యూస్ హెర్బర్ట్ (ఫ్రాన్స్) ద్వయం విజేతగా నిలిచింది. ఫైనల్లో మహుట్-హెర్బర్ట్ జోడీ 6-4, 7-6 (7/2)తో 12వ సీడ్ హెన్రీ కొంటినెన్ (ఫిన్‌లాండ్)-జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) జంటపై విజయం సాధించింది. ఈ విజయంతో మహుట్-హెర్బర్ట్ ద్వయం డబుల్స్‌లో కెరీర్ గ్రాండ్‌స్లామ్ ఘనతను (మొత్తం నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్-ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్) పూర్తి చేసుకున్న ఎనిమిదో జోడీగా గుర్తింపు పొందింది.



73 జొకోవిచ్ సాధించిన మొత్తం అంతర్జాతీయ సింగిల్స్ టైటిల్స్. గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో జొకోవిచ్, నాదల్ ముఖాముఖి రికార్డు 4-4

68 ఆస్ట్రేలియన్ ఓపెన్ చరిత్రలో జొకోవిచ్ మొత్తం 76 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో 68 మ్యాచ్‌ల్లో గెలిచి, ఎనిమిదింటిలో మాత్రమే ఓడిపోయాడు.

28 కెరీర్‌లో నాదల్‌పై జొకోవిచ్ సాధించిన విజయాలు. నాదల్‌తో 53 సార్లు తలపడిన జొకోవిచ్ 28 సార్లు గెలిచి, 25 సార్లు ఓడిపోయాడు.

3 పురుషుల సింగిల్స్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుల జాబితాలో పీట్‌సంప్రాస్ (అమెరికా-14)ను వెనక్కి నెట్టి జొకోవిచ్ (15) మూడో స్థానానికి ఎగబాకాడు. ఫెడరర్ (20), రాఫెల్ నాదల్ (17) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

క్వీన్ సైనా

- ఇండోనేసియా మాస్టర్స్ టైటిల్ నెగ్గిన భారత షట్లర్
- ఫైనల్లో గాయంతో తప్పుకున్న కరోలినా మారిన్



జకార్తా: ఇండోనేసియా గడ్డపై భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ అనుబంధం కొనసాగుతోంది. గతంలో ఇక్కడ పలు చిరస్మరణీయ విజయాలు సాధించిన సైనా... ఇప్పుడు మరో మేజర్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. అర్ధాంతరంగా ముగిసిన ఫైనల్లో విజేతగా నిలిచి ఇండోసియా మాస్టర్స్ వరల్డ్ సూపర్-500 టోర్నీలో సైనా విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన తుదిపోరులో ఆమె ప్రత్యర్థి కరోలినా మారిన్ (స్పెయిన్) తొలి గేమ్‌లోనే కాలి గాయంతో తప్పుకుంది. ఆ సమయంలో సైనా 4-10తో వెనుకబడి ఉంది. విజేత సైనాకు 26, 250 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 18 లక్షల 61 వేలు) లభించింది. 2018లో ఇదే టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచిన సైనా... ఇప్పుడు విజయం అందుకుంది. గత రెండేళ్లలో సైనాకు ఇదే తొలి బీడబ్ల్యూఎఫ్ టైటిల్ కావడం విశేషం. 2017 జనవరిలో ఆమె మలేసియా మాస్టర్స్ టైటిల్ గెలిచింది.

గత వారమే మలేసియా మాస్టర్స్ టోర్నీలో సైనాపై ఘన విజయం సాధించిన మారిన్ మరోసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. వేగంగా కదులుతూ తొలి రెండు పాయింట్లు తన ఖాతాలో వేసుకున్న మారిన్ అదే జోరును కొనసాగించింది. సైనా తప్పిదాలతో ఆమె 6-2తో ముందంజ వేసింది. దూకుడు పెంచిన మారిన్ 9-2తో దూసుకుపోయిన దశలో కోర్టులో అనూహ్యంగా పడిపోవడంతో కాలికి గాయమైంది. చికిత్స అనంతరం ఆమె ఆట కొనసాగించినా...మరో మూడు పాయింట్ల తర్వాత ఇక తన వల్ల కాదంటూ కుప్పకూలింది. కన్నీళ్లతో మారిన్ కోర్టు వీడగా...సైనా విజేతగా ఆవిర్భవించింది. 'నేను టైటిల్ సాధించిన తీరు పట్ల ఆనందంగా లేను. కఠినమైన ప్రత్యర్థులను ఓడించి ఫైనల్ వరకు వెళ్లడం సంతోషకరం. ఫైనల్లో నేను వెనుకబడ్డాననేది వాస్తవం. అయితే గట్టిగా పోరాడేదాన్ని. దురదృష్టవశాత్తూ ఈ ఘటన జరిగింది. కోర్టులో ఈ తరహాలో గాయపడటం చాలా బాధాకరం. నాకు కూడా ఇలాంటి అనుభవం గతంలో ఎదురైంది కాబట్టి ఆ వేదన ఎలాంటిదో బాగా తెలుసు' అని మ్యాచ్ అనంతరం సైనా వ్యాఖ్యానించింది.


ఛేజ్‌కు 8 వికెట్లు: విండీస్ జయభేరి



బ్రిడ్జ్‌టౌన్: వెస్టిండీస్ ఆఫ్ స్పిన్నర్ రోస్టన్ ఛేజ్ (8/60) తన స్పిన్ మాయాజాలంతో ఇంగ్లండ్‌ను తిప్పేశాడు. విండీస్‌కు తొలి టెస్టులో భారీ విజయాన్నందించాడు. నాలుగు రోజుల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ 381 పరుగుల భారీ తేడాతో జయభేరి మోగించింది. 628 పరుగుల కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 56/0తో నాలుగోరోజు ఆట కొనసాగించిన ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 246 పరుగుల వద్ద ఆలౌటైంది. 85 పరుగుల వద్ద తొలి వికెట్‌ను కోల్పోయిన ఇంగ్లండ్ 161 పరుగుల వ్యవధిలో మిగతా 9 వికెట్లను కోల్పోయింది. రోరి బర్న్స్ (84; 15 ఫోర్లు) అర్ధసెంచరీ తర్వాత మరెవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోయారు. స్టోక్స్ (34), బెయిర్‌స్టో (30), బట్లర్ (26), కెప్టెన్ రూట్ (22) రెండంకెల స్కోరు చేశారు. జట్టు స్కోరు 200 దాటాక... ఛేజ్ స్పిన్‌కు మోకరిల్లిన ఇంగ్లండ్ వడివడిగా వికెట్లను కోల్పోయింది. 217/6 స్కోరు వద్ద టీ విరామానికెళ్లిన ఇంగ్లండ్ తర్వాత 10 ఓవర్లను పూర్తిగా ఆడలేకపోయింది. గాబ్రియెల్, జోసెఫ్ చెరో వికెట్ తీశారు. వీరోచిత ద్విశతకం చేసిన వెస్టిండీస్ కెప్టెన్ హోల్డర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. మూడు టెస్టుల సిరీస్‌లో విండీస్ 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రెండో టెస్టు ఈ నెల 31 నుంచి నార్త్‌సౌండ్‌లో జరుగుతుంది.

పాకిస్తాన్ ఘన విజయం

8 వికెట్లతో దక్షిణాఫ్రికా చిత్తు



జొహన్నెస్‌బర్గ్: పాకిస్తాన్ బౌలర్లు తమ జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు. ఆదివారం ఇక్కడ జరిగిన నాలుగో వన్డేలో పాక్ 8 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. 'పింక్ వన్డే'లో గతంలో ఆడిన ఏడు సార్లూ గెలిచిన సఫారీ జట్టుకు తొలిసారి పరాజయం ఎదురైంది. ముందుగా దక్షిణాఫ్రికా 41 ఓవర్లలో 164 పరుగులకే ఆలౌటైంది. హాషీం ఆమ్లా (59; 7 ఫోర్లు), డు ప్లెసిస్ (57; 5 ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీలు సాధించారు. ఆరు బంతుల వ్యవధిలో 4 వికెట్లు పడగొట్టిన 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఉస్మాన్ షిన్వారి (4/35) దక్షిణాఫ్రికాను దెబ్బ తీశాడు. షాహిన్ అఫ్రిది, షాదాబ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం పాక్ 31.3 ఓవర్లలో 2 వికెట్లకు 168 పరుగులు సాధించింది.ఇమామ్ ఉల్ హఖ్ (71; 6 ఫోర్లు, సిక్స్) హాఫ్ సెంచరీ చేయగా...ఫఖర్ జమాన్ (44; 7 ఫోర్లు), బాబర్ ఆజమ్ 41 నాటౌట్; 2 ఫోర్లు) రాణించారు. ప్రస్తుతం సిరీస్ 2-2తో సమంగా నిలవగా, చివరి వన్డే బుధవారం జరుగుతుంది.

సర్ఫరాజ్‌పై 4 మ్యాచ్‌ల నిషేధం



దక్షిణాఫ్రికా ఆటగాడు ఆండిల్ ఫెలుక్‌వాయోపై వర్ణ వివక్ష వ్యాఖ్యలు చేసిన పాక్ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి 4 మ్యాచ్‌ల నిషేధం విధించింది. ఫలితంగా అతను ఈ సిరీస్‌లో రెండు వన్డేలతో పాటు టి20 సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. నాలుగో వన్డేలో షోయబ్ మాలిక్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయితే ఐసీసీ చర్యపై పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అసంతృప్తి వ్యక్తం చేసింది. సదరు ఘటనపై సర్ఫరాజ్ బహిరంగ క్షమాపణ చెప్పడంతో పాటు ఫెలుక్‌వాయోను కూడా వ్యక్తిగతంగా కలిసి మన్నించమని కోరిన విషయాన్ని గుర్తు చేసింది. తాము సర్ఫరాజ్‌ను క్షమించినట్లు డు ప్లెసిస్ చెప్పినా ఐసీసీ ఇంత తీవ్రంగా స్పందించడంతో నిరాశ చెందామని పీసీబీ అధికారులు వ్యాఖ్యానించారు.

సౌరాష్ట్ర ఫైనల్ దారిలో

బెంగళూరు: రంజీ ట్రోఫీలో సౌరాష్ట్ర జట్టు ఫైనల్‌కు చేరువైంది. 279 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చేతిలో 7 వికెట్లున్న సౌరాష్ట్ర లక్ష్యానికి కేవలం 55 పరుగుల దూరంలోనే ఉంది. పుజారా (108 బ్యాటింగ్; 14 ఫోర్లు) అజేయ శతకం బాదగా, జాక్సన్ (90 బ్యాటింగ్; 13 ఫోర్లు) సెంచరీ దారిలో ఉన్నాడు. ఇద్దరు కలిసి అబేధ్యమైన నాలుగో వికెట్‌కు 201 పరుగులు జోడించారు. ఆట ముగిసే సమయానికి సౌరాష్ట్ర 3 వికెట్లకు 224 పరుగులు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 237/8 తో ఆట కొనసాగించిన కర్ణాటక రెండో ఇన్నింగ్స్‌లో మరో 2 పరుగులు చేసి 239 స్కోరు వద్ద ఆలౌటైంది.

సిరీస్ విజయమే లక్ష్యంగా!

- జోరు మీదున్న టీమిండియా
- నేడు భారత్-కివీస్ మూడో వన్డే
- తుది జట్టులోకి హార్దిక్ పాండ్యా
- ఒత్తిడిలో ఆతిథ్య జట్టు

ఆస్ట్రేలియాలో మొదలైన భారత జట్టు విజయ యాత్ర టాస్మన్ సముద్రం దాటి మరోవైపు న్యూజిలాండ్‌లో కూడా కొనసాగుతోంది. లోపాలే లేకుండా దూసుకుపోతున్న టీమిండియాకు సొంతగడ్డపై కూడా కనీసం పోటీనివ్వడంలో కివీస్ తడబడుతోంది. ఇదే జోరులో భారత్ చెలరేగితే మరో వన్డే సిరీస్ మన ఖాతాలో చేరుతుంది. వరల్డ్ కప్‌నకు ముందు విదేశీ గడ్డపై కూడా జట్టు కూర్పు ఎలా ఉండాలో మరింత స్పష్టత వస్తుంది. వివాదాన్ని వెనక వదిలేసి జట్టుతో చేరిన హార్దిక్ పాండ్యా ఆడనుండటం మూడో మ్యాచ్‌లో కీలక మార్పు కాగా... విశ్రాంతి కోసం స్వదేశం వెళ్లే ముందు జట్టుకు కోహ్లి సిరీస్ అందిస్తాడా అనేది ఆసక్తికరం. స్వదేశంలో ఎప్పుడో ఏడేళ్ల క్రితం ఒకే జట్టు చేతిలో వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిన కివీస్ సిరీస్ కాపాడుకోవాల్సిన మ్యాచ్‌లో ఎలా స్పందిస్తుందో చూడాలి.

ఉదయం గం.7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం



మౌంట్‌మాంగనీ: వరుసగా రెండు విజయాలతో ఊపు మీదున్న భారత జట్టు మరో వన్డే సిరీస్‌ను సొంతం చేసుకోవడంపై దృష్టి పెట్టింది. న్యూజిలాండ్‌తో నేడు జరిగే మూడో వన్డేను కూడా గెలుచుకుంటే 3-0తో సిరీస్ టీమిండియా సొంతమవుతుంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో పటిష్టంగా కనిపిస్తున్న కోహ్లి సేనను నిలువరించడం న్యూజిలాండ్‌కు అంత సులువు కాదు. అనూహ్యంగా రెండు మ్యాచ్‌లు కోల్పోయిన కివీస్ సిరీస్‌ను చేజార్చుకోకుండా ఉండాలంటే ఎంతో పట్టుదల కనబర్చాల్సి ఉంది.

విజయ్ శంకర్ ఔట్...

భారత జట్టు ఫామ్ ప్రకారం చూస్తే తుది జట్టులో మార్పులు చేయాల్సిన అవసరం లేదు. అయితే వన్డే జట్టులో రెగ్యులర్ సభ్యుడైన హార్దిక్ పాండ్యా నిషేధం కారణంగా గత మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. ఇప్పుడు అతను తిరిగి రావడంతో ఆల్‌రౌండర్‌గా విజయ్ శంకర్ స్థానంలో చోటు ఖాయమైంది.ఎప్పటిలాగే మన టాప్-3 ఆట జట్టు విజయాలకు బాటలు వేస్తోంది. భారీ స్కోర్లు చేయకపోయినా కోహ్లి కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. రాయుడు తొలి మ్యాచ్ వైఫల్యాన్ని రెండో వన్డేలో మరచిపోయేలా చేశాడు. ధోని, జాదవ్ కూడా తమ వంతు పాత్రను సమర్థంగా పోషిస్తున్నారు. మిడిలార్డర్‌లో కూడా మరింత వేగంగా పరుగులు సాధించడంపైనే తాము దృష్టి పెట్టామని, అది మాత్రమే ప్రస్తుతానికి తమ దృష్టిలో కొంత సరిదిద్దుకోవాల్సిన అంశమని కోహ్లి ఇప్పటికే చెప్పాడు. కాబట్టి మిడిలార్డర్‌లో కూడా అందరూ పరుగులు సాధించడమే ఈ మ్యాచ్‌లో కీలకంగా మారనుంది. బౌలింగ్‌లో నలుగురు స్పెషలిస్ట్‌లు కూడా సత్తా చాటుతున్నారు. భువీ, షమీ పేస్ ముందు కివీస్ బ్యాట్స్‌మెన్ చేతులెత్తేస్తుండగా... చహల్, కుల్దీప్ స్పిన్ దెబ్బకు లోయర్ ఆర్డర్ నిలబడలేకపోతోంది. ఈ మ్యాచ్ తర్వాత కోహ్లి చివరి రెండు వన్డేలతో పాటు టి20 సిరీస్‌కు కూడా దూరం కానున్నాడు. న్యూజిలాండ్‌కు సొంత మైదానాల్లో ఇలాంటి స్థితి ఇటీవలి కాలంలో ఎప్పుడూ ఎదురు కాలేదు. స్వదేశంలో రికార్డులతో చెలరేగిపోయే గప్టిల్, మున్రో, టేలర్ రెండు మ్యాచ్‌లలో కూడా భారత బౌలింగ్ ముందు తడబడ్డారు. కొంత కాలంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కివీస్ అద్భుత ప్రదర్శన కనబరుస్తూ వన్డే వరల్డ్ కప్ ఫేవరెట్‌లలో ఒకటిగా కనిపించింది. కానీ సిరీస్ ఓడితే జట్టు స్థయిర్యం దెబ్బ తినడం ఖాయం. విలియమ్సన్ తన బృందాన్ని ఎలా నడిపిస్తాడో చూడాలి.

పిచ్, వాతావరణం

రెండో వన్డే జరిగిన మైదానంలోనే ఈ మ్యాచ్ కూడా నిర్వహిస్తున్నారు. అయితే పిచ్ మారవచ్చు. సాధారణ బ్యాటింగ్ వికెట్టే అయినా స్పిన్‌కు కొంత అనుకూలం. మంచి వాతావరణం. ఆటకు ఇబ్బంది లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: కోహ్లి (కెప్టెన్), రోహిత్, ధావన్, రాయుడు, ధోని, జాదవ్, పాండ్యా, భువనేశ్వర్, కుల్దీప్, షమీ, చహల్.

న్యూజిలాండ్: విలియమ్సన్ (కెప్టెన్), గప్టిల్, మున్రో, టేలర్, లాథమ్, నికోల్స్, సాన్‌ట్నర్, బ్రేస్‌వెల్, సోధి, ఫెర్గూసన్, బౌల్ట్.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు


శ్రీవారి ఆలయం వద్ద జస్టిస్ మీనాకుమారి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రామలింగం సుధాకర్, చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేల్‌మణి, హ్యూమన్‌రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ మీనాకుమారి, ఏపీ అదనపు డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా తదితరులు స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. వీరిని స్వామి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వదించారు.

'రెల్లి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

గన్నవరం: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన రెల్లి కుల సంక్షేమానికి ప్రభుత్వాలు తోడ్పాటునందించాలని రెల్లి (శబరి) కుల ఆత్మీయ సమావేశం తీర్మానించింది. కృష్ణా జిల్లా గన్నవరంలోని కొత్తపేట బీసీ కమ్యూనిటీ హాలులో ఆదివారం రాష్ట్ర రెల్లి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. రెల్లి జాతిని అన్ని రంగాల్లో ముందుకు నడిపించేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సమావేశంలో కార్యవర్గం తీర్మానించింది. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దళాయి ఆడమ్స్ మాట్లాడుతూ..ఎన్ని ప్రభుత్వాలు, పాలకులు మారినా రెల్లి కులస్తుల బతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఐఆర్‌ఎస్ అధికారి అప్పికట్ల భరత్‌భూషణ్ మాట్లాడుతూ.. రెల్లి కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బైబిల్ మిషన్ 81వ మహోత్సవాలు ప్రారంభం



ప్రసంగిస్తున్న శామ్యూల్ కిరణ్

పెదకాకాని: లోకరక్షకుడి సకల ఆశీర్వాదాలకు బైబిల్ మిషన్ మహోత్సవాలు వేదికగా నిలిచాయని సభల కన్వీనర్ రెవరెండ్ డాక్టర్ జె.శామ్యూల్ కిరణ్ అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో మూడు రోజులపాటు జరిగే బైబిల్ మిషన్ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సభలకు అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఎన్.సత్యానందం అధ్యక్షత వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు ధ్యానం, కీర్తన, వాక్య పఠనంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మహోత్సవాల ఆహ్వాన సందేశాన్ని జె.శామ్యూల్ కిరణ్ తెలియజేశారు. లక్షలాదిగా తరలివచ్చిన భక్తుల కోసం నిర్వాహకులు ఉచితంగా భోజనం, తాగునీరు ఏర్పాటు చేశారు. మహోత్సవాలకు తొలిరోజు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చంద్రగిరి యేసురత్నం, పలువురు అధికారులు హాజరై దైవాశీర్వాదాలు పొందారు. మహోత్సవాలకు విచ్చేసిన భక్తులకు గుంటూరు తూర్పు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి తాగునీరు అందజేశారు. కాగా, మహోత్సవాల తొలిరోజు సాయంత్రం 4 గంటలకు వర్షం కురవడంతో పందిళ్ళు, వంటశాలలు, కట్టెలు తడిసి ముద్దయ్యాయి. దీంతో సోమ, మంగళవారాల్లో యథావిధిగా పెదకాకాని స్వస్థిశాలలో జరుగుతాయని మహోత్సవాలు జరుగుతాయి.

కన్ను పడింది.. కాజేశారు..

- రూ.100 కోట్ల విలువైన చెరువు పోరంబోకు భూమి ఆక్రమణ
- అడంగల్‌లో దర్గాగా పట్టా భూమి అని మార్పు
- ఏకంగా సప్లై చానల్‌ను సైతం పూడ్చేసి భవన నిర్మాణం
- అనుకూలమైన తహశీల్దార్‌ను తెచ్చుకుని కథ నడిపిన వైనం
- ఇద్దరు మంత్రులు, ఓ మాజీ మంత్రి కుమారుడి ప్రమేయం
- 'ముఖ్య' నేత కుమారుడి అండతో టీడీపీ నేతల కబ్జా కాండ

సాక్షి, తిరుపతి


తూకివాకం చెరువుకు నీరు అందించే సప్లై చానెల్‌ను పూడ్చి వేసి రోడ్డు వేసిన దృశ్యం


ఆక్రమించుకున్న చెరువు పోరంబోకు భూమిలో కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు

అధికారాన్ని అడ్డు పెట్టుకుని టీడీపీ నేతలు ప్రకృతి సంపదను యథేచ్ఛగా దోచుకుంటున్నారు. ఇద్దరు రాష్ట్ర మంత్రులు, మరో మాజీ మంత్రి కుమారుడి కనుసన్నల్లో చిత్తూరు జిల్లా తిరుపతి సమీపంలోని జాతీయ రహదారికి పక్కనే ఉన్న రూ.100 కోట్ల విలువైన చెరువు పోరంబోకు భూమి ఆక్రమణకు గురైంది. ఈ భూమిలో దర్గాగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఆక్రమణలను అడ్డుకునేందుకు స్థానికులు ప్రయత్నించినా అధికార పార్టీ నేతల బలం ముందు ఫలితం లేకుండా పోయింది. పూతలపట్టు – నాయుడుపేట జాతీయ రహదారికి పక్కన రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 718/బిలో 7.28 ఎకరాల చెరువు పోరంబోకు భూమి ఉంది. ఈ భూమిలో 2013లో తిరుపతి, రేణిగుంట పరిధిలోని ఇల్లులేని నిరుపేదలు 400 మందికి పట్టాలు ఇవ్వడంతో లబ్ధిదారులు తాత్కాలిక గుడిసెలు కూడా వేసుకున్నారు. చెరువు పోరంబోకును ఇళ్ల స్థలాలకు ఇవ్వడం సమంజసం కాదని స్థానికుల నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. ఆ సమయంలో ఇరు వర్గాల మధ్య గొడవలు కూడా చోటు చేసుకున్నాయి. దీంతో భారీ ఎత్తున పోలీసు బలగాలు, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు, వడమాలపేట మండలాలకు చెందిన తహశీల్దార్లు, రెవిన్యూ సిబ్బంది అక్కడకు చేరుకుని బలవంతంగా గుడిసెలు తొలగించారు. అప్పటి నుంచి ఈ స్థలం ఖాళీగా ఉండిపోయింది. రెండేళ్ల క్రితం తూకివాకం చెరువు, చెరువు పోరంబోకు భూమిలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు కూడా తీశారు.

రికార్డులు తారుమారు

2014లో టీడీపీ అధికారంలోకి రాగానే కొందరు నేతల కన్ను విలువైన ఈ చెరువు పోరంబోకు భూమిపై పడింది. ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కబ్జాకు సహకరించని తహశీల్దార్‌ను 'ముఖ్య' నేత కుమారుడు బదిలీ చేయించి, అనుకూలంగా ఉన్న మరో తహశీల్దార్‌ని రేణిగుంటకు తెచ్చుకున్నారు. పాత రెవిన్యూ అడంగల్‌లో చెరువు పోరంబోకు భూమి అని ఉంటే, దానిని సుబ్రమణ్యం నాయుడు అనే వ్యక్తికి వంశపారం పర్యంగా సంక్రమించిందని రికార్డులు సృష్టించారు. ఆన్‌లైన్‌లోనూ సుబ్రమణ్యం నాయుడు పేరుతో మార్పులు చేశారు. ఈ తతంగంపై తూకివాకం గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేసినా, వీరి గోడు పట్టించుకునే వారే కరువయ్యారు. గట్టిగా మాట్లాడే వారిని బెదిరించటం మొదలు పెట్టారు. దీంతో స్థానికులు అటువైపు వెళ్లటం మానేశారు. ఇదే అదనుగా టీడీపీ బడా నేతలు తూకివాకం చెరువులోని మట్టిని జేసీబీలతో విచ్చలవిడిగా తవ్వి వందలాది టిప్పర్లతో పోరంబోకు భూమిని చదును చేసుకున్నారు. పనిలో పనిగా పోరంబోకు భూమికి అనుకుని ఉన్న చెరువు భూమిని కూడా కొంత ఆక్రమించి చుట్టూ ప్రహరీ నిర్మించారు. ప్రస్తుతం ఆక్రమణకు గురైన భూమి సుమారు 10 ఎకరాలు ఉంటుంది. ఎకరం రూ.10 కోట్ల చొప్పున రూ.100 కోట్ల విలువైన భూమి కబ్జాకు గురైంది.

సప్‌లై చానెల్‌ను పూడ్చి రోడ్డు వేశారు..

తూకివాకం గ్రామ సమీపంలో సర్వే నంబర్ 706లో 133.17 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. ఈ చెరువు భూమిని ఆక్రమించుకున్న వారు అక్కడికి వచ్చి వెళ్లడానికి అడ్డుగా ఉన్న సప్‌లై చానెల్ (చెరువుకు నీరందించే కాలువ)ను పూర్తిగా పూడ్చి వేసి రోడ్డు వేశారు.

సమగ్ర విచారణ జరపాలి



చెరువు పోరంబోకు భూమిని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. ఈ భూమి వంశ పారంపర్యంగా వచ్చిందని సుబ్రమణ్యం నాయుడు అనే వ్యక్తిపై రికార్డులు సృష్టించారు. ఈ పేరుగల వ్యక్తి మా గ్రామ పరిధిలోనే లేడు. గ్రామంలో ఉన్న వారందరూ చెరువు ఆయకట్టు రైతులే. ఈ ఆక్రమణ వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి నిజాలను నిగ్గు తేల్చాలి. లేదంటే న్యాయ పోరాటం చేస్తాం.

– నాగ సుబ్రమణ్యంరెడ్డి, తూకివాకం ఎంపీటీసీ సభ్యుడు.

పోలవరం సందర్శకుడు గుండెపోటుతో మృతి

మృతుడు ప్రకాశం జిల్లా వాసి


సుబ్బారావు (ఫైల్)

పోలవరం రూరల్/ బల్లికురవ: పశ్చిమగోదావరి జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన ఒక వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రెండు నెలలుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామంటూ పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం, గుంటూరు జిల్లా అమరావతికి బస్సులు ఏర్పాటు చేసి రైతులను, మహిళలను తరలిస్తున్నారు. శనివారం రాత్రి ప్రకాశం జిల్లా బల్లికురవ మండలంలోని పెద అంబడిపూడి, చిన అంబడిపూడి గ్రామాల నుంచి 5 బస్సుల్లో సుమారు 180 మంది పోలవరం బయలుదేరి వెళ్లారు. పెద అంబడిపూడి గ్రామానికి చెందిన కూరపాటి సుబ్బారావు (69) కూడా అందులో ఉన్నారు. ఆదివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు పట్టిసం రేవు వద్ద బస్సు ఆపారు. సుబ్బారావు బహిర్భూమికి వెళ్లి గుండెపోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. తోటి సందర్శకులు గమనించి 108కి ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని బస్సులోనే వారి స్వగ్రామం తరలించారు.

నిజం చెబితే సమస్యలు ఉండవ్

- జస్టిస్ జాస్తి చలమేశ్వర్
- జస్టిస్ చలమేశ్వర్‌కు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం


జస్టిస్ చలమేశ్వర్‌కు పురస్కారం అందజేస్తున్న రంగనాథబాబు.చిత్రంలో బుద్ధప్రసాద్ తదితరులు

చల్లపల్లి (అవనిగడ్డ)/భీమవరం (ప్రకాశం చౌక్): ప్రతి ఒక్కరూ జీవితంలో నిజం చెప్పటం ఎంతో అవసరమని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. ప్రపంచమంతా ఎదురు నిలిచినా నిజం చెబితే సమస్యలు తొలగిపోతాయని పేర్కొన్నారు. కృష్ణాజిల్లా చల్లపల్లిలోని విజయా అకాడమీ 38వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయా అకాడమీ చైర్మన్ గొర్రెపాటి రంగనాథబాబు, డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పాటూరు రామలయ్య జస్టిస్ చలమేశ్వర్‌కు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. అనంతరం జస్టిస్ చలమేశ్వర్ మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ చెప్పిన 'సత్యమేవ జయతే' నినాదం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అధర్మం, అసత్యం ప్రచారమవుతున్నప్పుడు నివారించలేనివారే ముందుగా వాటికి బలవుతారని చెప్పారు. యువత, విద్యార్థులు సత్యం, ధర్మం మార్గంలో నడిచి దేశానికి మంచి భవిష్యత్తునివ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గొర్రెపాటి చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు పాల్గొన్నారు.

తెలుగు సంగీతం, సాహిత్యం మహోన్నతం

నేటి తరం వారికి తెలుగు సంగీతం, సాహిత్యం గొప్పదనం గురించి వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆదివారం జరిగిన త్యాగరాజు మ్యూజిక్ అకాడమీ శతవార్షికోత్సవాల్లో జస్టిస్ చలమేశ్వర్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ చలమేశ్వర్ మాట్లాడుతూ అంతరించిపోతున్న భాషల్లోకి తెలుగు కూడా దగ్గర అవుతోందన్నారు. తెలుగువారంతా తెలుగు భాషను కాపాడుకోవాలని, సంగీత, సాహిత్యాలను ప్రోత్సహించాలని కోరారు. జస్టిస్ వెంకటశేషసాయి మాట్లాడుతూ రామాయణంలోని సీతారాముల గురించి తన కీర్తనల ద్వారా తెలుగు వారికి తెలియజేసిన మహానుభావుడు త్యాగరాజ స్వామి అని చెప్పారు. ఈ సందర్భంగా అకాడమీ వందేళ్ల సావనీరును ఆవిష్కరించారు.

'ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధే ధ్యేయం'

రామవరప్పాడు (గన్నవరం): అభివృద్ధికి దూరంగా ఉన్న ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధే ఆదివాసీ గిరిజనుల మహానాడు ధ్యేయమని ఆ సంఘాల మహానాడు వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు, రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ సభ్యుడు కొండారెడ్డి నరహరి వరప్రసాద్ అన్నారు. విజయవాడలోని ఎనికేపాడులో ఆదివారం 13 జిల్లాల్లోని ఆదివాసీ, గిరిజన సంఘాల మహానాడు, రాష్ట్ర కమిటీ వివిధ విభాగాల చైర్మన్‌లు సమావేశమయ్యారు. నరహరి వరప్రసాద్ మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ, గిరిజనులను అభివృద్ధి చేయడమే సంఘం ప్రధాన లక్ష్యమని చెప్పారు. 35 తెగల నుంచి గిరిజనులు, ఆదివాసీల్లో ఒక్కో తెగ నుంచి ఒక్కో ప్రతినిధిని తీసుకుని చైర్మన్‌గా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘాల మహానాడు సమన్వయ కమిటీ చైర్మన్ గోపీనాయక్, కార్యక్రమాల కమిటీ చైర్మన్ కండెల ఆంజనేయులు, ప్రచార కమిటీ చైర్మన్ మునీంద్రనాయక్, మహిళా కమిటీ చైర్మన్ తీగల ప్రభ, రాజకీయ కమిటీ చైర్మన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా రాజపత్రము

అధీకృత అధికారిచే ప్రచురించబడినది
అసాధారణము

గెజిట్ నెం: 10 — తేది : 25-01-2019

ఆర్.సి.నెం : 1300/2017-జి3 — తేది : 25-01-2019

ఫారము -6(A)

(భూసేకరణ ఆర్ అండ్ ఆర్, చట్టం 2013లోని సెక్షన్11(1) మరియు రూలు 19(1)క్రింద)

ప్రాథమిక ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరిచిన గుంటూరు జిల్లా నాదెండ్ల మండలము, గొరిజవోలు గ్రామము నందు ఈ దిగువన చూపబడిన భూములు ప్రజా ప్రయోజనాలకై అనగా గుంటూరు నుండి గుంతకల్ రైల్వే లైన్ డబ్లింగ్ కొరకు అవసరమైనట్లుగా చట్టములోని విభాగము 3(ఇ) ప్రొవిజో మరియు ఆంధ్రప్రదేశ్ భూ సేకరణ ఆర్ అండ్ ఆర్ రూల్స్ 2014లోని నిబంధన 2(1)(బి) క్రింద అనుగుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన గుంటూరు జిల్లా కలెక్టరు గారు భావించినందున, భూ సేకరణ పునరావాస మరియు పునర్నిర్మాణములో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం. 2013లోని విభాగం11(1)లో ఉన్న నిబంధనల మేరకు ఈ విషయము గురించి అందుకు సంబంధించిన వారందరికీ ఎరుక నిమిత్తం ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

సెంటర్ ఫర్ మేనేజ్‌మెంట్ మరియు సోషల్ రీసెర్చ్(CMSR), హైదరాబాద్ వారు సామాజిక ప్రభావము మదింపు అధ్యయనము చేసి నివేదిక సమర్పించినారు. సదరు నివేదిక ప్రకారం నాదెండ్ల మండలము, గొరిజవోలు గ్రామములో గుంటూరు-గుంతకల్ డబ్లింగ్ రైల్వే లైన్ నిర్మాణమునకు మొత్తము పన్నెండు(12) రైతు కుటుంబములకు చెందిన ఎ.2.56సెంట్ల వ్యవసాయ భూముల ద్వారా ప్రతిపాదిత భూమి వెళ్ళుచున్నది. సదరు వ్యవసాయ భూమి ఒక పంట మెట్ట భూమి అయినందున, ప్రత్తి, సుబాబుల మొదలగు పంటలు మాత్రమే సాగుచేయుచున్నారు. వ్యవసాయ ఉత్పాదకత మీద కలుగు ప్రభావం పరిగణనలోకి స్వల్పమైనది. ప్రాజెక్టు వలన ప్రజలకు మరియు సమాజానికి కలుగు సంభావ్య ప్రయోజనాలు సామాజిక వ్యయాలు ప్రతికూల సాంఘీక ప్రభావాలకన్నా అధికముగా ఉన్నవి.

ఈ భూ సేకరణ వలన నిర్వాసితులైన కుటుంబములు ఏమియు లేవు.

చట్టములోని సెక్షన్ 43(1) మేరకు ప్రభావిత వ్యక్తులు సహాయ పునరావాస చర్యలు చేపట్టుట కొరకు ప్రభుత్వ ఉత్తర్వు నెం.1 రెవెన్యూ (భూ.సే.) శాఖ తేది.02.01.2015 నందు ఇవ్వబడిన ప్రకటన ద్వారా సంయుక్త కలెక్టర్ గారు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించబడినారు.

పైన పేర్కొనిన చట్టములో సెక్షన్ (12) క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి శ్రీయుత జిల్లా కలెక్టరు, గుంటూరు వారు శ్రీయుత భూ సేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, నరసరావుపేట వారికి, వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూములు భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి కలెక్టర్/భూసేకరణాధికారివారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమికి ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ విక్రయములు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ 15(1) ననుసరించి భూసేకరణ పై ఏ విధమైన అభ్యంతరములు/ఆక్షేపణలు వున్నయెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60(అరువది) దినముల లోగ రెవిన్యూ డివిజనల్ అధికారి, నరసరావుపేట వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : గుంటూరు — మండలము : నాదెండ్ల — గ్రామము: గొరిజవోలు

వరుస నెం	సర్వే నెం	మొత్తం విస్తీర్ణము (ఎ.సెంట్లు)	భూసేకరణ క్రింద విస్తీర్ణము (ఎ.సెంట్లు)	భూమి యొక్క వర్గీకరణ	ఆసక్తి కలిగిన వ్యక్తి పేరు	హద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు నిర్మాణాలు మొదలైనవి, ఏమైనా ఉంటే వివరాలు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	47/ఎ	1.91	0.28	సర్కారు పుంజ	కంజుల జగన్మోహన్ రెడ్డి తండ్రి కోటిరెడ్డి	48-సి	47-ఎ (పార్ట్)	46-బి	మేడికపూడి గ్రామ సరిహద్దు	జామాయిల్ సరుగుడు-10
2	49/బి	0.16	0.05	సర్కారు పుంజ	చెవ్వాలి జనకదుర్గ, భర్త కృష్ణ శేఖర్ కుమార్ రెడ్డి	50-బి	49-బి (పార్ట్)	50-ఎ	48-బి	జామాయిల్
3	50/ఎ-ఎ1	2.37	0.12	సర్కారు పుంజ	చెవ్వాలి జనకదుర్గ, భర్త కృష్ణ శేఖర్ కుమార్ రెడ్డి	50-బి	50-ఎ-ఎ1 (పార్ట్)	50-ఎ-ఎ1 (పార్ట్)	50-ఎ-బి	జామాయిల్ జువ్వెట్టు-1
			0.05		కట్టిబోయిన వెంకటరత్నం భర్త వెంకట సుబ్బయ్య	50-బి	50-ఎ-ఎ1 (పార్ట్)	51-ఎ	50-ఎ-ఎ1 (పార్ట్)	ప్రత్తి
4	50/ఎ-బి	1.23	0.14	సర్కారు పుంజ	చెవ్వాలి జనకదుర్గ, భర్త కృష్ణశేఖర్‌కుమార్ రెడ్డి	50-బి	50-ఎ-బి (పార్ట్)	50-ఎ-ఎ1	49-బి	జామాయిల్
5	409/బి	5.23	0.09	సర్కారు పుంజ	కురుగుంట్ల చిన్న మస్తాన్‌రెడ్డి తండ్రి కోటిరెడ్డి	410-ఎ	409-బి (పార్ట్)	409-బి (పార్ట్)	409-బి (పార్ట్)	జామాయిల్
			0.10		ఆళ్ళ పేరెడ్డి, తండ్రి దశరథ రామిరెడ్డి	410-ఎ	409-బి (పార్ట్)	409-బి (పార్ట్)	444-ఎ	జామాయిల్
			0.16		దుంపా వెంకటేశ్వరరెడ్డి తండ్రి హనిమిరెడ్డి మరియు దుంపా రాజమ్మ భర్త వెంకటేశ్వర రెడ్డి	410-ఎ	409-బి (పార్ట్)	411	409-బి (పార్ట్)	జామాయిల్
6	411	13.80	0.18	సర్కారు పుంజ	కంజుల మంగమ్మ, భర్త పీరారెడ్డి	410-ఎ	411 (పార్ట్)	412	411 (పార్ట్)	జామాయిల్
			0.06		కంజుల సుజాత, భర్త శ్రీనివాసరెడ్డి	410-ఎ	411 (పార్ట్)	411 (పార్ట్)	411 (పార్ట్)	ప్రత్తి
			0.05		దుంపా వెంకటేశ్వరరెడ్డి తండ్రి హనిమిరెడ్డి మరియు దుంపా రాజమ్మ భర్త వెంకటేశ్వరరెడ్డి	410-ఎ	411 (పార్ట్)	411 (పార్ట్)	409-బి	జామాయిల్
7	418-2	0.08	0.05	సర్కారు పుంజ	కంజుల మంగమ్మ, భర్త పీరారెడ్డి	419-బి	418-2 (పార్ట్)	419-సి	431-ఎ	జామాయిల్
8	419-సి	2.93	0.28	సర్కారు పుంజ	కంజుల లక్ష్మి, భర్త పెద్దిరెడ్డి	419-బి	419-సి (పార్ట్)	420-సి	418	ప్రత్తి
9	431/ఎ	0.97	0.24	సర్కారు పుంజ	కంజుల మంగమ్మ, భర్త పీరారెడ్డి	431-బి	431-ఎ (పార్ట్)	418	412	జామాయిల్
10	442/ఎ	0.11	0.04	సర్కారు పుంజ	ఓగిరాల నారాయణరెడ్డి, తండ్రి వెంకటరెడ్డి	443-బి	442-ఎ (పార్ట్)	443-ఎ	448	ఖాళీ
11	443/ఎ	2.04	0.24	సర్కారు పుంజ	కురుగుంట్ల చిన్నమస్తాన్‌రెడ్డి, తండ్రి కోటిరెడ్డి	443-బి	443-ఎ (పార్ట్)	441-ఎ	442-ఎ	జూట్
12	444/ఎ	1.35	0.19	సర్కారు పుంజ	కూనం నాగేంద్రమ్మ భర్త సుందర రామిరెడ్డి	444-బి	444-ఎ (పార్ట్)	409-బి	444-ఎ (పార్ట్)	ప్రత్తి
			0.23		చేవూరి నాగిరెడ్డి, తండ్రి మస్తాన్‌రెడ్డి	444-బి	444-ఎ (పార్ట్)	444-ఎ (పార్ట్)	443-ఎ	ప్రత్తి
13	448-1	12.02	0.01	సర్కారు పుంజ	ఓగిరాల నారాయణరెడ్డి, తండ్రి వెంకటరెడ్డి	443-బి	448 (పార్ట్)	442-ఎ	449-బి	ఖాళీ
	మొత్తం	44.20	2.56							

సం// కోన శశిధర్,
కలెక్టరు మరియు జిల్లా మెజిస్ట్రేట్, గుంటూరు

'అగ్రిగోల్డ్' మరణాలు.. ప్రభుత్వ హత్యలే

వైఎస్సార్‌సీపీ అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు లేళ్ళ అప్పిరెడ్డి




నెహ్రూనగర్(గుంటూరు): అగ్రిగోల్డ్ బాధితుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలుగానే భావిస్తున్నామని వైఎస్సార్ సీపీ అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులు తమ రక్తాన్ని చిందించి ఒక్కొక్క రూపాయి కూడబెట్టి అగ్రిగోల్డ్ సంస్థలో డిపాజిట్ చేస్తే... సంస్థ యాజమాన్యం ఆ సొమ్ముతో కొనుగోలు చేసిన ఆస్తులను అప్పనంగా కాజేయడానికి టీడీపీ నాయకులు కంకణం కట్టుకున్నారని మండిపడ్డారు. ఇప్పటివరకు 260 మందిని పొట్టన పెట్టుకున్న చంద్రబాబుకు ఇంకా కనువిప్పు కలగకపోవడం సిగ్గుచేటన్నారు.

రూ. 250 కోట్లు ఏ లెక్కన పంచుతారు?

ప్రభుత్వ ప్రతినిధిగా కుటుంబరావు మొదట రూ.5 వేలు, రూ.10 వేలు డిపాజిట్ చేసిన వారందరికీ న్యాయం చేస్తామంటూ హామీ ఇచ్చారని, ఆ తరువాత బాసట కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించడంతో రూ.20 వేలు డిపాజిట్ చేసిన వారికి కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ లెక్కన చూసుకుంటే 20వేల లోపు డిపాజిట్ చేసిన వారికి చెల్లింపులకు రూ.1183 కోట్లు అవసరమవుతాయని అన్నారు. రూ.10 వేల లోపు డిపాజిట్ చేసిన వారికి న్యాయం చేయాలంటే రూ.363 కోట్లు కావాల్సి ఉంటుందని స్వయంగా సీబీసీఐడీ నిగ్గుతేల్చిందన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే మంత్రివర్గం ప్రకటించిన రూ.250 కోట్లు ఏ లెక్కన పంచుతారో సీఎం సెలవీయాలని డిమాండ్ చేశారు. బాధితుల సంఖ్యను తగ్గించే కుట్రలో భాగంగానే ప్రభుత్వం పొంతన లేని ప్రకటనలతో బాధ్యత రహితంగా వ్యవహరిస్తోందన్నారు. దీనిపై తాము ప్రత్యక్ష కార్యాచరణకు దిగనున్నట్లు చెప్పారు. ఈ నెల 30న విజయవాడలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అగ్రిగోల్డ్ బాసట కమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కుర్రి పున్నారెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, బొర్రా వెంకటేశ్వరరెడ్డి, జగన్ కోటి, పసుపులేటి రమణ, రబ్బాని, సుభాని, సింగు నరసింహారావు, సుంకర రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి: రాఘవులు



మచిలీపట్నంటౌన్: రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకపోవడంతో పాటు దేశ సమగ్రతకు తీవ్ర భంగం కలిగిస్తున్న బీజేపీ, దాని మిత్రపక్షాలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా 'వర్తమాన రాజకీయ పరిస్థితులు – కర్తవ్యాలు' అన్న అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకుండా ద్రోహం చేసిన బీజేపీతో టీడీపీ నాలుగున్నరేళ్లు కలిసి పనిచేసిందన్నారు. ప్రస్తుతం బయటకు వచ్చి ప్రత్యేకహోదా కోసం తామే ఉద్యమిస్తున్నట్లుగా ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీజేపీ మైనార్టీలను తీవ్ర ఇక్కట్లకు గురిచేస్తోందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తోందని, యూనివర్సిటీలను ధ్వంసం చేసేందుకు పథక రచన చేస్తోందని ఆరోపించారు.

దాసరి విగ్రహావిష్కరణకు ముద్రగడను పిలవకపోవడం బాధాకరం

సినీనటుడు మోహన్‌బాబు


మాట్లాడుతున్న మోహన్‌బాబు. పక్కన ముద్రగడ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో శనివారం జరిగిన దాసరి నారాయణరావు కాంస్య విగ్రహావిష్కరణ సభకు ముద్రగడను పిలవకపోవడం బాధాకరమని సినీ నటుడు, నిర్మాత మంచు మోహన్‌బాబు అన్నారు. పాలకొల్లులోని ముద్రగడ పద్మనాభం సన్నిహితుని ఇంట్లో ఆదివారం అల్పాహార విందుకు హాజరైన మోహన్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ.. ''తనను నమ్ముకున్న వ్యక్తులకు న్యాయం చేయాలనే పట్టుదలతో ఉన్న వ్యక్తి, ఏ రాజకీయ పార్టీకి సంబంధంలేని వ్యక్తి ముద్రగడ పద్మనాభం. శనివారం రాత్రి జరిగిన దాసరి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఏ పార్టీకీ సంబంధించినది కాదు. కమిటీ సభ్యులు ముద్రగడను పిలవకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది'' అన్నారు. ఈ సమావేశంలో ముద్రగడ కూడా పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తేవాలి

తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య

తెనాలి: రాష్ట్రంలో, దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను చూస్తూ ఊరుకోకుండా, ఆయా ప్రభుత్వాలను దూరంగా పెట్టి కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు చైతన్యవంతులై ఇందుకు నడుంబిగించాలని సూచించారు. గుంటూరు జిల్లా తెనాలి మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన తెనాలి, వేమూరు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో రోశయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఈ దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిందనే వాస్తవాన్ని ఎవరూ కాదనలేరని చెప్పారు.

కేరళ సంస్కృతికి అవమానం

- శబరిమల అంశంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరే నిదర్శనం
- కేరళలో యువమోర్చా ర్యాలీలో మోదీ ధ్వజం
- బీపీసీఎల్ విస్తరణ కాంప్లెక్స్‌ను జాతికి అంకితమిచ్చిన ప్రధాని
- మదురైలో ఎయిమ్స్‌కు శంకుస్థాపన

త్రిస్సూర్/కొచ్చి

కేరళ సంస్కృతిని ఆ రాష్ట్రంలోని కమ్యూనిస్టు ప్రభుత్వం ఎలా అవమానించిందో శబరిమల అంశం ద్వారా స్పష్టమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం విమర్శించారు. శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల స్త్రీలు వెళ్లవచ్చునంటూ సుప్రీంకోర్టు గతేడాది ఆదేశించడం, ఈ అంశం కేరళలో తీవ్ర ఆందోళనలకు, హింసకు దారితీయడం తెలిసిందే. అనంతరం పోలీసు భద్రత నడుమ ఇద్దరు మహిళలు అయ్యప్ప స్వామిని దర్శించుకోవడం కూడా పెనుదుమారం రేపింది. కేరళలోని త్రిస్సూర్‌లో జరిగిన యువ మోర్చా సభలో మోదీ మాట్లాడుతూ 'శబరిమల అంశం దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. కేరళ సంస్కృతిని సీపీఎం నేతృత్వంలోని కమ్యూనిస్టు ప్రభుత్వం ఎంతలా అవమానపరిచిందో దేశ ప్రజలు చూశారు. కేరళ సంస్కృతిని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోంది? దురదృష్టవశాత్తూ కేరళ సాంస్కృతిక విలువలపై దాడి జరుగుతోంది. ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న ప్రభుత్వమే ఆ పని చేస్తోంది' అని ఆరోపణలు చేశారు. ప్రతిపక్ష పార్టీల వారు తనను ఎంత దూషించినా పరవాలేదనీ, కానీ వారు రైతులను తప్పుదోవ పట్టించకూడదని మోదీ పేర్కొన్నారు. యువతకు లభిస్తున్న అవకాశాలకు విపక్షాలు అవరోధాలను సృష్టించకూడదని కోరారు. కొచ్చిలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్)కు చెందిన చమురు శుద్ధి కర్మాగారం విస్తరణ కోసం నిర్మించిన కాంప్లెక్స్‌ను మోదీ జాతికి అంకితమిచ్చారు. ఈ కర్మాగారంలో పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌కు, ఎట్టుమానూర్‌లో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పాటుకు కూడా మోదీ శంకుస్థాపన చేశారు. అలాగే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్)కు చెందిన ఎల్పీజీ సిలిండర్లను నింపే ప్లాంటులో కొత్త నిల్వ సదుపాయాన్ని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని వంటగదులను పొగరహితంగా మార్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేసిందనీ, తాము అధికారంలోకి వచ్చే నాటికి 55 శాతం కుటుంబాలకు వంట గ్యాస్ కనెక్షన్లు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్యను 90 శాతానికి చేర్చామని అన్నారు. కాంగ్రెస్, వామపక్షాలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం ఓ పెద్ద జోక్ అని మోదీ విమర్శించారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శాస్త్రవేత్త నంబి నారాయణన్‌ను గూఢచర్యం కేసులో ఇరికించింది నాడు కేరళలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ప్రభుత్వమేనని మోదీ ఆరోపించారు. తమ పార్టీ నాయకుల రాజకీయ ప్రయోజనాల కోసమే వారు అలా చేశారన్నారు. తమ ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్‌ను ఇచ్చిన విషయాన్ని మోదీ గుర్తుచేశారు. విపక్షం అంటే అవినీతి గృహమని మోదీ అన్నారు. తనను కాపలాదారుడిగా మరోసారి చెప్పుకున్న ఆయన, తాను అధికారంలో ఉన్నంతవరకూ అవినీతిని అనుమతించనని తెలిపారు. ఎట్టుమానూర్‌లో శంకుస్థాపన కార్యక్రమానికి గవర్నర్ పి.సదాశివం, ముఖ్యమంత్రి పినరయి విజయన్ తదితరులు హాజరయ్యారు.

సంపూర్ణ ఆరోగ్యానికే ఆయుష్మాన్ భారత్..

సాక్షి, చెన్నై: తమిళనాడులోని మదురై సమీపంలోని తోప్పూర్‌లో రూ.1,264 కోట్లతో నిర్మించ తలపెట్టిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్–ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)కు మోదీ ఆదివారం శంకుస్థాపన చేశారు. 750 పడకలతో నిర్మిస్తున్న ఈ వైద్యశాలలో 100 ఎంబీబీఎస్ సీట్లతో వైద్య కళాశాల కూడా ఉండనుంది. మదురైలో మోదీ మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందనీ, ఆరోగ్య సమస్యలకు సంపూర్ణంగా పరిష్కారం చూపేందుకే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం దేశంలో ఏడు ఎయిమ్స్ వైద్యశాలలు పనిచేస్తుండగా ఇవన్నీ ఉత్తర భారతంలోనే ఉన్నాయి. మరో 14 ఎయిమ్స్‌ను ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్మిస్తోంది. మదురైలో నిర్మిస్తున్న ఎయిమ్స్‌తో తమిళనాడు ప్రజలందరికీ ఆరోగ్య సేవలు అందుతాయని మోదీ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం చేపడుతున్న వివిధ ఆరోగ్య పథకాల గురించి ఆయన వివరించారు. వెనుకబడిన రామనాథపురం జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి పళనిస్వామి మోదీని కోరారు. కాగా, కావేరీ నదీ జలాలు సహా అనేక అంశాల్లో మోదీ తమిళనాడు ప్రయోజనాలకు భంగం కలిగేలా వ్యవహరించి, రాష్ట్రానికి వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపిస్తూ ఎండీఎంకే కార్యకర్తలు తమ పార్టీ అధినేత గైకో నేతృత్వంలోని ఎయిమ్స్ శంకుస్థాపన స్థలం వద్ద ఆందోళనకు దిగాయి. నల్ల జెండాలు చేతబట్టి నిరసన తెలుపుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



మదురైలో జరిగిన కార్యక్రమంలో మోదీని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

రక్షణ హబ్‌గా మారుస్తాం..

తమిళనాడును రక్షణ ఉత్పత్తుల, విమాన రంగ హబ్‌గా మార్చడమే కేంద్రం లక్ష్యమని మోదీ అన్నారు. పరిశ్రమల పరంగా దేశంలోని అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో తమిళనాడు ఒకటని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎయిమ్స్ శంకుస్థాపన అనంతరం మదురైలోనే బీజేపీ నిర్వహించిన ర్యాలీలో మోదీ పాల్గొన్నారు. తమిళనాడుకు మంజూరైన రక్షణ పరిశ్రమల కారిడార్ వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. తూత్తుకుడి నౌకాశ్రయం దక్షిణ భారతంలో మరింత పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడగలదని మోదీ అన్నారు. కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్ల వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు ఏ ప్రమాదమూ లేదనీ, వారంతా నిశ్చింతగా ఉండాలని మోదీ వివరించారు. అవినీతిని అంతం చేయడం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందనీ, ఆర్థిక నేరగాళ్లను చట్టం ముందుకు నిలబెట్టి తీరుతామని పేర్కొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి!

మాసాంతపు 'మన్‌కీ బాత్'లో ప్రధాని

న్యూఢిల్లీ: ఓటు హక్కు పవిత్రమైందనీ, ప్రజాస్వామ్యానికి కీలకమైన ఈ హక్కును వినియోగించుకోలేని వారు ఆ తర్వాత బాధపడతారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మాసాంతపు మనస్సులో మాట(మన్‌కీ బాత్) కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన ఆకాశవాణిలో దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ మహాయజ్ఞంలో తన విధిని ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఎన్నికల కమిషన్‌ను ప్రశంసించారు. గత నాలుగేళ్లలో అంతరిక్ష రంగంలో ఎన్నో విజయాలు సాధించిన భారత్ త్వరలోనే చంద్రునిపై తన ఉనికిని చాటబోతోందని ప్రధాని తెలిపారు. నేతాజీకి సంబంధించిన పత్రాలను బహిర్గతం చేయాలన్న ప్రజల చిరకాల కోరికను తమ ప్రభుత్వం నెరవేర్చిందని చెప్పారు. 21వ శతాబ్దంలో జన్మించిన వారు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మొట్టమొదటి సారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్నారన్న ప్రధాని.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని యువతకు విజ్ఞప్తి చేశారు. 'ఎవరైనా ఏదైనా కారణంతో ఓటు వేయలేకపోతే, అది చాలా బాధాకరమైన విషయం' అని ఆయన అన్నారు. 'దేశంలో ఏదైనా జరగరానిది జరిగినప్పుడు అయ్యో, అప్పుడే ఓటు వేయలేకపోయామే.. ఓటు వేయని ఫలితంగానే ఇలాంటి చెడు ఘటన జరిగింది కదా.. అంటూ బాధపడతారు'అని ప్రధాని వ్యాఖ్యానించారు.

నేతాజీ పత్రాలను వెల్లడించాం

స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను సాహసికుడైన సైనికుడు, అద్భుతమైన నాయకుడుగా అభివర్ణించిన ప్రధాని .. బోస్‌కు సంబంధించిన రహస్య పత్రాలను బహిర్గతం చేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని తెలిపారు. ఆయనకు సంబంధించిన వస్తువులతో ఎర్రకోట వద్ద 'క్రాంతి మందిర్' మ్యూజియంను ప్రారంభించామన్నారు.

త్వరలోనే చంద్రునిపైకి..

చంద్రయాన్–2 కార్యక్రమం ద్వారా త్వరలోనే భారతీయులు చంద్రునిపై అడుగుపెట్టనున్నారని ప్రధాని మోదీ తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకు జరిగిన అంతరిక్ష ప్రయోగాలతో సమాన సంఖ్యలో గత నాలుగేళ్లలో చేపట్టిన అంతరిక్ష కార్యక్రమాలు విజయవంతమయ్యాయని ప్రధాని తెలిపారు.

ప్రధాని కానుకల వేలం ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీకి కానుకలుగా వచ్చిన వస్తువుల వేలం ఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మాడర్న్ ఆర్ట్(ఎన్‌జీఎంఏ) మ్యూజియంలో ఆదివారం ప్రారంభమైంది. తొలిరోజు రూ.1,000 ప్రారంభ ధర కలిగిన ఛత్రపతి శివాజీ విగ్రహం రూ.22 వేలకు అమ్ముడుపోయింది. ఈ వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని గంగా నది శుద్ధి ప్రాజెక్టు 'నమామీ గంగా'కు వెచ్చించనున్నారు. వేలంలో అందుబాటులో ఉంచిన వస్తువుల వివరాలు, వాటి ప్రారంభ ధరల్ని http://pmmementos.gov.in అనే వెబ్‌సైట్‌లో సందర్శకులు చూడొచ్చు. ఈ వస్తువుల ప్రారంభ ధరల్ని రూ.100 నుంచి రూ.30 వేల మధ్య నిర్ధారించినట్లు సాంస్కృతిక శాఖ ప్రకటించింది. తొలిరోజు వచ్చిన ఆదాయం ఎంత? ఏ వస్తువుకు అధిక ధర లభించిందో తెలియరాలేదు. సోమవారం నాటికి అమ్ముడుపోని వస్తువుల్ని 29, 30, 31 తేదీల్లో ఆన్‌లైన్‌లో వేలం వేస్తారు. దేశవిదేశాల్లో



మోదీ కానుకలుగా స్వీకరించిన శాలువాలు, టోపీలు, చిత్రపటాలు, జాకెట్లు, జ్ఞాపికలను వేలానికి ఉంచారు. మాజీ ఎంపీ నరసింహన్ సమర్పించిన 2.22 కిలోల వెండి ప్లేట్‌కు అత్యధికంగా రూ.30 వేల ప్రారంభ ధర నిర్ణయించారు.

29న అయోధ్యపై విచారణ రద్దు

న్యూఢిల్లీ: అయోధ్య భూ వివాదం కేసులో మంగళవారం జరగాల్సిన విచారణను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ కేసును విచారించాల్సి ఉండగా, వారిలో ఒకరైన జస్టిస్ ఎస్ఏ బాబ్డే మంగళవారం అందుబాటులో ఉండరనీ, కాబట్టి కేసు విచారణను ఆ రోజున రద్దు చేస్తున్నామంటూ సుప్రీంకోర్టు రిజస్ట్రీ ఓ నోటీసు విడుదల చేసింది. సీజేఐ రంజన్ గొగోయ్ ఈ ధర్మాసనానికి నేతృత్వం వహిస్తుండగా, జస్టిస్ బాబ్డేతో పాటు జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్ఏ నజీర్‌లు సభ్యులుగా ఉన్నారు. ఈ ధర్మాసనాన్ని ఈ నెల 25న ఏర్పాటు చేశారు. అంతకుముందు ఈ కేసు విచారణలో పాలుపంచుకునేందుకు జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ ఎన్వీ రమణలు విముఖత చూపారు. వారి స్థానంలో జస్టిస్ భూషణ్, జస్టిస్ నజీర్‌లు ధర్మాసనంలో చేరారు.

తాజ్‌మహల్ ఒకప్పుడు శివాలయం



న్యూఢిల్లీ: ప్రేమ చిహ్నం తాజ్‌మహల్ చరిత్రపై కేంద్ర మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే కొత్త వాదనకు తెరతీశారు. ఈ చారిత్రక కట్టడాన్ని నిర్మించింది ముస్లిం పాలకులు కాదని, ఇదొక శివ మందిరమని ఆదివారం వ్యాఖ్యానించారు. తాజ్‌మహల్‌ను జయసింహ అనే రాజు నుంచి కొనుగోలు చేసినట్లు షాజహాన్ తన జీవితచరిత్రలో పేర్కొన్నారని తెలిపారు. పరమతీర్థ అనే రాజు నిర్మించిన ఈ కట్టడం తేజో మహాలయ పేరుతో శివాలయంగా వెలుగొందిందని, తరువాత తాజ్‌మహల్‌గా మారిందని వివరించారు. ఇకనైనా మేల్కోకుంటే మన ఇళ్లు కూడా మసీదులుగా మారుతాయని, రాముడిని జహాపనా అని, సీతాదేవిని బీబీ అని పిలవాల్సి ఉంటుందని వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. హిందూ మహిళను తాకే వ్యక్తి చేతుల్ని నరికేసేలా చరిత్రను రాయాలని సూచించారు.

'బుకర్ ప్రైజ్'కు మ్యాన్ గ్రూప్ గుడ్‌బై

లండన్: ఆంగ్ల నవలారంగంలో బ్రిటన్ అందించే అత్యున్నత పురస్కారం 'మ్యాన్ బుకర్ ప్రైజ్' పేరు మారనుంది. బుకర్ ప్రైజ్‌కు 18 ఏళ్లుగా స్పాన్సర్ కొనసాగుతున్న హెడ్జ్ సంస్థ 'మ్యాన్ గ్రూప్' ఈ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపింది. అత్యుత్తమ ఆంగ్ల నవలలకు ఏటా ఈ అవార్డు కింద 50వేల బ్రిటిష్ పౌండ్లు(రూ.46.79 లక్షలు) బహుమతిగా అందజేస్తున్నారు. బ్రిటన్ రచయిత సెబాస్టియన్ ఫాల్క్స్ గతేడాది మ్యాన్ గ్రూప్‌ను ప్రజలకు శత్రువుగా అభివర్ణించారు. అంతేకాకుండా కామన్‌వెల్త్ దేశాల రచయితలకే పరిమితమైన ఈ అవార్డును 2014లో మిగిలిన దేశాలకు విస్తరించడంపై విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో స్పాన్సర్ బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించింది. దీనివల్ల ఏటా రూ.14.97 కోట్ల ఆర్థిక సాయాన్ని బుకర్ సంస్థ కోల్పోనుంది. 1969 నుంచి 2002 వరకూ బుకర్ అవార్డుకు మెక్‌కెన్నెల్ సంస్థ స్పాన్సర్‌గా వ్యవహరించింది. అప్పట్లో 21 వేల పౌండ్లుగా ఉన్న బహుమతిని 2002లో మ్యాన్ గ్రూప్ 50 వేల పౌండ్లకు పెంచింది.

భూపేన్ హజారికాపై వ్యాఖ్యలకు ఖర్గేపై కేసు

మోరిగావ్: అస్సాంకు చెందిన దివంగత గాయకుడు భూపేన్ హజారికాపై కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై కేసు నమోదైంది. భూపేన్ హజారికాకు కేంద్రం ఇటీవలే భారత రత్న ప్రకటించగా, ఇటీవలే కన్నుమూసిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సంఘ సేవకుడు శివకుమార స్వామికి భారత రత్న ఇవ్వకుండా ఓ గాయకుడికి (హజారికా), ఆరెస్సెస్ సిద్ధాంతాలను వ్యాప్తి చేసిన వ్యక్తి (నానాజీ దేశ్‌ముఖ్)కు అవార్డు ఇచ్చారని ఖర్గే విమర్శించారు. ఈ వ్యాఖ్యలతో అస్సాం ప్రజల మనోభావాలను ఆయన దెబ్బతీశారంటూ ఓ సమాచార హక్కు కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఈ కేసు నమోదు చేశారు.



బాల్య స్నేహితురాలు కింజాల్ పారిఖ్‌ను వివాహమాడిన పటీదార్ రిజర్వేషన్ల ఉద్యమ నాయకుడు హార్దిక్ పటేల్. అహ్మదాబాద్‌కు 130 కిలోమీటర్ల దూరంలోని దిగ్సార్ అనే గ్రామంలో ఆదివారం ఈ వేడుక జరిగింది. కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్న ఈ జంట కుటుంబ సభ్యుల అనుమతితో ఒక్కటయ్యారు.

పేదరికంలో ఉన్నా.. ఆదుకోండి

పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన చిన్నపిళ్లై ఆవేదన

సాక్షి, చెన్నై: ఇటీవల పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన మదురైకి చెందిన చిన్నపిళ్లై(67) కటిక పేదరికంలో కాలం వెళ్లదీస్తున్నారు. రెండున్నర దశాబ్దాలకు పైగా గ్రామీణ మహిళాభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతూ తమిళనాట కోరలు చాచిన కంతు వడ్డీకి వ్యతిరేకంగా ఆమె పోరాటం చేస్తున్నారు. కళంజియం పేరిట సంస్థను స్థాపించి మహిళల్ని ఏకంచేసి బాల్య వివాహాల్ని అడ్డుకుంటున్నారు. పద్మశ్రీకి ఎంపికైన సందర్భంగా మీడియా పలకరించగా.. తాను పేదరికంలో ఉన్నానని, ప్రభుత్వం అందించే వితంతు పింఛను రూ.వెయ్యితో కాలం నెట్టుకు వస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు.తనకు స్త్రీ శక్తి పురస్కారం అందజేసిన సందర్భంగా అప్పటి ప్రధానమంత్రి వాజ్‌పేయి తనకు పాదాభివందనం చేశారని ఆమె గుర్తు చేశారు.



అ'సామాన్యుల'కు గుర్తింపు

న్యూఢిల్లీ: సమాజ సేవ చేస్తున్న పలువురు సామాన్యులను ఈ ఏడాది పద్మ అవార్డులు వరించాయి. అందులో టీ విక్రేత, రూపాయికే పేదలకు వైద్యం అందిస్తున్న డాక్టర్ దంపతులు, దళితుల కోసం పాఠశాలను నెలకొల్పిన రిటైర్డ్ ఐపీఎస్ తదితరులున్నారు. ఒడిశాలో 100 ఎకరాలను సాగుచేసేందుకు ఒంటరిగా 3 కి.మీ మేర కాలువ తవ్విన గ్రామస్తుడు, మథురలో వేయికి పైగా ముసలి, జబ్బుపడిన ఆవుల బాగోగులు చూస్తున్న జర్మన్ పౌరురాలు కూడా తమ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డులను గెలుచుకున్నారు. కటక్‌కు చెందిన దేవరపల్లి ప్రకాశరావు టీ అమ్మడం ద్వారా వచ్చిన లాభాలతో మురికివాడల్లో నివసిస్తున్న పేద పిల్లలకు చదువు చెప్పిస్తున్నారు. మహారాష్ట్రలో నక్సల్స్ ప్రభావిత మేల్ఘాట్ జిల్లాలో స్మిత, రవీంద్ర కోల్హే అనే వైద్య దంపతులు స్థానిక గిరిజనులకు మూడేళ్లుగా కేవలం రూ.1, రూ.2 కే వైద్యం అందిస్తున్నారు. ఇక బిహార్‌కు చెందిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జ్యోతికుమార్ సిన్హా మహాదళిత్ ముసాహర్ కులానికి చెందిన విద్యార్థుల కోసం ఆంగ్ల మాధ్యమ పాఠశాలను స్థాపించారు. రెసిడెన్షియల్ వసతి కూడా ఉన్న ఈ పాఠశాలలో 1 నుంచి 12 తరగతుల వరకు 320 మంది విద్యార్థులు చేరారు. 'కెనాల్ మ్యాన్ ఆఫ్ ఒడిశా'గా పేరొందిన దైతారి నాయక్..పర్వతాల నుంచి నీటిని పొలాలకు పారించేందుకు బైత్రాని గ్రామంలో ఒక్కడే సుమారు నాలుగేళ్లు శ్రమించి మూడు కి.మీ పొడవైన కాలువను తవ్వి నీటి ఎద్దడి తీర్చారు. 'గౌ మాతాకీ ఆశ్రయదాత్రి'గా పేరొందిన జర్మనీకి చెందిన ఫ్రెడరిక్ ఇరినా బ్రూనింగ్ మథురలో 1200 గోవులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. పద్మశ్రీకి ఎంపికైన.. అస్సాంకు చెందిన ఇంజినీరింగ్ డ్రాపౌట్ ఉద్ధవ్ కుమార్ భరాలి దానిమ్మ గింజలు తీసే, వెల్లుల్లి పొట్టు తొలిచే యంత్రాలను తయారుచేశారు.

సీవీసీ చౌదరిపై చర్య తీసుకోలేకపోయాం

- అందుకు ఎలాంటి మార్గదర్శకాలు లేవు
- సమాచార హక్కు దరఖాస్తుకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సమాధానం
- మార్గదర్శకాల రూపకల్పనకు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడి

న్యూఢిల్లీ: కేంద్ర విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ)పై వచ్చే అవినీతి ఆరోపణల విచారణకు అవసరమైన మార్గదర్శకాలు ఇంకా రూపొందలేదని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ తెలిపింది. అందుకే సీవీసీ కేవీ చౌదరిపై గతేడాది అందిన రెండు ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయామని స్పష్టం చేసింది. కేంద్ర విజిలెన్స్ కమిషన్ నివేదిక ఆధారంగా జనవరి 10న ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కమిటీ.. సీబీఐ డైరెక్టర్ ఆలోక్ వర్మను తొలగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజిలెన్స్ కమిషనర్ విషయంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



'కేంద్ర చీఫ్ విజిలెన్స్ కమిషనర్, ఇతర కమిషర్ల విషయంలో కానీ అవినీతి, చెడు ప్రవర్తన ఆరోపణలు వస్తే దీనిపై చర్యలు తీసుకునేందుకు ప్రస్తుతం ఎలాంటి మార్గదర్శకాలు లేవు'అని సమాచార హక్కు చట్టం కింద ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ అధికారి సంజీవ్ చతుర్వేది అడిగిన ప్రశ్నకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సమాధానం ఇచ్చింది. ఎయిమ్స్‌లో జరిగిన అవినీతి కేసులను మూసివేయాల్సిందిగా కేంద్ర విజిలెన్స్ కమిషనర్ కేవీ చౌదరీ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు అక్రమంగా సిఫారసు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందిగా 2017లో రాష్ట్రపతికి సంజీవ్ లేఖలు రాశారు. ఎయిమ్స్‌లో సీనియర్ అధికారుల ప్రమేయం ఉన్న అవినీతి కేసును అధికారులు మూసేశారని సంజీవ్ ఆరోపించారు. ఈ మేరకు దాదాపు వెయ్యి పేజీల పత్రాలను రాష్ట్రపతి కార్యాలయానికి పంపారు.

ట్రైన్ 18 ఇక 'వందేభారత్ ఎక్స్‌ప్రెస్'

త్వరలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: దేశీయంగా, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన సెమీ హైస్పీడ్ రైలుకు కేంద్రం కొత్త పేరు పెట్టింది. ఇప్పటివరకూ 'ట్రైన్ 18'గా వ్యవహరిస్తున్న ఈ రైలుకు 'వందేభారత్ ఎక్స్‌ప్రెస్' అని నామకరణం చేసినట్లు రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. వారణాసి–ఢిల్లీ మధ్య ఈ రైలు పరుగులు పెడుతుందని వెల్లడించారు. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ రూ.97 కోట్ల వ్యయంతో 16 బోగీలున్న ఈ రైలును నిర్మించిందని పేర్కొన్నారు. పూర్తి స్వదేశీ సాంకేతికతతో భారత ఇంజనీర్లు 18 నెలల్లోనే పూర్తి ఏసీ సౌకర్యం ఉన్న ఈ రైలును అభివృద్ధి చేశారన్నారు. ఈ రైలులో రెండు ఎగ్జిక్యూటివ్ చైర్ కార్లు ఉంటాయన్నారు. లోకోమోటివ్‌ల అవసరం లేకుండా నడిచే తొలి రైలుగా 'వందేభారత్ ఎక్స్‌ప్రెస్' చరిత్ర సృష్టించిందని గోయల్ తెలిపారు. మేకిన్ ఇండియా కార్యక్రమం కింద ప్రపంచస్థాయి ప్రమాణాలతో రైళ్లను నిర్మించగలమని ఈ 'వందేభారత్ ఎక్స్‌ప్రెస్'తో తేటతెల్లమయిందన్నారు. వారణాసి–ఢిల్లీ మధ్య పరుగులు పెట్టే ఈ రైలు కాన్పూర్, అలహాబాద్‌లో ఆగుతుందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన సలహాలు, సూచనల ఆధారంగానే ఈ పేరును ఖరారు చేసినట్లు గోయల్ స్పష్టం చేశారు. ప్రధాని మోదీ త్వరలోనే 'వందేభారత్ ఎక్స్‌ప్రెస్'ను ప్రారంభిస్తారని ప్రకటించారు. ఈ తరహా రైళ్ల తయారీని వేగవంతం చేయాలని తాను రైల్వే బోర్డును కోరారనీ, దీనివల్ల రైళ్ల సగటు ఉత్పత్తి వ్యయం గణనీయంగా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.



రైతన్నల కోసం రూ.1.5 లక్షల కోట్లు!

- భారీ ప్యాకేజీ ప్రకటనకు సిద్ధమైన కేంద్రం
- వ్యవసాయ రంగం బడ్జెట్ మూడు రెట్లు పెంపు
- లోక్ సభ ఎన్నికలే లక్ష్యంగా ఎన్డీయే వ్యూహం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రం రైతులకు ఊరట కల్పించేలా కీలక నిర్ణయం తీసుకోనుందని సమాచారం. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయాలు చవిచూసిన నేపథ్యంలో అప్రమత్తమైన ఎన్డీయే ప్రభుత్వం రైతులను ప్రసన్నం చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగా రైతులను ఆదుకునేందుకు కేంద్రం రూ.1.50 లక్షల కోట్ల మేర వ్యవసాయ ప్యాకేజీని ప్రకటించే అవకాశమున్నట్లు వెల్లడించాయి. అన్నదాతల ఆదాయం పెంపు, చిన్న, సన్నకారు రైతులను ఆదుకునే విషయాన్ని కేంద్ర కేబినెట్ అజెండాలో చేర్చినట్లు పేర్కొన్నాయి. సోమవారం జరగాల్సిన ఈ భేటీ కొన్ని కారణాలతో వాయిదా పడింది.



పరిశీలనలో 'రైతు బంధు'..

పంట రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే రైతులకు వడ్డీని మాఫీ చేయడం ఈ సిఫార్సుల్లో మొదటిది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై రూ.15వేల కోట్ల భారం పడనుంది. అలాగే ఆహార పంటలను సాగుచేసే రైతన్నలు చెల్లించే బీమా ప్రీమియంను పూర్తిగా మినహాయించాలని వ్యవసాయ శాఖ సిఫార్సు చేసింది. తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన 'రైతు బంధు' ఒడిశా సర్కారు తెచ్చిన 'కాలియా' పథకాల తరహాలో రైతుల బ్యాంకు ఖాతాలకే నగదును నేరుగా బదిలీ చేసే అంశాన్నీ కేంద్రం పరిశీలిస్తున్నట్లు సమాచారం. రైతులను ఆదుకునేందుకు కేంద్రం తీసుకురానున్న ప్యాకేజీ రూ.1.50 లక్షల కోట్లు ఉండవచ్చని తెలుస్తోంది. దీంతోపాటు వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపుల్ని మూడు రెట్లు పెంచనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే ఈ సిఫార్సులపై ప్రధాని మోదీ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశమైన తర్వాతే స్పష్టత రానుందని భావిస్తున్నారు. 2019–20 బడ్జెట్ సమర్పణకు చాలా తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో త్వరితగతిన అమలు చేసేలా, లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి చేకూర్చేలా ఎన్డీయే ప్రభుత్వం ఈ కొత్త పథకానికి తుదిరూపు ఇవ్వనుంది.

చర్చి లక్ష్యంగా పేలుళ్లు

- 20 మంది మృతి... 111 మందికి తీవ్ర గాయాలు
- ఫిలిప్పీన్స్‌లో దారుణం

మనీలా: బాంబు పేలుళ్లతో ఫిలిప్పీన్స్ దేశం దద్దరిల్లింది. దక్షిణ ఫిలిప్పీన్స్ ప్రాంతంలోని కేథలిక్ చర్చ్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు ఆప్రాంతంలో బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 20 మంది అక్కడికక్కడే దుర్మరణం చెందగా 111 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారిలో 15 మంది పౌరులు, ఐదుగురు భద్రతాసిబ్బంది ఉన్నారు. సైనిక బలగాలు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించాయి. ఆదివారం చర్చి ప్రార్థనలకు వచ్చిన వారిని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు బాంబులు అమర్చారు. తొలిబాంబు పేలుడుతో చర్చి ప్రధాన ద్వారం వద్ద తొక్కిసలాట జరిగింది. నిమిషం వ్యవధిలో మరో బాంబుపేలినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రెండో బాంబును చర్చివద్ద నిలిపివున్న బైక్‌కు అమర్చి ఉంటారని అనుమానిస్తున్నారు. పేలుడు అనంతరం ముందు జాగ్రత్తగా అధికారులు సెల్‌ఫోన్ సిగ్నల్స్‌ను ఆపివేశారు. 'ఇది దేశ విద్రోహుల చర్య, ఇంతటి ఘాతుకానికి పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదు. ముష్కరులకు తగిన బుద్ధి చెబుతాం'అని దేశ అధ్యక్షుడు రోడ్రిగో దుతెర్తె ప్రకటించారు. అబూ సయ్యఫ్ ఉగ్ర సంస్థకు చెందిన ఉగ్రవాదులు కొద్దికాలంగా బాంబుపేలుళ్లకు పాల్పడుతున్నారు.



అమెరికాలో ఐదుగుర్ని చంపిన ఉన్మాది

న్యూఆర్లిన్స్: అమెరికాలోని లూసియానా రాష్ట్రంలో డకోటా థిరియట్(21) అనే ఉన్మాది రెచ్చిపోయాడు. సొంత తల్లిదండ్రులతో పాటు ప్రియురాలు, ఆమె తండ్రి, సోదరుడిని కూడా హ్యాండ్‌గన్‌తో కాల్చిచంపాడు. అనంతరం ఓ కారులో పరారయ్యాడు. లూసియానాలోని అస్కెన్షన్ ప్రాంతానికి చెందిన థిరియట్ తన తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం(స్థానిక కాలమానం) ప్రియురాలు సమ్మర్ ఎర్నస్ట్(20) ఇంటికి వెళ్లిన నిందితుడు.. ఆమెతో పాటు యువతి తండ్రి బిల్లీ(43), తమ్ముడు టానర్(17)ను చంపేశాడు. అనంతరం అక్కడే ఉన్న కారులో లివింగ్స్టన్‌లో ఉంటున్న తల్లిదండ్రులు కీత్(50), ఎలిజబెత్(50) వద్దకు చేరుకుని వారిపై కాల్పులు జరిపాడు. ప్రస్తుతం పరారీలో ఉన్న డకోటా థిరియట్ కోసం గాలింపును ప్రారంభించారు. ఈ హత్యల వెనుకున్న కారణం ఏంటో ఇంకా తెలియరాలేదు.

భూగర్భ జలాల్లో 'ప్లాస్టిక్'

- జలచరాలకు పెద్ద ముప్పు
- మన ఆహార వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం
- పరిశోధనలో వెల్లడి

వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా 25 శాతం మంది తాగునీటి అవసరాలను తీరుస్తున్న భూగర్భ జలాల్లోనూ ప్లాస్టిక్ భూతం ప్రవేశించిందని శాస్త్రవేత్తలు అంటున్నారు. 'గ్రౌండ్‌వాటర్' పత్రికలో ప్రచురించిన కథనం ప్రకారం, అమెరికాలోని రెండు జలాశయాల్లో సూక్ష్మ ప్లాస్టిక్ వ్యర్థాలు, ఔషధాలు, గృహోపకరణ వ్యర్థాలను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. 'ప్లాస్టిక్ పర్యావరణంలోకి సూక్ష్మకణాలుగా విచ్ఛిన్నమవుతుంది. ఇది జలచర జీవుల నాశనానికి కారణమవుతుంది' అని ఇలినాయిస్ టెక్నాలజీ సెంటర్ పరిశోధకుడు జాన్ స్కాట్ చెప్పారు. ఫలితంగా మన ఆహార సరఫరా వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు.



సున్నపురాయి పగుళ్ల ద్వారా, కొన్నిసార్లు మురుగునీటి సరఫరా వ్యవస్థ ద్వారా కూడా భూగర్భంలోకి నీరు చేరుతుంది. అయితే, పరిశోధకులు సెయింట్ లూయిస్ మెట్రోపాలిటన్, ఇల్లినాయిస్ ప్రాంతాల్లో పలు భూగర్భ జల నమూనాలను సేకరించి పరీక్షించగా 15.2 శాతం ప్లాస్టిక్ సూక్ష్మకణాలు కనిపించాయి. 1940 నుంచి 600 కోట్ల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు తయారైనట్లు ఒక అంచనా. అందులో కనీసం 79 శాతం పర్యావరణంలో కలిసిపోయి ఉంటుందని అనుకుంటున్నామని స్కాట్ ఆందోళన వ్యక్తం చేశారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
170 ▼	69 ▼
36,025	10,780

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	7,167	▲ 91
డోజోన్స్	24,737	▲ 184
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,809	▼ 10
డాక్స్	11,282	▲ 152
షాంఘై	2,602	▲ 10
నికాయ్	20,774	▲ 199

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	70.35	72.2
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	92.25	94.8
€	యూరో	ఎస్‌బీఐ	79.7	82.1
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63	68
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.7	52.05
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.75	54.3
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.6	20.75
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.45	11.2

ఈ అపోహలకు చోటివ్వొద్దు



- ఆన్‌లైన్‌లో అన్ని బీమా ఉత్పత్తులూ చౌక కాదు
- మ్యూచువల్ ఫండ్స్‌కు కాంపౌండింగ్ సరికాదు
- ఆన్‌లైన్ భారీ సేల్స్‌లో తగ్గింపు కొసరంతే
- సిప్‌పై నష్టాలు రావన్న గ్యారంటీ లేదు
- తెలుసుకోవాల్సిన ఇలాంటి అంశాలెన్నో..

ఆర్థిక విషయాలు, పెట్టుబడుల విషయంలో కచ్చితంగా ఉంటేనే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలం. అయితే, ఈ మార్గంలో ఎన్నో సందేహాలు, అపోహలు తలెత్తుతుంటాయి. ఏది నిజం? అన్నది తెలిస్తేనే సరైన నిర్ణయాలకు అవకాశం ఉంటుంది. అపోహతో తీసుకునే నిర్ణయం నష్టానికి కారణం కావచ్చు. అందుకని ఇన్వెస్టింగ్, పలు ఉత్పత్తుల కొనుగోళ్లకు సంబంధించి తప్పుడు అభిప్రాయాలకు చెక్ పెట్టాలి. అవేంటన్నది తెలియజేసే కథనమే ఇది.



ఆన్‌లైన్‌లో బీమా మంచిదా?



ఆన్‌లైన్లో టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు కొనుగోలు చేయడం వల్ల తక్కువ ధరలకే వస్తాయి. ఉదాహరణకు రూ.కోటి టర్మ్ పాలసీని 30 ఏళ్ల వ్యక్తి 30 ఏళ్ల కాలానికి తీసుకునేట్టు అయితే మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్‌లైన్‌లో ఇచ్చే సూపర్ టర్మ్ ప్లాన్‌పై ఏడాది ప్రీమియం కింద రూ.12,100 చార్జ్ చేస్తోంది. ఇంతే మొత్తానికి ఇదే సంస్థ నుంచి ఆన్‌లైన్‌లో టర్మ్ ప్లాన్ తీసుకుంటే ప్రీమియం 30 శాతం తక్కువకు రూ.8,378కే వస్తోంది. అయితే, వైద్య బీమా, వాహన బీమా పాలసీలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడం వల్ల ఈ విధమైన డిస్కౌంట్ ఉండడం లేదు. ఆన్‌లైన్‌లో వాహన బీమా ప్రీమియం తక్కువకే తీసుకోవచ్చన్న ప్రకటనలు వినిపిస్తుంటాయి. వైద్య బీమా లేదా కారు బీమాను ఆన్‌లైన్‌లో తీసుకునే ముందు సంబంధిత ప్లాన్ సదుపాయాల గురించి తప్పక తెలుసుకోవాలి. ముఖ్యంగా ఇన్సూర్డ్ డిక్లేర్డ్ వ్యాల్యూ (వాహన బీమా మొత్తం) తగ్గించడం ద్వారా తక్కువ ప్రీమియంతో ఆకర్షించే ఎత్తుగడలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. అందుకే జాగ్రత్తగా వ్యవహరించాలి.

ఫండ్స్‌కు కాంపౌండింగ్ సూత్రమా!




మ్యూచువల్ ఫండ్స్ దీర్ఘకాలంలో మంచి రాబడులను ఇస్తాయన్న అభిప్రాయం ఉంది. దీర్ఘకాలం పాటు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల కాంపౌండింగ్ ప్రయోజనంతో అధిక రాబడులు పొందొచ్చని ఎవరైనా చెబితే అది తప్పే అవుతుంది. ఎందుకంటే కాంపౌండింగ్ అన్నది అప్పటికే పెట్టుబడిపై ఆర్జించిన వడ్డీ ఆదాయానికి అదనపు రాబడి. ఫిక్స్‌డ్ డిపాజిట్లలో వడ్డీ రేటును ముందే నిర్ణయించడం జరుగుతుంది. ఏటేటా వృద్ధి ఒకే విధంగా ఉంటుంది. కానీ, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ రాబడులు స్థిరంగా ఉండవు. 2016లో లార్జ్‌క్యాప్ ఈక్విటీ ఫండ్ సగటు రాబడి 3.7 శాతంగా ఉంటే, 2017లో అది 31 శాతానికి పెరిగింది. తిరిగి 2018లో 1.1% దగ్గరే ఆగిపోయింది. స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ నెగెటివ్ రిటర్నులు (నష్టాలు) కూడా ఇస్తాయి. ''కాంపౌండింగ్ అన్నది కాంపౌండ్ వడ్డీకే వినియోగించడం జరుగుతుంది. మ్యూచువల్ ఫండ్స్ ఎటువంటి వడ్డీని ఆఫర్ చేయవు. కనుక కాంపౌండింగ్ అంశం మ్యూచువల్ ఫండ్స్‌కు వర్తించదు'' అని ఫ్రీఫిన్‌కాల్ అనే బ్లాగ్‌సైట్ వ్యవస్థాపకుడు ఎం.పట్టాభిరామన్ పేర్కొన్నారు. కాంపౌండింగ్ వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్)ను పనితీరును అంచనా వేయడానికి వినియోగిస్తారని, దీనివల్ల ఇన్వెస్టర్లు తమ పెట్టుబడి కాంపౌండింగ్ చెందుతున్నట్టు భావిస్తారని, ఇది తప్పుడు అభిప్రాయంగా పేర్కొన్నారు.

బీమా నుంచి వచ్చే రాబడి



బీమా పాలసీల మెచ్యూరిటీ మొత్తంపై ఆదాయపన్ను మినహాయింపు ప్రయోజనం చాలా మందిని ఆకర్షిస్తూ ఉంటుంది. బీమా సంస్థలు, ఏజెంట్లు కూడా ఈ అంశాన్ని ప్రస్తావిస్తుంటారు. వార్షిక ప్రీమియానికి కనీసం 10 రెట్లు బీమా కవరేజీ ఉన్న పాలసీలకే సెక్షన్ 10(10డి) ప్రయోజనం ఉంటుంది. అప్పుడే మెచ్యూరిటీపై పన్ను ఉండదు. అయితే, నాణేనికి మరో కోణమన్నట్టు... ద్రవ్యోల్బణం కంటే తక్కువ రాబడి ఇచ్చే సంప్రదాయ బీమా పాలసీల వంటి సాధనాలు ఏమంత సూచనీయం కావు. సంప్రదాయ బీమా పాలసీలు 4.5–5 శాతం రాబడులను ఇస్తాయి. 15 ఏళ్లు అంతకుమించిన కాలానికి అయితే రాబడులు 5–6 శాతం మధ్య ఉంటాయి. మరి ద్రవ్యోల్బణం వ్యయాన్ని పరిగణలోకి తీసుకుంటే గత 15 ఏళ్ల కాలంలో కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ 6.49 శాతం ఉంది. దీంతో బీమాపై వచ్చే రాబడుల కంటే ద్రవ్యోల్బణ రేటే ఎక్కువ ఉన్నట్టు. అందుకే సంప్రదాయ బీమా పాలసీల మెచ్యూరిటీ మొత్తంపై పన్ను మినహాయింపు ప్రయోజనం ఏమంత ఆకర్షణీయం కాదు.

క్రెడిట్ కార్డులు ఎక్కువైతే ఊబిలోకి వెళ్లినట్టేనా?



డీమోనిటైజేషన్ తర్వాత డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహం పుణ్యమా అని క్రెడిట్ కార్డుల వినియోగం కూడా పెరిగింది. అయితే, ఒకటికి మించిన క్రెడిట్ కార్డులు ఉంటే అధిక వినియోగానికి దారితీసి రుణ ఇబ్బందుల్లోకి వెళ్లిపోవచ్చన్న అభిప్రాయం ఒకటి ఉంది. నిజానికి ఒకటికి మించిన కార్డుల వల్ల అధిక ఖర్చులకు దారితీయాలనేమీ లేదు. ఈ అభిప్రాయం అవాస్తవమని మనీమంత్ర ఎండీ రాజ్‌ఖోస్లా స్పష్టం చేశారు. ఎక్కువ క్రెడిట్ కార్డులు ఉంటే ప్రయోజనాలు కూడా ఎక్కువే ఉన్నాయంటున్నారు. చెల్లించని బ్యాలెన్స్‌ను బదలాయించుకునేందుకు చాలా కార్డు సంస్థలు అనుమతిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు మొదటి ఒకటి, రెండు నెలల పాటు చార్జీ వసూలు చేయడం లేదు. అంతకుమందు కార్డు కంటే తక్కువ వడ్డీ రేటునే వసూలు చేస్తున్నాయి. క్రెడిట్ స్కోరు పెంచుకోవచ్చు. ఒకటికి మించి కార్డులు ఉంటే ఒక కార్డుపై వినియోగ రేషియో తక్కువగా ఉంటుంది. క్రెడిట్ వినియోగ రేషియో క్రెడిట్ స్కోరులో కీలక పాత్ర పోషిస్తుంది. రివార్డులు, ప్రయోజనాలు కూడా పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అన్ని కార్డులు ఒకే తీరులో ఉండవు. కొన్ని గ్రోసరీ కొనుగోళ్లకు బాగా పనికొస్తాయి. కొన్ని ఆన్‌లైన్ షాపింగ్‌పై బెనిఫిట్స్ ఎక్కువ ఆఫర్ చేయవచ్చు. కొన్ని ఇంధనం పోయించుకుంటే సర్‌చార్జీ వసూలు చేయడం లేదు'' అని ఖోస్లా తెలిపారు.

సిప్ అన్నది సురక్షితమేనా?



రెగ్యులర్‌గా సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లడం వల్ల నష్టపోవడానికి అవకాశం ఉండదని నమ్ముతున్నారా...? నిజానికి సిప్ విధానంలో ఈక్విటీ ఫండ్స్‌లో నష్టాలు రావన్న గ్యారంటీ ఏదీ ఉండదు. కేవలం రిస్క్‌ను తగ్గించుకునేందుకే సిప్ పనికొస్తుంది. సిప్ అన్నది ఇటీవలి కాలంలో చాలా ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రతీ నెలా సిప్ మార్గంలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి రూ.7,000 కోట్లకుపైగా పెట్టుబడులు వస్తుండడం గమనార్హం. సిప్ అన్నది మార్కెట్ అస్థిరతల నుంచి రక్షణ కల్పిస్తుంది. కొనుగోలు ధరను సగటు చేస్తుంది. అంతేకానీ నష్టాలు రాకుండా హామీనివ్వలేదు. ''సిప్ అనేది మంచి రాబడులు, చెత్త రాబడులను ఇవ్వదు. రాబడులు అన్నవి మీరు పెట్టుబడి పెట్టే పథకం పనితీరుపైనే ఆధారపడి ఉంటాయి'' అని మార్కెటింగ్ నిపుణులు రేణు మహేశ్వరి పేర్కొన్నారు. నిజానికి ఏడాది, ఏడాదిన్నర క్రితం సిప్ విధానంలో ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్ ప్రారంభించిన వారికి ఇప్పటికీ నష్టాలే మిగిలాయి. నష్టాలు చూపిస్తున్నాయని సదరు సిప్‌ను ఆపడం కూడా తెలివైన నిర్ణయం కాదన్నది ఆర్థిక సలహాదారుల సూచన. సిప్ అనేది దీర్ఘకాల లక్ష్యాల సాధనకు వీలు కల్పించే క్రమశిక్షణతో కూడిన ఉపకరణం వంటిదిగా పేర్కొంటున్నారు. భిన్న మార్కెట్ సైకిల్స్ (పెరిగినప్పుడు, పడినప్పుడు)లో దీంతో ప్రయోజనం పొందొచ్చంటున్నారు.

చిన్న మొత్తాల పథకాల్లో స్థిరమైన రాబడులు?



చిన్న మొత్తాల పొదుపు పథకాల గురించి అందరికీ తెలుసు. వీటిలో రిస్క్ ఉండకపోవడంతోపాటు రాబడులకు హామీ ఉంటుంది. అయితే, రాబడులు మాత్రం ఎప్పుడూ ఫిక్స్‌డ్‌గా ఒకే రేటుతో ఉండవు. ప్రభుత్వ బాండ్ ఈల్డ్‌తో చిన్న మొత్తాల పొదుపు పథకాలపై రేట్లను అనుసంధానించి కొన్నేళ్లు అవుతోంది. కనుక వీటి రేట్లు మార్కెట్‌తో అనుసంధానమై ఉంటాయి. దీంతో ఎప్పటికప్పుడు తగ్గడం, పెరగడం జరుగుతుంది. ప్రతీ త్రైమాసికానికి ఓ సారి వడ్డీ రేట్లను కేంద్రం సమీక్షిస్తుంటుంది. ఎన్ఎస్‌సీ, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, టర్మ్ డిపాజిట్లపై మాత్రం ఇన్వెస్ట్ చేసే సమయంలో ఉన్న వడ్డీ రేటే కాల వ్యవధి ముగిసే వరకు అమలవుతాయి.

ఆన్‌లైన్‌లో భారీ తగ్గింపుల్లో నిజమెంత?



ఈ కామర్స్ సంస్థలు ప్రత్యేక సందర్భాల్లో మెగాసేల్స్ పేరిట భారీ తగ్గింపు ధరలతో విక్రయాలు నిర్వహించే ప్రచారాన్ని చూసే ఉంటారు. అటువంటి మెగాసేల్స్‌లోనే తక్కువ ధరలకు లభిస్తాయన్న అభిప్రాయం కరెక్ట్ కాదు. స్టాక్ క్లియరెన్స్ సేల్స్ అంటూ తరచుగా నిర్వహించే విక్రయాల సందర్భాల్లోనూ తగ్గింపు ఆఫర్లు ఉంటాయి. పైగా తరచుగా, రోజువారీగా ఇవి కొన్ని ఉత్పత్తులపై తగ్గింపులను ఆఫర్ ఇస్తూనే ఉంటాయి. సాధారణ రోజులతో పోలిస్తే భారీ తగ్గింపు విక్రయ కార్యక్రమాల సందర్భాల్లో కొనుగోళ్లు నాలుగు రెట్లు అధికంగా ఉంటాయని రిటైల్ టెక్నాలజీ సంస్థ ఏస్ టర్టిల్ అంటోంది. ఈ సంస్థ భారీ విక్రయ కార్యక్రమాలపై అధ్యయనం చేయగా... అటువంటి సందర్భాల్లో ఉత్పత్తుల విక్రయ ధరలు సాధారణ రోజులతో పోలిస్తే సగటున 17% తక్కువగా ఉంటున్నట్టు తెలిసింది. సాధారణ రోజుల్లో ఉండే డిస్కౌంట్లతో పోలిస్తే ఇదేమంత భారీ తగ్గింపు కాదన్నది ఈ సంస్థ విశ్లేషణ. ఇక, భారీ తగ్గింపు సందర్భాల్లో... ఉత్పత్తుల ధరలను పెంచి, వాటిపై ఎక్కువ తగ్గింపు ఇస్తుంటారనీ ఈ సంస్థ అంటోంది.

గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఈక్విటీల సెగ

2018లో రూ. 570 కోట్ల ఉపసంహరణ • వరుసగా ఆరో ఏడాది తగ్గిన ఇన్వెస్ట్‌మెంట్స్



అధిక రాబడుల కోసం ఇన్వెస్టర్లు ఈక్విటీల వైపు చూస్తుండటంతో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) కళ తప్పుతున్నాయి. వరుసగా ఆరో ఏడాది కూడా గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ జరిగింది. 2018లో వీటి నుంచి రూ. 571 కోట్ల మేర పెట్టుబడులను ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారు. దీంతో గోల్డ్ ఫండ్స్ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) 2017తో పోలిస్తే 2018లో 6 శాతం క్షీణించి రూ. 4,571 కోట్లకు తగ్గింది. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) విడుదల చేసిన గణాంకాల్లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. గతేడాది ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల్లోకి రూ. 1.27 లక్షల కోట్ల మేర ఇన్వెస్ట్‌మెంట్స్ వచ్చాయి. మొత్తం మీద మ్యూచువల్ ఫండ్ స్కీముల్లోకి రూ. 1.54 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. యాంఫీ గణాంకాల ప్రకారం 2017లో 14 పసిడి ఆధారిత ఈటీఎఫ్‌ల నుంచి రూ. 730 కోట్ల ఉపసంహరణ జరిగింది. 2016లో రూ. 942 కోట్లు, 2015లో రూ. 891 కోట్లు, 2014లో రూ. 1,651 కోట్లు, 2013లో రూ. 1,815 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్స్‌ను మదుపుదారులు వెనక్కి తీసుకున్నారు.

పసిడికి కొంతైనా కేటాయించాలి..

'అంతర్జాతీయంగా 2011–13 మధ్య కాలంలో 1,900 డాలర్లకు ఎగిసిన ఔన్సు (31.1 గ్రాములు) బంగారం రేటు ఆ తర్వాత నుంచి 1,050–1,350 మధ్యలోనే తిరుగుతోంది. రూపాయి బలహీనపడటంతో ఇటీవల దేశీయంగా పసిడి రేటు కాస్త పెరిగినా.. మొత్తం మీద చూస్తే గత ఐదేళ్లుగా పెట్టుబడి సాధనంగా ఇన్వెస్టర్లు బంగారం వైపు ఎక్కువగా మొగ్గు చూపడం లేదు. ఇదే సమయంలో ఈక్విటీ మార్కెట్లు భారీ రాబడులు ఇస్తుండటంతో.. గోల్డ్ ఫండ్స్, ఈటీఎఫ్‌ల నుంచి పెట్టుబడులు తరలిపోతున్నాయి. అయితే, పోర్ట్‌ఫోలియోకి హెడ్జింగ్‌గా కొంతైనా పసిడికి కేటాయించడం శ్రేయస్కరం' అని మార్నింగ్‌స్టార్ సంస్థ డైరెక్టర్ కౌస్తుభ్ బేలాపూర్కర్ చెప్పారు. రియల్ ఎస్టేట్, బంగారం, పొదుపు సాధనాలపై రాబడులు ఆకర్షణీయంగా లేకపోవడం కూడా ఈక్విటీల వైపు ఇన్వెస్టర్లు మళ్లడానికి కారణంగా మారిందని నిపుణులు పేర్కొన్నారు. అయితే అనిశ్చితి పరిస్థితులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది ద్వితీయార్థం నుంచి పసిడిపై పెట్టుబడులు మళ్లీ పెరిగే అవకాశం ఉందని ఎస్సెల్ మ్యూచువల్ ఫండ్ సీఐవో విరాల్ బేరావాలా చెప్పారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | బ్రోకరేజ్ సంస్థ: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ.2,096 **టార్గెట్ ధర:** రూ.2,500



ఎందుకంటే: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయి. రుణ వృద్ధి జోరుగా ఉండటం, ఇతర ఆదాయం మెరుగుపడటంతో నికర లాభం 20 శాతం వృద్ధితో రూ.5,590 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం 22 శాతం పెరిగి రూ.12,570 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ నిలకడగా 4.3 శాతంగా నమోదైంది. ఫీజు ఆదాయం 27 శాతం ఎగసి రూ.3,650 కోట్లకు పెరిగింది. ఈ క్యూ2లో రూ.33 కోట్లు ట్రెజరీ నష్టాలు రాగా ఈ క్యూ3లో రూ.474 కోట్ల ట్రెజరీ లాభాలు వచ్చాయి. ఫలితంగా ఇతర ఆదాయం 27 శాతం పెరిగి రూ.4,920 కోట్లకు చేరింది. రుణాలు 24 శాతం పెరిగి రూ.7.8 లక్షల కోట్లకు పెరగ్గా, డిపాజిట్లు 22 శాతం పెరిగాయి. స్థూల మొండి బకాయిలు 1.38 శాతంగా, నికర మొండి బకాయిలు 0.42 శాతంగా ఉన్నాయి. ప్రొవిజనల్ కవరేజ్ రేషియో70 శాతంగా ఉంది. ఎన్నికల సందర్భంగా రైతు రుణ మాఫీ ప్రయత్నాలు జరగవచ్చన్న అంచనాలతో ఈ బ్యాంక్ రూ.320 కోట్ల కేటాయింపులు జరిపింది. వ్యక్తిగత రుణాలు, వ్యాపారి, క్రెడిట్ కార్డ్, వాహన రుణాలకు సంబంధించిన రిటైల్ రంగ రుణాల విషయంలో బ్యాంక్ మార్కెట్ వాటా పెరుగుతోంది. మూలధన నిధులు పుష్కలంగా ఉండటం, లిక్విడిటీ సమస్యలు లేకపోవడంతో రానున్న సంవత్సరాల్లో వృద్ధి జోరును ఈ బ్యాంక్ కొనసాగించగలదని భావిస్తున్నాం. నిర్వహణ వ్యయాలు నియంత్రణలోనే ఉండటం, కాసా నిష్పత్తి 40 శాతానికి మించి ఉండటం, డిజిటైజేషన్ ప్రయత్నాల వల్ల బ్యాంక్ పనితీరు మరింతగా మెరుగుపడే అవకాశాలు, బ్రాంచ్‌ల విస్తరణ జోరు కారణంగా ఆదాయం పెరుగుతుండటం, రుణ నాణ్యత అత్యుత్తమంగా ఉండటం... ఇవన్నీ సానుకూలాంశాలు. రెండేళ్లలో నికర లాభం 23 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలదని అంచనా.

ఐటీసీ | బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 279 **టార్గెట్ ధర:** రూ.340



ఎందుకంటే: ఐటీసీ కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు దాదాపు అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయి. అమ్మకాల పరంగా చూస్తే, ఇతర వ్యాపారాలు రెండంకెల వృద్ధిని, సిగరెట్ల అమ్మకాలు 8 శాతం వృద్ధిని సాధించాయి. మొత్తం మీద ఆదాయం 15 శాతం వృద్ధి చెందింది. నిర్వహణ లాభం 11 శాతం పెరిగి రూ.4,326 కోట్లకు వృద్ధి చెందింది. పొగాకు ధరలు అధికంగా ఉండటంతో సిగరెట్ల విభాగం మార్జిన్ తగ్గింది. ఆటా, బిస్కట్లు, స్నాక్స్, నూడుల్స్ అమ్మకాలు బాగా ఉండటంతో ఎఫ్‌ఎంసీజీ విభాగం ఎబిటా రూ.122 కోట్ల నుంచి రూ.173 కోట్లకు పెరిగింది. ఈ క్యూ3లో 5.4 శాతంగా ఉన్న ఎబిటా మార్జిన్లు రెండేళ్లలో రెండంకెల స్థాయికి చేరగలవని అంచనా వేస్తున్నాం. ఎఫ్‌ఎంసీజీ విభాగంలో రూ.70,000 కోట్ల టర్నోవర్ సాధించడం లక్ష్యంగా కొత్త సెగ్మెంట్లలోకి ప్రవేశిస్తోంది. బాస్మతియేతర బియ్యం విక్రయాలు, డెయిరీ సెగ్మెంట్లోకి ఇటీవలనే ప్రవేశించింది. త్వరలోనే దేశవ్యాప్తంగా పాల పానీయాలను అందుబాటులోకి తేనున్నది. ప్రవేశించిన ప్రతి సెగ్మెంట్‌లోనూ వీలైనంత త్వరగా లాభదాయకత సాధించాలనేది కంపెనీ వ్యూహం. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ ఎబిటా మార్జిన్ 38 శాతంగా, నికర లాభ మార్జిన్ 28 శాతంగా ఉన్నాయి. మార్జిన్లు బాగా ఉండటంతో రూ.12,650 కోట్ల నిర్వహణ క్యాష్ ఫ్లోస్‌ను సాధించింది.రిటర్న్ ఆన్ క్యాపిటల్ ఎంప్లాయిడ్ 31 శాతంగా ఉంది. రెండేళ్లలో ఆదాయం 10 శాతం, నికర లాభం 11 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి సాధిస్తాయని అంచనా.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (జనవరి-24- 2019 అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1–2 ఏళ్లు	3–5 ఏళ్లు
ఆంధ్రా బ్యాంక్	6.26-6.6	6.8	6.75
యాక్సిస్ బ్యాంక్	6.75-7.1	7.3-7.35	7.25
బ్యాంక్ ఆఫ్ బరోడా	5.75-6.5	6.7-7	6.7
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.7	6.5
కెనరా బ్యాంక్	6.35-6.4	7-7.1	6.2
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.5	6.6	6.5
కార్పొరేషన్ బ్యాంక్	6-6.35	6.55-6.8	6.5
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	6.25-7.1	7.3	7.25-7.4
ఐసీఐసీఐ బ్యాంక్	6.25-6.75	6.9-7.1	7.25-7.5
ఐడీబీఐ బ్యాంక్	6.25-6.5	7.2-7.25	6.85-7.3
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.5-7	7.4-7.65	7
కోటక్ మహీంద్రా బ్యాంక్	7	7.25-7.4	7-7.1
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.5-6.75	7	6.7
ఎస్‌బీఐ	6.35-6.4	6.8	6.80
సిండికేట్ బ్యాంక్	6.35	6.7-7.05	7.15
పీఎన్‌బీ	6.35	6.75-6.85	6.25-6.75
యస్ బ్యాంక్	7-7.1	7.25-7.85	7.25-7.5

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

అన్ని రకాల స్టాక్స్‌లో పెట్టుబడికి అవకాశం

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీక్యాప్



ఈ పథకం లార్జ్‌క్యాప్, మిడ్, స్మాల్ క్యాప్ ఇలా అన్ని రకాల స్టాక్స్‌లోనూ ఇన్వెస్ట్ చేస్తుంది. అందుకు ఇది మల్టీక్యాప్ విభాగంలోకి వస్తుంది. దీర్ఘకాలంలో ఈ పథకం పనితీరు నిలకడగా ఉండడాన్ని గమనించొచ్చు. ఐదు, పదేళ్ల కాలంలో చూసుకుంటే బెంచ్ మార్క్ కంటే అధిక రాబడులను ఇచ్చింది. స్థిరమైన రాబడులు ఆశించే వారు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీక్యాప్ ఫండ్ పథకాన్ని దీర్ఘకాలం ఇన్వెస్టింగ్ కోసం పరిశీలించొచ్చు.

పనితీరు..: ఈ పథకం గడిచిన ఏడాది కాల పనితీరు ప్రామాణిక సూచీ కంటే మెరుగ్గా ఉంది. ఏడాది కాలంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీక్యాప్ పథకం నికరంగా నష్టాలనే ఇచ్చింది. మైనస్ 4.62శాతంగా ఉన్నాయి. 2018లో మార్కెట్ల పనితీరు నిరాశాజనకంగా ఉన్న విషయం గమనార్హం. కానీ, ఇదే కాలంలో ఈ పథకం పనితీరుకు ప్రామాణికంగా భావించే బీఎస్ఈ 500 రాబడులు కూడా మైనస్ 7.12 శాతంగా ఉండటం గమనార్హం. మూడేళ్ల కాలంలో అయితే, ఈ పథకంలో రాబడులు 13.27 శాతంగా ఉంటే, బీఎస్ఈ 500 రాబడులు 14.42 శాతంగా ఉన్నాయి. ఐదేళ్ల కాలంలో బీఎస్ఈ 500 రాబడులు 14.51 శాతం, పదేళ్ల కాలంలో 17.13 శాతంగా ఉండగా, ఈకాలంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీక్యాప్ 16.51 శాతం, 18.45 శాతం చొప్పున రాబడులు ఇచ్చింది. దీర్ఘకాలంలో బీఎస్ఈ 500కు మించి రాబడులను ఇచ్చినట్టు తెలుస్తోంది. అందుకే స్వల్ప కాలం కోసం కాకుండా ఐదేళ్లు, అంతకుమించి ఎక్కువ కాలం కోసం ఈ పథకాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు.




పెట్టుబడుల తీరు

ఈ పథకం తన పెట్టుబడుల్లో దాదాపు 95 శాతం నుంచి 100 శాతం వరకు ఈక్విటీల్లోనే ఇన్వెస్ట్ చేస్తుంది. అస్థిరతల సమయాల్లో నగదు నిల్వలు పెంచుకుంటుంది. 2015, 2016 సంవత్సరాల్లో బెంచ్ మార్క్‌లను మించి రాబడులను ఇవ్వగా, 2017లో మాత్రం వెనుకబడింది. సాఫ్ట్‌వేర్, హెల్త్‌కేర్ కంపెనీల్లో ఎక్కువ పెట్టుబడులే ఇందుకు కారణం. ఆ ఏడాదిలో ఈ రెండు రంగాల స్టాక్స్ ర్యాలీ చేయలేదు. 2018 జనవరి నుంచి సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పెట్టుబడులను పెంచుకోవడం, ఈ స్టాక్స్ ర్యాలీ చేయడంతో ఈ పథకం ఎన్‌ఏవీ రికవరీ అయింది. బ్యాంకులు, ఫైనాన్షియల్ రంగ స్టాక్స్‌కు ఈ పథకం ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. వీటిల్లో సుమారు 34 శాతం మేర పెట్టుబడులు పెట్టింది. ఆ తర్వాత ఇంధన రంగ స్టాక్స్‌లో సుమారు 19 శాతం మేర పెట్టుబడులు ఉన్నాయి. టెక్నాలజీ, ఎఫ్ఎంసీజీ, ఆటోమొబైల్ రంగాలకు సుమారు 9 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించడాన్ని గమనించొచ్చు. అతుల్ పటేల్, శంకరన్ నరేన్ ఫండ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నారు. వ్యాపార పరంగా అధిక నాణ్యత, వృద్ధి అవకాశాలున్న స్టాక్స్‌ను ఎంచుకుని ఇన్వెస్ట్ చేయడం చేస్తుంటారు. ముఖ్యంగా ఈక్విటీల్లో భారీ రిస్క్ వద్దనుకునే వారికి ఈ పథకం అనుకూలంగా ఉంటుంది.

టాప్ హోల్డింగ్స్

అంశం	పెట్టుబడుల శాతం
ఐటీసీ	5.42
ఎన్‌టీపీసీ	4.88
వేదాంత	3.89
ఓఎన్‌జీసీ	3.70
యాక్సిస్ బ్యాంకు	3.56
భారతీ ఎయిర్‌టెల్	3.51
ఎస్‌బీఐ	3.32
మదర్సన్‌సుమి	3.23
సన్‌ఫార్మా	3.12
కోల్ ఇండియా	2.97



స్టాక్ మార్కెట్ కూడా వాతావరణం లాంటిదే.
పరిస్థితులు బాగా లేకపోతే మెరుగుపడేదాకా ఓపిక పట్టాలి.
- వారెన్ బఫెట్, ఇన్వెస్ట్‌మెంట్ గురు

బొమ్మ-బొరుసు



పన్ను బకాయిలేమీ లేవు

- ఐటీ నుంచి మైండ్‌ట్రీ షేర్లు విడిపించుకుంటాం
- కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ స్పష్టీకరణ






న్యూఢిల్లీ: ఆదాయపన్ను శాఖ చెబుతున్నట్లుగా తమ కంపెనీ కట్టాల్సిన పన్ను బాకీలేమీ లేవని కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ స్పష్టం చేసింది. బాకీలు రాబట్టుకోవడం కోసమంటూ ఆదాయపన్ను శాఖ అటాచ్ చేసుకున్న మైండ్‌ట్రీ షేర్లను విడిపించుకునేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని తెలిపింది. 'ఆదాయ పన్ను శాఖ 148, 153ఎ సెక్షన్ల కింద ఇచ్చిన నోటీసులకు అనుగుణంగా ప్రమోటరు, కంపెనీ సవరించిన రిటర్నులను దాఖలు చేయడం జరిగింది. వీటి ప్రకారం.. కంపెనీ, దాని అనుబంధ సంస్థలు గానీ, ప్రమోటరు గానీ కట్టాల్సిన పన్ను బాకీలేమీ లేవు' అని స్టాక్ ఎక్స్ఛేంజీలకు కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ తెలిపింది. సీసీడీ కాఫీ చెయిన్‌ను కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ నిర్వహిస్తోంది. కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్, దాని ప్రమోటరు సిద్ధార్థ రిటర్నుల్లో చూపిన దానికంటే మరింత ఎక్కువ మొత్తం పన్నులు చెల్లించాల్సి ఉంటుందనే కారణంతో.. ఐటీ సంస్థ మైండ్‌ట్రీలో వారికున్న వాటాల్లో కొంత భాగాన్ని ఐటీ శాఖ అటాచ్ చేసింది. వీటినే విడిపించుకునేందుకు కాఫీ డే, సిద్ధార్థ ప్రయత్నాల్లో ఉన్నారు.

వివాదమిదీ..

ఐటీ సంస్థ మైండ్‌ట్రీ ఏర్పాటైన తొలినాళ్ల నుంచి పెట్టుబడులతో తోడ్పాటునందించిన వీజీ సిద్ధార్థ గ్రూప్‌నకు ఈ కంపెనీలో 21 శాతం వాటాలు ఉన్నాయి. ప్రస్తుతం మరో ఐటీ సంస్థ ఎల్‌అండ్‌టీ ఇన్ఫోటెక్‌కు ఈ వాటాలను విక్రయించేందుకు సిద్ధార్థ చర్చలు జరుపుతున్నారు. ఒకవేళ ఇది పూర్తయితే నియంత్రణ సంస్థ నిబంధనల ప్రకారం టేకోవర్ చేసిన కంపెనీ ఓపెన్ ఆఫర్ ప్రకటించాల్సి రావొచ్చు. అయితే, మైండ్‌ట్రీలో కాఫీ డే వాటాల విక్రయాన్ని సుబ్రతో బాగ్చి, ఎన్ఎస్ పార్థసారథి తదితర వ్యవస్థాపకులు వ్యతిరేకిస్తున్నారు. మేనేజ్‌మెంట్ మద్దతు లేకుండా ఈ డీల్ సాకారమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఈలోగా మైండ్‌ట్రీలో సిద్ధార్థకు ఉన్న షేర్లలో 22.2 లక్షల షేర్లు, కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్‌కున్న 52.7 లక్షల షేర్లను ఐటీ శాఖ అటాచ్ చేసుకుంది. జనవరి 25తో మొదలుకుని ఆరు నెలల పాటు ఈ ఆర్డరు అమల్లో ఉండనుంది. దీంతో సిద్ధార్థ వాటాల విక్రయ ప్రక్రియకు మరిన్ని అడ్డంకులు ఎదురయ్యేట్లు కనిపిస్తున్నాయని పరిశీలకులు చెబుతున్నారు.

బడ్జెట్‌పై మార్కెట్ దృష్టి..!

- ఫిబ్రవరి 1న బడ్జెట్
- ఈనెల 29–30 తేదీల్లో ఫెడ్ సమావేశం
- ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ ఫలితాలు ఈ వారంలోనే..



న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సర్కార్ ఈవారంలో ప్రవేశపెట్టనున్న మధ్యంతర బడ్జెట్ కోసం మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఫిబ్రవరి 1న (శుక్రవారం) లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు అధికార ప్రభుత్వం సన్నద్ధమవుతుండగా.. ఈ బడ్జెట్లో వెల్లడికానున్న పలు కీలక ప్రతిపాదనలు దేశీ స్టాక్ సూచీలకు దిశా నిర్దేశం చేయనున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. బడ్జెట్లో.. ప్రజాకర్షక పథకాలకే ఈసారి పెద్దపీట ఉండనుందని మార్కెట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. ప్రధాన సూచీలపై బడ్జెట్ ప్రభావం ఏ విధంగా ఉండనుందనే అంశంపై పలువురు మార్కెట్ విశ్లేషకుల అంచనాలను పరిశీలించినట్లయితే.. 'గ్రామీణ, వ్యవసాయ ఆధారిత రంగాలకు బడ్జెట్ ప్రాధాన్యత ఇవ్వనుంది. చిన్న వ్యాపారాలను ప్రోత్సహించే విధంగా నిర్ణయాలు వెలువడనున్నాయని భావిస్తున్నాం.' అని మినాన్స్ వెల్త్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ సీఈఓ అనురాగ్ భాటియా అన్నారు. బడ్జెట్ ఉన్నందున మార్కెట్లో ఈవారం అధికస్థాయి ఒడిదుడుకులకు అవకాశం ఉందని ఈక్విటీ99 సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ రాహుల్ శర్మ వ్యాఖ్యానించారు. ఈ ప్రధాన అంశానికి తోడు 31న జనవరి ఎఫ్ అండ్ ఓ ముగింపు ఉండడం, అంతర్జాతీయ అంశాల నేపథ్యంలో సూచీలు రేంజ్ బౌండ్‌లో కదలాడే ఆస్కారం ఉందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగం హెడ్ వినోద్ నాయర్ అంచనావేసారు.

క్యూ3 ఫలితాల ప్రభావం..

మరో మూడు వారాలపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సర క్యూ3(అక్టోబర్–డిసెంబర్) కార్పొరేట్ ఫలితాల వెల్లడి కొనసాగనుంది. అయితే.. ఈవారంలో 500 బీఎస్ఈ కంపెనీలు, నిఫ్టీ 50లోని 16 కంపెనీలు ఫలితాలును ప్రకటించనుండగా.. అధిక శాతం బ్యాంకుల ఫలితాలు ఈవారంలోనే వెల్లడికానున్నాయి. సోమవారం కెనరా బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, సిటీ యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాలను ప్రకటించనున్నాయి. మంగళవారం ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కార్పొరేషన్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ ఫలితాలు వెలువడనున్నాయి. బుధవారం ఐసీఐసీఐ బ్యాంక్, గురువారం దేనా బ్యాంక్.. శుక్రవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) గణాంకాలు వెలువడనున్నాయి. శనివారం సిండికేట్ బ్యాంక్ ఫలితాలు ప్రకటించనుంది. ఇక ఈవారంలోనే హెచ్‌డీఎఫ్‌సీ, బజాజ్ ఫైనాన్స్, సుందరం ఫైనాన్స్ లిమిటెడ్ వంటి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలతో పాటు భారతీ ఎయిర్ టెల్, హీరో మోటోకార్ప్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, ఎన్‌టీపీసీ, ఇండియన్ ఆయిల్, యూపీఎల్ దిగ్గజ సంస్థల ఫలితాలు వెల్లడికానున్నాయి. ఈ ఫలితాలు మార్కెట్ దిశపై ప్రభావం చూపనున్నాయని ఎపిక్ రీసెర్చ్ సీఈఓ ముస్తఫా నదీమ్ అన్నారు. ఇక శుక్రవారం రోజునే ఆటోమొబైల్ కంపెనీల అమ్మకాల డేటా వెల్లడికానుంది.

ఈవారంలోనే ఫెడ్ సమావేశం

అమెరికా ఫెడరల్ రిజర్వు రెండు రోజుల సమావేశం మంగళవారం ప్రారంభంకానుంది. 29–30 తేదీల్లో జరిగే ఈ సమావేశం ద్వారా 2019 తొలి పాలసీ సమీక్షను యూఎస్ ఫెడ్ వెల్లడించనుంది. ఈఏడాదిలో రెండు సార్లు వడ్డీ రేట్లు పెరిగేందుకు అవకాశం ఉండగా.. దీర్ఘకాలం కొనసాగిన అమెరికా ప్రభుత్వ మూసివేత, నెమ్మదించిన ఆర్థిక వ్యవస్థ, అమెరికా–చైనాల వాణిజ్య యుద్ధం నేపథ్యంలో ఫెడ్ ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందనే అంశంపై స్పష్టతలేదని రాయిటర్స్ ప్రచురించింది. ఈ సమావేశం నుంచి వెలువడే కీలక నిర్ణయాలపై మార్కెట్ వర్గాలు దృష్టి సారించాయని ఏంజెల్ బ్రోకింగ్ అనలిస్ట్ ప్రథమేష్ మాల్యా అన్నారు. అంతర్జాతీయ అంశాల పరంగా.. ఇదే వారంలో టెక్నాలజీ దిగ్గజాలైన ఆపిల్, మైక్రోసాఫ్ట్ ఫలితాలను ప్రకటించనున్నాయి. మరోవైపు వెనిజులాలో రాజకీయ సంక్షోభం కారణంగా క్రూడాయిల్ ధరలు ప్రభావితం కానున్నాయని కమోడిటీ మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

ఎఫ్ఐఐల నికర విక్రయాలు...

ఈఏడాది జనవరి 1–25 కాలంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) భారత స్టాక్ మార్కెట్ నుంచి రూ.5,880 కోట్లను ఉపసంహరించుకున్నట్లు డిపాజిటరీ డేటా ద్వారా వెల్లడయింది. అయితే, వీరు డెట్ మార్కెట్‌లో రూ.163 కోట్లను ఈకాలంలో పెట్టుబడి పెట్టారని తేలింది.

నేడు ప్రభుత్వ బ్యాంకుల సీఈఓలతో గోయల్ భేటీ

న్యూఢిల్లీ: కీలకమైన మధ్యంతర బడ్జెట్‌కు మూడు రోజుల ముందు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రభుత్వరంగ బ్యాంకుల చీఫ్‌లతో సోమవారం సమావేశం కానున్నారు. దీనికి ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ సైతం హాజరయ్యే అవకాశం ఉందని అధికార వర్గాల సమాచారం. ఎంఎస్ఎంఈ, సాగు రంగానికి రుణ వితరణ ఏ విధంగా ఉంది, ప్రభుత్వం నిర్వహిస్తున్న పలు పథకాల పనితీరు, ప్రభుత్వరంగ బ్యాంకుల పనితీరు తదితర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ బ్యాంకుల ఎన్‌పీఏలు రూ.9.62 లక్షల కోట్ల నుంచి రూ.23,000 కోట్ల మేర తగ్గగా, ఇదే కాలంలో అవి రూ.60వేల కోట్లకు పైగా మొండి బకాయిలను వసూలు చేయగలిగాయి.

నేటి బోర్డు సమావేశాలు

కెనరా బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సియట్, ఎస్కార్ట్స్, గోద్రేజ్ ప్రాపర్టీస్, టాటా పవర్, టీటీకే ప్రెస్టీజ్, మహీంద్రా లైఫ్ స్పేస్ డెవలపర్స్, సిటీ యూనియన్ బ్యాంక్, షాపర్స్ స్టాప్, ఓకార్డ్ సెంచురీ టెక్స్‌టైల్స్, చెన్నై పెట్రోలియమ్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 28-1-2019

విశాఖ	410-00
చిత్తూరు	423-00
వరంగల్	404-00
చెన్నై	430-00
ముంబై	457-00
విజయవాడ	408-00
నమక్కల్	420-00
గోదావరి	408-00
27-1-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	402-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.60
బెంగళూరు	425-00
కోల్‌కతా	440-00
ఢిల్లీ	425-00

ఎగుమతులకు ప్రోత్సాహకాలు కొనసాగించాలి

ఫార్మా-హెల్త్‌కేర్



ఆరోగ్యానికి మరింత చేయూతనివ్వాలి • ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల డిమాండ్

న్యూఢిల్లీ: రానున్న మధ్యంతర బడ్జెట్‌పై ఫార్మా, హెల్త్‌కేర్ రంగం పెద్దగా ఆశలు పెట్టుకోకపోయినప్పటికీ కొన్ని విధానపరమైన చర్యల అవసరాన్ని ప్రస్తావించాయి. ఎగుమతులకు ప్రస్తుతం ప్రోత్సాహాలు కల్పిస్తున్న 'భారత్ నుంచి సరుకుల ఎగుమతుల పథకం (ఎంఈఐఎస్)' 2020 మార్చిలో కాల వ్యవధి తీరిపోతుందని, దీన్ని పొడిగించాలని పరిశ్రమ ప్రధానంగా కోరుతోంది. ఈ తరహా పథకాలను పొడిగించాలని పరిశ్రమ కోరుకుంటున్నట్టు డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ చైర్మన్ సతీష్ రెడ్డి తెలిపారు. ఇక పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) వ్యయాలపై ఉన్న 150 శాతం ప్రామాణిక మినహాయింపును 200 శాతం చేయాలన్నది మరో డిమాండ్‌గా ఆయన పేర్కొన్నారు. ఆర్అండ్‌డీకి ఈ మాత్రం ప్రోత్సాహకం అవసరమన్నారు.

జీఎస్టీని మినహాయించాలి...

జీఎస్టీని హేతుబద్ధీకరించాలని హెల్త్‌కేర్ రంగం కోరుతోంది. పెరిగిన ముడి పదార్థాల ధరలతో ఆరోగ్య సంరక్షణ భారంగా మారుతోందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ ఎండీ సునీతా రెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్య సేవలను అందుబాటు ధరల్లో ఉంచాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా... ఈ రంగానికి సరఫరా అయ్యే ముడి పదార్థాలపై జీఎస్టీని మినహాయించాలని సూచించారు. ఎందుకంటే ఈ ధరల భారాన్ని రోగుల నుంచి రికవరీ చేసుకోవడానికి అనుమతించకపోవడంతో, చెల్లించిన జీఎస్టీని సర్దుబాటు చేసుకోలేకపోతున్నట్టు ఆమె చెప్పారు. దీనివల్ల తమ మార్జిన్లపై ప్రభావం పడి, తమ నిధుల లభ్యత ప్రభావితమై అధునాతన టెక్నాలజీలు, నాణ్యతపై వెచ్చించే అవకాశం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 150 శాతం తరుగుదలను అనుమతించే సెక్షన్ 35ఏడీని తిరిగి ప్రవేశపెట్టాలని కూడా ఆమె డిమాండ్ చేశారు. నూతన ప్రాజెక్టులపై పెట్టుబడులకు ఇది ప్రోత్సాహకాలు కల్పిస్తుందని ఆమె వివరించారు. ''ఆరోగ్య రంగానికి నిధుల కేటాయింపును గణనీయంగా పెంచాలి. మన దేశంలో ఓ వ్యక్తి ఆరోగ్యం కోసం చేసే సగటు ఖర్చు 85 డాలర్లు (6,035). ఇతర దేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ. రానున్న బడ్జెట్‌లో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని నియంత్రణలు లేకుండా ప్రైవేటు రంగానికీ విస్తరింపచేయాలి'' అని హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్, సీఈవో అజయ్ కుమార్ పేర్కొన్నారు.

ప్రోత్సాహకాలు కావాలి...

చిన్న పట్టణాల్లోనూ ఆస్పత్రుల ఏర్పాటుకు ప్రోత్సాహకాలను రానున్న బడ్జెట్‌లో ప్రకటించాలని హెల్త్‌కేర్ స్టార్టప్ 'లెట్స్ఎండీ' కోరింది. అలాగే, బీమా వ్యాప్తి కోసం చర్యలు అవసరమని ఈ సంస్థ సీఈవో నివేష్ ఖండేల్‌వాల్ అభిప్రాయపడ్డారు. ఆరోగ్య సేవల వ్యయాలు పెరిగిపోతుంటే, ఈ రంగంలో బీమా విస్తరణ అతి తక్కువగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు.





ఆయుష్మాన్ భారత్ పథకం, మెడికల్ డివైజెస్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఏర్పాటు మొదలైన చర్యలతో కేంద్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా హెల్త్‌కేర్ విభాగంపై మరింతగా దృష్టి పెడుతోంది. ఈ నేపథ్యంలో రాబోయే బడ్జెట్‌లో వీటికి తగినంత స్థాయిలో నిధుల కేటాయింపు జరుగుతుందని ఆశిస్తున్నాం. ప్రస్తుతం వైద్య పరికరాల రంగం 70 శాతం పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. దీన్నుంచి బయటపడేందుకు మేకిన్ ఇండియా నినాదం తరహాలో బై ఇండియా (భారతీయ ఉత్పత్తులే కొనుగోలు చేయడం) విధానాలు కూడా అమలు చేస్తే బాగుంటుంది.

- జీఎస్‌కే వేలు, మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ గ్రూప్ చైర్మన్

జూన్ నాటికి ఐఐఎఫ్‌ఎల్ హోల్డింగ్స్ డీమెర్జర్



కోల్‌కతా: ఐఐఎఫ్‌ఎల్ హోల్డింగ్స్‌ను మూడు కంపెనీలుగా విడగొట్టి లిస్టింగ్ చేసే కార్యక్రమం వచ్చే ఆర్థిక సంవత్సరం (2019–20) మొదటి త్రైమాసికం (ఏప్రిల్–జూన్) నాటికి పూర్తవుతుందని అంచనా వేస్తున్నట్టు కంపెనీ ఎండీ ఆర్‌వెంకటరామన్ ప్రకటించారు. ప్రస్తుతం ఐఐఎఫ్‌ఎల్ గ్రూపు చేపట్టిన ఎన్‌సీడీ ఇష్యూ కింద ఇప్పటికే రూ.1,000 కోట్లకు సబ్‌స్క్రిప్షన్ లభించినట్టు చెప్పారు. ఈ రిటైల్ ఇష్యూ నుంచి రూ.2,000 కోట్లను సమీకరించాలన్న లక్ష్యాన్ని చేరుకుంటామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఐఐఎఫ్‌ఎల్ హోల్డింగ్స్‌ను... ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ (రుణాలు, మార్ట్‌గేజ్ వ్యాపారం), ఐఐఎఫ్‌ఎల్ వెల్త్ (వెల్త్, మ్యూచువల్ ఫండ్స్ వ్యాపారం), ఐఐఎఫ్‌ఎల్ సెక్యూరిటీస్ (క్యాపిటల్ మార్కెట్స్)గా కంపెనీ విభజించి వాటిని ఏకకాలంలో లిస్ట్ చేయాలన్నది కంపెనీ డీమెర్జర్ ప్రణాళిక. వ్యాపారాలను వేరు చేయడం ద్వారా అవి తమ పూర్తి సామర్థ్యం మేరకు రాణించే అవకాశాన్ని కల్పిస్తామని వెంకటరామన్ చెప్పారు. డీమెర్జర్ ప్రక్రియలో భాగంగా ఐఐఎఫ్‌ఎల్ హోల్డింగ్స్ వాటాదారులకు వారి వద్దనున్న ప్రతి ఏడు షేర్లకు... ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ ఏడు షేర్లు, ఐఐఎఫ్‌ఎల్ సెక్యూరిటీస్ 7 షేర్లతోపాటు ఐఐఎఫ్‌ఎల్ వెల్త్ షేరు ఒకటి లభిస్తుంది.

నిత్యాంక్ ఇన్‌ఫ్రాపవర్‌తో సంబంధాల్లేవు

- మనీలాండరింగ్ ఆరోపణలను ఖండించిన ఎస్సెల్ గ్రూపు



న్యూఢిల్లీ: పెద్ద నోట్ల రద్దు అనంతరం పెద్ద ఎత్తున డిపాజిట్లు చేసిన నిత్యాంక్ ఇన్‌ఫ్రా పవర్ అండ్ మల్టీ వెంచర్స్ సంస్థపై ఎస్ఎఫ్ఐవో దర్యాప్తు చేస్తుండగా, ఈ సంస్థతో తమకు సంబంధాలు ఉన్నట్టు వచ్చిన వార్తలను ఎస్సెల్ గ్రూపు కంపెనీలు జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్, డిష్ టీవీ ఖండించాయి. నిత్యాంక్ ఇన్‌ఫ్రా స్వతంత్ర కంపెనీ అని, ఇది ఎస్సెల్ గ్రూపునకు సంబంధించినది కాదని స్టాక్ ఎక్స్ఛేంజీలకు జీ ఎంటర్‌టైన్‌మెంట్ వివరణ ఇచ్చింది. ఓ వెబ్‌సైట్‌లో వచ్చిన వార్తా కథనంలో పేర్కొన్నట్టు... ఎటువంటి లావాదేవీల్లోనూ జీ ఎంటర్‌టైన్‌మెంట్ పాత్ర లేదని స్పష్టం చేసింది. ఇదంతా ఉద్దేశపూర్వకంగా హాని కలిగించేందుకు చేస్తున్నదేనని, దీనిపై న్యాయపరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపింది. ఎస్ఎఫ్ఐవో అడిగిన పూర్తి సమాచారాన్ని ఎస్సెల్ గ్రూపు సంస్థలు ఇప్పటికే అందించాయని, అదనంగా ఇంకేమీ సమాచారం కోరలేదని స్పష్టం చేసింది. వీడియోకాన్ డీ2హెచ్‌ను విలీనం చేసుకునే కార్యక్రమంలో నిత్యాంక్‌తో ఎటువంటి లావాదేవీలు జరగలేదని డిష్ టీవీ సైతం స్పష్టం చేసింది.

పీఎస్‌యూ సాధారణ బీమా కంపెనీలకు రూ.4,000 కోట్లు


న్యూఢిల్లీ: రానున్న బడ్జెట్‌లో ప్రభుత్వరంగంలోని సాధారణ బీమా కంపెనీలకు ప్రభుత్వం రూ.4,000 కోట్ల మేర నిధులను కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఓరియంటల్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలకు రూ.4,000 కోట్లు కేటాయించాలని ఆర్థిక వ్యవహారాల విభాగం కోరినట్టు అధికార వర్గాలు తెలిపాయి. న్యూ ఇండియా అష్యూరెన్స్ ఇప్పటికే స్టాక్ మార్కెట్లో లిస్టయింది.

సెన్సెక్స్ తక్షణ మద్దతు 35,850

మార్కెట్ పంచాంగం


అమెరికా, యూరప్, కొన్ని ఆసియా సూచీలు బ్రేక్అవుట్‌ను సాధించి, ముందడుగు వేసినప్పటికీ, భారత్ సూచీలు కీలక స్థాయిల వద్ద నిరోధాన్ని చవిచూసి, వెనకడుగువేశాయి. ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈఓ చందా కొచ్చర్‌పై సీబీఐ..ఎఫ్ఐఆర్ నమోదుచేయడం, ఐటీసీ బలహీన ఆర్థిక ఫలితాలు, జీ గ్రూప్ సంక్షోభం వంటి ప్రతికూల వార్తలకు తోడు ఈ వారంలో వెల్లడికానున్న కేంద్ర బడ్జెట్లో ద్రవ్యలోటు పెరగవచ్చన్న ఆందోళనలు భారత్ మార్కెట్‌ను కిందకు లాగాయి. తాజాగా మరో పెద్ద కార్పొరేట్ గ్రూప్ అయిన జీ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో బ్యాంకింగ్ షేర్లు కదిలే తీరు, వ్యవసాయ రంగానికి కేంద్రం ప్రకటిస్తుందని భావిస్తున్న ప్యాకేజీ, బడ్జెట్ ప్రతిపాదనలపై విదేశీ ఇన్వెస్టర్లు వ్యవహరించే పెట్టుబడుల శైలికి అనుగుణంగా సమీప భవిష్యత్తులో మన మార్కెట్ కదలికలు ఉండవచ్చు. ఇక సూచీల సాంకేతిక అంశాల విషయానికొస్తే...

సెన్సెక్స్ సాంకేతికాలు...



జనవరి 25తో ముగిసిన వారం ప్రథమార్థంలో 36,700 పాయింట్ల గరిష్టస్థాయివరకూ పెరిగిన బీఎస్ఈ సెన్సెక్స్ ద్వితీయార్థంలో 35,953 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు అంతక్రితంవారంకంటే 362 పాయింట్లు నష్టపోయి 36,025 పాయింట్ల వద్ద ముగిసింది. గత మూడు వారాల్లో రెండు దఫాలు మద్దతునిచ్చిన 35,850 పాయింట్ల స్థాయి ఈ వారం సెన్సెక్స్‌కు కీలకం. ఈ వారం ఈ స్థాయిని పరిరక్షించుకోగలిగితే మరోదఫా 36,700 పాయింట్ల స్థాయిని పరీక్షించే అవకాశం వుంటుంది. సెన్సెక్స్‌కు తొలుత 36,260 పాయింట్ల స్థాయి నిరోధాన్ని కల్పించవచ్చు. ఈ స్థాయి పైన క్రమేపీ 36,475 పాయింట్ల వరకూ పెరిగే అవకాశం వుంటుంది. ఈ స్థాయిపైన ముగిస్తేనే తదుపరి అప్‌ట్రెండ్ సాధ్యపడి 36,700 పాయింట్ల వద్దకు పెరిగే చాన్స్ వుంటుంది. ఈ వారం క్షీణిస్తే 35,850 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతు దిగువన ముగిస్తే వేగంగా 35,475– 35,380 పాయింట్ల శ్రేణి వద్దకు పతనం కావొచ్చు. ఈ లోపున ముగిస్తే 35,000 పాయింట్ల స్థాయికి పడిపోవచ్చు.

నిఫ్టీ తక్షణ మద్దతు 10,730



గతవారం తొలుత 10,987 పాయింట్ల గరిష్టస్థాయికి పెరిగిన ఎన్ఎస్ఈ నిఫ్టీ తదుపరి 10,756 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 127 పాయింట్ల నష్టంతో 10,780 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం మార్కెట్ పెరిగితే నిఫ్టీకి 10,865 పాయింట్ల వద్ద తొలి అవరోధం కలగవచ్చు. అటుపైన క్రమేపీ 10,930 పాయింట్ల స్థాయికి పెరగవచ్చు. ఇదే స్థాయి నుంచి గత శుక్రవారం అధిక ట్రేడింగ్ పరిమాణంతో నిఫ్టీ పతనమైనందున, ఈ స్థాయిపైన ముగిస్తేనే తదుపరి అప్‌ట్రెండ్ సాధ్యపడుతుంది. అటుపై క్రమేపీ 10,987 పాయింట్ల స్థాయిని తిరిగి అందుకోవచ్చు. ఈ వారం తొలి నిరోధాన్ని దాటలేకపోయినా, మార్కెట్ నిస్తేజంగా ప్రారంభమైనా, నిఫ్టీకి 10,730 పాయింట్ల సమీపంలో తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ స్థాయిలోపున ముగిస్తే 10,630 పాయింట్ల వద్ద క్రమేపీ తగ్గవచ్చు. ఈ స్థాయి దిగువన ముగిస్తే 10,535 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు.

– పి. సత్యప్రసాద్

రేటింగ్ ఆధారంగా పెట్టుబడులు వద్దు

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను గత కొంతకాలం నుంచి మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. కనీసం 10–15 ఏళ్ల దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేయాలనేది నా ఆలోచన. మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో నా ఇన్వెస్ట్‌మెంట్స్‌ను పెంచాలనుకుంటున్నాను. అయితే నా పోర్ట్‌ఫోలియోలోని అన్ని మిడ్‌క్యాప్ ఫండ్స్ గత ఏడాది ఒక్క డిసెంబర్ నెలలోనే 3–4 శాతం వరకూ నష్టపోయాయి. వీటిల్లోంచి పెట్టుబడులను వెనక్కి తీసుకొని వేరే ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయమంటారా?

–సంజయ్, విజయవాడ

మిడ్‌క్యాప్ ఫండ్స్ సాధారణంగా దీర్ఘకాలంలో మంచి రాబడులే ఇస్తాయి. అయితే ఒక నెల పనితీరును బట్టి ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహాన్ని మార్చడం సరైన నిర్ణయం కాదు. వచ్చే నెల పూర్తిగా భిన్నమైన పనితీరు ఉండొచ్చు కదా ! అందుకని మీ పోర్ట్‌ఫోలియోలో మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొనసాగించండి. కనీసం ఏడాది కాలాన్ని పరిగణనలోకి తీసుకొని ఫండ్స్ పనితీరును మదింపు చేయాలి. ఈ కాలంలో మీరు ఇన్వెస్ట్ చేస్తున్న ఫండ్... ఇదే కేటగిరీలోని ఇతర ఫండ్ల కన్నా అధ్వానమైన పనితీరును కనబరిస్తేనే, అప్పుడు ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకోవాలి.

నేను రెండేళ్ల నుంచి మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. నా పోర్ట్‌ఫోలియోలో బీఎన్‌పీ పారిబా మిడ్‌క్యాప్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ మిడ్ క్యాప్ ఆపర్చునిటీస్, సుందరమ్ మిడ్‌క్యాప్ ఫండ్‌లు ఉన్నాయి. వీటిల్లో బీఎన్‌పీ పారిబా పనితీరు అంతంతమాత్రంగానే ఉంది. అంతేకాకుండా కొన్ని వెబ్‌సైట్లలో ఈ ఫండ్ రేటింగ్ కూడా తక్కువగా ఉంది. అందుకని ఈ ఫండ్ నుంచి వైదొలగి సుందరమ్, హెచ్‌డీఎఫ్‌సీ మిడ్‌క్యాప్‌ల్లో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. తగిన సూచనలివ్వండి.

–పల్లవి, విశాఖపట్టణం

సాధారణంగా ఒక ఇన్వెస్టర్ పోర్ట్‌ఫోలియోలో రెండు మిడ్‌క్యాప్ ఫండ్‌లు ఉంటే సరిపోతుంది. మిడ్‌క్యాప్ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేసేటప్పుడు ఆ ఫండ్ పనితీరు గతంలో ఎలా ఉందో తప్పనిసరిగా చూడాలి. కొన్ని వెబ్‌సైట్లలో రేటింగ్ తక్కువగా ఉందన్న కారణంగా ఒక ఫండ్ నుంచి ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకోవడం సరైన నిర్ణయం కాదు. మ్యూచువల్ ఫండ్ వెబ్‌సైట్లు...సాపేక్ష పనితీరు ఆధారంగా ఫండ్స్‌కు రేటింగ్‌నిస్తాయి.. ఫండ్ తీవ్రమైన ఒడిదుడుకుల్లో ఉన్నా, మంచి రాబడులు ఇవ్వలేకపోయినా, ఆ ఫండ్‌కు తక్కువ రేటింగ్‌ను ఇస్తాయి. ఈ కేటగిరీలోని ఇతర ఫండ్స్‌తో పోల్చితే మీ ఫండ్ పనితీరు అధ్వానంగా ఉంటేనే ఆ ఫండ్ నుంచి వైదొలగాలి. ఇక బీఎన్‌పీ పారిబా మిడ్‌క్యాప్ ఫండ్ విషయానికొస్తే, రెండేళ్ల క్రితం ఈ ఫండ్‌కు కొత్త ఫండ్ మేనేజర్ వచ్చారు. పాత ఫండ్ మేనేజర్ నిష్క్రమణ కారణంగా కొన్ని అంశాలు సర్దుకోకపోవడంతో ఈ ఫండ్ పనితీరు ఆశించిన స్థాయిలో లేదు. మీరన్నట్లుగా గత ఏడాది మిడ్‌క్యాప్ ఫండ్స్‌కు పీడకలే అని చెప్పవచ్చు. అయితే 10–15 ఏళ్ల దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేసే మీలాంటి ఇన్వెస్టర్లకు ఇది మంచిదే. ఎందుకంటే మీకు తక్కువ ధరలోనే ఎక్కువ మ్యూచువల్ ఫండ్ యూనిట్లు లభిస్తాయి కదా ! ముందు అనుకున్నట్లుగానే మీ ప్రణాళికలకు అనుగుణంగానే మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొనసాగించండి. మార్కెట్ పతన బాటలో ఉన్నప్పుడు కూడా ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొనసాగిస్తే, మీకు యావరేజింగ్ ప్రయోజనాలు లభిస్తాయి.

నా పోర్ట్‌ఫోలియోలో పదికి మించి ఫండ్స్ ఉన్నాయి. వీటిని తగ్గించుకోవాలనుకుంటున్నాను. ఫండ్స్ సంఖ్యను తగ్గించుకోవడానికి ఏమైనా ప్రాతిపదికలు ఉన్నాయా?

–శ్రీకాంత్, హైదరాబాద్

మార్కెట్ బాగా పెరుగుతున్నప్పుడు అందరూ చాలా ఉత్సాహంగా ఇన్వెస్ట్ చేస్తారు. చేతి నిండా సొమ్ములు ఉంటే కనిపించిన స్కీమ్‌ల్లో ఎడాపెడా ఇన్వెస్ట్ చేసేస్తారు. డబ్బులు అవసరమైనప్పుడు అయిన కాడికి తెగనమ్ముకొని నష్టాలపాలవుతారు. కళల విషయంలో అభిరుచి ఉంటే కళాత్మక వస్తువులను సేకరించడం బావుంటుంది. అయితే సేకరించడం (అన్ని ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడమనేది)ఇన్వెస్ట్‌మెంట్స్‌కు వర్తించదు. మీ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా మీ ఇన్వెస్ట్‌మెంట్స్ ఉండాలి. అన్ని ఒకే కేటగిరి ఫండ్స్‌ల్లో కాకుండా విభిన్నమైన మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించిన విభిన్నమైన కేటగిరీల ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలి. ఇలా చేస్తే డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు పొందవచ్చు. ఇక మీ పోర్ట్‌ఫోలియోలో ఉన్న ఫండ్స్‌ను తగ్గించుకోవడానికి రకరకాల మార్గాలున్నాయి. మొత్తం మీ పోర్ట్‌ఫోలియోలో కనీసం రెండు బ్యాలన్స్‌డ్ ఫండ్స్ ఉండేలా చూసుకోవాలి. బ్యాలన్స్‌డ్ ఫండ్స్ మీ పోర్ట్‌ఫోలియోను ఆటోమేటిక్‌గా రీబ్యాలన్స్ చేస్తుంది. స్టాక్ మార్కెట్ పతనమైనా, పెద్దగా నష్టాలు రావు. ఇక మీ పోర్ట్‌ఫోలియోలో రెండు, లేదా మూడు మల్టీక్యాప్ ఫండ్స్ ఉండేలా చూసుకోవాలి. ఇవి ఒకే మ్యూచువల్ ఫండ్ సంస్థవి అయి కాకుండా వేర్వేరు మ్యూచువల్ ఫండ్ కంపెనీలవి అయి ఉండే మంచిది. మీరు ఇన్వెస్ట్ చేస్తున్న ఫండ్స్ పనితీరును కనీసం ఏడాదికొక్కసారైనా మదింపు చేయండి. ఆరు నెలలకొకసారి మదింపు చేస్తే మరీ మంచిది. ఫండ్స్ పనితీరును మదింపు చేసేటప్పుడు అదే కేటగిరీలోని ఇతర ఫండ్స్ కంటే మీ ఫండ్స్ మంచి రాబడులు ఇచ్చినా, లేక అదే స్థాయి రాబడులు ఇచ్చినా ఆ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్‌మెంట్స్ కొనసాగించవచ్చు. అలా కాకుండా ఇతర ఫండ్స్‌తో పోల్చితే మీరు ఇన్వెస్ట్ చేస్తున్న ఫండ్స్ రాబడి సరిగ్గా లేదనుకోండి. సదరు ఫండ్ నుంచి మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకొని, వేరే ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయండి.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.